అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

ఆదివారం 07-4-2024

సంపుటి : 10 సంచిక : 47

సమగ్ర తెలుగు దినపత్రిక

Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar

12 పేజీలు + వెంట (సోపతి) వెల : 8.00



కాంగ్రెస్ ధ్యేయం సమన్యాయం

మ్యానిఫెస్టో మా పార్టీది కాదు... ఈ దేశ పౌరుల ఆత్మ

- మోడీ హయాంలో అన్ని వ్యవస్థలు, రంగాలు నిర్వీర్యం
- దేశ సంపద కొందరి చేతుల్లోనే...
- ఇక్కడ మాజీ సీఎం ఫోన్‌ట్యాపింగ్ చేయించారు
- ఢిల్లీలో మోడీ అదే పనిచేస్తున్నారు : తుక్కుగూడ సభలో రాహుల్‌గాంధీ



అసెంబ్లీ ఎన్నికలకు అచ్చొచ్చిన తుక్కుగూడ నుంచే హస్తం పార్టీ లోక్‌సభ ఎన్నికలకు జంగ్ సైరన్ మోగించింది. కొద్ది నెలల క్రితం గెలిచి తీరతాం.. అధికారంలోకి వస్తామంటూ ఆ సభ సాక్షిగా ప్రతినబూని, విజయం సాధించిన ఆ పార్టీ అగ్రనేతలు, మరోసారి అదే రకంగా ఇండియా కూటమి అధికారంలోకి రావటం ఖాయమంటూ నొక్కి చెప్పారు. ప్రధాని మోడీ, ఆయన పార్టీ బీజేపీ వద్ద సీబీఐ, ఈడీలాంటి సంస్థలుంటే, తమ వద్ద ప్రజల పట్ల ప్రేమ, స్వచ్ఛత ఉన్నాయనీ, అవే తమకూ తమ పార్టీకి కొండంత అండంటూ వారు కార్యకర్తల్లో ఆత్మస్థైర్యం నింపారు. సమభావన, సమన్యాయమే తమ అసలు సిసలు సిద్ధాంతాలనీ, ఆ విజయ రహస్యం ఆధారంగానే ఈసారి ఢిల్లీ పీఠంపై కాంగ్రెస్ జెండాను ఎగరేయబోతున్నామని వారు జోస్యం చెప్పారు.

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దేశసంపదను ప్రజలందరికీ సమానంగా పంచడమే కాంగ్రెస్ విధానమని ఆపార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. ఇదే విషయాన్ని 'న్యాయపత్రం'లో పేర్కొన్నామనీ, అది తమపార్టీకి సంబంధించిన మ్యానిఫెస్టో కాదనీ, దేశ ప్రజల ఆకాంక్షలు, ఆలోచనల్లోంచి ఉద్భవించిన 'ఆత్మ' అని స్పష్టం చేశారు. శనివారంనాడిక్కడి తుక్కుగూడలో జరిగిన జనజాతర సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్‌పార్టీ మ్యానిఫెస్టో 'న్యాయపత్రం' తెలుగు ప్రతిని ఆవిష్కరించారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆరు గ్యారెంటీలు ప్రకటించామనీ, అధికారంలోకి రాగానే అమలు చేస్తున్నామనీ, ఇదే ఆదర్శంతో దేశంలోనూ ఐదు గ్యారెంటీలు అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలు ప్రకటించినప్పుడు ప్రజల అవసరాలను, వారి వాణిని దేశానికి వినిపించామన్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉన్న సమయంలో తెలంగాణ ప్రభుత్వం 30వేల ఉద్యోగాలు ఇచ్చి, మరో 50వేల ఉద్యోగాలు ఇవ్వబోతున్నదని చెప్పారు. తెలంగాణలో ఎలాగైతే మాట ఇచ్చి నిలబెట్టుకున్నామో అదే విధంగా దేశంలో అమలు చేస్తామన్నారు. నిరుద్యోగులందరికీ ఏడాదికి రూ.లక్ష జీతంతో ఉద్యోగం, అప్రెంటీస్‌షిప్ ఇస్తామన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ యువతకు ఎలాగైతే ఉపాధి కల్పిస్తున్నామో, అదే విధంగా లక్ష రూపాయల జీతంతో అన్ని రంగాల్లోనూ శిక్షణ, అప్రెంటీస్‌షిప్ కల్పిస్తామని వివరించారు. దేశంలోని మహిళలు మన భవిష్యత్ చూసుకుంటారు. మహిళలు ఇంటిపని, ఉద్యోగ,ఉపాధి వంటి రెండు పనులు ఏకకాలంలో చేస్తున్నారని చెప్పారు. దేశంలో మోడీ సర్కారు వచ్చాక ప్రజలు మళ్లీ నిరుపేదలు అయ్యారనీ, వారి కోసం నారీన్యాయ్ తెస్తున్నామన్నారు. ప్రతిఒక్క మహిళ బ్యాంకు ఖాతాలో ఏటా రూ.1లక్ష ఇస్తామనీ, దీనివల్ల సమాజంలో విప్లవాత్మక మార్పులు వచ్చి దేశ ముఖచిత్రం మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కిసాన్ న్యాయ్ ద్వారా రైతులకు న్యాయం చేస్తామన్నారు. దేశంలో రోజుకు 30 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారనీ, మోడీ సర్కార్ ధనవంతులకు రూ.16 లక్షల కోట్ల రుణమాఫీ చేసి, రైతులకు మాత్రం ఒక్క రూపాయీ మాఫీ చేయలేదని గుర్తుచేశారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కనీస మద్దతు ధర (ఎమ్ఎస్‌పీ)కి చట్టబద్ధ హామీ, రుణమాఫీ అమలు చేస్తామని చెప్పారు. డాక్టర్ ఎమ్ఎస్ స్వామినాథన్ ...3లో

నమో అంటే...

నమ్మించి మోసం చేయడమే



- పదేండ్లలో తెలంగాణకు బీజేపీ తీరని అన్యాయం
- రాష్ట్ర విభజన చట్టంలోని హామీలేమయ్యాయి?
- ఏం మొహం పెట్టుకుని బీజేపోళ్లు ఓట్లు అడుగుతారు?
- జూన్ నాలుగో తేదీన అధికారంలోకొచ్చేది ఇండియా కూటమే
- చూస్తూ ఊరుకోవడానికి నేను జానారెడ్డిని కాదు రేవంత్‌రెడ్డిని
- కేసీఆర్..ఎక్కువ చేస్తే చర్లపల్లి జైలుకు పంపిస్తా : సీఎం రేవంత్‌రెడ్డి

10లో..

దొందూ దొందే..

కాంగ్రెస్, బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాలి





- రైతులను మోసం చేస్తూ పాలన : రైతు దీక్షలో బీఆర్ఎస్ నేతలు
- రెండు పిల్లర్లు కుంగితే రాజకీయం చేస్తారా? : కేటీఆర్
- నా ప్రాణం అడ్డుపెట్టైనా కార్యకర్తలకు అండగా నిలుస్తా : హరీశ్‌రావు

నవతెలంగాణ- విలేకరులు

కాంగ్రెస్, బీజేపీ రైతులను మోసం చేస్తూ పాలన సాగిస్తున్నాయి.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలి.. మోసపూరిత హామీలతో రాష్ట్రంలో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఏ ఒక్క హామీని సరిగ్గా నెరవేర్చలేదు. రెండు లక్షల రుణమాఫీ, ...10లో

హుష్..మాయం!


ఎన్సీఈఆర్టీ పుస్తకాలలో మరికొన్ని ప్రస్తావనలకు మంగళం

- బాబ్రీ కూల్చివేత, గుజరాత్‌లో ముస్లింల ఊచకోత తొలగింపు
- మణిపూర్, జమ్మూకాశ్మీర్, భారత్-పాక్ వివాదం ఊసే లేదు



వివరాలు 11లో

వామ పక్షాలకు కొత్త భాష్యం



గాజాపై ఐరాస తీర్మానం

ఓటింగ్‌కు భారత్ దూరం

2లో..

సీబీఐ విచారణపై కవిత సవాల్

రౌస్ అవెన్యూ కోర్టులో పిటిషన్ దాఖలు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టై తీహార్ జైలులో ఉన్న కవిత సీబీఐ విచారణను సవాల్ చేస్తూ ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టును ఆశ్రయించారు. ఆమెను సీబీఐ విచారణకు అనుమతి ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ కవిత తరపు సీనియర్ న్యాయవాది నితీష్ రాణా శనివారం పిటిషన్ దాఖలు చేశారు. సీబీఐ విచారణకు అనుమతి ఇవ్వడంపై స్టేటస్ కో ఉత్తర్వులు ఇవ్వాలని న్యాయమూర్తిని కోరారు. సీబీఐ తమకు ...11లో

ప్రజా సమస్యలపై కొట్లాడేందుకు

కమ్యూనిస్టులు అవసరం



మతోన్మాదాన్ని ఎదుర్కొని లౌకికత్వాన్ని కాపాడుతాం


- భువనగిరి నియోజకవర్గంపై కమ్యూనిస్టులకే అవగాహన
- వామపక్షాల పోరాట ఫలితమే ఉపాధి హామీ చట్టం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ
- పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ స్థాయి సమావేశం
- హాజరైన భువనగిరి సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి జహంగీర్

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

ప్రజా సమస్యలపై కొట్లాడేందుకు పార్లమెంట్‌లో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం ఎంతో అవసరమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ అన్నారు. దేశాన్ని మతోన్మాద ప్రమాదం నుంచి ఎదుర్కొని, లౌకికత్వాన్ని కాపాడుతామన్నారు. సీపీఐ(ఎం) ఇబ్రహీంపట్నం నియోజకవర్గ స్థాయి సమావేశం శనివారం ఇబ్రహీంపట్నంలోని పాషా-నరహరి స్మారక కేంద్రంలో నిర్వహించారు. భువనగిరి పార్లమెంట్ పార్టీ అభ్యర్థి ఎండి జహంగీర్, జాన్‌వెస్లీ హాజరయ్యారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. భువనగిరి పార్లమెంటు స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కమ్యూనిస్టుల ప్రాబల్యం అత్యధికంగా ఉందన్నారు. నకిరేకల్, భువనగిరి, జనగామ, తుంగతుర్తి, ఇబ్రహీంపట్నం, మునుగోడు నియోజకవర్గాల అభివృద్ధిలో ముఖ్య భూమిక పోషించారని చెప్పారు. ఈ ప్రాంతం నేటికీ తెలంగాణ ...11లో



సికింద్రాబాద్ కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా నారాయణన్ శ్రీ గణేష్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా నారాయణన్ శ్రీ గణేష్ పోటీ చేయనున్నారు. శనివారం ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన గణేష్ బీఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందిత చేతిలో ఓటమి పాలయ్యారు. ఎన్నికల అనంతరం కాంగ్రెస్‌లో చేరారు.



పట్టణ ఉపాధి హామీ చట్టం

రూ.700 కనీస వేతనంతో 200 ఉపాధి హామీ పని దినాలు

11లో..

సీపీఐ ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల

అంతా మీవల్లే...

వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి కారణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే

- సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఆర్డర్లు ఇవ్వాలి
- బకాయిలు చెల్లించి కార్మికులను ఆదుకోవాలి
- సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించాలి
- రాజకీయ కోణంలో కాకుండా ప్రజా సమస్యగా చూడాలి : సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య
- కార్మికుల నినాదాలతో దద్దరిల్లిన 'నేతన్న మహా గర్జన'

మరో నేతన్న ఆత్మహత్య

బాధిత కుటుంబీకులను ఓదార్చిన సీఐటీయూ నేతలు

కుటుంబానికి కేటీఆర్ పరామర్శ, ఆర్థిక సహాయం

10లో..



నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

'సిరిసిల్లకు సాంచాలే గుండె చప్పుడు. అటువంటి చప్పుడు ఆగే పరిస్థితి నెలకొంది. వెంటనే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ బకాయిలు చెల్లించి, కొత్తగా ఆర్డర్లు ఇచ్చి ఉపాధి కల్పించాలి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వల్లే వస్త్ర పరిశ్రమలో సంక్షోభం నెలకొంది' అని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య అన్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సుమారు 2వేల మంది కార్మికులు శనివారం 'నేతన్న మహాగర్జన' నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాల వల్లే సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో పడిందన్నారు. చేనేత, టెక్స్‌టైల్ బోర్డును కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రద్దు చేసిందని, కనీసం ఇక్కడి కార్మికుల గురించి ఆలోచించినా వారికి కొంత ఉపశమనం లభించేదని అన్నారు. ముఖ్యంగా యారన్, ఇతర వస్త్రాల ఉత్పత్తిపై నాలుగు శాతంగా ఉన్న జీఎస్టీని ...10లో

పేదల గుడిసెలపై పెద్దల కన్ను

గ్రేటర్ వరంగల్‌లోని పైడిపల్లి శివారులో గుడిసెల కూల్చివేత

- కాళ్లపై పడినా కనికరించని అధికారులు
- సొంత ఇండ్లు నిర్మించి ఇచ్చేదాకా కదలం : బాధితులు
- 2022లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో స్టాలిన్‌నగర్ పేరుతో గుడిసెలు
- గుడిసెల కూల్చివేత దుర్మార్గ చర్య :రంగయ్య, సీపీఐ(ఎం) వరంగల్ జిల్లా కార్యదర్శి



నవతెలంగాణ-కాశిబుగ్గ

గ్రేటర్ వరంగల్ మూడో డివిజన్ పైడిపల్లి శివారులోని ఎస్సారెస్పీ కాలువ వద్ద ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలపై పెద్దల కన్ను పడింది. అధికారుల అండదండలతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు రైతుల ముసుగులో కొంతమందితో కలిసి కోర్టులో కేసు వేయించారు. దీంతో కోర్టు ఉత్తర్వుల మేరకు శనివారం తెల్లవారు జామున పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పేదల గుడిసెలను కూల్చేశారు. విధ్వంసం సృష్టించారు. స్టాలిన్ నగర్‌గా పేరుపెట్టుకున్న ఆ ప్రాంతం మొత్తాన్ని ధ్వంసం చేసారు. వివరాల్లోకి వెళితే..3వ డివిజన్ ...10లో

అప్రజాస్వామికం

- గుడిసెవాసులకు పట్టాలిచ్చి ఇండ్ల నిర్మాణానికి రూ.5 లక్షలివ్వాలి
- అక్రమంగా అరెస్టు చేసిన బషీర్‌ను తక్షణమే విడుదల చేయాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని డిమాండ్



10లో..



కేసీఆర్ పొగరుబోతు, అబద్ధాలకోరు

- ఆయన మాటలను నమ్మొద్దు : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మాజీ సీఎం కేసీఆర్ పొగరబోతు, అబద్ధాలకోరు అనీ, ఆయన మాటలను నమ్మొద్దంటూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజలను కోరారు. శనివారం హైదరాబాద్ గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కరీంనగర్‌లో కేసీఆర్ మాట్లాడిన ప్రతి మాటా అబద్ధమేనని అన్నారు. ఆయనలా తమ పార్టీ నేతలు పాస్ పోర్టులను అమ్ముకోలేదనీ, కాంట్రాక్టర్లకు బ్రోకర్లుగా పని చేయలేదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ఫ్రస్టేషన్‌లో సిగ్గులేకుండా పిచ్చి లేచినట్టుగా బ్రోకర్, జోకర్ అంటూ వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. సూర్యాపేటకు నాగార్జునసాగర్ నుంచి తాగునీరు మాత్రమే ఇచ్చామనీ, సాగునీరు కాదని స్పష్టం చేశారు. షెడ్యూల్ ప్రకారమే సూర్యాపేట, పాలేరుకు నీళ్లిచ్చామే తప్ప కేసీఆర్ ముఖం చూసి కాదని చెప్పారు. ఆయన పొగరు వల్లే 104గా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య 39కి పడిపోయిందనీ, అందులోనూ 25 మంది కాంగ్రెస్‌లో చేరబోతున్నారని తెలిపారు.

మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ధనిక రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పుల రాష్ట్రంగా మార్చిన కేసీఆర్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని తెలిపారు. పదేండ్లలో పంట నష్టం ఇవ్వని ఆయన ఫామ్‌హౌజ్‌లో నిద్రపోయారని విమర్శించారు. నాలుగు మాసాల కాంగ్రెస్ పాలనను చూసి ఉలిక్కి పడుతున్న కేసీఆర్, కుర్చీ వేసుకుని కడుతా అని చెప్పిన ప్రాజెక్టుల్లో ఒక్కటైనా నిర్మించారా? అని ప్రశ్నించారు. దమ్ముంటే మేడిగడ్డకు కాదు... పాలమూరుకు రావాలని జూపల్లి సవాల్ విసిరారు. మిషన్ భగీరథలో రూ.వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి పోయిన 12 సార్లు సోనియా, ఖర్గే అపాయింట్ మెంట్ ఇచ్చారనీ, కేసీఆర్ ఏనాడు హైదరాబాద్‌లో ఉన్న మంత్రులను కలవలేదని తెలిపారు. తలకిందులుగా తపస్సు చేసినా రాష్ట్రంలో బీఆర్ఎస్ ఒక్క లోక్ సభ సీటూ గెలవదని తెలిపారు. ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోతే పార్టీనే రద్దు చేసుకుంటా... అని చెప్పే దమ్ము కేసీఆర్ కు ఉందా? అని ప్రశ్నించారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కేసీఆర్ అత్తగారి ఊర్లో ఎవరు ఎటువైపు ఉంటారో చూద్దామా? అని ప్రశ్నించారు. కరీంనగర్‌లో కేసీఆర్ ఇష్టం వచ్చినట్టు మాట్లాడారని తప్పుపట్టారు. ఆయన వాడిన భాషకు కౌంటర్ ఇస్తే తల ఎక్కడ పెట్టుకుంటారని ప్రశ్నించారు. కేసీఆర్ చవట, దద్దమ్మ కాకపోతే మిగులు రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా ఎలా మార్చారని ప్రశ్నించారు. 2014 నుంచి బీఆర్ఎస్ ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయలేదని ఆయన ప్రశ్నించారు. రూ.4 వేల పెన్షన్ హామీని అమలు చేస్తామని తెలిపారు. బీఆర్ఎస్ హయంలో పంట నష్టం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. పదేండ్లలో పాలమూరుకు కేసీఆర్ ఏం చేశారని ప్రశ్నించారు. మిషన్ భగీరథలో రూ.వేల కోట్ల అవినీతి జరిగిందని మంత్రి పొన్నం ఆరోపించారు

బూటకపు ఎన్ కౌంటర్లకు కాంగ్రెస్‌దే బాధ్యత

- ములుగు ఎస్పీ కనుసన్నల్లోనే ఎన్‌కౌంటర్లు
- బీకే ఏఎస్ఆర్ కార్యదర్శి ఆజాద్ పేరుతో మావోయిస్టుల లేఖ

నవతెలంగాణ-ఏటూరు నాగారం ఐటీడీఏ

ములుగు జిల్లా సహరిద్దు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ పూజారి కాంకేర్‌లో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లకు కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం -అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ పేరుతో శనివారం ఒక లేఖ విడుదలైంది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా రాజ్యం స్వభావం మారదని, ప్రజల కోసం పోరాడుతున్న మావోయిస్టులపై తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర పోలీసులు రాజ్యహింసకు తెగబడుతున్నారని పేర్కొన్నారు. కార్పోరేట్ కంపనీల అడుగులకు మడుగులొత్తేలా వారు పనిచేస్తున్నారు. ఈ హింసలో పార్టీలకు ఎలాంటి భిన్నాభిప్రాయం లేదని, బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ అన్ని పార్టీలదీ ఒకటే వ్యూహం అన్నారు. డ్రోన్లు, హెలీకాప్టర్లతో ఆకాశ మార్గం గుండా దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో మహారాష్ట్ర సరిహద్దులో ముగ్గురు కామ్రేడ్స్‌పై విష ప్రయోగం చేసి పట్టుకొని అతి కిరాతకంగా హింసించి ఎన్‌కౌంటర్ కథలు అల్లారన్నారు. శనివారం తెల్లవారుజామున బీజాపూర్ జిల్లా ఊసూర్ బ్లాక్ పూజారి కాంకేర్ తెలంగాణ గ్రేహౌండ్స్, స్పెషల్ పార్టీ, కోబ్రా పోలీసులకి మావోయిస్టులకు మధ్య జరిగిన భయంకర యుద్ధంలో మావోయిస్టులు ముగ్గురు అమరులయ్యారని పేర్కొన్నారు. తెలంగాణ ఎస్ జెడ్సీ సభ్యులు కామ్రేడ్ సాగర్‌తోపాటు కామ్రేడ్ మణిరాం (ఏసీఎం) మరో కామ్రేడ్ అమరులయ్యారన్నారు. అప్పుడు కేసీఆర్, ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ప్రజాస్వామ్యాన్ని, ప్రజల హక్కులను పరిరక్షిస్తానని.. ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతానని చెప్పి మావోయిస్టు పార్టీపై పోలీసు బలగాలతో దాడులు చేయిస్తున్నారని పేర్కొన్నారు. రాజ్యహింసలో ఒకరిని మించిన వారు ఇంకొకరు అన్నట్టు రుజువు చేసుకుంటున్నారన్నారు. ములుగు ఎస్పీ పథకం రచించి ఈ ఎన్‌కౌంటర్‌కు పాల్పడినట్టు తెలుస్తోందని.. అందుకు మూల్యం చెల్లించుకోక తప్పదని లేఖలో పేర్కొన్నారు.


15 కోట్ల మార్క్‌కు డిమ్యాట్ ఖాతాలు

- ఏడాదిలో కొత్తగా 3.5 కోట్ల అకౌంట్స్ జారీ



న్యూఢిల్లీ : గడిచిన ఆర్థిక సంవత్సరం (2023-24)లో రికార్డ్ స్థాయిలో కొత్తగా 3.7 కోట్ల డిమ్యాట్ ఖాతాలు తెరిచారు. అంతక్రితం ఏడాదితో పోల్చితే 32 శాతం అధికం. స్టాక్ మార్కెట్‌లో నేరుగా పెట్టుబడులపై ఆసక్తులు పెరగడంతో భారీ సంఖ్యలో కొత్త ఖాతాలు నమోదవుతున్నాయి. 2024 మార్చి ముగింపు నాటికి దేశంలో మొత్తం డీమ్యాట్ ఖాతాలు 15 కోట్లు దాటి నూతన మైలురాయిని చేరుకున్నాయి. ఈక్విటీ మార్కెట్ల నుంచి ఆకర్షణీయ రాబడులను పొందవచ్చనే ఆలోచనలతో అనేక మంది డిమ్యాట్ ఖాతాలను తెరిచారు. గడిచిన ఏడాది కాలంలో సగటున ప్రతి నెలా 30 లక్షలకు పైగా కొత్త డీమ్యాట్ ఖాతాలు నమోదయ్యాయి. 2020-21లో 1.4 కోట్ల కొత్త డిమ్యాట్ ఖాతాలు తెరుబడ్డాయి.దేశంలో సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ లిమిటెడ్ (సిడిఎస్ఎల్), నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డిఎల్)లు డిమ్యాట్ ఖాతాలను తెరవడం, నిర్వహించడం చేస్తున్నాయి. గడిచిన ఏడాదిలో ఈ సంస్థలు వరుసగా 11.9 శాతం, 15.14 శాతం పెరుగుదలను సాధించాయి. 2023 మార్చి ముగింపు నాటికి దేశంలో ఈ రెండు సంస్థలు కలిసి 11.45 కోట్ల డిమ్యాట్ ఖాతాలను అందించాయి. భారత మార్కెట్లపై పలు ఏజెన్సీలు అంచనాలు పెంచడం, మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు పెరగడం, ఈక్విటీలపై యువత ఆసక్తి, పలు కంపెనీలు ఐపిఒలకు రావడం తదితర అంశాలు డిమ్యాట్ ఖాతాల పెరుగుదలకు ప్రధాన కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 2023-24లో ఐపిఒల ద్వారా ద్వారా 76 కంపెనీలు రూ.61,921 కోట్ల నిధులు సమీకరించాయి. అదే ఏడాది సెన్సెక్స్ నిఫ్టీలు వరుసగా 24.85 శాతం, 28.61 శాతం చొప్పున రిటర్న్‌లను అందించాయి. బిఎస్ఇ మిడ్ క్యాప్ సూచీ 63.4 శాతం, స్మాల్ క్యాప్ 60 శాతం చొప్పున పెరిగాయి.

బిగ్‌సీ ఉగాది ఆఫర్లు



నవ తెలంగాణ - హైదరాబాద

మొబైల్స్ రిటైల్ అమ్మకాల్లో 21ఏండ్లకు పైగా అనుభవమున్న బిగ్ సీ...ఉగాది పండగ సందర్భంగా తమ కస్టమర్లకు వినూత్న ఆఫర్లు ప్రకటించింది. మొబైల్స్, స్మార్ట్ టీవిలు,ల్యాప్‌టాప్, ఏసీ కొనుగోళ్లపై 7.5శాతం వరకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్, ఆకర్షణీయమైన ఆఫర్లు అందిస్తున్నట్టు కంపెనీ సీఎండీ ఎం. బాలు చౌదరి తెలిపారు. ఒక ఏడాది మొబైల్ ప్రొటెక్షన్ కొనుగోలుపై రెండో సంవత్సరం రూ.8వేల విలువగల మొబైల్ ప్రొటెక్షన్ అదనంగా పొందవచ్చు. ప్రతి మొబైల్ కొనుగోలుపై కచ్చితమైన బహుమతి పొందవచ్చు. డౌన్‌పేమెంట్, వడ్డీ లేకుండా సులభమైన వాయిదా పద్ధతి సౌకర్యం కూడా ఉందని సీఎండీ వివరించారు. ఆన్‌లైన్ కంటే తక్కువ ధరలతో పాటు అనేక ఆఫర్లను బిగ్‌సీ అందిస్తోంది.

అందరికీ నాణ్యమైన వైద్యం ప్రభుత్వాల బాధ్యత

- ప్రభుత్వ వైద్యరంగాన్ని బలోపేతం చేయాలి : ఐద్వా, డీవైఎఫ్ఐ రాష్ట్ర సదస్సులో మల్లు లక్ష్మి, కోట రమేష్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం అందించడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత అని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ చెప్పారు. ప్రభుత్వ వైద్యరంగాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. 'ప్రజారోగ్యం, ప్రభుత్వ ఆస్పత్రులు'అనే అంశంపై శనివారం హైదరాబాద్‌లో ఐద్వా, డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సును నిర్వహించాయి.

ఈ సందర్భంగా మల్లు లక్ష్మి, కోట రమేష్ మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని పటిష్టపర్చాలనీ, వైద్య రంగానికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రజలు వైద్య సేవలు అందించేందుకు మరిన్ని ప్రభుత్వ ఆస్పత్రులను ఏర్పాటు చేయాలని కోరారు. ఉన్న వాటిలో మౌలిక వసతులను మెరుగుపర్చాలనీ, వైద్యులు, ఇతర సిబ్బందిని నియమించాలని చెప్పారు. వైద్యారోగ్య శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డబ్ల్యూహెచ్‌వో నిబంధనల ప్రకారం వెయ్యి మందికి ఒక డాక్టర్ ఉండాలనీ, దాన్ని కచ్చితంగా అమలు చేయాలని కోరారు. సకాలంలో వైద్యం అందకపోవడంతో రోగులు చనిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెరుగుతున్న జనాభాకనుగుణంగా ఆస్పత్రులు అందుబాటులో లేకపోవడం వల్ల లక్షలాది మంది గాంధీ, ఉస్మానియా, నిమ్స్ వంటి ఆస్పత్రులకు వెళ్తున్నారని వివరించారు. పలు టెస్టులు, సర్జరీల కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తుందని చెప్పారు. సరిపడా సిబ్బందిని నియమించి పలె దవాఖానాలు, బస్తీ దవాఖానాలను బలోపేతం చేయాలని కోరారు. మందుల కొరత లేకుండా చూడాలన్నారు. ప్రసూతి మరణాలు, శిశు మరణాలను తగ్గించాలని చెప్పారు. పౌష్టికాహార లోపం వల్ల పిల్లలు చనిపోతున్నారని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్య సేవలను మెరుగుపర్చాలని సూచించారు. మొబైల్ వ్యాన్లు ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం అందించాలని కోరారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ఆర్ అరుణజ్యోతి, డీవైఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండీ జావీద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు కెఎన్ ఆశాలత, కోశాధికారి రత్నమాల, సహాయ కార్యదర్శి కె నాగలక్ష్మి, నాయకులు శశికళ, లక్ష్మమ్మ, వినోద, షబానా, మస్తాన్‌బి, డీవైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు సాగర్, కిషన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను రాజీనామా చేయించాలి

- లేదంటే స్పీకర్ ద్వారా అనర్హత వేటు వేయించాలి : రాహుల్ గాంధీకి కేటీఆర్ సవాల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్‌లో చేరిన ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను రాజీనామా చేయించాలనీ, లేదంటే స్పీకర్ ద్వారా అనర్హత వేటు వేయించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. అలా చేయడం ద్వారా చెప్పిందే చేస్తాం, అబద్ధాలు చెప్పమనే విషయాన్ని నిరూపించుకోవాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి ఆయన శనివారం ఒక ప్రకటనలో సవాల్ విసిరారు. భారతదేశంలో ఇతర పార్టీల నుంచి నేతల్ని చేర్చుకోవడం ప్రారంభించిందే కాంగ్రెస్ అని విమర్శించారు. తాను ప్రారంభించిన ఆయారాం- గయారాం సంస్కృతిపై ఇప్పటికైనా కాంగ్రెస్ విధానం మార్చుకోవడం మంచిదేనని తెలిపారు. ఆ పార్టీ తన మ్యానిఫెస్టోలో పార్టీ మారితే ఆటోమేటిగ్గా సభ్యత్వం రద్దు అనే హామీని పేర్కొనడం స్వాగతించదగిందని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ ఎప్పటిలానే చెప్పేదొకటి చేసేదొకటిగా ఉంటుందని తెలిపారు. తాను హామీ ఇచ్చిన దానికి పూర్తి వ్యతిరేకంగా కాంగ్రెస్ విధానాలుంటాయని విమర్శించారు.

ఒకవైపు మ్యానిఫెస్టోలో ఇతర పార్టీల నుంచి చేర్చుకోమంటూనే... తెలంగాణలో కారు గుర్తుపై గెలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేకి ఎంపీ టికెట్ ఇచ్చిందని గుర్తు చేశారు. మరో బీఆర్ఎస్ ఎమ్మెల్యేను రాజీనామా చేయకుండానే పార్టీలో చేర్చుకుందని తెలిపారు. రాహుల్ గాంధీకి తమ హామీలపై నిబద్ధత ఉంటే ఈ అంశంపై మాట్లాడాలని సూచించారు. లేకుంటే ఆయన ఒక హిపోక్రట్‌గా మిగిలిపోతారని పేర్కొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు సాఫ్ట్‌వేర్‌పై శిక్షణా తరగతులు

- కళాశాల విద్యాశాఖ, ఐఐటీ బాంబే మధ్య ఒప్పందం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని డిగ్రీ విద్యార్థులకు ఆడియో, వీడియో రూపంలో వివిధ రకాల సాఫ్ట్‌వేర్‌పై శిక్షణా తరగతులను నిర్వహించనున్నారు. శనివారం హైదరాబాద్‌లో కళాశాల విద్యాశాఖ కమిషనర్, ఐఐటీ బాంబేకు చెందిన స్పోకెన్ ఇంగ్లీష్ ట్యుటోరియల్ ప్రాజెక్టు మధ్య ద్వైపాక్షిక ఒప్పందం కుదిరింది. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ బుర్రా వెంకటేశం, ఐఐటీ బాంబే, స్పోకెన్ ట్యుటోరియల్‌ప్రాజెక్టు నేషనల్ కోఆర్డినేటర్ ఆకాంక్ష సాయిని ఆ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఐటీ సాఫ్ట్‌వేర్, యూ ట్యుటర్ కోర్సు, మూక్ ప్రోగ్రామ్‌లను అందిస్తుంది.

ఈ ప్రాజెక్టు 2009 నుంచి కేంద్ర ప్రభుత్వం వారి ద్వారా నేషనల్ మిషన్ ఆన్ ఎడ్యుకేషన్ ఐసీటీ ద్వారా నిర్వహిస్తున్నది. ఈ స్పోకెన్ ట్యుటోరియల్‌లో బేసిక్ ఐటీ స్కిల్స్, గ్రాఫిక్, యానిమేషన్, ప్రోగ్రామ్ లాంగ్వేజెస్, వెబ్ డెవలప్‌మెంట్, డాటాబేస్ మేనేజ్‌మెంట్ వంటి కోర్సులను విద్యార్థులకు అందిస్తుంది. విద్యార్థులు ఐఐటీ బాంబే స్పోకెన్ ట్యుటోరియల్ ప్రాజెక్టు ద్వారా శిక్షణా కార్యక్రమాలను ఇంగ్లీష్, తెలుగు, హిందీ తదితర 22 ప్రాంతీయ భాషల్లో నేర్చుకుంటున్నారు. విద్యార్థులు ఐటీ స్కిల్స్, కంప్యూటర్ సంబంధిత సాంకేతిక అంశాల్లో యానిమేషన్, మల్టీమీడియా ప్రోగ్రాం లాంగ్వేజ్‌లో శిక్షణ పొంది వివిధ రకాల స్కిల్ ఆధారిత ఉపాధి అవకాశాలను అందుకుంటారు. కళాశాల అధ్యాపకులకు కూడా ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తున్నది. ఈ స్పోకెన్ ట్యుటోరియల్ జాబ్ ఫెయిర్, జాబ్‌మేళాలు నిర్వహిస్తూ శిక్షితులైన విద్యార్థులకు ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నది.

ఈ కార్యక్రమంలో కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్లు జి యాదగిరి, రాజేంద్రసింగ్, అకడమిక్ గైడెన్స్ అధికారి పి బాలభాస్కర్, అకడమిక్ అధికారి ఎం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి అవకాశమివ్వండి!

- లేదంటే విద్యాసంవత్సరం నష్టపోతాం : స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేయని విద్యార్థుల ఆందోళన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉన్నత విద్యను అభ్యసించే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద విద్యార్థులు చాలామంది స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు కొత్తగా (ఫ్రెష్), పునరుద్ధరణ (రెన్యూవల్)కు దరఖాస్తు చేసుకోలేదు. దీంతో వందలాది మంది విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. మరోసారి స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. చాలా మంది విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలుండటం వల్ల పరీక్షలపై దృష్టి పెట్టారు.

ఇంకోవైపు దరఖాస్తులు చేసుకోవాలంటూ కొన్ని కాలేజీల యాజమాన్యాలు కూడా విద్యార్థులకు సమాచారం ఇవ్వలేదు. దీంతో వారికి స్కాలర్‌షిప్ దరఖాస్తుకు చివరి తేదీ తెలియక దరఖాస్తు చేసుకోలేదు. మార్చి 31తో దరఖాస్తు గడువు ముగిసిన విషయం తెలిసిందే. దరఖాస్తు చేసేందుకు మరోసారి అవకాశమివ్వాలంటూ హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్‌లో ఉన్న సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయానికి ప్రతి రోజూ విద్యార్థులు వస్తున్నారు. అధికారులు గడువు ముగిసిందని చెప్తున్నారు. మరోసారి దరఖాస్తు చేసేందుకు అవకాశం ఇచ్చేది లేదంటున్నారు. దీంతో చాలా మంది పేద విద్యార్థులు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆధారంగానే ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. ప్రభుత్వం నుంచి రాకపోతే సొంతంగా ఫీజులు చెల్లించే పరిస్థితి లేదు.

ఆ విద్యార్థులకు మరోసారి అవకాశమివ్వకపోతే ఈ విద్యా సంవత్సరం చదువుకు దూరమయ్యే ప్రమాదమున్నది. దీనివల్ల చాలామంది పేద విద్యార్థులకు అన్యాయం జరుగనుంది. రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని దరఖాస్తు చేసుకునేందుకు మరోవారం, పది రోజులు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సంక్షే శాఖ, విద్యాశాఖ అధికారులు స్పందించి స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు చివరిసారి అవకాశం కల్పించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వైద్య శాఖను ప్రక్షాళన చేస్తాం

- సీనియార్టీ ప్రకారమే ప్రమోషన్లు : వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

రాష్ట్రంలో వైద్య శాఖను ప్రక్షాళన చేస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. వరల్డ్ హెల్త్ డే సెలబ్రేషన్స్‌ను పురస్కరించుకుని ఉస్మానియా మెడికల్ కళాశాల అల్యూమిని అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాల ఆడిటోరియంలో సూపర్ స్పెషాలిటీ విద్యార్థులకు గోల్డ్ మెడల్ ప్రదానోత్సవం నిర్వహించారు. మంత్రి హాజరై విద్యార్థులకు బంగారు పతకాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్యశాఖను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రంలో ఆధునిక వైద్య కళాశాలలు, వైద్యశాలను నిర్మించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఉస్మానియా ఆస్పత్రి విషయం కోర్టులో ఉన్నదని.. అది తేలగానే ఆధునిక ఆస్పత్రిగా తీర్చిదిద్దుతామని అన్నారు. ప్రస్తుతం కమిషనర్లను, డైరెక్టర్లను సీనియార్టీ ప్రకారం నియమిస్తున్నామని తెలిపారు. వైద్య శాఖలో సీనియార్టీకి ప్రాధాన్యత ఇస్తూ ప్రమోషన్లు కల్పిస్తామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు నమ్మకం కలిగేలా ప్రత్యేక చికిత్సలు ఉండేలా కృషి చేస్తామన్నారు. వైద్యాధికారులు, ఉద్యోగులు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఉస్మానియా అంటేనే ఒక బ్రాండ్ అని.. అది మెడికల్ అయినా ఇంజినీరింగ్ అయినా ఉస్మానియానే అని అన్నారు. రాష్ట్రంలో మోడల్ లెక్చర్ హాల్స్, హాస్టల్ బిల్డింగ్స్ నిర్మిస్తామని తెలిపారు. జూన్‌లో వీటికి ప్రత్యేక బడ్జెట్‌ను తీసుకొచ్చేలా కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మెడికల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుధాకర్ యాదవ్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ వాణి, ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నరేంద్ర కుమార్, ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ త్రివేణి, నిలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి, డాక్టర్ శివ శివరాంప్రసాద్, అసోసియేషన్ చైర్మెన్ డాక్టర్ కృష్ణారెడ్డి, అధ్యక్షులు శ్రీధర్, కార్యదర్శి కృష్ణమూర్తి, ఆఫీస్ ఇన్‌చార్జి రఘుమోహన్, వేణుగోపాల్ గౌడ్, పూర్వ వైద్య విద్యార్థులు, యువ వైద్యులు, పీజీ వైద్య విద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

గాజాపై ఐరాస తీర్మానం

- ఓటింగ్‌కు భారత్ దూరం

న్యూయార్క్: గాజాలో కాల్పుల విరమణ పాటించాలని ఐక్యరాజ్యసమితిలోని మానవ హక్కుల మండలి తీర్మానం చేసింది. అయితే ఆ తీర్మానంపై జరిగిన ఓటింగ్‌లో ఇండియా పాల్గొనలేదు. గాజా స్ట్రిప్‌లో ఉన్న అక్రమ నిర్బంధాన్ని కూడా ఎత్తివేయాలని ఇజ్రాయిల్‌ను ఆ తీర్మానంలో కోరారు. తీర్మానానికి అనుకూలంగా 28 ఓట్లు పోలయ్యాయి. ఆరుగురు వ్యతిరేకంగా ఓటేశారు. 13 దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. ఇండియాతో పాటు ఫ్రాన్స్, జపాన్, నెదర్లాండ్స్, రొమేనియా దేశాలు కూడా ఓటింగ్‌లో పాల్గొనలేదు. వ్యతిరేకంగా ఓటు వేసిన దేశాల్లో అర్జెంటీనా, బల్గేరియా, జర్మనీ, అమెరికా ఉన్నాయి. అనుకూలంగా ఓటేసిన దేశాల్లో బంగ్లాదేశ్, బెల్జియం, బ్రెజిల్, చైనా, ఇండోనేషియా, కువైట్, మలేషియా, మాల్దీవులు, ఖతార్, సౌత్ ఆఫ్రికా, యూఏఈ, వియత్నాం ఉన్నాయి.

రాజ్యసభ సభ్యుడిగా అనిల్ యాదవ్ ప్రమాణం

- గుజరాత్ నుంచి ఎగువసభ ఎంపీగా బీజేపీ అధ్యక్షుడు నడ్డా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కాంగ్రెస్ పార్టీ నుంచి రాజ్యసభ సభ్యుడిగా అనిల్ యాదవ్ ప్రమాణ స్వీకారం చేశారు. శనివారం పార్లమెంట్‌లోని ప్రత్యేక రూంలో రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ కొత్తగా ఎన్నికైన ఆరుగురు నూతన సభ్యులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ నారాయన్ సింగ్, రాజ్యసభ సెక్రటరీ జనరల్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ నుంచి కాంగ్రెస్ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ మందాడి ప్రమాణం చేశారు. అంతకు ముందు బీజేపీ అధ్యక్షుడు జయప్రకాశ్ నడ్డా గుజరాత్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణం చేశారు. అలాగే మహారాష్ట్ర నుంచి అశోక్ రావు శంకర్ రావు చౌవాన్ (బీజేపీ), రాజస్థాన్ నుంచి చున్నిలాల్ గరాసియా (బీజేపీ), పశ్చిమ బెంగాల్ నుంచి టీఎంసీకి చెందిన సుశ్మిత దేవ్, మహ్మద్ నదిముల్ హక్ ప్రమాణం చేశారు. అనంతరం నూతన సభ్యులతో కలిసి రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ ఫొటో సెషన్‌లో పాల్గొన్నారు. కాగా, 2015 నుంచి 2018 వరకు కాంగ్రెస్ అనుబంధ సంస్థ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులుగా అనిల్ యాదవ్ పని చేశారు. అనంతరం 2018లో ముషీరాబాద్ నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో నిలిచి ఓటమి పాలయ్యారు. 2023లో పార్టీ ఆయనను సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడిగా నియమించింది. ఇటీవల తెలంగాణ నుంచి మూడు రాజ్యసభ స్థానాలు ఖాళీ కాగా, ఇందులో ఒక స్థానం నుంచి అనిల్ కుమార్ యాదవ్‌కు కాంగ్రెస్ అధిష్టానం అవకాశం కల్పించింది. రాజ్యసభ ఎన్నికల్లో అనిల్ ఎన్నిక కావడంతో ఆయన ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు.

రోడ్డు ప్రమాదంలో..తల్లీ కూతుళ్లు మృతి

నవతెలంగాణ-దమ్మపేట

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లి, ఇద్దరు పిల్లలు మృతిచెందారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా ఏ కొండూరు మండలం చీమలపాడు గ్రామానికి చెందిన దంపతులు చీపు బాలకృష్ణ(35), లక్ష్మి(30)కు ఇద్దరు కుమార్తెలు శరణ్య(8), శాన్విక(6). వీరంతా బైక్‌పై ఎన్టీఆర్ జిల్లా విసన్నపేట నుంచి అశ్వరావుపేట వైపు కోళ్ల ఫారంలో పనిచేయటానికి వస్తున్నారు. మందలపల్లి సమీపంలో దాబా హోటల్ వద్ద వెనుక నుంచి వచ్చిన కారు బైక్‌ను ఢీ కొట్టింది. అదే సమయంలో కింద పడిన వారిపై నుంచి లారీ వెళ్లడంతో తల్లి, ఇద్దరు కుమార్తెలు అక్కడికక్కడే మృతిచెందారు. చీపు బాలకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. 108 ద్వారా దమ్మపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కర్రిగుట్టపై తుపాకీ గుండ్ల వర్షం

- ముగ్గురు మావోయిస్టులు మృతి
- వివరాలు వెల్లడించిన పోలీసు వర్గాలు



నవతెలంగాణ-చర్ల

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కోసూరు పోలీస్‌స్టేషన్ పరిధి నంబి అటవీ ప్రాంతంలో కర్రిగుట్టపై మావోయిస్టులకు భద్రతా దళాలకు జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో సాగర్ అలియాస్ సంతోష్, మనీ రామ్‌తోపాటు మరో మావోయిస్టు ఉన్నారు. కర్రిగుట్ట ప్రాంతంలో మావోయిస్టులు రహస్య సమావేశాలు నిర్వహిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు తెలంగాణ గ్రేహౌండ్స్ బలగాలు, ఛత్తీస్‌గఢ్ పోలీసులు సంయుక్తంగా శుక్రవారం దండకారణ్యాన్ని జల్లెడ పట్టసాగాయి. ఈ క్రమంలో ఉసురు బ్లాక్ పూజారి కాంకేర్ సమీప అడవుల్లో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. గ్రే హౌండ్స్, ఛత్తీస్‌గఢ్ పోలీసులు సంయుక్తంగా మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. సంఘటనా స్థలం నుంచి ఎల్ఎంజీ, ఏకే 47 సహా 12 బోరు తుపాకులు, అనేక ఆయుధాలు, నిత్యావసర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ ధ్రువీకరించారు.

రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి

- టిప్పర్ మట్టి పడి అన్నాచెల్లెళ్లు ముగ్గురు..
- కేబుల్ బ్రిడ్జిపై కారు ఢీకొని ఒకరు..



నవతెలంగాణ - హుజురాబాద్/మియాపూర్

పెద్దమ్మ బోనాలకు వెళ్లి తిరిగి వస్తుండగా.. టిప్పర్‌లోని మట్టి మీద పడటంతో ఊపిరాడక ముగ్గురు అన్నా చెల్లెళ్లు ప్రాణం కోల్పోయారు. ఈ విషాద ఘటన కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. అలాగే, హైదరాబాద్‌లోని కేబుల్ బ్రిడ్జిపై ఫొటోలు దిగుతున్న యువకులను కారు ఢీకొట్టడంతో ఒకరు ప్రాణం కోల్పోయారు. ఇందుకు సంబంధించి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని బోర్నపల్లి గ్రామంలో పెద్దమ్మ బోనాలు జరిగాయి. ముదిరాజులంతా బోనాలతో దేవాలయంలో పూజల్లో పాల్గొన్నారు. బోనాలు ముగిసిన తర్వాత అన్నాచెళ్లెలు గంట విజయ్, గంట వర్ష, వారి పెద్దనాన్న కూతురు గంట సింధూజ మోటార్ సైకిల్‌పై ఇంటికి బయలుదేరారు. గ్రామ మధ్యలో బొడ్రాయి వద్ద ఎదురుగా టిప్పర్ వస్తుండటంతో రోడ్డు పక్కన ఆగారు. కానీ, వేగంగా వచ్చిన టిప్పర్ అదుపు తప్పి మూలమలుపు వద్ద బోల్తా పడింది. టిప్పర్‌లో ఉన్న మట్టి రోడ్డు పక్కన ఆగిన ముగ్గురు పిల్లలపై పడింది. ఆ వెనుకనే వస్తున్న సింధూజ తాత కొమురయ్య పిల్లలు కనిపించకపోవడంతో కేకలు వేశాడు. స్థానికులు వెంటనే జేసీబీ సహాయంతో మట్టిని తొలగించారు. అప్పటికే ముగ్గురు పిల్లలు ఊపిరాడక ప్రాణం కోల్పోయారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. మృతదేహాలను హుజురాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వర్ష, సింధూజ, విజయ్ ఇంటర్మీడియట్ చదువుతున్నారు.

కేబుల్ బ్రిడ్జిపై రోడ్డు ప్రమాదం

హైదరాబాద్‌లోని కేబుల్ బ్రిడ్జిపై శుక్రవారం అర్ధరాత్రి కారు ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతిచెందాడు. మరొకరికి గాయాలయ్యాయి. రంగారెడ్డి జిల్లా మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. అనిల్ (25), అజయ్ కేబుల్ బ్రిడ్జిపై అర్ధరాత్రి ఫొటోలు దిగుతున్నారు. ఈ క్రమంలో ఓ కారు వీరిని ఢీకొట్టింది. దాంతో అనిల్, అజయ్ తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, వారిని ఆస్పత్రికి తరలించారు. అనిల్ పరిస్థితి విషమించి మృతిచెందాడు. కారు నెంబర్ ఆధారంగా యజమాని వెంకటరెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే, తన కారును ఇతరులు తీసుకెళ్లారని ఆయన చెప్పాడు. పరారీలో ఉన్న డ్రైవర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

బ్రిడ్జిపై సెల్ఫీలు దిగొద్దు : ఇన్‌స్పెక్టర్ మల్లేష్

కేబుల్ బ్రిడ్జిపై సెల్ఫీలు నిషేధించినట్టు ఇన్‌స్పెక్టర్ మల్లేష్ తెలిపారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే వారి వాహనాలు సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కేబుల్ బ్రిడ్జి వంతెనపై వాహనాలు నిలపడం, సెల్ఫీలు దిగడం పూర్తిగా నిషేధమన్నారు. ఇందుకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బ్రిడ్జి వంతెనకు ఇరువైపులా ఉన్న గోడ ఎత్తు పెంచాలని జీహెచ్ఎంసీ అధికారులను కోరామన్నారు.



టొబాకోపనిషత్

ఆరెస్బీ

గిరీశం : ఏం వాయ్, మైడియర్ బ్రదిన్లా! ఎడం దవడ ఎర్రవారింది?

వెంకటేశం : నాన్న గూబ గదలేశాడు

గిరీ : ఏం చేశావేంటి?

వెంక : సంధ్య వార్చలేదని!

గిరీ : వార్చినట్టు చెయ్యలేకపోతివో!

వెంక : చూద్దనుకున్నాను.

గిరీ : అనుకోడాలు, గినుకోడాలు జాన్తానై! నన్ను చూడట్లేదా, రోజూ ఎంతసేపు ధ్యానం చేస్తున్నానో! ఒకడు చూస్తాడనుకొన్నప్పుడు, చూడట్లేదనుకొన్నపుడూ మన వేషం ఒకేలా ఉండాలి.

వెంక : ఏమని ధ్యానం చేస్తారేమిటి మీరు?

గిరీ : ఏమనా? నా కంచంలో నాలుగు మెతుకులు ఎప్పుడు పడ్తాయాయనే!

వెంక : అది తప్పు కదండీ? ఎవరైనా దేవుడ్ని ధ్యానం చెయ్యాలి గాని అన్నం కోసమా చేస్తారు?

గిరీ : ఏవందోయ్ నీ ఉపనిషత్తు? "అన్నం బ్రహ్మే తి వ్యజానాత్!" అంటే అన్నమే బ్రహ్మ అని తెలుసుకోవోయ్, వెధవాయా! అని చెప్పింది కదూ! దీన్నే నీ బోటి పామరులకు అర్థం చేయించేందుకు సుళువుగా 'అన్నం పరబ్రహ్మ స్వరూపం' అన్నారు మన పెద్దలు. అమెరికా వాడైనా అన్నం తినేముందు "ఫాధర్! గివ్ అజ్ అవర్ డెయిలీ బ్రెడ్" అనేగా ధ్యానం చేస్తాడు. వాడు రొట్టె ముక్కలు తింటాడు కాబట్టి అలా అడిగాడు. మన 'చమకం'లో ఏమన్నాడూ? "శ్యా మాకాశ్చమే" చామల అన్నం మా మజాగా ఉంటుంది ఓ దేవుడా! నాకు ఇవ్వు! అని కదా ప్రార్థించాలి. నువ్వు దేన్ని తినాలనుకుంటే దాన్ని కలిపి 'చమక' పారాయణం చేయొచ్చు. ఇదే రెలిజియస్ రిఫార్మ్!'.

వెంక : నేను చేగోడీలు చమే! గడ్డపెరుగూ చమే! అనచ్చా అండీ!

గిరీ : లోపలే అనుకో! లేకుంటే మీ తండ్రి ఎడ్యుకేషన్ లేకపోవడం వల్లనూ, రీజన్ తెలియకా 'చమకం' పాడు చేస్తున్నాడని నీ చెమ్డాలు తీయొచ్చు! నా మట్టుకు నాకు భారత ప్రధానే ఆదర్శం. టీవీ కేమేరాలు చూస్తున్నాయనుకున్నపుడూ, ఇంట్లోనైనా ఒకే పద్ధతిలో ఉంటుంది ఆయన ధ్యానం. గంధంతో అడ్డపట్టీలు పెట్టుకుని, భూకైలాస్‌లో ఎన్టీఆర్‌లా మధ్యలో శివలింగం లాంటి బొమ్మేయించుకుని ఆయన చేసే ధ్యానం ఎంత రియలిస్టిక్‌గా ఉంటుంది!

వెంక : అలా చేయొచ్చా అండీ!

గిరీ : దటీజ్ ప్యూర్ ఇగ్నోరెన్స్! నీకు మతపరమైన విషయాల్లో బొత్తిగా నాలెడ్జ్ లేదల్లే ఉంది. నేనీ మధ్య అన్ని మతాల ఎస్సెన్స్ తీసి ఒక కొత్త మతం ఏర్పాటు చేశాను. అక్బర్ 'దీన్ ఇల్లాహి' లాగా. దాన్ని అమెరికా నుండే ప్రజ్వలింపజేయాలనుకుంటున్నాను. ఎందుకంటే భారతదేశంలో రెలిజియస్ ఫ్రీడమ్ లేదనే గోల అక్కడ్నించే ఎక్కువ వినబడుతోంది.



వెంక : అద్సరే గానీండి. మొన్న మీరు ఒక శాస్త్రి గారింటి నుండి పొగాక్కట్ట ఎత్తుకొచ్చారు కదా! పాపం చేశారని దేవుడు కోప్పడడా?

గిరీ : పాపాలు, శాపాలు మా ఇంగ్లీషు వాళ్ళకు తగలవు. లేకంటే ప్లాసీ యుద్ధం నుండి మన దేశంలో జరిగిన ఊచకోతలకు ఎన్ని శాపాలు తగలాలి వాడికి. ఒక్క బెంగాల్ కరువులోనే ముప్పయి లక్షల మంది చనిపోయారు కదా! అలాంటి మూఢ నమ్మకాలు పెట్టుకుంటే వాడి రాజ్యం మీద సూర్యుడు ఎప్పటికీ నిలిచేవాడేనా?

ఇక నువ్వన్న పొగాకు కట్ట సంగతి. వెనకటికి మా పిన తండ్రి ఒకాయన చెవి మెలేసి మరీ ఉపనిషత్తులన్నీ భట్టీయం వేయించాడు. దాని పేరేంటో కూడా మరిచిపోయాను. దాన్లో కూడా నీలాంటి శిష్యుడు సందేహాలడుగుతూంటాడు. నా బోటి గురువు వాడి డౌట్లు తీరుస్తూంటాడు. మన సంవాదాన్ని ఎవరైనా తాటాకు మీద రాసి పడేస్తే మరో రెండు వందలేళ్ళకు అదే 'టొబాకోపనిషత్' అయ్యేది. పొగాకు కట్టకి పాపమేమిటోయ్, కాల్చిపారేసేదానికి? పైగా లోకోపకారం కూడా.

వెంక : అదెలాగండీ!

గిరీ : ఎలాగా ? చుట్ట కాలిస్తే భగ్ భగ్‌మని పొగ స్టీమింజన్‌లాగా ఆకాశంలోకిపోయి వర్షమై కురవదా? ప్రభుత్వాలు గనుక ఓటేయడం తప్పనిసరి చేసినా చేయకపోయినా దేశ పౌరులంతా తప్పని సరిగా మన లంక పొగాకుతో చేసిన చుట్టలు కాల్చాలని చట్టం చేస్తే.. గుప్పుగుప్పున పొగ పైకెళ్లి మన దేశం మీంచి వానదేవుడు అసలు కదుల్తాడా? పైగా భారత దేశంలోని నిరుద్యోగ సమస్యను దాదాపు పరిష్కారం చేయగలుగుతాడు మన ప్రధాని.

వెంక : అదెలాగండీ!

గిరీ : 140 కోట్ల మంది కనీసం రోజుకి ఐదు చుట్టలు తాగినా ఏడు వందల కోట్ల చుట్టలవసరం. సగం మందికి చుట్టల కంపెనీల్లో ఉద్యోగాలు, మిగిలిన వారికి పొగాకు పొలాల్లో ఉపాధి! దాంతో ఈ ఎన్నికల్లో మన ప్రధాని బయట పడటం గ్యారంటీ!

'డొల్ల' విరాళాలు

ఈబీలు కొనుగోలు చేసిన పలు 'షెల్ కంపెనీ'లు

వాటి నుంచి రాజకీయ పార్టీలకు నిధులు

- అత్యధిక మొత్తం అధికార బీజేపీకే
- ఈ కంపెనీల వెనకున్నదెవరో?
- ఈడీ, సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలి: మోడీ సర్కారును డిమాండ్ చేస్తున్న మేధావులు, నిపుణులు



న్యూఢిల్లీ : మోడీ సర్కారు తీసుకొచ్చిన వివాదాస్పద ఎలక్టోరల్ బాండ్ల(ఈబీ) పథకం విషయంలో రోజుకో ఆసక్తికరమైన విషయం బయటపడుతున్నది. సాధారణంగా, తన ప్రతిష్టకు భంగం కలిగించే సత్యాలపై స్పందించటం ప్రధాని మోడీకి ఇష్టముండదు. ఈబీ పథకం చట్టవిరుద్ధం, రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై తన తొలి స్పందనను అందించటానికి ఆయన ఒకటిన్నర నెల సమయం తీసుకున్నారు. ఈబీల ద్వారా "ఎవరు డబ్బు చెల్లిస్తున్నారో.. ఎవరు స్వీకరిస్తున్నారో ఇప్పుడు కనీసం అందరికీ తెలుసు" అని బహిరంగ సభలో చెప్పటం ద్వారా మోడీ.. కోర్టు తీర్పునూ తనకు అనుకూలంగా మల్చుకున్నాడని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇంతకు ముందు ఎవరు ఎవరికి నిధులు ఇచ్చారో ఎవరికీ తెలియదని చెప్తూ తమ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈబీ పథకాన్ని సమర్థించుకునే యత్నం చేశారు.

అయితే, ఈ ఈబీల ద్వారా ప్రధానంగా లాభపడింది బీజేపీ మాత్రమేనన్నది కాదనలేని వాస్తవమని విశ్లేషకులు అంటున్నారు. వివిధ సంస్థల నుంచి ఆ పార్టీకి దేశంలోనే మరే ఇతర పార్టీకి లేనంతగా వేలకోట్ల నిధులు వచ్చి చేరాయి. ముఖ్యంగా, దర్యాప్తులో ఉన్న కంపెనీలు, నష్టాల్లో ఉన్న సంస్థలూ బీజేపీకి నిధులు సమకూర్చటం చర్చనీయాంశంగా మారింది.

33 నష్టాల్లో ఉన్న కంపెనీలు (అనేక అనుమానిత షెల్ కంపెనీలు) రూ.576 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేశాయని 'ది హిందూ' కథనం వెల్లడించింది. అందులో చాలా వరకూ బీజేపీకే నిధుల రూపంలో వెళ్లినట్టుగా తెలుస్తున్నది.

ఎస్బీఐ నుంచి సమాచారం బహిర్గతమైన తర్వాత ఈ కంపెనీల గురించి కీలక సమాచారం అందింది. ఈ కంపెనీలు 2016-17 నుంచి 2022-23 వరకు ఏడేండ్లలో దాదాపు రూ. 1 లక్ష కోట్ల మొత్తం నష్టాన్ని చవిచూసినట్టు తెలిసింది. ఇలాంటి నష్టాల్లో ఉన్న కంపెనీలు ఎలక్టోరల్ బాండ్లను ఎలా కొనుగోలు చేశాయి? ఈ కంపెనీల డైరెక్టర్లు ఎవరు? అసలు ఈ షెల్ కంపెనీల వెనుక ఎవరున్నారు? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ), సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(సీబీఐ) వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు ఇలాంటి షెల్ కంపెనీలపై విచారణకు ఆసక్తి చూపకపోవటం గమనార్హం.

ఎలక్టోరల్ బాండ్స్ కేసు విచారణ సమయంలో ఇలాంటి షెల్ కంపెనీలను నిరోధించేందుకు సవరణలు చేయాలని కూడా సీజేఐ సూచించారు. ఇంత నష్టాల్లో ఉన్న ఈ షెల్ కంపెనీలను నియంత్రించే కీలుబొమ్మలు ఎవరు? భారతీయ ఓటరు ఈ వాస్తవాలను ఎప్పటికైనా తెలుసుకుంటాడా? అని రాజకీయ విశ్లేషకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎవరు డబ్బు చెల్లిస్తున్నారో, ఎవరు స్వీకరిస్తున్నారో ఇప్పుడు అందరికీ తెలుసునన్న మోడీ వాదనను వట్టి మాటేనని దీనిని బట్టి అర్థమవుతున్నదని వారు అంటున్నారు.

నష్టాల్లో ఉన్న డొల్ల కంపెనీల వెనుక ఉన్న అసలు దాతలను కనిపెట్టటంపై మోడీ ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నట్టయితే, ఈ కంపెనీల డైరెక్టర్లను ప్రశ్నించాలని ఈడీ, సీబీఐలను కోరేదని అంటున్నారు. అయితే, వేల కోట్ల నిధులను స్వీకరించిన అధికార బీజేపీ సర్కారు మాత్రం అంత ధైర్యం చేయదని వారు అంటున్నారు.

ఎలక్టోరల్ బాండ్ల పథకం ప్రకటించిన తర్వాత అనేక షెల్ కంపెనీలు సృష్టించబడినట్టు కొన్ని వార్త కథనాలను బట్టి తెలుస్తున్నది. మూడు సంవత్సరాల ఉనికి రికార్డు కలిగిన ప్రస్తుత కంపెనీలు మాత్రమే బాండ్ కొనుగోళ్లలో పాల్గొనవచ్చని ఈబీ పథకం నిబంధన. అయితే, ఈ నిబంధనను కూడా తీవ్రంగా ఉల్లంఘనకు గురైందనీ, దీనిపై కూడా ప్రత్యేక విచారణ అవసరమని రాజకీయ విశ్లేషకులు, మేధావులు, నిపుణులు అంటున్నారు. "నేను తినను.. ఇంకొకరిని తిననివ్వను" అని అవినీతిపై సహించేది లేదనే మోడీ.. ఇలాంటి కంపెనీలపై ప్రత్యేక దర్యాప్తు జరిపించాల్సిన అవసరం ఉన్నదని డిమాండ్ చేస్తున్నారు.


బీజేపీ ఆటలు సాగనివ్వం

మతతత్వ రాజకీయాలను అనుమతించం

ఎన్నికల్లో ఆ పార్టీ ఒక్క సీటునూ గెలవకుండా చూస్తాం : కేరళ సీఎం పినరయి విజయన్

తిరువనంతపురం : కేరళలో బీజేపీ మతతత్వ రాజకీయాలపై ఆ రాష్ట్ర సీఎం పినరయి విజయన్ హెచ్చరికలు పంపారు. ఆ పార్టీ ఆటలు రాష్ట్రంలో సాగనివ్వబోమని చెప్పారు. కాషాయపార్టీ మతతత్వ రాజకీయాలను వామపక్షాలు అనుమతించబోవని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో కాషాయ పార్టీ ఒక్క సీటు కూడా గెలవకుండా చూస్తామని విజయన్ అన్నారు. దేశానికి, ప్రజలకు సంఘ్ పరివార్ విసురుతున్న సవాళ్లను వామపక్షాలు అధిగమిస్తాయనీ, వారిని అధికారం నుంచి తరిమికొట్టేందుకు కృషి చేస్తాయని మీడియా సమావేశంలో విజయన్ చెప్పారు. " బీజేపీని అధికారం నుంచి దించాలనే లక్ష్యంతో ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాం. అందుకే జాతీయ స్థాయిలో బీజేపీ వ్యతిరేక ఫ్రంట్‌లో చురుకుగా చేరాం. మేము ఒక విషయం స్పష్టం చేయాలనుకుంటున్నాం. బీజేపీ మొత్తం 20 స్థానాల్లో(కేరళలో) ఓటమిని చవిచూడటమే కాదు.. ఈసారి ఏ నియోజకవర్గంలోనూ రెండో స్థానం దక్కించుకోలేకపోతుంది" అని విజయన్ అన్నారు. ఈ ఎన్నికలు దేశ భవిష్యత్తును నిర్దేశిస్తాయనీ, కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే ప్రయోజనం లేదని ఆయన అన్నారు.

"గత ఐదేండ్ల అనుభవంతో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయడం వల్ల ప్రయోజనం లేదని ప్రజలు అర్థం చేసుకున్నారు. దేశంలో ప్రమాదకర విధానాలను అమలు చేస్తున్న బీజేపీని గద్దె దించేందుకు వామపక్షాలు ప్రజల నుంచి ఓట్లు అడుగుతున్నాయి" అని విజయన్ చెప్పారు. మతతత్వ ఫాసిస్టులతో పోరాడిన చరిత్ర వామపక్షాలకు ఉన్నదన్నారు. కొన్ని ఓట్ల కోసం తాము తమ రాజకీయాలను మార్చుకోబోమని విజయన్ స్పష్టం చేశారు. కేరళలోని 20 లోక్‌సభ స్థానాలకు ఏప్రిల్ 26న ఎన్నికలు జరగనుండగా, జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయి. ఇక్కడ ప్రధానంగా అధికార లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్), యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్)ల మధ్య పోటీ ఉన్నది.



డబ్బులు ఎవరికి వెళ్లాయి?

ఫోన్ ట్యాపింగ్ కేసులో కూపీ లాగుతున్న పోలీసులు

రాధాకిషన్‌రావును లోతుగా ప్రశ్నిస్తున్న అధికారులు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు బృందం తాము స్వాధీనం చేసుకున్న డబ్బులను ఎవరికి పంపిణీ చేశారనే విషయమై దర్యాప్తు అధికారులు ఒక్కటొక్కటిగా కూపీ లాగుతున్నారు. గత ఉప ఎన్నికలు మొదలుకొని అసెంబ్లీ ఎన్నికల వరకు ఎంత మందిని ట్రాప్ చేసి రాధాకిషన్‌రావు బృందం డబ్బులను స్వాధీనపర్చు కుందనే విషయమై ఒక జాబితాను కూడా స్పెషల్ టీం అధికారులు రూపొందిస్తున్నట్టు తెలిసింది. తమ కస్టడీలో ఉన్న రాధాకిషన్‌రావును మూడో రోజు విచారణలో ఈ అంశంపైనే ఎక్కువగా దృష్టి సారించినట్టు తెలిసింది. ప్రధానంగా, ఎస్ఐబీ మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు ఇచ్చిన ఫోన్ నెంబర్లేగాక తన వైపు నుంచి కూడా ఎంత మంది ఫోన్లను ట్యాప్ చేసి వారి నుంచి డబ్బులను సీజ్ చేసింది తెలుసుకోవటానికి స్పెషల్ టీం అధికారులు ప్రత్యేకంగా దృష్టిని సారించారు. ఈ విషయంలో గతంలో అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, డీఎస్పీ ప్రణీత్‌రావు విచారణల సందర్భంగా బయటపడిన సమాచారాన్ని ఇప్పుడు రాధాకిషన్‌రావు ఇస్తున్న సమాచారంతో క్రోడీకరించి దర్యాప్తును ముందుకు సాగిస్తున్నట్టు తెలిసింది. ఈ కేసులో మరికొందరి పోలీసుల పేర్లను కూడా రాధాకిషన్‌రావు బయటపెట్టటంతో వారిని కూడా విచారించటానికి రంగం సిద్ధం చేస్తున్నట్టు తెలిసింది. మొత్తమ్మీద, డీసీపీ స్థాయి అధికారైన రాధాకిషన్‌రావును క్షుణ్ణంగా విచారించటం ద్వారా.. ఈ కేసులో మిగిలిపోయిన అంశాలు కూడా వెలుగులోకి వస్తాయని అధికారులు భావిస్తున్నారు. కాగా, రాధాకిషన్‌రావు డబ్బు పంపిణీ జరిపిన వ్యక్తులను గుర్తించి వారి నుంచి కూడా సమాచారాన్ని సేకరించటానికి అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.

వేటాడి..వేధించటానికే... సీపీఐ(ఎం) ఖాతా నిలువరింత

త్రిస్సూర్ జిల్లా కమిటీ బ్యాంక్ ఖాతాను స్తంభింపచేసిన ఐటీ అధికారులు



తిరువనంతపురం : కేరళలోని త్రిస్సూర్ లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి ప్రయోజనార్థం.. సీపీఐ(ఎం) త్రిస్సూర్ జిల్లా కమిటీ బ్యాంక్ ఖాతాను ఆదాయపన్ను శాఖ అధికారులు స్తంభింపచేశారు. పార్టీకి ఈ మేరకు నోటీసులు జారీ చేశారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎంజి రోడ్‌లోని జిల్లా కమిటీ అకౌంట్‌ను స్తంభింపచేసినట్లు ఆ నోటీసులో తెలియచేశారు. దానికి గల కారణమేంటనేది ఆ నోటీసులో వారు వివరించలేదు. తదుపరి ఆదేశాలు జారీ చేసేవరకు ఎలాంటి లావాదేవీలు జరగరాదని ఆ నోటీసు పేర్కొంది.

ఈ ఖాతా వివరాలు పరిశీలించేందుకు శుక్రవారం రాత్రి ఐటీ అధికారులు బ్యాంక్ ఎంజి రోడ్ బ్రాంచికి చేరుకున్నారు. అదే సమయంలో జిల్లా కమిటీ కార్యదర్శిని కూడా బ్రాంచికి రావాల్సిందిగా పిలిపించారు. అంతకుముందు రోజే కోచిలో జిల్లా కార్యదర్శి ఎం.ఎం.వర్గీస్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ఇంటరాగేట్ చేశారు. కరవన్నూర్ సర్వీస్ కో ఆపరేటివ్ బ్యాంక్‌కు సంబంధించిన సమస్యలకు సంబంధించి ఇంటరాగేషన్ జరిగింది. ఖాతా వివరాలను ఐటీ అధికారులు అడిగి తెలుసుకున్నారు.

ఐటీ శాఖ చర్యలపై సీపీఐ(ఎం) ఖండన

ప్రతి సంవత్సరం పార్టీ ఆదాయం, ఖర్చుల వివరాలను ఆదాయపన్ను శాఖకు, ఎన్నికల కమిషన్‌కు సీపీఐ(ఎం) అందచేస్తుందని ఆ ప్రకటన పేర్కొంది. అలాగే త్రిస్సూర్ జిల్లా కమిటీ అకౌంట్ వివరాలను కూడా తెలియచేశామన్నారు. ముందస్తు సమాచారం, ఎలాంటి వివరణ లేకుండా అకౌంట్‌ను స్తంభింపచేశారని కార్యదర్శివర్గం విమర్శించింది.

త్రిస్సూర్ జిల్లాలోసహకార బ్యాంకులకు సంబంధించిన సమస్యలపై పార్టీ నిర్దిష్ట వైఖరి తీసుకుంటూ వస్తోందని తెలిపింది. ఈ పరిస్థితుల్లో ప్రతిపక్ష పార్టీల నేతృత్వంలోని ప్రభుత్వాలను, ప్రతిపక్ష పార్టీలను వెంటాడి, వేధించేందుకు కేంద్ర ప్రభుత్వం అనుసరించే విధానంలో భాగమే ఈ చర్యలని కార్యదర్శివర్గం విమర్శించింది. ఈ ఎన్నికల క్రమంలో మరింత చురుకుగా పాల్గొనాల్సిందిగా, ఈ విధానాలపై పోరాడాల్సిందిగా కేరళ ప్రజలను కార్యదర్శివర్గం ఆ ప్రకటనలో కోరింది.

11న ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవం

పోస్టర్ ఆవిష్కరణలో రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి టి సాగర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈనెల 11న అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణలు, సభలు, సమావేశాలు గ్రామ, మండల, జిల్లా కేంద్రాల్లో నిర్వహించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అరిబండి ప్రసాద్‌రావు, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, నాయకులు టి కిషోర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సాగర్ మాట్లాడుతూ 1936, ఏప్రిల్ 11న ఏఐకేఎస్ ఏర్పడిందని చెప్పారు. జాతీయోద్యమంలో భాగంగా ఆవిర్భవించిన ఏఐకెఎస్ ఒకవైపు బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతూనే మరోవైపు జమీందార్లు, జాగీర్దార్లకు వ్యతిరేకంగా సంస్థానాల్లో పోరాటాలను నిర్వహించిందని గుర్తు చేశారు. అర్హులైన పేదలకు భూమి దక్కాలనీ, కౌలు రేట్లు తగ్గించాలనీ, గ్రామీణ ప్రాంతాల్లో సాగు చేస్తున్న రైతుల రుణాలను మాఫీ చేయాలనీ, అనేక ప్రాంతీయ డిమాండ్‌లను తీసుకుని నిరంతరం పోరాటాలు నిర్వహించిందన్నారు. స్వామి సహజనంద సరస్వతి మొదటి అధ్యక్షునిగా, ఎన్‌జి రంగ కార్యదర్శిగా ఈ సంఘం ఆవిర్భవించిందని చెప్పారు. ఆవిర్భావ కాలంలోనే ఈఎంఎస్ నంబూద్రిపాద్, సుందరయ్య లాంటి అనేక మంది జాతీయోద్యమంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. ఈనెల 11న దేశవ్యాప్తంగా కిసాన్ సభ జెండాలను ఆవిష్కరించి అదే సందర్భంలో సభలు, సమావేశాల ద్వారా కేంద్ర ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే విధానాన్ని బహిర్గతం చేయాలన్నారు. మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఆ చట్టాలను వెనక్కి తీసుకుంటూనే చాపకింద నీరులా కేంద్రం అమలు చేయడానికి పూనుకుంటున్నదని విమర్శించారు.



విద్యుత్ సవరణ బిల్లును పార్లమెంట్‌లో పెట్టిందన్నారు. ప్రజానీకానికి నష్టం చేసే విధానాలను కేంద్రం అవలంభిస్తున్నదని చెప్పారు. ఎన్నికలు జరుగుతున్న ఈ సందర్భంలో రైతు రుణాల గురించి మాట్లాడటం లేదన్నారు. కనీస మద్దతు ధరల చట్టం గురించి మాట్లాడటం లేదని అన్నారు. కలిసొచ్చే రైతు సంఘాలను కలుపుకుని ఆందోళనా పోరాటాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

కాంగ్రెస్ ధ్యేయం సమన్యాయం

(మొదటి పేజీ తరువాయి)

కమిటీ సిఫార్సుల ఫార్ములా ప్రకారమే రైతులకు లబ్ధి చేకూరుస్తామని వివరించారు. శ్రామిక్ న్యాయ్‌లో భాగంగా కార్మికులకు కనీస వేతనాలు తెస్తామనీ, ఉపాధి హామీ కింద రోజుకు రూ.400 ఇస్తామనీ, ఇతర పనులనూ ప్రకటిస్తామని తెలిపారు. దేశంలో 50 శాతం జనాభా వెనుకబడిన తరగతులకు చెందినవారు ఉన్నారనీ, వారిలో 15 శాతం దళితులు, 8 శాతం గిరిజనులు, ఆదివాసులు, 15 శాతం మైనార్టీలు, 5 శాతం నిరుపేదలు జనరల్ కేటగిరిలో ఉన్నారని చెప్పారు. ఈ కేటగిరిలోకే 90 శాతం జనాభా వస్తారనీ, కానీ వీరెవరూ ఏ వ్యవస్థలోనూ వ్యవస్థలో కనిపించరని అన్నారు. మీడియా కంపెనీ యజమానుల్లో ఎవరూ వెనుకబడిన తరగతుల వారు లేరనీ, అదే పరిస్థితి ఇతర కంపెనీల్లోనూ ఉందన్నారు. దేశాన్ని 90 మంది ఐఏఎస్‌లు నడుపుతుంటే, వారిలో కేవలం ముగ్గురు మాత్రమే బీసీలు ఉన్నారనీ, కానీ జనాభాలో వారు 50 శాతంగా ఉన్నారని విశ్లేషించారు. గిరిజనుల్లో ఒక్క ఐఏఎస్, ముగ్గురు దళితులు మాత్రమే ఉన్నారని చెప్పారు. బడ్జెట్‌లో వంద రూపాయల ఖర్చులో కేవలం రూ.6 మాత్రమే బీసీ, ఎస్సీ, ఎస్టీ అధికారుల కోసం ఖర్చు చేస్తున్నారనీ, సంపద సమానంగా పంపిణీ జరగట్లేదని అభిప్రాయపడ్డారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే తెలంగాణ తరహాలో దేశంలోనూ కుల గణన చేపడతామనీ, దేశాన్ని ఎక్స్‌రే తీసి, ఆర్థిక సంస్థల సర్వే చేసి పాలు-నీళ్లు వేర్వేరు చేస్తామన్నారు. దేశ సంపద ఏ వర్గం చేతిలో ఉన్నదో నిగ్గు తేలుస్తామని హెచ్చరించారు. విప్లవాత్మక మార్పులు తెస్తూ, ప్రజల హక్కుల్ని వారికే ఇస్తామని చెప్పారు. మీడియా, బ్యూరోక్రసీ, దేశంలోని అన్ని సంస్థల్లో జనాభా ప్రాతిపదికన ఎవరి వాటా వారికి దక్కేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో మాజీ సీఎం ప్రభుత్వాన్ని ఎలా నడిపారో ప్రజలకు తెలుసనీ, వేలాదిమంది ఫోన్లు ట్యాపింగ్ చేసి, బ్యాంకులు, ఇంటలిజెన్స్, పోలీస్ వ్యవస్థల్ని దుర్వినియోగం చేశారన్నారు. ప్రభుత్వం మారగానే ఆ డేటా మొత్తం ధ్వంసం చేశారని అన్నారు. గత ప్రభుత్వంలో ప్రజల్ని భయపెట్టి, సమాజాన్ని ఆందోళనలోకి నెట్టారని విమర్శించారు. రాష్ట్రంలో మాజీ సీఎం చేసిన పనులనే ఢిల్లీలో నరేంద్రమోడీ ప్రభుత్వం కూడా చేస్తున్నదని ఆరోపించారు. ఈడీ బలవంతపు వసూళ్ల సంస్థగా మారిందన్నారు. బీజేపీ దేశంలోనే అతిపెద్ద వాషింగ్ మెషిన్‌ను నడిపిస్తున్నదనీ, ఎన్నికల కమిషన్‌లో కూడా తన వ్యక్తుల్ని పెట్టారని చెప్పారు. ఎలక్టోరల్ బాండ్స్ ప్రపంచంలోనే అతిపెద్ద కుంభకోణమనీ, పైసలు ఇచ్చి పనులు తీసుకొనేలా వ్యవస్థను మార్చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. సీబీఐ ఎప్పుడైతే ఏ సంస్థను భయపెడుతుందో, అదే నెల ఆ కంపెనీ ఎలక్ట్రోరల్ బాండ్స్ పేరుతో బీజేపీకి డబ్బు చెల్లిస్తుందనీ, దేశంలో మౌలిక వసతుల కల్పన కాంట్రాక్టుల్ని ఇలాంటి వారికే ఇచ్చారని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ బీ టీంను ఓడించామనీ, ఇప్పుడు దేశంలో 'ఏ' టీంను ఓడిస్తామని స్పష్టం చేశారు. రాజ్యాంగం దేశ ప్రజలకు రక్షణ కల్పిస్తుందనీ, బీజేపీ ఆ రాజ్యాంగాన్నే మార్చే ప్రయత్నం చేస్తున్నదనీ, కానీ అలా జరగనివ్వబోమని స్పష్టం చేశారు. తమది రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకొనే ప్రయత్నమని వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోడీ 3, 4 శాతం ఉన్న పెద్దల కోసమే పనిచేస్తున్నారనీ, ఆయన దగ్గర మీడియా, సీబీఐ, ఈడీ వంటివి ఉన్నాయన్నారు. తమ దగ్గర కేవలం ప్రజల ప్రేమ, ఆశీస్సులు మాత్రమే ఉన్నాయని తెలిపారు. మత్స్యకారులకు డీజిల్ సబ్సిడీ ఇస్తామనీ, వారి కో ఆపరేటివ్ సొసైటీలకు తక్కువ ధరకు రుణాలు ఇప్పిస్తామని చెప్పారు. యువకులు, మహిళలు, రైతులు, కూలీలు, వెనుకబడిన తరగతులవారి కోసం మరో ఐదు హామీలు ఉన్నాయనీ, ఇది దేశ ముఖచిత్రాన్ని మారుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మ్యానిఫెస్టో దేశ ప్రజల ఆత్మ అనీ, వారి బాధలు విని దీన్ని రూపొందించామని చెప్పారు. తనకు, ప్రజలకు ఉన్నది కేవలం రాజకీయ సంబంధం మాత్రమే కాదనీ, ప్రేమ ఆత్మీయతలతో కూడిన కుటుంబ సంబంధమని అన్నారు. సోనియాగాంధీ తెలంగాణ ప్రజలకు తోడుగా నిలిచారనీ, ఢిల్లీలో తానూ ప్రజల కోసం పోరాడే సైనికుడిగానే ఉంటాననీ, రాష్ట్రంలో చిన్న పిల్లలు పిలిచినా మీకోసం వచ్చేస్తానని భరోసా ఇచ్చారు. తాను బతికున్నంతకాలం మీ ముందే ఉంటాననీ, సేవ చేస్తానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందనీ, మాజీ సీఎం కేసీఆర్ ఇక్కడి ప్రజల కలల్ని కాలరాసారని విమర్శించారు. దేశానికి తెలంగాణ దారి చూపాలనీ, అందరం ఒక్కటై కలిసి పనిచేద్దామన్నారు. మేడిన్ తెలంగాణ అనే బ్రాండ్ మేడిన్ చైనా కంటే పెద్దగా కావాలనీ, అదే తరహాలో మేడిన్ రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రావాలని ఆకాంక్షించారు. బీజేపీ దేశంలో విద్వేషాన్ని నింపుతోందనీ, మతాల మధ్య కొట్లాటలు పెడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కానీ రాష్ట్రంలో ప్రజలంతా ప్రేమతో కలిసిమెలిసి ఉంటారనీ, ఇదే సందేశం రాష్ట్రం నుంచి దేశానికి వెళ్లాలని ఆకాంక్షించారు.



కొత్త పాట

భారతీయ భిన్న సాంస్కృతిక విలువలకు తిలోదకాలిస్తూ భిన్నత్వంలో ఏకత్వ స్ఫూర్తిని తుంగలో తొక్కుతూ హిందూత్వ రాష్ట్రంగా ప్రకటించాలని ఉవ్విళ్లూరుతున్న వీరు వారసత్వం గురించి వల్లిస్తున్నారు. ఎంత విచిత్రం! ఇంకా ఏమన్నారు తెలుసా! 'ఇంకా నయం ఇడ్లీ, దోసెలను రాజకీయం చేయలేదు, చేసుంటే అవి తమిళనాడుకే పరిమితమయ్యేవి' అన్నారు. భిన్నమైన, ప్రాంతీయ ఆహారపు అలవాట్లను గౌరవించే గుణ సంపన్నత ఉన్న మనిషా ఈయన? బీఫ్ తింటున్నారని కొట్టి చంపే మూకకు నాయకుడిగా ఉండి, మాంసాహారులనే మంద బుద్ధులని ప్రచారం చేసే సన్యాసులకు వత్తాసు పలికే గొంతు ఆహారపు వారసత్వాన్నీ మాట్లాడ టమా! ఎంత నిస్సిగ్గుతనం! ఏ ఎండకా గొడుగు పట్టే లక్షణమంటే ఇదే మరి!


ఎన్నికలల విహారంలో ఎన్నో కొత్తగా కనిపిస్తుంటాయ్, మరెన్నో కొత్తగా వినిపిస్తుంటాయి. ఏం చేస్తాం వినకతప్పదు. కలల విహారంలో కళల సోయగాలు కనకతప్పదు. ఎన్ని చివుళ్ల గొంతుదిగినా వసంత కాలాన కోయిల గొంతుమారదు. ఎన్ని పండ్లు ముక్కు కొరికినా చిలుక పలుకూ మారదు. వేపపువ్వు చేదుమారదు. మామిడి పండు మధురమూ మారదు. సంధ్య ఎరుపు తరగదు. జాబిలి తెలుపు మలగదు. ఎందుకంటే ఇవి ప్రకృతి ధర్మ నియమాలు. కలుష రహిత గుణాలు. ఇక మారే గొంతు ఒక్క మనిషి సొంతమే. అదికూడా అవసరార్థమై నానా విధ విన్యాసాలకు పాల్పడే నాయకమన్యుల కొత్త గొంతులు వింతపాటలు వినిపిస్తుంటారు. కోరికలు నెరవేర్చుకునేందుకు కొత్త పాటలూ ఎత్తుకుంటారు. వసంతకాలం గనక కోయిలల తీయని గానాలతో పాటు, మనకు ఎన్నికల పుణ్యాన నాయకుల కొత్తపాటలూ చెవిన మోగుతున్నాయి. పాటలు హాయిగా అనిపించినా కొత్తపాటని, విని తరించినా ఏమీ ఫర్వాలేదు. కానీ పాటెందుకు మారిందో అందులోని మర్మమేమిటో తెలుసుకోలేకపోతే మోసపోతాం, మొసలి కన్నీటికి కరిగిపోతాం!

సార్వత్రిక ఎన్నికల వేల పదేండ్లుగా కడుపునిండా మింగించిన నాయకుడు, దాని రుచి ఇంకా జనానికి తెలియనట్టు తిరిగి చెబుతున్నాడు. మొన్న తమిళనాడుకు ప్రచారానికి వచ్చిన మోడీ తోడిరాగంలో కొత్త పాటను వినిపించాడు. పాపం ఛానెల్‌వాళ్లు రికార్డు చేసి మరీ రిలే చేశారు. నాకు తమిళ భాషంటే ఎంతో ఇష్టం, నేను తమిళం నేర్చుకుంటా, ఐక్యరాజ్య సమితిలో తమిళంలో మాట్లాడతానని ప్రతిజ్ఞ చేశారు. అంతేకాదు ఇంతవరకు తమిళ భాషకు అన్యాయం జరిగిందని, వేల సంవత్సరాల చరిత్ర కలిగిన తమిళభాష భారతదేశంలో ఉందన్న విషయాన్ని ప్రపంచానికి చెప్పలేక పోయాం. గర్వపడలేక పోయాం. రాజకీయాల వల్లే ఈ భాషను విస్తరించలేక పోయామని తెగ ఆవేదన చెందారు మన మోడీ గారు. ఇవి మొసలి కన్నీరులా ఉందని అంటే కాదని ఎవరైనా అనగలరా! ఈయనగారి పాలనలోనే, ఇంకా ఆ సంఘటనల జ్ఞాపకాలు పచ్చిపచ్చిగానే ఉన్నాయి. తమిళ ఉద్యోగులను హిందీలో మాట్లాడాలని ఒత్తిడి తెచ్చి భారతీయులు కాదా మీరని అవమానించిన వాళ్లు తమిళ భాష గొప్పతనాన్ని పొగడడమా! దేశం మొత్తంలో ఒకే మతం, ఒకే పన్ను, ఒకే భాష అనే నినాదాన్ని ఇస్తూ, హిందీ భాషని దక్షిణ భారతంపై బలవంతాన రుద్దే ప్రయత్నం చేసింది ఎవరు? దక్షిణాది ప్రాంతీయ భాషల ప్రాధాన్యతను గుర్తించ నిరాకరించింది ఎవరు? మోడీగారి ప్రభుత్వం కాదా! తమిళభాషా ఔన్నత్యాన్ని, దాని వారసత్వాన్ని పోరాడి నిలుపుకుంటున్నది అక్కడి తమిళ ప్రజలే. అక్కడే కాదు, కన్నడ, మళయాల, తెలుగు ప్రజలు కూడా హిందీ భాషాధిపత్య రాజకీయాలను తిప్పికొట్టారు. రాజకీయంగా ఉద్యమించారు కనుకనే భాషా సంస్కృతిని వారసత్వంగా నిలుపుకున్నారు. తమిళభాషా ఘన వారత్వాన్ని ప్రపంచమంతటా చెప్పుకోవాలనీ ప్రధాని సెలవిచ్చారు. భారతీయ భిన్న సాంస్కృతిక విలువలకు తిలోదకాలిస్తూ భిన్నత్వంలో ఏకత్వ స్ఫూర్తిని తుంగలో తొక్కుతూ హిందూత్వ రాష్ట్రంగా ప్రకటించాలని ఉవ్విళ్లూరుతున్న వీరు వారసత్వం గురించి వల్లిస్తున్నారు. ఎంత విచిత్రం! ఇంకా ఏమన్నారు తెలుసా! 'ఇంకా నయం ఇడ్లీ, దోసెలను రాజకీయం చేయలేదు, చేసుంటే అవి తమిళనాడుకే పరిమితమయ్యేవి' అన్నారు. భిన్నమైన, ప్రాంతీయ ఆహారపు అలవాట్లను గౌరవించే గుణ సంపన్నత ఉన్న మనిషా ఈయన? బీఫ్ తింటున్నారని కొట్టి చంపే మూకకు నాయకుడిగా ఉండి, మాంసాహారులనే మంద బుద్ధులని ప్రచారం చేసే సన్యాసులకు వత్తాసు పలికే గొంతు ఆహారపు వారసత్వాన్నీ మాట్లాడటమా! ఎంత నిస్సిగ్గుతనం! ఏ ఎండకా గొడుగు పట్టే లక్షణమంటే ఇదే మరి!

అసలు మన అధినాయకుని కొత్త పాటకు కారణమేమో తెలుసు కోవటం చాలా అవసరం. ఉత్తర భారతంలో ఎట్లాగూ ఎన్నికల్లో సీట్లు తగ్గుతాయనేది స్పష్టమయిన విషయం. ఇక ఉన్నదొక్కటే ఆశ. గతం నుండి కాలు మోపనీయని దక్షిణాది, ముఖ్యంగా తమిళనాడులో కొన్నయినా సీట్లు పొందాలన్న ఆశ తప్ప మరేమీ కాదు. అందుకు తమిళ సెంటిమెంటును పండించే బృహత్ నాటకానికి నాందీ వచనం పలుకుతున్నారు మోడీగారు. భావోద్వేగాలను రెచ్చగొట్టటం వీరికి కొత్తేమీ కాదు కదా! అందుకే తమిళ భాష, ఇడ్లీ, దోశ గుర్తుకొచ్చాయి వీరికి, సాధారణంగా పరిపాలకులు పదేండ్లుగా ప్రజలకు ఏమిచేశానో ఎంత అభివృద్ధి చేశానో, చెప్పి ఓట్లడుగుతారు. అవేమీ లేవు గనక, సెంటిమెంటు నెత్తుకున్నది ఎన్నికల కోకిల. అంతేకాదు, కచ్చతీవు ద్వీపాన్నీ పదేండ్లుగా మాట్లాడని, పరిష్కరించని అంశాన్ని రాజకీయం చేసే పనికి పూనుకుంటున్నారు. దాని ద్వారా ఓట్లు దండుకోవాలనే ఆశ తప్ప ప్రజల మేలు కోరుకోవడమేమీ లేదు. తమిళనాడు ప్రభుత్వం, తమ ప్రజల కోసం చేసిన చట్టాలను, తమ గవర్నరు ద్వారా ఆమోదం పొందకుండా నిలుపుదల చేసిన తీరు ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. కోర్టులు, వీరు తమ ప్రతినిధులుగా నియమించిన గవర్నర్లను తప్పుబడుతూనే ఉన్నారు. కేరళలోనూ అంతే చేస్తున్నారు. అయినా దక్షిణాది ప్రజల కోసం తెగ ఆవేదన చెందే నటనా, ఎత్తుకున్న పాటా ఎంత ఎబ్బెట్టుగా ఉందో జనం గమనిస్తూనే ఉన్నారు.

సంపాదకీయం

మోడీ బిల్డప్‌నే మోయడం అవసరమా?


తెలకపల్లి రవి

జానపద కథల్లో శక్తులన్నీ కలిసి ఎవరికో పట్టం కట్టాలని చూసినట్టు భారతదేశంలో, పాలక వ్యవస్థలన్నీ కలిసి నరేంద్రమోడీ బీజేపీప్రభుత్వాన్ని మూడోసారి ప్రతిష్టించడానికి పథకాలు వేస్తున్నాయి. ఎన్నికలలో ఓటు వేసి గెలిపించవలసిన ప్రజలను మానసికంగా సిద్ధం చేయాలను కుంటున్నాయి. నిజానికి మోడీని ఢిల్లీలో తీసుకొచ్చిన మొదటి రోజు నుంచి ఈ వ్యూహం వుంది. ఇప్పుడు ఆయన మూడవసారి అధికారంలోకి రావడం అనివార్యమని మోత పరమార్థం అదే. ఎలాగూ గెలిచే మోడీని ఎదుర్కోవడం వృథా అని నీరిపోయడం అందులో భాగమే. తెలుగునాట సీనియర్ మాజీ ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు నాయుడు కూడా అదే తరహాలో మోడీని మోయడం అనివార్యమని నమ్ముతూ ఆ ప్రచారానికి ఊతమిస్తున్నారు. గత పదేండ్ల నుంచి మోడీకే వత్తాసునిస్తున్న ముఖ్యమంత్రి జగన్ కూడా బీజేపీ జోలికిపోకుండా తనవంతు సహాయం అందిస్తున్నారు. ఇక తెలంగాణలో ఓటమిపాలైన మాజీ సీఎం కేసీఆర్ కూడా కాంగ్రెస్‌నే ఏకైక శత్రువుగా భావిస్తూ బీజేపీకి పరోక్షంగా సహకరిస్తున్నారు. జాతీయ మీడియా దాదాపుగా మోడీయాగా మారిపోగా తెలుగు మీడియా కూడా ప్రాంతీయంగా తమకు నచ్చినవారికి మద్దతిస్తూ జాతీయ స్థాయిలో బీజేపీకి అనుకూలమైన రాగాలే వినిపిస్తున్నది. ఏతావాతా బీజేపీ హ్యాట్రిక్ విజయం గురించి వారికన్నా ఎక్కువగా ఈ శక్తులు ప్రచారం చేస్తున్నాయి. వామపక్షాలుగానీ, బీజేపీ ఎన్‌డిఎకు వ్యతిరేకంగా ఏర్పాటైన 'ఇండియా' దండగమారి ప్రయత్నమనీ, వామపక్షాలు ఏదో సైద్ధాంతికంగా వ్యతిరేకించడం తప్ప చేయగలిగింది లేదనీ అహోరాత్రులు అపహాస్యం చేస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలుగా పోరాడటం సహజంగా జరుగుతుందనే కనీస ప్రజాస్వామిక సంప్రదాయాన్ని కూడా భరించలేకపోతున్నాయి.

రాజకీయ ప్రత్యామ్నాయాల నేపథ్యమేమిటి?


నిజంగానే ఇది చాలా విడ్డూరమైన పరిస్థితి.దేశ విదేశాలలోని గుత్తాధిపతులకు మోడీ రాకకోసం ఎందుకంత పరితపిస్తున్నారనేది ఆలోచించవలసిన అంశం. గతంలో కాంగ్రెస్ అవిచ్ఛిన్నంగా ముప్పై ఏండ్లు దేశాన్ని పాలించింది.ప్రతిపక్షాలకు చాలా తక్కువ సీట్లే వుండేవి.బెంగాల్, కేరళ, తమిళనాడు, పంజాబ్ వంటిచోట్ల తప్ప బలమైన ప్రత్యామ్నాయ పక్షాలు కూటములు కూడా వుండేవి కావు. అయినా ప్రతి ఎన్నికలోనూ కాంగ్రెస్‌ను ఓడించేందుకు విస్తారమైన ప్రయత్నం జరిగేది. అందుకు గల అవకాశాలకు తగినట్టు వేదికలను ఏర్పాటు చేయడం జరుగుతుండేది. ఆ క్రమంలోనే 1957లో కేరళలో ఇఎంఎస్ నంబూద్రిపాద్ నాయకత్వాన తొలి కాంగ్రెసేతర కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడింది. 1967నాటికి ఎనిమిది రాష్ట్రాలలో కాంగ్రెసే తర ప్రభుత్వాలొచ్చాయి. 1977లో ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ తర్వాత ప్రతిపక్షాల ఐక్యత దాన్ని ఓడించడానికి దారితీసింది. రాష్ట్రాలలోనూ కేంద్రంలోనూ ఏర్పడిన ఈ ప్రభుత్వాలు పూర్తికాలం సాగకుండా కేంద్రం కుట్రలు చేసింది.ప్రతిపక్షాల అనైక్యతా అందుకు దోహదం చేసింది, ఎమర్జెన్సీతో ఓడిపోయిన ఇందిరాగాంధీ తిరిగి అధికారంలోకి రాగలిగారు.ఆమె దారుణహత్య తర్వాత ఆమె కుమారుడు రాజీవ్‌గాంధీ సానుభూతి వెల్లువలో చరిత్రలోనే లేనంత పెద్ద మెజారిటీతో అంటే 400 పైన స్థానాలతో ప్రధాని అయ్యారు. ఇప్పుడు పాలన చేస్తున్న బీజేపీకి ఆ ఎన్నికల్లో రెండంటే రెండు సీట్లే వచ్చాయి. ఆ 1984 ఎన్నికల్లో బెంగాల్‌లో సీపీఐ(ఎం), ఉమ్మడి ఏపీలో ఎన్టీఆర్ నేతృత్వంలో టీడీపీ మాత్రమే నిలదొక్కుకో గలిగాయి. టీడీపీ జాతీయ ప్రధాన ప్రతిపక్షం కూడా అయింది. అంతేగానీ పలాయన మంత్రం పాడింది లేదు.1989లో వీపీసింగ్ ప్రభుత్వం కూడా వచ్చింది. పాలకపక్షం బలం చూసి లేదా ప్రతిపక్షాల బలహీనత చూసి ముందే చేతులెత్తేసింది లేదు, రాజీవ్‌గాంధీ హత్య తర్వాత మళ్లీ పీవీ నరసింహారావు మైనార్టీ ప్రభుత్వం వచ్చింది. ఈ కాలంలోనే బీజేపీ మత రాజకీయాలను అయోధ్య వంటి సమస్యలనూ పెంచుతూ శక్తి పెంచుకున్నది. 1989, 1996-97లలో కేంద్రంలో విఫలయత్నాలు చేసి 1998లో తొలిసారి అధికారం చేపట్టగలిగింది. మారిపోయిన తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబు మద్దతు అందుకు ప్రధాన కారణమైంది. వాజ్‌పేయి పాలనా సమర్థతలో దేశం వెలిగిపోతోందని ప్రచారం మోగించిన కాలం కూడా మర్చిపోలేము. 2004లో మళ్లీ యుపిఎ సర్కారు ఏర్పడే వరకూ చంద్రబాబు వారికే మద్దతుగా వున్నారని మర్చిపోరాదు. వాజ్‌పేయికి స్వంతంగా మెజార్టీ లేని మాట నిజమే గాని బలపరిచే పార్టీలు చాలా వుండేవి. అయినా ఓటమిపాలు కాక తప్ప లేదు. తర్వాత మన్మోహన్ సింగ్ నాయకత్వంలో వామపక్షాల మద్దతుతో ఏర్పడిన యుపిఎ ప్రభుత్వం రెండు పర్యాయాలు పాలన చేసింది. అణుఒప్పందం తర్వాత వామపక్షాలు మద్దతు ఉపసంహరించుకున్నా అవకాశవాద ప్రాంతీయ పార్టీలు దానికి మద్దతునిచ్చాయి. మోడీ రెండుసార్లు పాలించడం అసాధారణమన్నట్టు చెప్పేవారు, మన్మోహన్ కూడా పదేండ్లు పాలించారనేది దాటేస్తుంటారు.

అవకాశవాదం అనర్థం

అనేక ప్రాంతీయ పార్టీల అవకాశవాదం, కాంగ్రెస్ బలహీనపడటం,వామపక్షాలు ప్రతికూల పరిస్థితిలో పడటం,దేశంలో పాలకవర్గాలు మతవాద, మితవాద రాజకీయాలను ప్రోత్సహించడం, సరళీకరణ విధానాలు అనివార్యంగా మతమార్కెట్ తత్వాలను ప్రోత్సహించడం వంటి కారణాల వల్ల బీజేపీ, ఆరెస్సెస్‌లు పట్టు పెంచుకున్న మాట నిజం. దేశ, విదేశీ గుత్తాధిపతులు ఫైనాన్స్ పెట్టుబడిశక్తులు కూడా ఆయనకు దన్నుగా నిలిచిన మాటా వాస్తవం. ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రజాస్వామిక విలువలనే బలహీనపరిచే ప్రయత్నాలు కూడా కాదనలేనివి. అయితే ఈ కారణాలన్నీ ప్రత్యామ్నాయంకోసం పోరాడవలసిన అవసరాన్ని మరింత పెంచుతాయే గాని తగ్గించవు. ఎందుకంటే వీటి అంతిమఫలితం మోసేది శ్రమజీవులు, సామాన్య ప్రజానీకమే. అలాటి ప్రత్యక్ష దాడులే మనం చూస్తున్నాం. ఆ ప్రజలు అందుకు వ్యతిరేకంగా ఒక్కతాటిపై నిలవకుండా మతపరమైన విభజనలు, విద్వేషాలు పెంచడం కూడా జరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మరింత ఐక్యంగా నిలబడి పొంచివున్న ప్రమాదాన్ని ప్రతిఘటించవలసి వుంటుంది. అంతేగాని అభివృద్ధి నిరోధక శక్తులు ఎలాగూ విజయం సాధిస్తాయి గనక ప్రజాస్వామిక వాదులు ప్రత్యామ్నాయ శక్తులు ప్రతిపక్షాలు లొంగిపోవాలనడం ఎలాంటి తర్కం?పాలకవర్గాలు స్వార్థ ప్రయో జనాల కోసం ఎంతకైనా దిగజారతాయనే వాస్తవిక అవగాహన లేకుండా ఏదో అవకాశవాదాలతో అంచనా వేసుకోవడం ఎక్కడకు దారితీస్తుంది? ఏపీ, తెలంగాణలలోనే ఈ తరహా ఆలోచనల పర్యవసానాలు చూసూనేవున్నాం, బీజేపీ నిరంకుశత్వాన్ని మతతత్వ రాజకీయాలను నికరంగా ఎదుర్కొనే బదులు ఊగిసలాటలు, లోపాయికారీ పోకడలకు పాల్పడిన ప్రతివారూ మూల్యం చెల్లించక తప్పలేదు.అయినా టీడీపీ, జనసేన దాంతో జతకట్టడానికి ఉబలాటపడ్డాయి, వైసీపీ అప్రకటిత మైత్రి బంధం పాటిస్తున్నది. అయినా సరే మోడీ సర్కారు ఆ రాష్ట్రానికి అన్యాయం చేస్తూనే వుంది. తెలంగాణలోనూ కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య కపట నాటకం నడిపిస్తూ తన పబ్బం గడుపుకొంటున్నది. ఈ పరిణామాల పట్ల స్పష్టమైన కచ్చితమైన వైఖరి తీసుకోకపోతే ఆయా పార్టీలూ రాష్ట్రాలూ కూడా నష్టపోవడం అనివార్యమవుతుంది. కాంగ్రెస్ నాయకత్వమే ఆ మెళకువతో అన్ని చోట్ల సరైన వైఖరి తీసుకోలేకపోతున్న తీరును కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్ సూటిగా విమర్శించారు. ఇక ప్రాంతీయ పార్టీల బలహీనతలు వుండనే వుంటాయి. కానీ అవేవీ దేశం ముందున్న కర్తవ్యాన్ని మార్చలేవు.

400 సీట్ల పాట, నిరంకుశత్వ బాట

ఇదంతా ఒక ఎత్తయితే అసలు మోడీ మరింత ఆధిక్యతతో అధికారానికి రావడం తథ్యమనే ప్రచారానికి ఆధారమేమిటి? టైమ్స్ నౌ,న్యూస్ 18, ఇండియా టీవీ, ఇండియా టుడే ఇలా ఏవేవో సర్వేలు ఇందుకు ఆధారంగా చూపిస్తుంటారు. జాతీయ మీడియా దాంతో చేతులు కలిపే సర్వే సంస్థలూ ఇంతకన్నా భిన్నమైన అంచనాలు ఎలా ఇస్తాయి? కాకపోతే వాటిలో కూడా మెజార్టీ ఇస్తూనే రకరకాల అంకెలు వదలుతున్నారు.330 నుంచి 411 వరకూ ఎన్‌డిఎకు వస్తాయని లెక్కలు చెబుతున్నారు. సర్వేలు చాలాసార్లు విఫలం కావడం చూశాం. ఒక మేరకు నిజమైనా అంచనాలకు చాలా దూరంలో నిలబడిన పరిస్థితీ చూశాం. యూపీలో బీజేపీ బ్రహ్మాండంగా వచ్చేస్తుందనీ, హిందీ రాష్ట్రాలలోనూ గుజరాత్‌లోనూ బలం పెంచుకుంటుందని చెప్పే అంచనాలపై ఆధారపడి ఈ జోస్యాలు చెబుతున్నారు. నిజానికి



బీజేపీకి నిజంగా తిరుగులేదనేట్టయితే ప్రతి సందర్భంలోనూ ఏకపక్షంగా చర్యలు తీసుకోవలసిన అవసరమేమొచ్చింది? ఈ అయిదేండ్ల కింద నడిచిన రైతాంగ ఆందోళనను అణచివేశామనుకుంటే మళ్లీ మొదలవలేదా? అప్పటి పౌరసత్వ సవరణ చట్టంపై ఆందోళన కూడా కొత్తరూపంలో మొదలవలేదా? మీడియా నోరు నొక్కేందుకు ప్రతిపక్షాల ఖాతాలనూ, కార్యకలాపాలనూ అడ్డుకునేందుకు రకరకాల అప్రజాస్వామిక చర్యలకు పాల్పడాల్సిన అవసరమేమొచ్చింది? అరవింద్ కేజ్రీవాల్, హేమంత్‌సోరేన్ వంటి ముఖ్యమంత్రుల అరెస్టు ఏం చెబుతుంది? నిజమైన సమస్యలను పక్కదోవ పట్టించడానికి కాకపోతే కచ్చతీవు వంటిపాత అంశాలను తిరగదోడడం, చైనాతో వివాదాలను పదేపదే పైకి తేవడం, పాకిస్తాన్‌పై ఏదో చేస్తున్నట్టు బిల్డప్‌లు ఇవన్నీ ఎందుకు?

యూపీలో కూడా ఎస్పి కాంగ్రెస్ మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం అసలు వుండదని చెప్పలేము. బీహార్‌లో రెండు కూటములు పోటాపోటీగా నడుస్తున్నాయి. నితీశ్‌కుమార్ కన్నా ఆర్జేడి నాయకత్వంలోని 'ఇండియా'కే మెరుగైన అవకాశాలు న్నాయి. మధ్య ప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో మొన్నటి ఎన్నికలలో బీజేపీ విజయం సాధించినా కాంగ్రెస్ ధీటుగానే ఓట్లు తెచ్చుకున్నది.కనక వీటిని ఏకపక్షంగా చెప్పడం చెల్లుబాటు కాదు. బెంగాల్‌లో తృణమూల్, ఒరిస్సాలో బీజేడీ ఎక్కువ స్థానాలు తెచ్చుకుంటాయనే సర్వేల సారాంశంగా వుంది. దక్షిణభారతంలో కర్నాటకలో మాత్రం బీజేపీకి ఎక్కువ స్థానాలు వస్తే తెలంగాణలోనూ ఒక మోస్తరుగా తెచ్చుకోవచ్చే అవకాశం వుంది.కేరళ, తమిళనాడు ఏపీల్లో బీజేపీ నామమాత్రం. ఏపీలో బీజేపీతో కలవడం వల్ల టీడీపీకి కూడా నష్టమనే అంచనాలూ అనేకం. తమిళనాడులో డిఎంకె కూటమి దాదాపు తుడిచిపెడితే కేరళలో యుడీఎఫ్,ఎల్‌డీఎఫ్ మధ్యనే సీట్ల విభజన వుంటుంది. మహారాష్ట్రలో పోటాపోటీగానే నడవొచ్చు. ప్రధాన రాష్ట్రాలలో పరిస్థితి ఇలా వుంటే బీజేపీకి ఏదో అపూర్వమైన ఆధిక్యత వస్తుందని ఎలా చెబుతున్నారు?ఈ మధ్య కాలంలో మతరాజకీయాల నుంచి ఎలక్టోరల్ బాండ్ల వరకూ ఎన్ని విషయాల్లో మోడీ ప్రభుత్వం నిరసనను ఎదుర్కొంది? నిరుద్యోగం, ధరల పెరుగుదల రాష్ట్రాల అప్పుల భారం వంటి అంశాలు ఆందోళన కలిగించడం లేదా? ఆ ప్రభావం ఓటర్లపై వుండనే వుండదా?

అనేక ప్రాంతీయ పార్టీల అవకాశవాదం, కాంగ్రెస్ బలహీనపడటం, వామపక్షాలు ప్రతికూల పరిస్థితిలో పడటం,దేశంలో పాలకవర్గాలు మతవాద, మితవాద రాజకీయాలను ప్రోత్సహిం చడం, సరళీకరణ విధానాలు అనివార్యంగా మతమార్కెట్ తత్వాలను ప్రోత్సహించడం వంటి కారణాల వల్ల బీజేపీ, ఆరెస్సెస్‌లు పట్టు పెంచుకున్న మాట నిజం. దేశ, విదేశీ గుత్తాధిపతులు ఫైనాన్స్ పెట్టుబడిశక్తులు కూడా ఆయనకు దన్నుగా నిలిచిన మాటా వాస్తవం. ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రజాస్వామిక విలువలనే బలహీనపరిచే ప్రయత్నాలు కూడా కాదన లేనివి. అయితే ఈ కారణాలన్నీ ప్రత్యామ్నాయంకోసం పోరాడవలసిన అవసరాన్ని మరింత పెంచుతాయే గాని తగ్గించవు. ఎందుకంటే వీటి అంతిమఫలితం మోసేది శ్రమజీవులు, సామాన్య ప్రజానీకమే.

బీజేపీకి నిజంగా తిరుగులేదనేట్టయితే ప్రతి సందర్భంలోనూ ఏకపక్షంగా చర్యలు తీసుకోవలసిన అవసరమేమొచ్చింది? ఈ అయిదేండ్ల కింద నడిచిన రైతాంగ ఆందోళనను అణచివేశామనుకుంటే మళ్లీ మొదలవలేదా? అప్పటి పౌరసత్వ సవరణ చట్టంపై ఆందోళన కూడా కొత్తరూపంలో మొదలవలేదా? మీడియా నోరు నొక్కేందుకు ప్రతిపక్షాల ఖాతాలనూ, కార్యకలాపాలనూ అడ్డుకునేందుకు రకరకాల అప్రజాస్వామిక చర్యలకు పాల్పడాల్సిన అవసరమేమొచ్చింది? అరవింద్ కేజ్రీవాల్, హేమంత్‌సోరేన్ వంటి సీఎంల అరెస్టు ఏం చెబుతుంది? నిజమైన సమస్యలను పక్కదోవ పట్టించడానికి కాకపోతే కచ్చతీవు వంటిపాత అంశాలను తిరగదోడడం, చైనాతో వివాదాలను పదేపదే పైకి తేవడం, పాకిస్తాన్‌పై ఏదో చేస్తున్నట్టు బిల్డప్‌లు ఇవన్నీ ఎందుకు? ఇంతచేసినా బీజేపీలోనూ, సంఘ పరివార్‌లోనూ అంతర్గతంగా విభేదాలు రావడం, ఉన్నతాధికారులే విభేదాలు వెల్లడించడం నిజమే కదా? టీడీపీఎలాగో వెంటబడి పొత్తు కుదుర్చుకుంది కానీ దగ్గరకు వచ్చిన బీజేడీ, అకాలీదళ్ వంటివారు కూడా మళ్లీ వెనక్కు పోలేదా? పొత్తుపెట్టుకున్న టీడీపీ అనుకూలంగా వుండే వైసీపీ కూడా తాము మైనార్టీలకు వ్యతిరేకం కాదని చూపుకోవడానికి ఎన్ని తంటాలు పడుతున్నాయి?

దేశంలో పరిస్థితి అలా వుంచి అమెరికా జర్మనీ, ఐక్యరాజ్యసమితి కూడా అప్రజాస్వామిక ధోరణులపై ఆందోళన అభ్యంతరాలు వెలిబుచ్చలేదా? వాటి జోక్యం సరైందా అనే ప్రశ్న ఒకటైతే మోడీ సర్కారు చర్యల పట్ల స్పందనలు ఎలా వున్నాయనేది దీన్నిబట్టి విదితమవుతుంది. ఇవి మన ప్రజలు గమనించలేరనీ, స్పందించరనీ అనుకోవడం పొరబాటు. గతంలో చాలాసార్లు చైతన్యవంతమైన తీర్పులతో చారిత్రక మార్పులు తెచ్చిన భారతీయ ఓటర్లు ఇప్పుడు కూడా బొత్తిగా ఆ మెళకువ చూపించకపోరు. అది ఏ రాష్ట్రంలో ఏ రూపంలో, ఏ స్థాయిలో వుంటుందనేది వాస్తవంలో చూడాలి. గతంలో ప్రత్యామ్నాయాలు వచ్చినపుడు ఇన్ని ప్రతిపక్ష ప్రభుత్వాలు ఇన్ని ప్రాంతీయపార్టీలూ వుండేవి కావు. కాకపోతే ఇప్పుడు ప్రాంతీయ పార్టీల స్వభావంలో మార్పు వచ్చిన మాట నిజమే గానీ బీజేపీతో కలిసినవి తక్కువే. ఎన్నికల ఫలితాల తర్వాత మాత్రమే ప్రభుత్వ ఏర్పాటు గురించిన చర్చకు అర్థం వుంటుంది. అప్పుడు ఎవరేమి చేస్తారనేది కీలకం. ఈ లోగా ఎన్నికల సవాళ్లను ధీటుగా ఎదుర్కోవలసి వుంటుంది. దేనికైనా సిద్ధపడటం వేరు, ముందే చేతులు ఎత్తేయడం వేరు. ముందే మోడీ నాలుగువందల లెక్కలతో అదరగొడితే చెల్లుబాటు కాదని ప్రకటించడం తప్పనిసరి. ■

'ఉరి'సిల్లగా... మార్చొద్దు

సిరిసిల్ల... ఉరిసిల్లగా మారకముందే నేతన్నలను ఆదుకోకుంటే పాత రోజులు పునరావృతమవుతాయి. కండె పోగులే మరణమృదంగాలై చేనేత కార్మికులను బలిగొన్న గతం మరోసారీ నిజం కాకుండా ఉండాలంటే సర్కార్ పెద్దమనసుతో తాయిలాలు ప్రకటించాలి. గడిచిన ఏడాది బతుకమ్మ చీరల పెండింగ్ బకాయిలు రూ.220 కోట్లు ప్రభుత్వం ఇప్పటివరకు చెల్లించకపోగా, ఈ ఏడాది చీరల ఆర్డర్లివ్వలేదు. ఫలితంగా అసాములు మరమగ్గాలకు హాలీడే ప్రకటించడంతో పనులు లేక 30 వేల మంది కార్మిక కుటుంబాలు వీధిన పడ్డాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన నిర్వాకానికి తోడు కేంద్రంలోని మోడీ సర్కార్ చర్యలు మూలిగే నక్కపై తాటిపండులా పరిణమించాయి.. టెక్స్‌టైల్, చేనేత బోర్డులను రద్దు చేయడంతో పాటు వాటి ఉత్పత్తులు, ముడిసరుకులపై కేంద్రం పెంచిన 12 శాతం జీఎస్టీ నేతన్నలకు శాపంగా మారాయి. సిరిసిల్ల నేత కార్మికుల దుస్థితికి తప్పు ఎవరిదనే చర్చ పక్కనపెట్టి ముందు వారిని ఆదుకునేందుకు రేవంత్ సర్కార్ వెంటనే చర్యలు చేపట్టాలి.

-ఊరగొండ మల్లేశం

పొగలు.. సెగలు...

మనం ఇప్పుడు ఏప్రిల్ మొదటి వారంలోనే ఉన్నాం. కానీ మే చివరి వారంలో ఉన్న ఫీలింగ్ కలుగుతోంది. 'సూరయ్య' దెబ్బకు ఉదయం పది దాటిందంటే చాలు... రోడ్ల మీదికి రావటానికి జనం జంకుతున్నారు. రోడ్ల మీది దాకా ఎందుకు..? ఇంట్లో ఫ్యాన్ కింద కూర్చున్నా శరీరం పొగలు.. సెగలూ కక్కుతోంది. లీటర్లకు లీటర్లు నీళ్లు తాగుతున్నా... ఒక్క చుక్కా బయటకు రావటం లేదు. అంతా ఒంట్లోనే ఇంకిపోతున్నవి. ఒకవైపు పరిస్థితి ఇలా ఉంటే... మరోవైపు కుండలు, కూలర్లకు భలే గిరాకీ వచ్చింది. పుచ్చకాయలు, కొబ్బరి బోండాలు, నిమ్మ, చెరుకు రసాల బండ్ల వద్ద జనం క్యూ కడుతున్నారు. ఈ డిమాండ్ రీత్యా కాసింత లావాటి పుచ్చకాయ చెట్టెక్కి కూర్చుని రూ.వందిస్తే గానీ దిగిరానంటోంది. కొబ్బరి బోండాల్లో సాధారణ రకం, బెంగళూరు, కేరళ కాయలంటూ రకరకాల వెరైటీల్లో అమ్ముతున్నారు. సాధారణరకం ధర రూ.30గా ఉంటే, మిగతా రకాలకు రూ.60 పెట్టాల్సిందే. అదే లీటరు బాటిల్‌లో కొబ్బరి నీళ్లు నింపుకోవాలంటే రూ.130 సమర్పించు కోవాల్సి వస్తోంది. ఎండదెబ్బకు జనం జేబులు ఈ విధంగా గుల్లవుతుంటే 'సూర్యారావు' మాత్రం రోజుకు రోజుకి తన ప్రతాపాన్ని పెంచుకుంటూ పోతున్నాడు. 40, 43, 45 డిగ్రీలనుకుంటూ వేలం పాటలాగా ఉష్ణోగ్రతలతో హీటెక్కిస్తున్నాడు. బాబ్బాబూ.. మీలో ఎవరైనా వాడికి తెలిసిన వాడుంటే, కాస్త చెప్పండి, ఈ ఉక్కపోత నుంచి, ఎండ వేడిమి నుంచి కాస్త ఉపశమనం కల్పించమని...అలా చేస్తే ఆయనక్కూడా నాలుగు కొబ్బరి బోండాలు కొట్టిద్దాం...

- బి.వి.యన్.పద్మరాజు

కరెంటోళ్లా.. మజాకా..!

ఎవ్వరి మాటా వినడు సీతయ్యా... అన్నట్టు, కరెంటోళ్లు ఈ మధ్య హైదరాబాద్ ఉప్పల్ స్టేడియం మీద సీరియస్ అయ్యారు. 'అది ఐపీఎల్ మ్యాచ్ అయితే ఏంటి..? ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం అయితే ఏంటి..?' నా బిల్లు నాకు కట్టకపోతే కరెంటు కట్‌చేసి పడేస్తామంతే...అంటూ అగ్గి మీద గుగ్గిలమయ్యారు. అవటమే కాదు... మొన్నటి హైదరాబాద్-చెన్నై మ్యాచ్‌కు ఒకరోజు ముందు ఉప్పల్ స్టేడియానికి కరెంటు కట్‌చేసి పడేశారు. దెబ్బకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)కు దిమ్మతిరిగి బొమ్మ అగుపడ్డది. కరెంటు డిపార్టుమెంటోళ్లని బతిమిలాడుకున్నారో లేక బిల్లు మొత్తం కట్టేశారో తెలీదుగానీ, మ్యాచ్ రోజు మాత్రం స్టేడియానికి కరెంటు సరఫరా అయింది. దీంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ఇదే తరహాలో బడాబాబుల పరిశ్రమలు, వ్యాపార, వాణిజ్య సముదాయాలు కరెంటు బిల్లులు ఎగ్గొడితే... కత్తెరతో కరెంటు తీగలు కట్‌చేసి, ముక్కు పిండి బిల్లు వసూలు చేయాలని కోరుతున్నారు రాష్ట్ర ప్రజలు...

- కె.నరహరి

యోగక్షేమం వహామ్యహం

ఎల్‌ఐసి బ్రాంచి మేనేజరు పరుగు పరుగున ఫ్లెక్సీ తయారు చేసే వెంకట్ దగ్గరికొచ్చాడు. మా హెల్త్ క్యాంపు పోస్టర్ తయారయ్యిందా అనడిగాడు. ఒక్కసారి స్క్రీను మీద చూడండి సార్ ప్రింటు తీసిస్తా అన్నాడు వెంకట్. మీ వాట్సప్పులో పెట్టాను చూడలేదా అనీ అన్నాడు. ఈ రూట్లో పోతూ వచ్చానులే అన్నాడు బి.ఎం. స్క్రీను పైన వచ్చిన పోస్టర్ చదివి, ఏమయ్యా వెంకట్ కొంప ముంచావు కదయ్యా అన్నాడు. ఏమైంది సార్ అన్నాడు వెంకట్. "యోగి క్షేమం" కాదయ్యా "యోగక్షేమం" అనుండాలి. వెంకట్ వెంటనే అలాగే మారుద్దాము సార్, "యోగి క్షేమం" కూడా ముఖ్యమేగా ఇప్పుడు అన్నాడు వెంకట్. బ్రాంచి మేనేజరు ఆశ్చర్య పోయాడు వెంకట్ తెలివికి.

నలభై ఏండ్ల క్రితం అదో పెద్ద మీటింగు. అందులో ముఖ్యమంత్రితో పాటు ఇతర మంత్రులు, అధికారులు, పెద్దోళ్లు, ప్రజలు ఇలా అందరూ ఉన్నారు. సభను మొదలు పెట్టిన ఒక పెద్దాయన "సర్వే జనాస్సుఖినో భవన్తు" అన్నాడట. సరే అది అర్థమైనోళ్లకు అయింది, కాకున్నా ఇదేదో వినడానికి బాగుందని కొందరు పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి గారి వంతు వచ్చినప్పుడు ఆయన మాట్లాడుతూ పెద్దాయన చెప్పేటప్పుడు సర్వేవాళ్ళు మాత్రమే బాగుండాలని అన్నారు కాని అందరూ బాగుండాలి కదా అనేశాడు. పక్కనున్న సెక్రెటరీ పరుగు పరుగున పోయి ముఖ్యమంత్రి చెవిలో సర్వేజనా అంటే జనాలందరూ అని అర్థం సార్ అన్నాడట మైకును చేత్తో మూసి. ముఖ్యమంత్రి వెంటనే ఇప్పుడు సెగ్రెటీ చెప్పాడు సర్వేజనా అంటే అందరు జనాలు అని అర్థం. బాగుంది, నాకు కావలసింది కూడా అదే అందరూ బాగుండాల. అందరూ బాగుండాలి అందులో మనముండాలి అన్న మాటలు జనాల నోటిలో ఎప్పుడైనా, ఎక్కడైనా వినిపిస్తూనే ఉంటాయి. ఎందుకంటే అవి అందరికీ అర్థమయ్యేవి కాబట్టి. జనామోదం ఉండాలే కాని ఇలాంటి డైలాగులు వస్తూనే ఉంటాయి.

అయ్యవారు సర్వేజనా, యోగక్షేమం వహామ్యహం లాంటి మాటలు వాడినప్పుడు ఎవరెవరి స్పందన ఎలా ఉంటుందో ముందే అనుకున్నాం. అలా కాకుండా అచ్చమైన తెలుగులో చెబితే అందరూ విని ఆనందిస్తారు. ఒక దర్శకుడొచ్చి పెద్ద కవి పాట తనే రాసి తనే పాడతాడు, చెల్లెలు నాట్యం చేస్తుంటుంది కాబట్టి మంచి పాట రాయండి పదికాలాలు నిలిచిపోతుంది అన్నాడట సినారె గారితో. నారాయణరెడ్డి గారికి నన్ను దోచుకొందువటే, ఒంటరినైపోయాను ఇక ఇంటికి ఏమనిపోను లాంటి పదాలు వాడడం ఇష్టం. అందుకే నెమలిలా నాట్యం చేయమ్మా అంటూ పాట రాశారట. దర్శకునికి చూపిస్తే ఇలా కాదండి బాబూ, పాటలో ఏదో మంచి భావం ఉంది, అర్థం కాకున్నా చెవులకు వినసొంపుగా ఉంది అనుకోవాలి ప్రేక్షకులందరూ. కాబట్టి పెద్ద పెద్ద సమాసాలు, సంస్కృత పదాలు ఉండాలి, సినిమాలో కవి స్వయంగా పాడతాడు ఆ పాట అన్నాడట. సినారె గారికి అర్థమైపోయింది. వెంటనే "చరణ కింకిణులు ఘల్లుఘల్లుమన, కరకంకణములు గలగలలాడగ.... వినీల గజభర.. విలాస బంధుర.. తనూలతిక చంచలించిపోగ.... ఆడవే మయూరి" అంటూ రాశారట. ఇక


జంధ్యాల రఘుబాబు
9849753298

చూస్కోండి దర్శకుడి మొహంలో వెలుగే వెలుగు. ఇది సార్ పాటంటే అని సినారె గారి కాళ్ల మొక్కినంత పనిచేశాడట.

మనల్ని ఆంగ్లభాష ఏలకముందు సంస్కృతం హవా నడిచిందని అందరికీ తెలుసు. దాన్ని దైవ భాష అనేవాళ్ళు, అంటే దేవుళ్ల మాట్లాడుకునే భాష అని అర్థం. ఇంతకూ దేవుళ్లంటే ఎవరు అన్న ప్రశ్న రావడం సహజం. ఇప్పుడు ఎన్నికల సమయం కాబట్టి ఓటర్లే దేవుళ్ల అందరికీ. 'యత్ర నార్యస్తు పూజ్యంతె రమంతె తత్ర దేవతా' అన్న శ్లోకం కూడా. దానర్థం ఎక్కడైతే మహిళలను పూజిస్తారో అక్కడ దేవతలు నివసిస్తుంటారు, ఎక్కడైతే వారికి మర్యాద చేయరో అక్కడ పనులు ఫలితాలనివ్వవు, అదెంత మంచి పనైనా సరే అని దానర్థం. ఎంత మంచి మాటలు వినడానికి. అదీ ఈ మాటలన్నది ఎక్కడో కాదు మనుస్మృతిలో. మరి అందులో అన్ని మంచి వాక్యాలున్నాయా ఉంటే వాటిని నిజంగా నిజం చేయొచ్చు కదా అని సగటుజీవి ఆలోచనల్లో అనుమానం

సురుకు



వస్తుంది. మంచి మాటలు తెలియడం, ఉండడం కాదు అవి అమలు చేసే దాంట్లోనే ఉంది అసలు రహస్యం. ఈ ప్రభుత్వాలు ఎవరికి వత్తాసు పలుకుతు న్నాయి? సామాన్య ప్రజలకా లేక ఉన్నోళ్లకా అన్నది అసలు ప్రశ్న.

మనం మళ్లీ యోగక్షేమం వహామ్యహం దగ్గరికి వద్దాం. ఈ మాటలు భగవద్గీతలో ఉన్నవి. అందులో అనుమానమక్కరలేదు. మంచిమాటలు ఎక్కడున్నా స్వీకరించాల్సిందేనని ఇంతకుముందే చెప్పుకున్నాం. యోగా అంటే పనిచేసే మార్గాలు, క్షేమ అంటే సంరక్షణ, వహామి అంటే తీసుకుపోవడం, అహం అంటే నేనే అని అర్థాలు. కాబట్టి ఎల్.ఐ.సి మీ అన్ని ఆర్థిక బాధ్యతలను తన చేతుల్లో పెట్టుకొని వాటిని సంరక్షిస్తుంది అని అర్థం. అందుకే రెండు చేతులతో దీపాన్ని రక్షిస్తున్నట్టు ఉంటుంది దాని గుర్తు. మీరు ఖాతాదారులలో భాగమైతే వాటిని మీ కోసం ఎల్.ఐ.సి నిర్వహిస్తుంది అని ఆ స్లోగన్ చెబుతుంది. నిజంగా ఎల్.ఐ.సి ఇవన్నీ నిర్వర్తించడమే కాదు కాలంతో పాటు మారి ఒక్క ఖాతాదారులకే కాదు మొత్తం ఆర్థిక వ్యవస్థకే వెన్నెముకగా నిలబడింది. అటు సాధారణ బీమా రంగంలో నాలుగు ప్రభుత్వ కంపెనీలూ అదే పనిచేస్తున్నాయి.

ఇక ఎవరి క్షేమం ఎవరు కాపాడుతున్నారన్నది అసలు విషయం. ప్రజల, రైతుల, మధ్య తరగతి దిగువ మధ్య తరగై ప్రజలు, ఇలా అందరి క్షేమాన్ని జీవిత బీమా రంగంలో ఎల్.ఐ.సి, సాధారణ బీమా రంగంలో నాలుగు ప్రభుత్వ కంపెనీలు పగలు రాత్రి అని తేడా లేకుండా పని చేస్తూ తమను తాము నిలుపుకుంటూ ఆర్థిక భారతాన్ని అత్యంత ప్రేమగా చూసుకుంటున్నాయి. మరి ఆ తల్లిపాలు తాగుతూ నాయకులేం చేస్తున్నారు అన్నది మరో ప్రశ్న. ఎవరి క్షేమం ఎవరు కాపాడుతున్నారు అని చూస్తే అందరికీ తెలిసిపోయేది ఒక్కటే అది సవతి తల్లి ప్రేమ. అందుకే వీటిని కాపాడే సైనికుల్లాంటి ఉద్యోగులు అన్ని పార్టీల ఎంపీ అభ్యర్థుల దగ్గరికి పోయి వీటిని సంరక్షిస్తామంటూ మాట తీసుకుంటు న్నాయి. ఇచ్చిన మాట నిలబెట్టుకొమ్మనీ కోరుతున్నాయి. అప్పుడు దేశానికి మొత్తంగా ఈ యోగక్షేమం వహామ్యహం అనే మాటలు రక్షణనిస్తాయి. అసలైన జాతీయత, దేశభక్తి అంటే అవే మరి. ఇప్పుడు మొత్తం భారత దేశం క్షేమంగా, స్నేహంగా ఉండవలసిన సమయం. ■

ప్రభుత్వ స్థలాలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయండి

- పరిరక్షణకు చర్యలు చేపట్టాలి
- కలెక్టర్ వి.పి గౌతమ్



నవతెలంగాణ-ఖమ్మం

ప్రభుత్వ స్థలాలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, నిఘాతో పరిరక్షణకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ తెలిపారు. శనివారం నూతన కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువైన ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ స్థలాల గుర్తింపు చేసి, వాటిపై భూ రక్షణా బృందాలు తీసుకున్న చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. ఖాళీ స్థలాల్లో క్రమబద్ధీకరణ జీవో 59లో చేసుకున్న దరఖాస్తులు తిరస్కరణకు గురయిన చోట వెంటనే స్థలాలు స్వాధీనం చేసుకొని, ఫెన్సింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు చేసి, రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. బృందాలు క్షేత్ర పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలని అన్నారు. బృందాలు క్రియాశీలకంగా పనిచేయాలని, ప్రతి ప్రభుత్వ స్థలం పరిరక్షణ చేయాలని అన్నారు. సర్వే నెంబర్ 37లో స్వాతంత్ర్య సమరయోధులు, ఎక్స్ సర్వీస్ మెన్‌లకు కేటాయించిన 439 ప్లాట్లలో ఓపెన్ ప్లాట్లు 267, తాత్కాలిక నిర్మాణాలు 54, శాశ్వత నిర్మాణాలు 11, బేస్ మెంట్ లు 106, పాక్షిక నిర్మాణాలు 1 ఉన్నట్లు, వీటిపై సమగ్ర విచారణ జరిపి, అసైన్డ్ దారులకు చట్టప్రకారం నోటీసులు ఇచ్చి, ఆధారాలతో హాజరుకు తెలుపాలన్నారు. పువ్వాడ ఉదయ్ నగర్ లో ఖాళీ ప్లాట్ల విషయమై చర్యలు చేపట్టాలన్నారు. టేకులపల్లి డబల్ బెడ్ రూమ్ ఇండ్లలో 33 ఇండ్లకు తాళాలు, 20 ఇండ్లు అద్దెకు, ఒక ఇల్లు అమ్మడం జరిగిందని, వీటిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఉన్న నిర్మాణాలు గుర్తించి తొలగించాలన్నారు. కోర్టు కేసుల్లో ఉన్న స్థలాల విషయమై ఫాలో అప్ చేయాలన్నారు. విలువైన ప్రభుత్వ భూముల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి, అన్యాక్రాంతం కాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణా సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, ఖమ్మం ఆర్డీవో జి. గణేష్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి శ్రీనివాసులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం ప్రారంభం

నవతెలంగాణ-ఖమ్మం లీగల్

మానవ అవయవాలన్నింటిలో కన్ను అత్యంత ప్రధానమైనదని కన్ను దానిని జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ఎస్ జగ్జీవన్ కుమార్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యాయ సేవ సదనంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని న్యాయమూర్తి ప్రారంభించారు. శరత్ మాక్స్ విజన్ హాస్పిటల్, శ్రీ రక్ష ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ ఉచిత వైద్య శిబిరంలో న్యాయశాఖ ఉద్యోగులు, కక్షిదారులు పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. కంటి శుక్లాల సమస్య, దగ్గర చూపు, దూరపు చూపు, కంటిలో నీటి శాతం పరీక్ష, రక్త పోటు, మధుమేహ పరీక్షలను వైద్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. నిత్యజీవితంలో కంప్యూటర్, మొబైల్ ఫోన్లో వాడకం పెరుగుతుండటంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలని వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు కే.ఉమాదేవి, డి.రాంప్రసాదరావు, ఎం.అర్చనా కుమారి, మహమ్మద్ అబ్దుల్ జావేద్ పాషా, పి.గోపికా నాగస్రావ్య, కె.దీప, వై.బిందుప్రియ, వి.మాధవి, బి.రజిని, ఆర్.శాంతి లత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు, కార్యదర్శి చింత నిప్పు వెంకట్, సీనియర్ న్యాయవాదులు కాటన్ నేని రమేష్, కొత్త వెంకటేశ్వరరావు, బిచ్చాల తిరుమలరావు న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రత్నాకరం శ్రీనివాస రాజు, కార్యవర్గ సభ్యులు, శ్రీనివాసరెడ్డి, రాధేశ్యామ్, మహమ్మద్ షరీఫ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.
వైద్యులు డాక్టర్ లావణ్య, నేహా, జి.వెంకటేశ్వర్లు, ఏడుకొండలు, మంజుష తదితరుల ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు.

స్మార్ట్ కిడ్జ్‌లో ఘనంగా రంజాన్ వేడుకలు



నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శనివారం రంజాన్ సంబురాలు ఘనంగా నిర్వహించారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్క రించుకొని పాఠశాల చిన్నారులు మతసామరస్యాన్ని చాటుతూ ఈ వేడుకల్లో పాల్గొన్నారు. విద్యార్థులు పవిత్ర ఖురాన్ చదువుతూ నమాజులో పాల్గొన్నారు. నమాజ్ అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు. సేమ్యాలు ఒకరికొకరు పంచుకుంటూ తమ ఆత్మీయతను తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య మాట్లాడుతూ పవిత్ర రంజాన్ దీక్షా దక్షితకు ప్రతీకగా నిలుస్తున్నదని పేర్కొన్నారు. రోజంతా కఠిన ఉపవాస దీక్షలో పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక, ఆధ్యాత్మికత వెల్లివిరిస్తున్నది అన్నారు. అందరూ కలిసిమెలిసి ఐక్యతను చాటుతూ మతసామరస్యాన్ని తెలియజేస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచితంగా బోన్ మ్యారో చికిత్స

- వికాస తరంగిణి బాధ్యులు పోలాస్ శ్రీనివాసరావు
- సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మందుల పంపిణీ



నవతెలంగాణ-ఖమ్మం

తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు ఉచితంగా బోన్ మ్యారో చికిత్స చేయిస్తామని వికాస తరంగిణి బాధ్యులు పోలాస్ శ్రీనివాసరావు అన్నారు. శనివారం సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఖమ్మంలోని సంస్థ కార్యాలయం వద్ద చిన్నారులకు ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తలసేమియా చిన్నారుల కోసం 14 ఏళ్లకు పైగా నిరంతరాయంగా సేవలందిస్తున్న సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు ప్రశంసనీయమైనవని అన్నారు. వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఇక నుండి ప్రతి సంవత్సరం ఒక చిన్నారికి బోన్ మ్యారో చికిత్స ఉచితంగా చేపిస్తామన్నారు. డే కేర్ సెంటర్‌లో రక్తం ఎక్కించుకునే చిన్నారులకు అన్నదానం చేస్తామన్నారు. వైద్యులు జితేందర్, నారాయణ మూర్తి మాట్లాడుతూ ఈ ఏడాది ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని, చిన్నారులు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. హెచ్.బి 9 శాతం ఉండేలా చూసుకోవాలి అన్నారు. వేసవిలో చిన్నారులకు రక్తం అందడం లేదని, దాతలు ముందుకొచ్చి రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షురాలు పి.పావని, కోశాధికారి ప్రొద్దుటూరి రవిచందర్, సంస్థ సభ్యులు పి.అనిత, వికాస తరంగిణి బాధ్యులు శాంతి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి



నవతెలంగాణ- ఖమ్మం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయే ముందు తెలంగాణ రాష్ట్రానికి మిగులు బడ్జెట్ 16 లక్షల కోట్లకి అవకాశం కల్పించిన నారా చంద్రబాబు నాయుడుని అగౌరవపరుస్తూ బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ శుక్రవారం చేసిన వ్యాఖ్యలు వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీ కూరపాటి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అసలే నువ్వు చేసుకున్న పాపానికి మీ పార్టీ తెలంగాణలో భూస్థాపితం కానుందని, పార్లమెంట్ ఎన్నికల అనంతరం మీ పార్టీలో నాయకులందరూ జైలుకు పోవడం ఖాయం అన్నారు.

డీఎస్సీ ఉచిత మెటీరియల్ పంపిణీ

నవతెలంగాణ - ఎర్రుపాలెం

మండలంలో డీఎస్సీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న 150 మందికి మండల పరిధిలోని కండ్రిక గ్రామానికి చెందిన వి.ఎస్.కె కన్స్ట్రక్షన్ అధినేత వేజెండ్ల సాయి కుమార్ డీఎస్సీ మెటీరియల్స్ శనివారం సర్దార్ జమ లాపురం కేశవరావు మెమోరియల్ కళాశాల నందు జరిగిన కార్యక్రమంలో అందించారు. జీఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు జంగా గురునాథరెడ్డి ఆధ్వర్యంలో దాత వేజెండ్ల సాయికుమార్ సహకారంతో సుమారు రూ.1,50,000 విలువ గల ఎస్&ఎస్ పబ్లికేషన్స్ మెటీరియల్ అందించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టియు జిల్లా కార్యదర్శి రంగారావు ఎస్.జె.కేయం డైరెక్టర్ దండెం సత్యనారాయణ రెడ్డి, ప్రతిభ స్కూల్ అధినేత గిరిధర్ పాల్గొన్నారు.

ముదిగొండలో చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-ముదిగొండ

ముదిగొండ ప్రధాన రహదారి కూడలి వద్ద గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ముదిగొండ పంచాయతీ ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ ఎస్.శ్రీధరస్వామి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ నరసింహారావు, ఎంపీఓ పి.సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి పి.సంపత్, పంచాయతీ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంట పరిహారంపై...

నాటి దొరకో నీతి..! నేటి పాలకులకు ఒక నీతా?

నాడు 'తమ్మినేని' రూ.20 వేల డిమాండును కేసీఆర్ తిరస్కరణ

- నాడు సీఎంగా కేసీఆర్ ఇచ్చింది రూ.10 వేలు
- మాజీ సీఎంగా డిమాండ్ చేస్తుంది రూ.25 వేలు
- సుద్దులు చెబుతున్న కేసీఆర్



నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ కు రూ. 20 వేలు పంట పరిహారం చెల్లించాలని వినతిపత్రం అందజేస్తున్న తమ్మినేని (ఫైల్)

నవతెలంగాణ-బోనకల్

2023 మార్చి నెలలో కురిసిన అకాల వర్షాల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా మొక్కజొన్న పంటతో పాటు ఇతర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. సీపీఐ(ఎం), సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావు డిమాండ్ మేరకు ఆనాటి సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ 2023 మార్చిలో రాష్ట్ర వ్యాప్తంగా అకాల వర్షాల వలన దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఇందులో భాగంగా 2023 మార్చి 23న బోనకల్ మండల పరిధిలోని రావినూతల, రామాపురం, గార్లపాడు గ్రామాలలో మొక్కజొన్న పంటలను తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావుతో కలిసి పరిశీలించారు. కేసీఆర్ స్వయంగా రైతులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గార్లపాడు పంటల పరిశీలన సమయంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం దెబ్బతిన్న పంటలకు పరిహారంగా ఎకరానికి రూ. 20 వేలు ఇవ్వాలని, దీంతోపాటు రాష్ట్ర, జిల్లా వ్యాప్తంగా కొన్ని సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కేసీఆర్‌కు అందజేశారు. కనీసం ఎకరానికి రూ.20వేల పరిహారం ఇవ్వటం వల్ల రైతులకు ఎంతో కొంత ఊరట కలిగిస్తుందని తమ్మినేని వీరభద్రం స్వయంగా కేసీఆర్‌ను డిమాండ్ చేశారు. 25 జిల్లాలలో దాదాపు 7 లక్షల ఎకరాల పంటలకు నష్టం వాటిల్లిందని తమ్మినేని వివరించారు. రాష్ట్రంలో మొక్కజొన్న విస్తీర్ణంలో 30 శాతం నష్టం జరిగినప్పటికీ, కేవలం 43,424 మందికి చెందిన 57,855 ఎకరాలు మాత్రమే నష్టం జరిగినట్లు అధికారులు ప్రకటించడం బాధాకరమని కేసీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. వాస్తవ గణాంకాలు సేకరించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇదే సంవత్సరం వానాకాలంలో 12 లక్షల ఎకరాల పంటలు దెబ్బతిన్నాయని అందులో 7 లక్షల ఎకరాలలో పత్తి పంట ఉందన్నారు. ప్రధానంగా కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని నేరుగా కౌలు రైతులకే పరిహారం చెల్లించాలని తమ్మినేని ముఖ్యమంత్రిని స్వయంగా కోరారు. కాని కేసీఆర్ ఇవేమీ పట్టించుకోలేదు. ఆనాడు వామపక్ష నాయకులు చేసిన ఏ డిమాండ్ లను కేసీఆర్ అంగీకరించలేదు. ఆ తర్వాత రావినూతలలో సీపీఐ(ఎం), సీపీఐ రాష్ట్ర కార్యదర్శులను కేసీఆర్ పక్కన కూర్చోబెట్టుకొని విలేకరుల సమావేశం నిర్వహించారు. అకాల వర్షానికి నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10వేల చొప్పున పరిహారం చెల్లించి రైతులను పూర్తిగా ఆదుకుంటామని కేసీఆర్ ప్రకటించారు. కౌలు రైతులకు కూడా నష్టపోయారని వారిని కూడా ఆదుకుంటామని ఎంతో ఘనంగా ప్రకటించారు.
అకాల వర్షాల వల్ల రాష్ట్రవ్యాప్తంగా మొక్కజొన్న 10,9,446 ఎకరాలలో 72,709 ఎకరాల్లో వరి 8,865 ఎకరాల్లో మామిడి 17,238 ఎకరాలు ఇతర పంటల దెబ్బతిన్నాయని కేసీఆర్ ప్రకటించారు. రైతులను అప్పుల భారం నుంచి బయటపడే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రకటించారు. కాని అందుకు విరుద్ధంగా కేసీఆర్ ఆచరణలో చేసి చూపించారు. ఇన్సూరెన్స్ ద్వారా రైతులకు ఎటువంటి ఉపయోగం లేదని, ఆ సంస్థలకు ఉపయోగం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పద్ధతి చూస్తుంటే చెవుటోడు ముందు శంకువు ఊదినట్లుగా ఉందని ఘాటుగా విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం మొక్కజొన్నకు రూ 3,300 వరికి రూ. 5,400 మామిడికి రూ 7,200 ప్రకటించిందని ఇవి ఎవరు ముక్కులో పెడతారని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాలు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని, పంటలకు నష్టపరిహారం ప్రపంచంలో ఏ ప్రభుత్వం చెల్లించలేదని, నష్టపోయిన పంటలకు సహాయ పునరావస సౌకర్యం కింద మాత్రమే పరిహారం చెల్లించడం జరుగుతుందని గొప్పగా ప్రకటించారు. కౌలు రైతులకు సహాయం చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులు ఆదేశిస్తున్నట్లు తెలిపారు. కానీ ఆచరణలో మాత్రం జిల్లా వ్యాప్తంగా ఎక్కడ అమలు జరగలేదు.
ఆనాడు బోనకల్ మండల వ్యాప్తంగా వ్యవసాయ శాఖ అధికారులు 15, 277 ఎకరాలలో మొక్కజొన్న పంట సాగు చేశారని, కాని ఇందులో 6, 218 మంది రైతులకు చెందిన కేవలం 7,896 ఎకరాలలో మాత్రమే పంట దెబ్బతిన్నదని వ్యవసాయ శాఖ అధికారులు లెక్కలు తేల్చారు. 6218 మంది రైతులకు గాను 7 కోట్ల 89 లక్షల 60 వేల రూపాయలు పరిహారం చెల్లించారు. వాస్తవంగా సాగు చేసిన మొక్కజొన్న పంట మొత్తం దెబ్బ తిన్నది. ఇందులో కూడా ప్రభుత్వం పెద్ద నాటకం ఆడింది.
ఉదాహరణకు ఒక ఎకరంలో మొక్కజొన్న పంట సాగు చేస్తే అందులో 90 శాతానికి పైగా నష్టం జరిగి ఉంటేనే ఎకరం కింద జమ కట్టారు. 80 శాతం లోపు నష్టం జరిగితే అర ఎకరానికి మాత్రమే పరిహారం చెల్లించారు. 50 నుంచి 70 శాతం లోపు పంట నష్టం జరిగి ఉంటే పావు పొలానికి మాత్రమే పరిహారం చెల్లించారు. ఎక్కడ ఎకరానికి పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించకపోవడం విశేషం. ఈ విధంగా ముఖ్యమంత్రి ఎకరానికి పదివేల రూపాయల ప్రకటించినా, వాస్తవంగా ఎకరానికి పదివేల రూపాయల పరిహారం చెల్లించలేదు.



దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న కెసిఆర్ (ఫైల్)

బోనకల్లులో పంటలను పరిశీలిస్తున్న సమయంలో కేసీఆర్ తో తమ్మినేని వీరభద్రం, సాంబశివరావు ఎకరానికి రైతులకు రూ. 20వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కానీ కేసీఆర్ ఆనాడు తిరస్కరించారు. కాని నేడు కేసీఆర్ మాజీ సీఎం హెూదాలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటలకు రూ. 25 వేలు పరిహారం చెల్లించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేయటం విశేషం. సీఎంగా ఉన్నప్పుడు వామ పక్షాలు డిమాండ్ చేసిన కనీసం రూ. 20 వేలు కూడా ఇవ్వని కేసీఆర్ నేడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రూ. 25 వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేయటం రైతులపై కేసీఆర్‌కు ఉన్న ప్రేమ ఎలాంటిదో అర్థమవుతుందని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. అధికారంలో ఉంటే ఒకరకంగా అధికారం కోల్పోగానే, కేసీఆర్‌కు రైతులపై అపారమైన ప్రేమ పుట్టటం విశేషం. ప్రకృతి వైపరీత్యంతో, ఇతర కారణాల వలన పంటల దెబ్బతిన్న సమయంలో అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ఏనాడు పంటలను పరిశీలించలేదు. కాని నేడు పంటల పరిశీలనకు స్వయంగా వెళ్ళటం రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేయటం మరింత విశేషం. దీనికంతటికీ కారణం అధికారం కోల్పోవడమే. బూర్జువా పార్టీలు అధికారములో ఉంటే ఒకరకంగా అధికారం లేకపోతే మరొక రకంగా వ్యవహరిస్తారనే విషయాన్ని రైతుల, ప్రజలు ఇప్పటికైనా గమనించాలి.

భూకబ్జా గ్యాంగ్‌లను ఉపేక్షించొద్దు

- ఫైనాన్స్ రికవరీ ఏజెంట్లపై కేసు నమోదు చేయండి
- మద్యం, నగదు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై నిఘా
- హవేలీ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఐజీపీ

ఏవి.రంగనాథ్

నవతెలంగాణ-ఖమ్మం

భూకబ్జా గ్యాంగ్ లను ఉపేక్షించవద్దని మల్టీజోన్ -1 ఐజిపి ఏవి రంగనాథ్ అన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా శనివారం జిల్లాకు చేరుకున్న ఐజీపీ రంగనాథ్ పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో కలసి ఖమ్మం ఖానాపురం హవేలీ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించారు. సమస్య పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్‌లో ఇటీవల ఫిర్యాదు చేసిన బాధిత ఫిర్యాదుదారులతో ఐజీపీ నేరుగా ఫోన్లో మాట్లాడారు. పోలీస్ స్టేషన్ పోలీస్ అధికారులు స్పందించిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ అక్రమ దందాలతో బాధితులను బెదిరించి దౌర్జన్యాలు, దాడులు చేసేవారిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలన్నారు. క్రిమినల్ చర్యలు ఉన్నప్పటికి సివిల్ కేసులని వదిలేస్తే కబ్జాలు, దాడులు, దౌర్జన్యాలు పెరిగే అవకాశం ఉంటుందనే విషయాన్ని పోలీస్ అధికారులు గ్రహించి అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సామాన్యులకు న్యాయం జరిగినప్పుడే సమస్యలున్న ప్రజలు సైతం నిర్భయంగా ఫిర్యాదులు చేస్తారని పేర్కొన్నారు. ప్రధానంగా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, శాంతి భద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. కేసుల నమోదు విషయంలో తత్సారం చేయవద్దన్నారు. అదేవిధంగా విధి నిర్వహణలో రోల్



క్లారిటీ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు అవినాష్ కుమార్, మౌనిక, టౌన్ ఏసీపీ రమణమూర్తి పాల్గొన్నారు.

గంజాయి సరఫరా, ఆర్థిక మూలాలపై ఉక్కుపాదం

గంజాయి సరఫరా, ఆర్థిక మూలాలపై ఉక్కుపాదం మోపాలని మల్టీజోన్ ఐజీపీ ఏవి. రంగనాథ్ అన్నారు. శనివారం ఖమ్మంలోని పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. మల్టీజోన్ - 1 ఐజీపీగా మొదటి సారిగా ఖమ్మం పోలీస్ కమిషనరేట్ కు విచ్చేసిన ఏవి. రంగనాథ్ ని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ స్వాగతం పలుకుతూ పుష్పగుచ్ఛం అందజేశారు. పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన నేర సమీక్ష సమావేశం ఐజీపీ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాల నిర్మూలనకు పటిష్ఠమైన చర్యలు తీసుకొవాలని, ప్రధానంగా సరిహద్దు రాష్ట్రాల పోలీస్ అధికారులను సమన్వయం చేసుకొని కట్టడి చేయాలన్నారు. ఇందుకోసం ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అక్రమ ఫైనాన్స్ వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలని, పేద, మధ్య తరగతి ఆర్థిక అవసరాన్ని ఆసరాగా తీసుకుని అధిక వడ్డీలు, స్కీమ్‌ల పేరుతో అమాయకుల నుండి డబ్బులు తీసుకొని ఇవ్వకుండా వేధిస్తునట్లు ఫిర్యాదులు వస్తే కేసులు నమోదు చేయాలన్నారు.
నగరంలో బైక్ ఫైనాన్స్ కిస్తీలు కట్టలేదని యువకుడిపై దాడి, దుర్మరణానికి కారణమైన ఫైనాన్స్ రికవరీ ఏజెంట్లతో పాటు ఫైనాన్సర్ పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఆదేశించారు. అక్రమార్జనకు అలవాటు పడిన భూకబ్జాదారులను వదిలిపెట్టవద్దని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మద్యం, నగదు, మాధకద్రవ్యాల అక్రమ రవాణా నియంత్రణ చర్యలు, సరిహద్దు మార్గాల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులలో పకడ్బందీగా తనిఖీలు, ఇరు రాష్ట్రాల సరిహద్దు పోలీసులు పరస్పరం సమాచార వ్యవస్థను సమన్వయం చేసుకొంటూ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా రూపొందించిన ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లాని అన్నారు. ఇసుక అక్రమ రవాణా చేసే వాహనాలకు సీజ్ చేసి జరిమానా విధించాలని ఆదేశించారు. ఎన్నికల సందర్భంగా తీసుకుంటున్న చర్యలు, అనుసరిస్తున్న వ్యూహం పై ఎన్నికల బందోబస్తు, శాంతిభద్రతలపై పోలీస్ కమిషనర్ వివరించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపి లా అండ్ ఆర్డర్ ప్రసాద్ రావు, అడిషనల్ డీసీపీ గణేష్, ఏఎస్పీ అవినాష్ కుమార్, మౌనిక, ఏసీపీలు రమణమూర్తి, తిరుపతిరెడ్డి, రహెమాన్, రఘు, శ్రీనివాసులు, ప్రసన్న కుమార్, బోజరాజు, మల్లయ్య, ఫణింద్ర, నర్సయ్య, సిఐలు, ఆర్ఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

సెమిస్టరు ఫలితాలలో డీఆర్ఎస్ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-ఖమ్మం

కాకతీయ యూనివర్సిటీ 1,3, 5 సెమిస్టరు ఫలితాలలో ఖమ్మం డీఆర్ఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆర్ట్స్, సైన్స్, కామర్స్ విభాగాలలో అద్భుత ఫలితాలను సాధించారని కళాశాల కరస్పాంటెండెంట్ వి.మోహన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అద్భుత ఫలితాలు సాధించాలని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్‌పర్సన్ వి.శోభా రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ టి.నాగేశ్వర్ రావు, కళాశాల పరిపాలనాధికారి బి. వెంకటకృష్ణ, ఎన్ఎస్ఎస్ పిఓ ఎం.యాదగిరిలను అభినందించారు.

నిరుపేద విద్యార్థికి సైకిల్ అందజేసిన పూర్వ విద్యార్థి

నవతెలంగాణ-వేంసూరు

భరణి పాడు నివాసి కందుకూరు పాఠశాల పూర్వ విద్యార్థి బెల్జియాలో ఉంటున్న సింగంశెట్టి ప్రీతియ సాగర్ దంపతులు 7200 విలువ గల సైకిల్‌ను శనివారం నిరుపేద విద్యార్థి రెడ్డి బోయిన దేవి ప్రియకు కందుకూరు పాఠశాలలో అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు పీఏసీఎస్ అధ్యక్షుడు కూరపాటి నాని, మాజీ సర్పంచ్ మందపాటి మహేశ్వర్ రెడ్డి, మోహన్ రావు భాస్కర్ రావు, పాల్గొన్నారు.

9 నుండి శ్రీవారి బ్రహ్మోత్సవాలు



- 15న జమలాపురం శ్రీవారి కళ్యాణం
- మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి
- వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఎర్రుపాలెం

తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన మహాదివ్య క్షేత్రమైన స్వయంభు జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు శ్రీ క్రోధి నామ సంవత్సర వసంత నవరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 9 ఉగాది నుండి ప్రారంభం కానున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి కొత్తూరు జగన్మోహన్ రావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా కళ్యాణ మహోత్సవ తేదీలు, తెప్పోత్సవ సమయం, ప్రతిరోజు వివిధ వాహన సేవల వివరాలు దేవస్థానం కార్యాలయము నందు పత్రికా విలేకరుల సమావేశంలో వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షతన వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 9 నుండి 17 వరకు 9 రోజులు పాటు బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించబడతాయని తెలిపారు. స్వామి వారి ఆలయంతోపాటు ఉప ఆలయాలకు రంగులు, విద్యుత్ దీపాల అలంకరణ, దేవాలయం అంతా రంగ వల్లులతో తీర్చిదిద్దినట్లు తెలిపారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు ఉచిత అన్నదానం, ప్రసాద వితరణ చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు అవసరమైనన్ని శ్రీవారి లడ్డు ప్రసాదాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ నెల 15 శ్రీ అలివేలు మంగ పద్మావతి దేవేరులతో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం మహోత్సవం భక్తుల సమక్షంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సాయంత్రం వివిధ రకాల వేషాధారణలతో, కోలాట, భజనలు వివిధ రకాల నృత్యాలతో కనుల విందు గొలిపే రీతిగా స్వామివారు గ్రామ సేవ (ఊరేగింపు) అనంతరం పెద్ద చెరువు (తటాకం)లో తెప్పోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్ శర్మ ఆలయ పర్యవేక్షకులు కే.విజయ కుమారి పాల్గొన్నారు.



లింగ నిర్ధారణ చేస్తున్న

హాస్పిటల్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఖమ్మం

కడుపులో ఆడపిల్ల అవగానే భ్రుణ హత్యలు జరుగుతున్నాయని, దంపతుల బలహీనతని ఆసరాగా చేసుకొని లింగ నిర్ధారణ చేస్తున్నారని, కొందరు డాక్టర్లు కూడా ఆందోళన వ్యక్తపరిచారని డాక్టర్ వై.రవీంద్రనాథ్, విద్యావేత్త పి.రవి మారుతి, స్పర్శ అధ్యయన కేంద్రం బాధ్యులు కాకి భాస్కర్ అన్నారు. శనివారం ఖమ్మంలోని టెండర్ రూట్స్ పాఠశాలలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఆవుల మంగతాయి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఖమ్మం నగరంలో భ్రుణహత్యలు జరుగుతున్నాయని, ఆడపిల్ల మనుగడే ప్రశ్నార్ధకంగా మారే పరిస్థితి ఉందని, ఆడపిల్ల అనగానే అబార్షన్ చేసి 50 వేల నుండి లక్ష రూపాయలు దాకా తీసుకుంటూ దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. ఆడపిల్ల అయితే చదివించాలనీ, సమాజానికి ఉపయోగపడాలని, కానీ, ఆడపిల్ల అంటేనే కష్టంగా ఉన్న పరిస్థితియనీ, ఖమ్మంలో ఈ మధ్యకాలంలో కొన్ని హాస్పిటల్స్‌ను సీజ్ చేశారని, అయినప్పటికీ మళ్లీ కొద్ది రోజులకే హాస్పటల్స్‌ను నడుపుతున్న పరిస్థితి ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కడుపులో మగపిల్లాడు అయినప్పటికీ ఆడపిల్ల అని చెప్పి అబార్షన్ చేస్తున్న పరిస్థితిని చూస్తున్నామని ఆడ, మగ నిష్పత్తిలో కూడా ఆడపిల్లల సంఖ్య పూర్తిగా తగ్గిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఖమ్మం నగరంలో 20 సంవత్సరాల నుండి భ్రుణ హత్యలు చేస్తూ, లింగ నిర్ధారణలు నిర్వహిస్తూ వైద్య వ్యాపారానికి తెరదించారని, ఆనాటి నుండి ఈనాటి వరకు అదే పరిస్థితి కొనసాగుతుందని, భ్రుణ హత్యలు, లింగ నిర్ధారణలు రోజురోజుకి పెరిగిపోతున్నాయని, లింగ నిర్ధారణపై హాస్పిటల్స్ దోపిడీ నిరంతరంగా కొనసాగుతూ ఉందని, దానికి లోపాలు చాలానే ఉన్నాయని, ప్రభుత్వం యంత్రాంగం పకడ్బందిగా పనిచేయాలని, ఆడపిల్లలను చంపడం అనేది ఒక రుగ్మత అని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ శిరోమణి, ఏపీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయల చంద్రశేఖర్, పౌర హక్కుల సంఘం (సీఎల్‌సీ) జిల్లా సహాయ కార్యదర్శి డి శిరీష, గ్రామీణ వైద్యుల సహాయక సంఘం రాష్ట్ర నాయకులు పిట్టల నాగేశ్వరరావు, లెక్చరర్ ఆర్ కీర్తి, పిఓడబ్ల్యు రాష్ట్ర కోశాధికారి టీ.ఝాన్సీ, జిల్లా అధ్యక్షురాలు జి.లలిత, జిల్లా సహాయ కార్యదర్శి పి.శోభ, జిల్లా నాయకురాలు జి.సరోజినీ, శీలం పూలమ్మ, బందెల లలిత, కే.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

6

నవతెలంగాణ

నమ్మిన తెలుగు దినపత్రిక

ఖమ్మం

ఆదివారం | ఏప్రిల్ 07, 2024 | www.navatelangana.com

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా పీ.సుధాకర్, టీ. ప్రవీణ్

నవతెలంగాణ-ఖమ్మం





ఎస్‌ఎఫ్‌ఐ ఖమ్మం జిల్లా 46వ మహాసభలు ఖమ్మంలోని సుందరయ్య భవనంలో నిర్వహించారు. ఈ మహాసభలో నూతన ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా పీ.సుధాకర్, టీ.ప్రవీణ్‌లు ఎన్నికైనట్లు రాష్ట్ర కార్యదర్శి టీ.నాగరాజు తెలిపారు. 23 మందితో నూతన జిల్లా కమిటీని, జిల్లా కార్యవర్గం 9 మందితో ఏర్పాటు చేశారు. జిల్లా ఉపాధ్యక్షులుగా బెజవాడ సాయి శేషు, దొంతబోయిన వెంకటేష్, వంకాయల రాజు, పోతబోయిన సరళ, సహాయ కార్యదర్శిగా చింతల సంగీత, కోటా ప్రేమ్ కుమార్, చేపల వెంకటేష్ ఎన్నికైనట్లు తెలిపారు.

నేడు కామిశెట్టి కళ్యాణ మండపంలో రక్త దానం శిబిరం

- రక్త దానం చేయండి..! ప్రాణదాతలు కాండీ...!!

- మార్పు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు గుడిమెట్ల రజిత

నవతెలంగాణ-వైరాటౌన్



మార్పు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నేడు ఏప్రిల్ 7వ తేదీ ఆదివారం తలసేమియా పిల్లల సహాయం కోసం స్థానిక కామిశెట్టి కళ్యాణ మండపంలో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు బ్లడ్ డొనేషన్ క్యాంపు నిర్వహిస్తున్నామని మార్పు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు గుడిమెట్ల రజిత మోహన్‌రావు తెలిపారు. శనివారం గుడిమెట్ల రజిత మాట్లాడుతూ తలసేమియా చిన్నారులు బ్రతికి ఉన్నంతకాలం ప్రతి 15 రోజులకు ఒకసారి రక్తం ఎక్కించుకోవలసి ఉంటుందని, ప్రస్తుత ఎండాకాలం సీజన్‌లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటం వలన పిల్లలు రక్తం దొరకక చాలా యిబ్బంది పడుతున్నారని, కొంతమంది చిన్నారులు చనిపోతున్నారని తెలిపారు. ఒకరు రక్తదానం చేయడం వలన తలసేమియా చిన్నారులకు 20 రోజుల జీవితాన్ని ప్రసాదించిన వారు అవుతారని, మనం చేసే రక్తదానం చిన్న పిల్లల ప్రాణాలను కాపాడుతుందన్నారు. ప్రతి ఒక్కరు మానవతా హృదయంతో స్పందించి రక్తదానం చేసి చిన్నారుల జీవితాల్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. వివరాలకు సెల్ నెంబర్ 8309633034 సంప్రదించాలని కోరారు.

క్రీడా ప్రాంగణాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కామేపల్లి

మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కామేపల్లి గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ తారా దేవి, పంచాయతీ కార్యదర్శి అనిల్ కుమార్ అన్నారు. వేసవిలో క్రీడాకారులు ఉల్లాసంగా ఆడుకునేందుకు క్రీడాకారులను దృష్టిలో పెట్టుకొని క్రీడా ప్రాంగణాన్ని డోజర్ సహాయంతో శనివారం శుభ్రం చేయించారు. ఈ ప్రాంగణాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓటు హక్కు అందరి బాధ్యత..

నవతెలంగాణ-కామేపల్లి

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని కామేపల్లి మండల తహసీల్దార్ సిహెచ్.సుధాకర్, ఎంపీడీఓ రవీందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ప్రభుత్వ అధికారులతో తహశీల్దార్ సుధాకర్ ఆధ్వర్యంలో ఓటు హక్కును వినియోగం, ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నెల్లూరు చందన, ఆర్ఐ సక్రు, ఏఓ తారాదేవి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

నవతెలంగాణ-కామేపల్లి



గుండెపోటుతో హొటల్ యజమాని భూక్యా శంకర్(50) మృతి చెందిన సంఘటన కామేపల్లి మండల పరిధిలోని ముచ్చర్ల క్రాస్‌రోడ్‌లో శనివారం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం...ముచ్చర్ల అక్రాస్ రోడ్‌లో ఉంటూ హొటల్‌ని నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. అందులో భాగంగానే శనివారం అర్ధరాత్రి ఒక్కసారి వాంతులు చేసుకోని వెంటనే మృతి చెందటం జరిగిందని తెలిపారు. మృతుడికి భార్య, కుమారులు ఉన్నారు. అనంతరం అంత్యక్రియలు ఘనంగా నిర్వహించారు.

డిగ్రీ ఫలితాల్లో ఆర్జేసీ ప్రభంజనం

నవతెలంగాణ-ఖమ్మం

కాకతీయ యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ 1,3,5 వ సెమిస్టర్ ఫలితాల్లో ఖమ్మం ఆర్జేసి కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల చైర్మెన్ గుండాల కృష్ణ తెలిపారు. వీరిలో బి ఎస్సీలో ఎస్‌కే.సల్మా 8.13, ఎండీ.ఆయేషా 8.05, ఎన్.సాత్విక 8.03, బీ.విజయలక్ష్మి 8.01, బీ.శ్రీలక్ష్మి 8.0, వీ.హారిక 8.74, ఎన్.భవాని 8.24, ఎస్‌కే. ఖాజాబి 8.20, జీ.శైలజ 8.01 మార్కులు సాధించారని పేర్కొన్నారు. అదేవిధంగా బీకాంలో జీ.గోపిక 8.52, జీ.సమీరా 8.18, ఎస్. రుస్తం, కే అలీ 8.12, డీ.వర్షిణి 8.04, కే.ప్రవల్లిక 8.03, జీ.కుమార్ 8.03, కే.మానసా 8.02, సాధించారని వెల్లడించారు. అలాగే బీఏలో ఎస్కే. ఇష్టీజం 7.70, ఎస్‌కే. జాస్మిన్ 7.65, ఎస్‌డీ. సమ్రీన్ 7.50, ఎల్. శ్రావణి 7.18, వీ.ఐశ్వర్య 7.18 పాయింట్లు సాధించి ఆర్జేసి విద్యార్థుల సత్తా చాటారని పేర్కొన్నారు. తమ కళాశాల విద్యార్థులు గతంలో పలువురు వివిధ రంగాల్లో ఉన్నతమైన స్థితిలో స్థిర పడ్డారని తెలిపారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేసిన అధ్యాపకులను అభినందించారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఏ.లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలో గోకినేపల్లి ఎరువుల దుకాణాన్ని మధిర ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా దుకాణంలోని ఎరువులను పరిశీలించి, షాపు స్టాక్ రిజిస్టర్‌లను ఆయన తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన ఎరువులను పంపిణీ చేయాలన్నారు. నకిలీ ఎరువులను రైతులకు పంపిణీ చేస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆయన వెంట ఏఈఓ ఏ.మౌనిక ఉన్నారు.

న్యాయ చైతన్య సదస్సు

నవతెలంగాణ-మధిర



ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల మధిర ఆవరణలో వరల్డ్ హెల్త్ డే, న్యాయ చైతన్య సదస్సు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్జ్ టీ.కార్తీక్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై వరల్డ్ హెల్త్ డే గురించి న్యాయ చైతన్య సదస్సు గురించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలోవైద్యులు డాక్టర్ పృథ్వీ, ఆయుర్వేద వైద్యులు డాక్టర్ వెంకట్ లాల్, సీడీపీఓ పల్లె దవాఖాన వైద్యులు కుమారి జాహ్నవి, వైద్య సిబ్బంది విజయ్ కుమార్, అంగన్‌వాడీ సూపర్వైజర్, ఆయుష్ సిబ్బంది శ్రీనివాసు, కందుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు రూ.25 వేలు పరిహారం చెల్లించాలి

- **గోదావరి జలాలు సముద్రపు పాలు చేసి పంటలు ఎండబెట్టారు**
- **ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం**
- **ఎంపీ నామా, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు**

నవతెలంగాణ-కల్లూరు



కల్లూరు

రబీ సీజన్‌లో సాగునీరు ఉండి పంటలకు నీళ్ల ఇవ్వకుండా పంటలు ఎండిపోవటానికి ప్రభుత్వ కారణమని, నైతిక బాధ్యత వహించి ఎకరానికి రూ.25 వేల నష్టపరిహారం చెల్లించాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కల్లూరు పట్టణ సెంటర్‌లో మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో రైతు నిరసన దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఒక వైపు రైతులు సాగునీరు ఇవ్వండి పంటలు ఆదుకోండి అంటూ రైతులు ఆందోళన చెందుతుంటే కాళేశ్వరాన్ని బూసి చూపించినట్టు చూపించి సాగునీరు సముద్రపు పాలు చేసి పంటలు ఎండ పెట్టారని ఆరోపించారు. వంద రోజుల్లోనే ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి ఏది అమలు చేయకపోవడంతో ప్రజల్లో ఈ ప్రభుత్వంపై నమ్మకం అధికారంలోకి వచ్చిన వెంటనే ఋణ మాపి చేస్తామని చేపి వందరోజులైనా ఎందుకు ఇవ్వలేదని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆరోపించారు. వర్షాలు పడకపోయిన పంటలకు నీరు ఇచ్చిన ఘనత కేసీఆర్ దేనన్నారు. సత్తుపల్లి డివిజన్‌లో 1.50 మెట్రిక్ టన్నులు దాన్యాని సేకరించామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అదికారం లోకి వచ్చినప్పుడు 7వేలు కోట్లు రైతుబంద్ కోసం ఉంచితే కాంట్రాక్ట్‌కు ఇచ్చి రైతులకు మెండిచేయి చూపించారని ఆరోపించారు. రైతు భరోసా 15 వేలు ఎక్కడ.. ఇదేనా మార్పు అని ఏద్దేవా చేశారు. ఇచ్చిన హామీలు ఆమలు చేయకపోతే కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పండి అని పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించి నామ నాగేశ్వరావును అధిక మెజారిటీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు కట్టా అజయ్ కుమార్, మెహన్‌రావు, ఎంపీపీలు లక్కినేని అలేఖ్య, దొడ్డి శ్రీనివాసరావు, పార్టీ మండల కమిటీ అధ్యక్షులు పాలెపు రామారావు, లక్కినేని రఘు, ఐదు మండలల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైరాటౌన్ : అసమర్ధ కాంగ్రెస్ పాలనలో అన్నదాతలు అడుగడుగునా అవమానాల పాలవుతున్నారని, బీఆర్‌ఎస్ రైతన్నలకు సంపూర్ణ భరోసా కల్పిస్తుందని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు స్పష్టం చేశారు. శనివారం వైరాలో జరిగిన రైతు భరోసా దీక్షలో ఎంపీ నామ నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, వనమా విశేశ్వరరావు, ముళ్ళపాటి సీతారాములు, టౌన్ పార్టీ నాయకులు, మండలాల నాయకులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బూత్ స్థాయి నాయకులు, రైతులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ఖమ్మం రూరల్

మధిర : మధిర పాత రూరల్ పోలీస్ స్టేషన్ ఎదురుగా రాష్ట్రవ్యాప్తంగా మాజీ ముఖ్యమంత్రివర్యులు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పిలుపుమేరకు శనివారం జిల్లా పరిషత్ చైర్మెన్ లింగాల కమల్ రాజ్ ఆధ్వర్యంలో రైతు గోస నిరసన దీక్ష కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, రైతులు పెద్ద ఎత్తున హాజరై ఎండిపోయిన పంటలను తీసుకొచ్చి నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మెన్ లింగాల కమల్ రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పల్లపోతు వెంకటేశ్వర్లు, పట్టణ కార్యదర్శి అరిగి శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు రావూరి శ్రీనివాసరావు, మండల కార్యదర్శి బొగ్గుల భాస్కర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ బంధం శ్రీనివాసరావు, మాజీ వైస్ చైర్మెన్ కటికల సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం రూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం రూరల్, కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల బీఆర్‌ఎస్ నాయకుల ఆధ్వర్యంలో మండల పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్‌లో శనివారం ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తాతా మధు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్ పర్సన్ ధనలక్ష్మీ, ఖమ్మం రూరల్, కూసుమంచి, నేలకొండపల్లి మండలాల అధ్యక్షులు బెల్లం వేణు, వీరయ్య, బ్రహ్మయ్య, ఖమ్మం రూరల్ ఎంపీపీ బెల్లం ఉమ, జడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత మెడికల్ క్యాంపుల నిర్వహణ ప్రజా ఉద్యమాలాంటివి

- **త్వరలో జనరిక్ మెడికల్ షాపు ప్రారంభం**
- **సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు**

నవతెలంగాణ-ఖమ్మం



ప్రతి నెలా తప్పకుండా గత ఏడు సంవత్సరాలుగా నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపు జిల్లా వ్యాప్తంగా పేదలకు, మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడే విధంగా అందుబాటులో ఉందని, ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహణ కూడా ప్రజా ఉద్యమాలు లాంటివి అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నగర పుర ప్రముఖులు బీమవరపు పుల్లారావు తెలిపారు. శనివారం మంచికంటి భవన్‌లో సీపీఐ(ఎం) ఖమ్మం టూ టౌన్ కమిటీ, బోడేపూడి విజ్ఞాన కేంద్రం (బీవీకే) ఆధ్వర్యంలో బిపి, షుగర్, ఫిట్స్ మెడికల్ క్యాంపు విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నున్నా నాగేశ్వరరావు, బీమవరపు పుల్లారావు మాట్లాడుతూ మనిషి జీవితంలో ఆరోగ్యం కాపాడుకోవడం ఒక ముఖ్యమైన బాధ్యతని, నేటి నాగరిక సమాజంలో ఫాస్ట్ ఫుడ్ ఫలితంగా తక్కువ వయసులోనే బీపీ, షుగర్ తదితర అనారోగ్య సమస్యలు మనిషిని చుట్టుముట్టుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రముఖ వ్యాపారవేత్త వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ సంస్థలో నిర్వహణలో వీవీసీ, బీవీకే ఆధ్వర్యంలో ఈ మెడికల్ షాపు నడుస్తుందని పేర్కొన్నారు. ఈనెల లేదా మే నెలలో మెడికల్ షాపు ప్రారంభం అవుతుందని, ప్రతి రోజూ పేషెంట్లకు మెడికల్ షాపు అందుబాటులో ఉండటం ఫలితంగా ప్రజలకు మరింత తక్కువ ధరలకు మందులు పంపిణీ చేస్తామని తెలిపారు. ప్రముఖ హార్ట్ డాక్టర్ హర్ష తేజ నిర్వహణలో 100 మంది పేషెంట్లకు ఉచితంగా ఏకో టెస్ట్ నిర్వహించారు. బీసీ, షుగర్, ఫిట్స్ కంటి పరీక్షలు, చెవి, ముక్కు గొంతు పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. అనంతరం బీపీ, షుగర్, ఫిట్స్‌కు నెలకు సరిపడా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై .విక్రమ్, కంటి డాక్టర్ ఈవై. లావణ్య, ప్రముఖ డాక్టర్లు సీ.భారవి, కొల్లి అనుదీప్, రావిళ్ళ రంజిత్, పీ.సుబ్బారావు, జెట్ల రంగారావు, డాక్టర్ విజయ్, బోడేపూడి విజ్ఞాన కేంద్రం నాయకులు వై.శ్రీనివాసరావు, బోడపట్ల సుదర్శన్, శివనారయణ, నర్రా రమేష్, రామారావు, పీ.వాసు, అఫ్జల్, గుమ్మడి బిక్షం, పీ.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



నారాయణమ్మకు నివాళి

- **దశదిన కర్మకు హాజరైన సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు**
- **బుర్రి రవి కుటుంబానికి పరామర్శ**

నవతెలంగాణ-ఎర్రుపాలెం



వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి, సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు గామాసు జోగయ్య సతీమణి నారాయణమ్మ ఇటీవల మరణించారు. శనివారం ఎర్రుపాలెం మండల పరిధిలోని నరసింహాపురం గ్రామంలో నిర్వహించిన దశదిన కర్మలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు పాల్గొని నారాయణమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తొలుత రామాపురం సీపీఐ(ఎం) గ్రామ శాఖ కార్యదర్శి బుర్రి రవికుమార్ గత నెల రోజుల క్రితం మృతి చెందారు. రవి భార్యను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి యర్రా శ్రీను, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య, మండల కమిటీ సభ్యులు గొల్లపూడి కోటేశ్వరావు, రామిశెట్టి సురేష్, నల్లమోతు హనుమంతరావు, సగ్గుర్తి సంజీవరావు, షేక్ లాల, మేడగాని తిరుపతిరావు, దేవరకొండ రామకృష్ణ, గొర్రాజు రాములు, కూడెల్లి నాగేశ్వరరావు, తాళ్లూరి వెంకటనారాయణ, కోలా రాములు, చిత్తారు కిషోర్, నాగులవంచ వెంకట్రామయ్య, షేక్ నాగుల మీరా, కోలా నాగేశ్వరరావు, వీరవెంకయ్య, కుర్ర వెంకటరామయ్య, తేలప్రోలు రాధాకృష్ణ, యరమల శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శక్తికి మించిన పని చేపిస్తున్న ఉపాధి హామీ ఉద్యోగులు

- **పని కాకుంటే ఆఫ్‌సెంట్ వేస్తామని బెదిరింపులు**
- **వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి తేలప్రోలు రాధాకృష్ణ**

నవతెలంగాణ-మధిర



కూలీలను కందకాలు తవ్వే దగ్గర వారి శక్తికి మించి పెద్దపెద్ద మొద్దుల్ని తొవ్వి తీపిస్తున్నారని, ఆ శ్రమతో కూడుకున్న పనిని మహిళా కూలీలతో కూడా తీపిస్తున్నారని, ఏర్లతో సహా తవ్వి తీయమని అధికారులు వారిని ఇబ్బంది పెడుతున్నారని, ఆ పని కాకుంటే ఆఫ్‌సెంట్ వేస్తామని ఉద్యోగులు బెదిరిస్తున్నారని కూలీలు వాపోయారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తేలప్రోలు రాధాకృష్ణ తెలిపారు. మండలం పరిధిలోని దెందుకూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల శనివారం ఆయన పరిశీలించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనంగా 600 రూపాయలు ఇవ్వాలని, ఉపాధి హామీ పనుల దగ్గర టెంట్, మెడికల్ కిట్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు. కొలతలు ప్రకారం కాకుండా కూలి వేతనంగా నిర్ణయించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూడు నెలల నుంచి ఉపాధి హామీ పనులు డబ్బులు ఇవ్వట్లేదని ఆ డబ్బులు వెంటనే చెల్లించాలన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేయడం కోసం అనేక ప్రయత్నాలు చేస్తుందన్నారు. ఎక్కువ శ్రమతో కూడిన పనుల్లో పెట్టి కూలీలను ఇబ్బందికర పరిస్థితిలోకి నెడుతున్నారని, తేలికైన పనులను ఉపాధిగా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ప్రెసిడెంట్ వెల్సన్, దెందుకూరు గ్రామ కార్మిక నాయకుడు అల్లూరి నాగేశ్వరరావు, వీ.కృష్ణయ్య, అద్దంకి గోపాల్‌రావు, అద్దంకి పూర్ణయ్య, కిలారి కృష్ణ, తిరుబోయిన సత్యం, కే.వరలక్ష్మి, అద్దంకి నాగలక్ష్మి, కోయ నాగలక్ష్మి అద్దంకి సీత మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వలస కార్మికుడి మృతికి బిల్డర్, ఫైనాన్స్ వారే కారణం

- **బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రి వద్ద ఆందోళన**

నవతెలంగాణ-ఖమ్మం



వలస కార్మికుడు వినయ్ మృతికి బిల్డర్, ఫైనాన్స్ వారే కారణమని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ముదాం శ్రీనివాసరావు ఆరోపించారు. వలస కార్మికుడికి పోరాడి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో శనివారం ఖమ్మంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం నగరంలో నివసిస్తున్న ఆగ్రాకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు వినయ్ మోటార్ సైకిల్ కి సంబంధించిన ఈఎంఐ పెండింగ్‌లో ఉందని, బండి తీసుకువెళ్లడానికి వచ్చిన మోహన్ సాయి ఫైనాన్స్ వారు వాళ్ళు బండి బల్లేపల్లిలో ఉందని, తీసుకువెళ్లి వారికి చూపించారు. ఆ బండి నా పని పూర్తి చేస్తేనే ఇస్తానని ఇంటి ఓనర్ చెప్పడంతో ఫైనాన్స్ వారు ఈ వలస కార్మికుడి పై దాడి చేస్తూ కొడుతున్న సందర్భంలో పరిగెత్తే ఖానాపురం చెరువులో దూకడం జరిగిందని, వీళ్ళు రాల్లువేయడంతో వినయ్ మృతి చెందాడని ఆరోపించారు. బిల్డరు, ఫైనాన్స్ వారు కలిపి అతనిపైకి రాళ్ళు విసిరారని వలస కార్మికుడు చనిపోవడానికి కారణమయ్యారని ఆరోపించారు. ఆందోళనకు స్పందించిన అధికారులు మోహన్ సాయి ఫైనాన్స్ యాజమాన్యంపై, బిల్డర్ పై 302 కేసు నమోదు చేశారని తెలిపారు. అనంతరం వలస కార్మికునికి అంబులెన్స్ మాట్లాడి అంబులెన్స్ ఖర్చులు, దహన సంస్కార ఖర్చులు ఇప్పించి బాడీని అతని తమ్ముడికి అప్పజెప్పి ఆగ్రా పంపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దోనోజు లక్ష్మయ్యగౌడ్, రాంబ్రహ్మం గౌడ్, ఎస్‌కే. జానీ, రెంటపల్లి మోతీరయ్య, ఎస్కే. పాషా, మౌలానా, చిట్టిబాబు, రవి, ఏసూబ్, అనిశెట్టి శంకరయ్య, కుమ్మరి కుంట్ల వెంకట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటిని పరిశీలించిన ఐబీ అధికారులు

నవతెలంగాణ-ముదిగొండ



మండలంలోని యడవల్లి వద్ద సాగర్ కాలువను ఐబీ, పోలీస్ అధికారులు శనివారం క్షేత్రస్థాయిలో సందర్శించి నీటిని పరిశీలించారు. మండలంలోని తాగునీటి ఎద్దడును నివారించాలని ప్రభుత్వం సాగర్ జలాలను విడుదల చేసింది. ఈ జలాలను సద్వినియోగం చేసేందుకు అధికారులు పర్యవేక్షణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్. శ్రీధరస్వామి, ఆర్డబ్ల్యుఎస్ డీఈ నరసింహారావు, ఎన్ఎస్పి ఏఈ ఎల్. భగీరథబాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యాలమ్మ గుడిలో చోరీ

నవతెలంగాణ-పెనుబల్లి

మండల కేంద్రంలోని ముత్యాలమ్మ గుడిలో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆలయం ముఖద్వారం వద్ద ఉన్న ఇనుప తడికలను పగలగొట్టి ఆలయంలోకి ప్రవేశించి హుండీలను పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఈ ఆలయం ఊరికి దూరంగా ఉండటం వలన పలుమార్లు దొంగతనాలు జరిగాయి. ఈ ఆలయం మీద ఉన్న మక్కువతో భక్తులు పెద్ద ఎత్తున కానుకలు సమర్పిస్తూ ఉంటారు. అదునుగాభావించిన దొంగలు తరచూ ఉండిన పగలగొట్టి అందినంతవరకు దోచుకొని వెళ్తున్నారు. పెనుబల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్బీఐటీలో ముగిసిన వృత్తినైపుణ్య శిక్షణా తరగతులు

నవతెలంగాణ-ఖమ్మం

విద్యార్థులకు విద్యతో పాటు వృత్తి నైపుణ్య మెళకువలు కూడా అవసరమని గుండాల కృష్ణ తెలిపారు. శనివారంతో ఆరు రోజుల శిక్షణా తరగతులు ముగింపు వేడుకలకు హాజరైన కళాశాల చైర్మెన్ గుండాల కృష్ణ హాజరై మాట్లాడారు. పలు ప్రవేశ పరీక్షలకు సమయపాలనతో పాటు మెళకువలు కూడా ముఖ్యమని దిశానిర్దేశం చేశారు. సీఆర్‌టీ పేరుతో నిర్వహించే ఈ శిక్షణా తరగతులు విద్యార్థులకు పలు బహుళ జాతి కంపెనీల ఎంపికలో క్రియాశీలకంగా ఉంటుంది అని, ఈ శిక్షణలో తక్కువ సమయంలో ప్రశ్నలకు సమాదానం ఇచ్చే మెళకువలు, ఎనలిటికల్ స్కిల్స్ అవగాహన కల్పిస్తారని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జీ. ధాత్రి తెలిపారు. ఆప్టిట్యూడ్, రీజనింగ్ తో పాటుగా ప్రాబ్లమ్ సాల్వింగ్ పై అవగాహన కల్పించామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జీ. రాజుకుమార్ తెలిపారు. శిక్షకులను అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు బాషా, పీ. ధీరజ్, కే. దుర్గాప్రసాద్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కే. అమిత్ బంధాజ్, అకడమిక్ డైరెక్టర్స్, గంధం శ్రీనివాసరావు, డాక్టర్ ఏవీవీ. శివ ప్రసాద్, జీ. ప్రవీణ్ కుమార్, డాక్టర్ జె. రవీంద్రబాబు. డాక్టర్ ఎస్. శ్రీనివాసరావు, టీపీఓఎస్. సవిత, కోఆర్డినేటర్ జీ. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన 'వాణి' విద్యార్థులు

నవతెలంగాణ-సత్తుపల్లి



లిటిల్ చాంప్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ హైదరాబాద్ వారు రాష్ట్రస్థాయిలో నిర్వహించిన గణితం, తెలుగు ప్రతిభా పరీక్షలో స్థానిక వాణి విద్యాలయం విద్యార్థులు అత్యంత ప్రతిభను కనబర్చారు. లిటిల్ చాంప్స్ మాథ్స్ ఒలంపియాడ్‌లో ఎస్. దేవి శ్రీవల్లీ (మూడో తరగతి) రాష్ట్రస్థాయి ఐదో ర్యాంకు సాధించగా డీ.తారక్ (ఆరో తరగతి) 13వ ర్యాంకు, ఆర్.అనీష్ అభినవ్ (నాలుగో తరగతి) గోల్డ్ మెడల్ సాధించారు. తెలుగు ప్రతిభా పరీక్షలో కే. వకుల్ సత్యకుమార్ (ఐదో తరగతి) 4వ ర్యాంకు సాధించగా పదో తరగతి విద్యార్థినులు ఎస్.లక్ష్మీలహరి 6వ ర్యాంకు, జీ.ఈశ్వరి 9వ ర్యాంకు సాధించారు. ఎస్. నేహా సంజన (ఏడో తరగతి) 14వ ర్యాంకు, యశ్వంత్ (మూడో తరగతి), లక్ష్మీ సృజన (8వ తరగతి) తెలుగులో గోల్డ్ మెడల్ సాధించారు. ఉత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు లిటిల్ చాంప్స్ అకాడమీ సంస్థ మెడల్స్‌తో పాటు నగదు పారితోషికాలు, విద్యాభివృద్ధికి ఉపకరించే పుస్తకాలను అందిచినట్లు వాణి విద్యాలయం కరస్పాండెంట్ ఒగ్గు భగవాన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చి పాఠశాలకు పేరు తీసుకొచ్చిన విద్యార్థులను ఈ సందర్భంగా భగవాన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ గోరంట్ల వంశీకృష్ణ, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
7
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం | ఏప్రిల్ 07, 2024 | www.navatelangana.com

ఫలిస్తున్న పోరాటాలు...

కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఐదు పంచాయతీలు



పదేండ్లుగా ఈ ప్రాంత ప్రజలు చేస్తున్న పోరాటాలు ఫలితాన్ని ఇస్తున్నాయి...విభజనతో మొదలైన భద్రాచలం కష్టాలు పార్లమెంట్ ఎన్నికలలో ప్రచారహస్త్రాలుగా మారనున్నాయి....దేశవ్యాప్తంగా ఐదు పంచాయతీల సమస్య పై చర్చలు జరగనున్నాయి. కాంగ్రెస్ మ్యానిఫెస్టోతో గులాబి కమలం దళాలు ఎరకాటంలో పడనున్నాయి.

రాజకీయ ఎజెండాగా మారనున్న విభజన పంచాయితీ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ఒకప్పుడు అతిపెద్ద నియోజకవర్గం, ప్రకృతి అందాలకు నిలయం, దక్షిణ అయోధ్యగా పిలిచే పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలం నియోజకవర్గం. అటువంటి అందాల మన్యం 2014లో పోలవరం ముంపు ప్రాంత విభజనతో ముక్కలు చెక్కలుగా విడిపోవడంతో మొదలైన భద్రాద్రి ప్రజల కష్టాలు దేశవ్యాప్తంగా చర్చించే అవకాశం కనిపిస్తుంది. విభజనతో భద్రాచలం పట్టణానికి చెత్త వేసుకుండే చోటు కూడా లేక అభివృద్ధి నిలిచిపోవటమే కాక సరిహద్దు సమస్యలతో భద్రాచలం సతమతమవుతున్న విషయం తెలిసిందే. ప్రధానంగా రహదారి సమస్యలతో పాటు రామయ్య భూముల సమస్య సైతం రామాలయ అభివృద్ధిపై ప్రభావం చూపుతుంది. రామయ్య భూములు ఆంధ్రాలో ఉండడం చేత అట్టి భూములు కబ్జాకు గురవుతున్నాయని దేవస్థానం అధికారుల సైతం అనేక మార్లు ఉన్నత అధికారులకు ఫిర్యాదులు చేయటమే కాక రెండు నెలల క్రితం రామయ్య భూములో అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారితో ప్రత్యక్ష పోరాటానికి సైతం దిగిన విషయం తెలిసిందే. భద్రాచలం పట్టణంకు ఒకవైపు గోదావరి మరోవైపు విలీన ఆంధ్ర సరిహద్దు ప్రాంతం కావడంతో పట్టణ విస్తరణ అవకాశం లేక నష్టపోతున్న ఈ ప్రాంత ప్రజలకు కాంగ్రెస్ మ్యానిఫెస్టో రూపంలో ప్రశ్నించే గొంతులకు పోరాట ఆయుధం దక్కింది. గత నెలలో భద్రాచలం పర్యటనకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందానికి సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అఖిలపక్ష పార్టీలు భద్రాచలానికి అనుకొని ఉన్న ఐదు గ్రామ పంచాయతీలను తిరిగి భద్రాచలంలో కలపకపోతే ఈ ప్రాంతం అభివృద్ధి భవిష్యత్తు ప్రశ్నార్ధకంగా మారే పరిస్థితి ఏర్పడుతుందని ఇచ్చిన వినతి పత్ర పై తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ చర్చించింది. రానున్న పార్లమెంట్ ఎన్నికలలో అధికారం చేపడితే ఐదు గ్రామపంచాయతీలను భద్రాచలంలో కల్పిస్తామని హామీని మేనిఫెస్టోలో చేర్చింది. ఈ హామీ రానున్న పార్లమెంట్ ఎన్నికలలో మానుకోట పార్లమెంటు స్థానంపై తీవ్ర ప్రభావం చూపించనున్న నేపథ్యంలో కాంగ్రెస్‌తో పాటు పోటీలో నిలిచే బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కూడా ఐదు పంచాయతీల విషయాని చర్చించక తప్పని పరిస్థితి ఏర్పడింది. మహబూబాద్ పార్లమెంటు పరిధిలోని భద్రాచలం నియోజవర్గ ఓట్లే గెలుపోటమును శాసించే నేపథ్యంలో ఈ ప్రాంత అతి ముఖ్యమైన సమస్య 5 గ్రామపంచాయతీలను భద్రాచలం విలీనం చేయడంతోనే పరిష్కారం అవుతుందని కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ఐదు పంచాయతీల విలీన హామీను చేర్చడంతో ఇటు కమలం పార్టీ, గులాబీ పార్టీ ఇరకాటంలో పడకుండా ఉండాలంటే ఐదు పంచాయతీలపై స్పష్టమైన వైఖరిని చెప్పక తప్పని పరిస్థితి ఏర్పడింది.

మ్యానిఫెస్టో హామీకి కట్టుబడి పని చేయాలి



కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఐదు పంచాయతీలను భద్రాచలంలో కలుపుతామన్న హామీని చేర్చటం అభినందించదగ్గ విషయం. ఈ హామీని ఎన్నికల అనంతరం కార్యరూపం దాల్చే విధంగా అన్ని రాజకీయ పార్టీలు కలుపుకొని కాంగ్రెస్ పార్టీ ముందుకెళ్లాలి. ఈ సమస్యపై గత పది సంవత్సరాలుగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అనేక దఫాలుగా, అనేక రూపాలలో ఇతర పార్టీలను సైతం కలుపుకొని పోరాటాలను నిర్వహించిన ఫలితంగా ఈ సమస్య ప్రస్తుతం రాజకీయ ఎజెండాగా మారింది. ఈ అవకాశాన్ని కాంగ్రెస్ పార్టీ సద్వినియోగం చేసుకొని కేంద్రంలో ఏ ప్రభుత్వం ఏర్పడినా అన్ని పక్షాలను కలుపుకొని ఐదు పంచాయతీలను భద్రాచలం విలీనం చేసేందుకు కృషి చేయాలి. రానున్న పార్లమెంట్ ఎన్నికలలో ఈ అంశాన్ని మ్యానిఫెస్టోలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కూడా చేర్చే విధంగా ఆయా పార్టీల నాయకత్వాన్ని ఒప్పించే బాధ్యత ఆ పార్టీల తరపునుండి పోటీ చేసే పార్లమెంట్ అభ్యర్థులపైనే ఉంది. లేనిపక్షంలో ఆ రెండు రాజకీయ పార్టీలకు ఈ ప్రాంతాల్లో ఓట్లు అడిగే నైతిక హక్కు కూడా ఉండదు.

- సీపీఐ(ఎం) నియోజవర్గ కన్వీనర్ మచ్చ వెంకటేశ్వర్లు

భద్రాచలం అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది



బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలే ముంపు పేరుతో ఐదు పంచాయతీలను ఆంధ్రలో కలిపి ఈ ప్రాంతానికి ద్రోహం చేశారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన వెంటనే ఐదు పంచాయతీలు తిరిగి భద్రాచలంలో విలీనం చేస్తాం. భద్రాచల నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉన్నదన్న విషయం కాంగ్రెస్ మ్యానిఫెస్టోతో మరోసారి రుజువైంది. రానున్న పార్లమెంటు ఎన్నికలలో పోరిక బలరాం నాయక్ గెలిచిన వెంటనే పార్లమెంటులో ఐదు పంచాయతీలను భద్రాచలంలో కలిపేదుకు కృషి చేస్తారు. కరకట్ట రిటర్నింగ్ వాల్‌కి కూడా రేవంత్ రెడ్డి సర్కార్ రూ.1000 కోట్లను కేటాయించింది. మాస్టర్ ప్లాన్ సిద్ధం కాగానే రామాలయ అభివృద్ధికి కూడా నిధులు కేటాయించేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉంది.

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భోగాల శ్రీనివాస్ రెడ్డి

అంగన్వాడీల రిటైర్మెంట్‌కు రూ.5 లక్షలు ఇవ్వాలి

- సమ్మె కాలం హామీలు అమలు చేయాలి
- అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.పద్మ
- జాయింట్ కలెక్టర్‌కు మెమోరాండం అందజేత

నవతెలంగాణ-పాల్వంచ

అంగన్వాడీలకు రిటైర్మెంట్‌కు మెరుగైన సౌకర్యం రూ.5 లక్షలు ఇవ్వాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జి.పద్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్‌ను కలసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా అంగన్వాడీలు చాలీచాలని జీతాలతో అనేక ఇబ్బందులు పడుతూ సెంటర్ పిల్లలను తల్లులను తీర్చిదిద్దడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్న అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ రిటైర్మెంట్ సమయంలోనైనా మెరుగైనటువంటి రిటైర్మెంట్ సౌకర్యం కల్పించకుండా కేవలం టీచర్స్‌కు లక్ష, హెల్పర్స్‌కు రూ.50 వేలు ఇస్తానని మెమో విడుదల చేయటం చాలా అన్యాయమని అన్నారు. ఐదు సంవత్సరాలు పాలనలో ఉండి దిగిపోయినటువంటి ప్రజా ప్రతినిధులకు లక్షల్లో పెన్షన్లు ఇస్తున్న ప్రభుత్వం 40 సంవత్సరాలుగా పనిచేస్తున్న అంగన్వాడీలకు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. రిటైర్మెంట్‌గా టీచర్స్‌కు ఐదు లక్షలు హెల్పర్స్ రూ.2.5000వేలు ఇవ్వాలని, ప్రతి నెల వస్తున్న జీవితంలో సగం పెన్షన్ లేనిపక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని అన్నారు. అంగన్వాడీలు 24 రోజుల సమ్మె కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం టీచర్స్‌కు రూ.2 లక్షలు, హెల్పర్స్‌కు రూ.లక్ష ఆసరా పెన్షన్ కాకుండా అదనంగా పెన్షన్ ఇస్తానని హామీ ఇచ్చారన్నారు. కానీ కాంగ్రెస్ గవర్నమెంట్ వచ్చాక ఆ సమ్మె కాలం హామీలు కూడా అమలు చేయకపోవడం సరైనది కాదని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ టీచర్లు వ్యతిరేకించిన పాత జీవో ఉత్తర్వులను మళ్ళీ ముందుకు తెచ్చి అమలు చేయడం బాధాకరమన్నారు. ఎప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినటువంటి మెమో ఉపసంహరిస్తూ మెరుగైనటువంటి రిటైర్మెంట్ సౌకర్యం కల్పిస్తూ జీవో ఇవ్వాలని అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కే.సత్య, జిల్లా సహాయ కార్యదర్శి డి.వీరన్న, ఉపాధ్యక్షులు దొడ్డ రవికుమార్, అంగన్వాడీ జిల్లా ఉపాధ్యక్షులు కళావతి, నాయకులు అచ్చమ్మ, రమ్య, భాను, తదితరులు పాల్గొన్నారు.



రైతుల చేలు ఎండి, ప్రజల గొంతెండుతోంది

- మీకు క్రికెట్ ముఖ్యమా రేవంత్ రెడ్డి..
- మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

నవతెలంగాణ-అశ్వారావుపేట

ఆరుగాలం కష్టించి రైతులు సాగు చేస్తున్న పంటలు ఎండిపోతుంటే నీవు మాత్రం క్రికెట్ చూస్తూ ఎంజాయ్ చేస్తావా...! అంటూ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సీఎం రేవంత్ రెడ్డి పై ధ్వజమెత్తారు. మండుటెండలో మాజీ సీఎం కేసీఆర్ మాత్రం ఎండిన పంటలను సందర్శిస్తూ రైతులకు మనో ధైర్యం కల్పిస్తున్నారని, ఆయన ప్రజా నాయకుడని ఉదాహరించారు. రైతు సమస్యలపై స్థానిక కార్యాలయ ప్రాంగణంలో బీఆర్ఎస్ అదిష్టానం పిలుపుకు శనివారం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'మెచ్చా' మాట్లాడుతూ ఆచరణ సాధ్యం కాని హామీలతో మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజా పాలనను విస్మరిస్తుందని ఆరోపించారు. ఎండిన పంటలకు పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేసారు. ఎకరాకు రూ.25 వేలు పరిహారం అందించాలని, వరికి రూ.500 బోనస్ చెల్లించి, సాగర్ జలాలతో ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత పదేళ్ళ బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో తిరిగి 2014కు ముందు పరిస్థితులు దాపురించాయని ఆవేదన వ్యక్తం చేశారు.

అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ పి.కృష్ణ ప్రసాద్‌కు అందజేశారు. ఇందుకు స్పందించిన తహశీల్దార్ సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, వైఎస్ ఎంపీపీ చిట్లూరి ఫణీంద్ర, బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి ప్రకాశరావు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు సంక ప్రసాద్, నాయకులు జెకేవీ రమణారావు, మందపాటి రాజ మోహన్ రెడ్డి, సత్యవరుపు సంపూర్ణ, వెంకన్న బాబు, నారం రాజశేఖర్, దారా యుగంధర్, యార్లగడ్డ బాబు అబ్దుల్ జిన్నా, చిప్పనపల్లి బజారియ్య, చరణ్, బుచ్చిబాబు, నక్కా రాంబాబు, జుజ్జూరపు శ్రీరామ్మూర్తి, లక్ష్మయ్య, తాళం సూరిబాబు పాల్గొన్నారు.



భద్రాచలం రూరల్ : బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కేసీఆర్ పిలుపుమేరకు రాష్ట్రంలో రైతాంగ ఎదుర్కొంటున్న సమస్యలపై ఎండిపోతున్న పంట పొలాల రైతుల ఆవేదనపై రైతులకు ఇచ్చిన హామీలు అమలు కోసం బీఆర్ఎస్ పార్టీ భద్రాచలం నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్లో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం రెవిన్యూ డివిజన్ అధికారి దామోదర్ రావుకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ, గొడవర్తి నరసింహమూర్తి, తాంద్ర వెంకట రమణారావు, వాసు రాజులు మాట్లాడారు. రాష్ట్రంలో రైతులకు ప్రజలకు అమలు గాని హామీలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచుతుందన్నారు. కేవలం గత ప్రభుత్వం మీద బురదజల్లే ప్రయత్నంలో భాగంగానే మేడిగడ్డ ప్రాజెక్టు వ్యవహారం చూపించి రైతులకు నీరు వదలకుండా కక్షపూరితంగా పంట పొలాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎండబెట్టిందన్నారు. రైతుల ఉసురు కాంగ్రెస్‌కి తప్పకుండా తగులుతుందని అన్నారు. ఎకరానికి రూ.25 వేల నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ వెంకటాపురం మండల అధ్యక్షులు గంప రాంబాబు, పిల్లారి శెట్టి మురళి, డర్రా దామోదర్, సత్యనారాయణ, దుమ్ముగూడెం మండల అధ్యక్షులు అన్నే సత్యాలు, ఎంపీపీ రేసు లక్ష్మి, చర్ల మండలం నాయకులు దొడ్డి తాతారావు, అజీజ్ రాము, తదితరులు ఉన్నారు.



అంబేద్కర్ పార్క్ అభివృద్ధికి సింగరేణి యోచన

- రామవరం అంబేద్కర్ పార్క్‌ను సందర్శించిన ఏజీఎం

నవతెలంగాణ-కొత్తగూడెం

రామవరం ఏరియాలోని అంబేద్కర్ పార్క్‌లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) కొత్తగూడెం బ్రాంచ్ కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్, పార్క్ నిర్మాణ కమిటీ సభ్యులు తొగరు రాజశేఖర్ సింగరేణి యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తి మేరకు కొత్తగూడెం ఏరియా ఏజీఎం సివిల్ రామకృష్ణ శనివారం రామవరం అంబేద్కర్ పార్క్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పార్క్‌లో పలుసమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించి అభివృద్ధి చేయాలని, రామవరం నడిబొడ్డున ఉన్న అంబేద్కర్ పార్కులో సందర్శకులు పెరిగారని, ప్రజలు వాకింగ్ చేయడానికి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు, యువతకు ఉపయోగ పడేవిధంగా ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని ఏజీఎంను కోరారు. పార్క్‌ను సందర్శించిన సింగరేణి ఏజీఎం మాట్లాడుతూ వాకింగ్ ట్రాక్ మరమ్మతులు చేపడతామని, ఓపెన్ జిమ్, చిన్నపిల్లలకు సంబంధించిన ఆటల ఇన్‌స్టుమెంట్ నిర్మాణం చేయుటకు కోసం వెల్ఫేర్ అధికారులతో తెలుపుతామని, సెక్యూరిటీకి, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్‌కు సంబంధించి తమ అధికారులతో మాట్లాడతామని తెలిపారు. ఈ పార్కును సింగరేణి వెల్ఫేర్ నిధులతో ఆధునికరణంగా అభివృద్ధి చేయుటకు తమ వంతు కృషి చేస్తామని ఏజీఎం సివిల్ రామకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం రాజారాం, సూపర్‌వైజర్ మర్రి శ్రీనివాస్, ఏరియా వాసులు సుధాకర్ రెడ్డి, పద్మారావు, మున్నా బేగం, సందీప్ రాజేశ్వరరావు, లక్ష్మణ్, హసీనా తదితరులు పాల్గొన్నారు.



21న కర్ణాటక సంగీత కళాకారుల స్వరార్చన

- ఆహ్వాన పత్రికను విడుదల చేసిన ఈఓ ఎల్.రమాదేవి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ట్రూ టాలెంట్ సింగర్స్ గ్రూప్, భద్రాద్రి మెలోడీ సింగర్స్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 21వ తారీఖున భద్రాచలం పట్టణంలో కర్ణాటక శాస్త్రీయ సంగీతం పోటీలను నిర్వహిస్తున్నామని కన్వీనర్ బెల్లంకొండ దుర్గా కోమలి కోకన్వీనర్ మూర్తి తెలియజేశారు. శనివారం కార్యక్రమనిర్వహణ ప్రచార బ్రోచర్‌ని దేవస్థానం ఆలయ ఈఓ ఎల్.రమాదేవి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దుర్గా కోమలి మాట్లాడుతూ మహా బిలం మఠంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో కళాకారులు పాల్గొన్నారు. గెలుపొందిన విజేతలకు నగదు ప్రోత్సాహంతో పాటు ప్రశంసా పత్రాలను ఆలయ ఈవో రమాదేవి చేతుల మీదుగా అందిస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా కళాకారులకు వసతితో పాటు భోజన సదుపాయాన్ని కల్పిస్తున్నట్టుగా ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి గౌరవ అధ్యక్షులు డాక్టర్ గోల్ల భూపతి రావు పాల్గొన్నారు.



నూతన వధూవరులను ఆశీర్వదించిన నాయకులు

నవతెలంగాణ-జూలూరుపాడు

మండలంలోని గంగారం తండా గ్రామంలో గుగులోతు రాములు నాయక్ కుమారుడు వినోద్ కుమార్-సుప్రియ, గాంధీ నగరంలో పిరేసు-ఝాన్సీ వివాహ వేడుకల రిసెప్షన్ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, మండల సొసైటీ పీఏసీఎస్ ఛైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వెంగన్నపాలెం ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూదన్ రావు, ధరావత్ రాంబాబు, సాయిల కృష్ణయ్య, మల్లెల నాగేశ్వరావు, చంటి, బాలాజీ, సామ్య, బాలు, మంగీలాల్, ధర్మ, రవీందర్, కళ్యాణ్, రాములు, గ్రామస్తులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక చేయూత

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

మండల పరిధిలోని నడిమిగూడెం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబ యజమాని కొమరం కాంతారావు ఇటీవల కాలంలో మృతిచెందిన విషయం విదితమే. దానికి గాను పొరుగు మండలం గుండాలలోని యాపలగడ్డ గ్రామానికి చెందిన సివిల్ విద్యార్థి పాయం సుధాకర్ శనివారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, రూ.2 వేల ఇతోధిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చంద్రం, నరసింహారావు, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు రూ.600 ఇవ్వాలి

- పని ప్రదేశంలో వసతులు లేక కూలీల అవస్థలు
- పనులు పరిశీలనలో వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి

ఉపాధి హామీ కూలీలకు రోజు వారి కూలీ రూ.600 ఇవ్వాలని, గత సంవత్సర పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శనివారం బావోజీ తండ గ్రామంలో సోమ్లాకుంట వద్ద జరుగుతున్న ఉపాధి పనులను వ్యకాస మండల కమిటీ ఆధ్వర్యంలో పరిశీలించి, ఉపాధి కూలీల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం చేసిన ఉపాధి పని బిల్లులు నేటికీ చెల్లించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు లేవని అన్నారు. మెడికల్, టెంట్లు, మంచినీరు, పిల్లలను చూసే ఆయా వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాద భరితమైన చెరువులు, కుంటల వద్ద పనులు జరుగుతున్నాయని చెప్పారు. ప్రమాద బీమా సౌకర్యం రూ.5 లక్షలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకన్న, సుధీర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ అధికారంలోకి రాకుండా అడ్డగిస్తాం



- తెలంగాణ బహుజన ఐక్యవేదిక

నవతెలంగాణ-పాల్వంచ

కేంద్రంలో హిందూ ధర్మం పేరుతో బీజేపీ పార్టీ మరల అధికారంలోకి రావాలని ప్రయత్నాన్ని అడ్డగిస్తామని తెలంగాణ బహుజన ఐక్యవేదిక కన్వీనర్ బరగడి విధానం, సభ్యులు చిటికెన ముసలయ్య, నబి సాయబ్లు హెచ్చరించారు. శనివారం ఐక్యవేదిక కార్యాలయంలో అధ్యక్షులు శ్రీ పద సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ బీజేపీ కులమతాలను రెచ్చగొట్టి ప్రజల్లో కక్షలును పెంచి మణిపూర్ సంఘటనలు జరుగుటకు కారకులు అయ్యారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన కర్మాగారాలను, విమానాశ్రయాలను, ఓడరేవులను కార్పొరేటర్లకు అమ్మి ప్రజలను అతి పేదవాడిగా మార్చుటకు కారణమయ్యారని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వంలో బహుజనులకు ఉపాధి లేక నానా అవసరం ఎదుర్కొంటున్నారని, జనాభాల 90శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలు 85% హిందువులే అని ఈ హిందువుల ఓట్లను వేయించుకునే అధికారంలోకి వచ్చిన బీజేపీ వీరికి మేలు చేయలేదని అన్నారు. ధర్మం, సనాతన ధర్మం పేరుతో వీరి బతుకులను చిద్రం చేశారని వాపోయారు. ఈ పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌ని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాయల భాస్కర్, దుర్గారావు, మంజూర్, ముర్తుజా తదితరులు పాల్గొన్నారు.

సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు తప్పనిసరి

నవతెలంగాణ-పినపాక

జీరో నుండి 40 సంవత్సరాల లోపు వారందరూ సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏఎన్ఎం మధులత సూచించారు. శనివారం పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ దుర్గాభవాని ఆదేశాలతో పినపాక మండలం బోటుగూడెం, గాండ్ల బయ్యారం గ్రామాలలో సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం మధులత మాట్లాడుతూ సికిల్ సెల్ అనీమియా అనేది వైవిధ్యమైన హిమోగ్లోబిన్, ప్రొటీన్‌ల వల్ల కలుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో తాజాగా ప్రవేశపెట్టిన 2023-24 బడ్జెట్‌లో సికిల్ సెల్ ఎనీమియాను సంపూర్ణంగా తుడిచిపెట్టేందుకు కార్యాచరణ ప్రకటించిందన్నారు. ఈ వ్యాధి మరో పాతికేళ్లలో కనుమరుగు కావడం లక్ష్యంతో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నామని తెలిపారు. ఈ వ్యాధి మేనరికాల వల్ల అధిక శాతం వ్యాపిస్తుందని తెలిపారు. ఇది ఎర్రగడ్డ కణాల జీవిత కాలాన్ని తగ్గిస్తుందని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సుశీల, ఆశా కార్యకర్త జమున, అంగన్వాడి టీచర్ సావిత్రి, పాల్గొన్నారు.



మతోన్మాద బీజేపీని ఓడించాలి

- సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కే.సాబీర్ పాషా

నవతెలంగాణ-మణుగూరు

దేశంలో మతోన్మాద బీజేపీ పార్టీని ఓడించి, లౌకికవాద ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పాటుపడే పార్టీని, జరగబోయే పార్లమెంటు నియోజకవర్గం ఎంపీ ఎన్నికల్లో గెలిపించుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషా పిలుపునిచ్చారు. శనివారం మణుగూరు సీపీఐ పార్టీ కార్యాలయంలో సరెడ్డి పుల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చినటువంటి హామీలు అమలు జరుగుతున్నప్పటికీ కావాలని ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని, కేంద్రంలో బీజేపీని ఓడించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని, దీనికోసం వామపక్ష లౌకిక తంత్ర ప్రజా పార్టీలన్నీ ఏకం కావాలని వారు పిలుపునిచ్చారు. జిల్లా కార్యవర్గ సమావేశంలో నరాటి ప్రసాద్, ముత్యాల విశ్వనాథం, సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీకుమారి, కల్లూరి వెంకటేశ్వరరావు, కమటం వెంకన్న, దేవరకొండశంకర్ పాల్గొన్నారు.



అనుబోసు కళాశాలలో ప్రాంగణ నియామకాలు

నవతెలంగాణ-పాల్వంచ

స్థానిక అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రాంగణ నియమకాలు జరిగాయి. ప్రముఖ హైదరాబాద్‌కు చెందిన ఎలక్ట్రిక్ అండ్ ఎలక్ట్రానిక్ సంస్థలు ప్రీమియర్ ఎనర్జీస్ ప్రయివేట్ లిమిటెడ్ వాలి ఎంటర్ప్రైజెస్, ప్రయివేట్ లిమిటెడ్ ఓరియంట్ ఎలక్ట్రానిక్స్ గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైన్ జూనియర్ టెక్నీషియన్ నియామకం కోసం ఇంజనీరింగ్ డిప్లమా చివరి సంవత్సరం చదువుతున్న ఈసీఈ, ఈఈఈ, సివిల్ మెకానికల్ విద్యార్థులకు శనివారం కళాశాలలో పాల్గొన నియామకాల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ నియామకాలను నిర్వహించుటకు సంస్థ నుండి ఎం.రవీందర్, హెచ్ ఆర్ మేనేజర్ బృందం విద్యార్థులకు రాత పరీక్ష ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహించి, కళాశాలకు చెందిన దాదాపు 70 మందిని ఉద్యోగులకు అర్హత కలిగించారు. వారికి రెండు లక్షల 50 వేలు సంవత్సరాల జీతభత్యాలు ఉండనున్నాయి. ఈ సందర్భంగా కళాశాల చైర్మెన్ డాక్టర్ టి.భరత్‌కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు అంది వచ్చిన సువర్ణ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు వివిధ రంగాల్లో రాణించాలని, తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి.ఆవని, ప్లేస్మెంట్ ఆఫీసర్ ఉమ్మడి క్రాంతి కుమార్, వివిధ విభాగ్యపతులు, విద్యార్థుల తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ-టేకులపల్లి



మండలంలోని బొమ్మనపల్లి, సంపత్ నగర్ గ్రామాలలో సేర్పు ఐకేపీ ద్వారా యాసంగి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీడీవో రవీంద్రరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవికాలంలో రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మండలంలోని రైతులకు అందుబాటులో ఉండేందుకు ప్రారంభించామని దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం క్వింటాలు ఏ-గ్రేడ్ రకం ధాన్యానికి రూ.2,203, బీ- గ్రేడ్ రకానికి రూ.2,183 అందజేస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రంలో ఉన్నటువంటి ప్యాడి క్లీనర్ ద్వారా శుభ్రపరిచిన తర్వాత మాత్రమే కొనుగోలు కేంద్రం వారు జారీ చేసిన గన్ని బ్యాగులో మాత్రమే ధాన్యాన్ని నింపి కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి అన్నపూర్ణ, ఏపీఎం రవికుమార్, ఆర్ఐ వెంకటేశ్వర్లు, ఏఈఓ రెహనా, సీసీ నరేష్, సావిత్రి, వీవోఏలు రోజా, సుజాత కమిటీ సభ్యులు భవాని తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రానికి సీలింగ్ ఫ్యాన్‌లు వితరణ

నవతెలంగాణ-పినపాక



మండల పరిధిలోని తోగ్గూడెం గ్రామపంచాయతీలో గల ఆరోగ్య ఉపకేంద్రంకు ఎంపీటీసీ సత్యం రెండు ఫ్యాన్లను శనివారం అందించారు. ఆరోగ్య ఉప కేంద్రంలో వేసవిలో సేవలందిస్తున్న వైద్య సిబ్బంది, ఆసుపత్రికి వచ్చే రోగులు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న ఎంపీటీసీ స్పందించి, ఈ వితరణ అందజేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ హెచ్ పి.డాక్టర్ పవన్ వర్మ, ఏఎన్ఎం అరుణ, ఆశాలు చంద్రకళ, సరోజినీ, వరలక్ష్మి, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రజక సహకార సంఘాలు
ప్రతి గ్రామంలో నెలకొల్పాలు

నవతెలంగాణ -చర్ల

తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో రజక సహకార సంఘాలపైన అవగాహన సదస్సు రేగళ్ల సుధాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షులు ముదిగొండ రాంబాబు చిటికెన ముసలయ్య మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల మందికి పైగా రజక వృత్తి పై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా తీవ్ర వెనుకబడి ఉన్నారని కొత్తగా ఏర్పడ్డ రేవంత్ రెడ్డి ప్రభుత్వం రజకులు ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. రజకుల భూములకు పట్టాలిచ్చి కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు.

జాతర ప్రారంభం

- మహాలక్ష్మి అమ్మవారు అవతారం లో ముత్యాలమ్మ దేవత

నవతెలంగాణ - అశ్వారావుపేట

మండలంలోని మూడో మేజర్ పంచాయితీ అయిన వినాయకపురంలో చిలుకలు గండి ముత్యాలమ్మ జాతర వేద మంత్రోచ్చారణల నడుమ భక్తిప్రపత్తులతో శనివారం దేవాలయం నిర్వాహకులు ప్రారంభించారు. 5 రోజులపాటు నిర్వహించే ఈ జాతర మహోత్సవానికి జిల్లా లోని అనేక మండలాలతో పాటు, సరిహద్దు రాష్ట్రం అయిన ఆంధ్రప్రదేశ్ లోని సరిహద్దు మండలాల నుండి భక్తులు అధిక సంఖ్యలో దైవాన్ని దర్శించుకుంటారు. మొదటి రోజైన శనివారం తహశీల్దార్ క్రిష్ణ ప్రసాద్ సందర్శించి పూజాది కార్యక్రమాలలో పాల్గొన్నారు.సీఐ జితేందర్ రెడ్డి, ఎస్.హెచ్.ఓ ఎస్.ఐ శ్రీరాముల శ్రీను,అదనపు ఎస్.ఐ శివరామ్ క్రిష్ణ లు బందోబస్తు ను పర్యవేక్షించారు.

విజయ్ వర్మను సత్కరించిన సింగపూర్ నాలెడ్జి హబ్

నవతెలంగాణ-దుమ్ముగూడెం



సినీ దర్శక నిర్మాత, నటులు ఫిలిం అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ అఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి దుమ్ముగూడెం మండలం చెరుపల్లి గ్రామానికి చెందిన విజయ్ వర్మ పాకలపాటి నేతృత్వంలో సినీ ప్రతినిధుల బృందం శ్రీలంక రాజధానిలో జరిగిన ఇండో సింగపూర్ ఫిలిం అండ్ టూరిజం ఎక్స్చేంజి అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సినీ సాంకేతిక, సమన్వయ, ప్రచార ఉభయోపరి సహకారంతో పాటు పర్యాటక అభివృద్ధిని కాంక్షిస్తూ చేపట్టిన ఈ కార్యక్రమంలో విజయ్ వర్మ మాట్లాడుతూ ఆర్థికంగా, నిష్పక్షపాత, అవినీతి రహితంగా ఉన్నత స్థానంలో వున్న సింగపూర్‌కి చెందిన ప్రొడక్షన్ హౌసెస్‌తో మన చిత్ర నిర్మాణ సంస్థల భాగస్వామ్యం మన చిత్రాల పరిధి మరింతగా పెరిగేందుకు దోహదపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా సింగపూర్ నాలెడ్జి హబ్ ప్రతినిధులు అడ్రియన్ ఓయ్, షియోబాన్ ఇసోబెల్, నరేన్ ఆర్‌లు విజయ్ వర్మని సత్కరించి ఇటువంటి మంచి కార్యక్రమాలు తరచుగా నిర్వహించాలని కోరారు.

భద్రాద్రిపై భానుడి పగ...భగ



ఘోషిస్తున్న గోదావరి

ఘోషిస్తున్న గోదారమ్మ

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు తప్పనిసరి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం పై భానుడు పగ పట్టినట్టు భగభగ మండుతున్నాడు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏప్రిల్ మొదటిలోనే రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఇప్పటికే భద్రాచలంలో 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా నేడు, రేపు అవి మరింత పెరిగి వడగలుపులు సైతం తీవ్రంగా వీచే అవకాశం ఉందని వాతావరణ అధికారులు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా ఏప్రిల్ నెల చివరిలో మే నెలలో వచ్చే వడగలుపులు ఈ సంవత్సరం నెలరోజులు ముందుగానే ప్రజలను భయపెట్టిస్తున్నాయి. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు పూర్తయినప్పటికీ నర్సరీ నుండి తొమ్మిదవ తరగతి వరకు ఇంకా పాఠశాలలు కొనసాగుతున్న నేపథ్యంలో ఎండల తీవ్రతతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సంవత్సరం వర్షపాతం కూడా తక్కువగా నమోదు కావడంతో ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. గోదావరి నీళ్ల సైతం రికార్డ్ స్థాయిలో తగ్గిపోయి గోదారమ్మ ఘోషతో రానున్న రోజులలో మంచినీటి కొరత సైతం ఉత్పన్నమయ్యే అవకాశాలు స్పష్టంగా కనబడుతున్నాయి. ఏప్రిల్ మొదటి వారంలోనే గోదారిలో నీళ్ల ఈ స్థాయిలో తగ్గిపోతే మే నెలలో తాగునీటి పై సమస్య తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. పెరుగుతున్న ఎండలకు తోడు వడగాకులు వీల్చడంతో చిన్నపిల్లలు, వృద్ధులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

పిల్లల విషయంలో తల్లితండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి



సాధారణంగా ఎండల ప్రభావం పిల్లలు, వృద్ధులపైనే ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. ఈ సంవత్సరం వేసవి తాపం తీవ్రంగా ఉన్న నేపథ్యంలో పిల్లల విషయంలో తల్లితండ్రులకు జాగ్రత్తలు తీసుకోవాలి. చిన్నపిల్లలు వీలైనంతవరకు ఎండ సమయంలో బయటికి రాకపోవటమే మంచిది. తప్పనిసరి రావాల్సి వచ్చిన తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రధానంగా వేసవి కాలంలో పిల్లలు మంచినీళ్లను ఎక్కువగా తీసుకోవాలని, అంతేకాకుండా అవకాశం ఉన్న మేరకు కొబ్బరి నీళ్లతో పాటు ఓఆర్ఎస్ వంటి ద్రవపదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి. జంక్ ఫుడ్, మసాలా ఫుడ్లు ఈ వేసవిలో పిల్లలు ఎట్టి పరిస్థితిలో తీసుకోకుండా తల్లితండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండల తీవ్రత అధికంగా పిల్లలపై వృద్ధులపైనే పడే అవకాశం ఉన్న నేపథ్యంలో వడదెబ్బ తలిగిన పిల్లలను వీలైనంత ఎక్కువ చల్లని ప్రదేశంలో ఉంచాలి. వడదెబ్బ తీవ్రత అధికంగా ఉంటే డాక్టర్ పర్యవేక్షణ వైద్యం తీసుకోవాలి. పిల్లలకు తలనొప్పి, వాంతులు, నీరసం, జ్వరం, విరోచనాలు వంటి లక్షణాలు కనబడితే వెంటనే వైద్యుని సంప్రదించాలి. డాక్టర్ సలహాలు లేకుండా ఎటు వంటి సొంత వైద్యాలు చేయకుండా ఉంటేనే మంచిది.

- డాక్టర్ కాపుల రవికుమార్ చిన్నపిల్లల వైద్య నిపుణులు, రేవతి నర్సింగ్ హోమ్ భద్రాచలం

ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు

- ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి
- స్వీప్ కార్యక్రమంలో భాగంగా రంగోలి కార్యక్రమం

నవతెలంగాణ-అశ్వారావుపేట

సమర్థ పాలకులను ఎన్నుకోవడానికి రాజ్యాంగం పౌరులకు ఓటు హక్కు కల్పించిందని, అటువంటి ఓటును నిర్లక్ష్యం చెయ్యొద్దని తహశీల్దార్ పి.కృష్ణ ప్రసాద్, ఎంపీడీవో జి.శ్రీనివాసరావులు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఐసీడీఎస్, సెర్ప్ ఆధ్వర్యంలో ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ 18 ఏళ్ళు నిండిన యువతులు, మహిళలకు ఓటు వినియోగంపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గులు, మెహందీ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఓటు హక్కు పొందటంలో యువత వెనుక బడి పోతుందని, రాజకీయాలు, ప్రజా ప్రభుత్వం ఎంపికలో యువత పాత్ర అత్యంత కీలకమని, దీనిని గుర్తించి యువత హక్కును పొందటమే కాకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాలకులను ఎన్నుకోవడంలో సామాన్యుడి చేతిలో ఓటు హక్కు వజ్రాయుధంగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో రోజా రాణి, సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, సెర్ప్ సీసీలు పాల్గొన్నారు.

పాల్వంచ రూరల్ : ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. శనివారం మండల పరిధిలోని జూనియర్ కళాశాల ప్రాంగణం నందు మహిళా శిశు సంక్షేమ శాఖ, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు



అందజేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ రేవతి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీఆర్డిఏ ఏపీఎం సుభాష్ చంద్రబోస్, పాల్వంచ ఏపీఎం ఎస్.రాంబాబు సీసీలు శ్రీను, రవికుమార్, పద్మావతి, అంగన్వాడీ సూపర్వైజర్ వసంత, అనసూయ, రత్నకుమారి, శారద, కవిత అంగన్వాడీ టీచర్స్, వీఓఏలు పాల్గొన్నారు.

పినపాక : ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, అప్పుడు మాత్రమే నిజమైన ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకున్న వాళ్ళం అవుతామని ఎంపీడీవో రామకృష్ణ, తహసీల్దార్ తోట సూర్యనారాయణ తెలియజేశారు. శనివారం పినపాక ఎంపీడీఓ కార్యాలయం వద్ద స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఐసీడీసీ, ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన రంగోలి కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐసీడీసీ డీపీఓ జయలక్ష్మి, ఐకేపీ ఏపీఎం జ్యోతి, ఐసీడీసీ సూపర్వైజర్ సత్యవతి, అంగన్వాడీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.

టేకులపల్లి : రానున్న పార్లమెంటు ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఉద్దేశంతో భారత ఎన్నికల సంఘం పిలుపుమేరకు కలెక్టర్ ఆదేశాల ప్రకారం మండలంలోని వాడవాడలో మహిళా సమాఖ్య సభ్యులు, అంగన్ వాడీ టీచర్ల సమన్వయంతో రంగోలి ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రవికుమార్, ఎంపీడీవో జి.రవీంద్రరావు, మండల పంచాయతీ అధికారి గాంధీ, సర్ప్ సిబ్బంది, ఐసీడీఎస్ సీడీపీఓ తార, టీచర్లు, వీవోఏలు, గ్రామ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆళ్ళపల్లి : ప్రజాస్వామ్యంలో ఓటు అతిబలమైన ఆయుధమని, దేశంలో మనం వేసే ఓటు మన భవిష్యత్తుని ప్రభావితం చేస్తుందని స్థానిక అంగన్వాడీ సూపర్వైజర్ కె.విజయకుమారి, ఐకేపీ ఏపీఎం కె.రాంకుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంతో పాటు మర్కోడు గ్రామంలో ఐసీడీఎస్, సెర్ప్(ఐకేపీ) ఉద్యోగుల ఆధ్వర్యంలో దేశంలో రానున్న రోజుల్లో జరిగే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. అందులో భాగంగా తహసీల్దార్ ఆవరణలో జాతీయతా భావాన్ని, ఓటు ప్రాముఖ్యతను సూచిస్తూ త్రివర్ణం ముగ్గులు వేశారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీఓ బత్తిన శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్‌లు సోయం రామయ్య, తాటి బుల్లిబాబు, పంచాయతీ కార్యదర్శులు రమేష్, నాగరాజు, అంగన్వాడీ టీచర్లు సుజాత, మమత, జయశ్రీ, బుచ్చమ్మ, రమణ, విమల, లత, బాయమ్మ, రజిత, ఐకేపీ ఉద్యోగులు వి.జయశ్రీ, సుభద్ర, తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు ఓటు ప్రతి ఒక్కరి హక్కుగా బాధ్యత తీసుకొని వినియోగించుకోవాలని మండల అభివృద్ధి అధికారి జమలా రెడ్డి అన్నారు. శనివారం మోరంపల్లి బంజర, బస్టాండ్ ప్రాంతంలో బూర్గంపాడు గ్రామపంచాయతీ పరిధిలో ప్రధాన కూడలి నందు ఓటు ప్రాముఖ్యత కోసం సెల్ఫీ పాయింటును ఏర్పాటు చేశారు. ఈ సెల్ఫీ పాయింట్‌లు మే 13 వరకు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో సమ్మయ్య, మోరంపల్లి బంజర పంచాయతీ కార్యదర్శి భవాని, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రేరణ ఉత్సవం విజేతలకు బహుమతులు

నవతెలంగాణ-మణుగూరు

ప్రేరణ ఉత్సవ విజేతలకు బహుమతులు అందజేసినట్టు మండల కార్యదర్శి వీరా హుస్సేన్ తెలిపారు. శనివారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల మణుగూరు నందు ప్రేరణ ఉత్సవంలో భాగంగా 'వికసిప్ భారత్, సమాజం, దేశం కోసం నా వంతు కృషి అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో మొదటి స్థానం ఉడిముడి లిఖిత 9వ తరగతి, రెండవ స్థానం జి.శృతి 9వ తరగతి సాధించారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థినీలకు ఆంగ్ల ఉపాధ్యాయులు డాక్టర్ షేక్ మీరా హుస్సేన్ సౌజన్యంతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.స్వర్ణ జ్యోతి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు జిల్లా స్థాయిలో కూడా విజయం సాధించాలని ఆకాంక్షించారు. మహనీయుల నుండి విద్యార్థులు స్ఫూర్తి పొంది జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. విద్యార్థులకు బహుమతులను అందించి, విద్యార్థులను పోటీలకు ప్రోత్సహిస్తున్న, ఆంగ్ల ఉపాధ్యాయులు షేక్ మీరా హుస్సేన్‌ను అభినందించారు. ఇలాంటి పోటీల వలన విద్యార్థులలో ప్రేరణ కలుగుతుందని అది విజయానికి సోపానంలా పనిచేస్తుందని అన్నారు. విద్యార్థులు చిన్నతనం నుండే దేశభక్తి అలవర్చుకుని నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశం ఎప్పుడు మనకేం ఇచ్చింది అని కాకుండా దేశం కోసం మనమేం ఇస్తామో కూడా తెలుసుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సావిత్రి, షేక్ మీరా హుస్సేన్, ధనలక్ష్మి, కల్పనా దేవి, జ్యోతి, విద్యార్థినీలు పాల్గొన్నారు.

చిన్ననాటి నుండే పిల్లలకు మానవతా విలువలు నేర్పాలి

నవతెలంగాణ-కొత్తగూడెం

సాటివారి పట్ల ప్రేమానురాగాలు ఆప్యాయత అనురాగాలు కలిగి మంచి మానవతా వాదులుగా జీవించేలా పిల్లలకు శిక్షణ గరపడం ఎంతో అవసరం అని జమాతే ఇస్లామి హింద్ మహిళా విభాగం అధ్యక్షురాలు ఫాతిమా అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా రుద్రం పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మస్జిద్ ఎ ఖుబా లైబ్రరీలో జరిగిన చిన్న పిల్లల ఇఫ్తార్ విందులో ఆమె పాల్గొని మాట్లాడుతూ... నేటి బాలలే రేపటి భావి పౌరులన్నారు. ఈ కార్యక్రమంలో జమాత్ సభ్యులు షమీమ్ పర్వీన్, పర్వీన్ బాను, షాహీన్, షహేనాజ్, పర్వీన్ సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

జేపీఆర్ ఆధ్వర్యంలో చలివేంద్రం

జూలూరుపాడు : జేపీఆర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ఎంపీఓ తోట తులసిరామ్ ప్రారంభించారు. చలివేంద్రం ప్రారంభం సందర్భంగా మజ్జిగ, పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేపీఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఇడుపుల రాజు, వెంకన్నపాలెం సెక్రెటరీ లక్ష్మీనారాయణ, హెడ్ కానిస్టేబుల్ దయానంద్, కానిస్టేబుల్ సురేష్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు రూ.600 ఇవ్వాలి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి రాములు

నవతెలంగాణ-మణుగూరు



ఉపాధి హామీ కూలీకు కొలతలు లేకుండా రోజు వారి కూలీ రూ.600 ఇవ్వాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొడిశాల రాముల అన్నారు. శనివారం మండల కమిటీ ఆధ్వర్యంలో పని ప్రదేశాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికులతో మాట్లాడుతూ... రోజు రోజు పెరుగుతున్న ధరలకు అనుకూలంగా ఉపాధి కూలీలకు 600 ఇవ్వాలన్నారు. ప్రభుత్వ వసతులు కల్పించాలని, గడ్డపార పారా, మెడికల్ కిట్లు, మంచినీటి వంటి సదుపాయాలు పని ప్రదేశాలలో కల్పించాలన్నారు. కూలీలకు ప్రతి వారానికి పడాల్సిన అమౌంటు ఆలస్యంగా పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల బొల్లం రాజు నాయకులు ఉత్తం, ఉపాధి కూలీలు రామకృష్ణ, విజయమ్మ వెంకటమ్మ ధనమ్మ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రెండు వాహనాలు స్వాధీనం

నవతెలంగాణ-అశ్వారావుపేట

వేర్వేరు ప్రదేశాల్లో నిబంధనలకు విరుద్ధంగా మట్టి, ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లను పోలీస్, రెవిన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను శనివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు కథనం ప్రకారం మండలంలోని గుమ్మడవల్లి పంచాయతీ కొత్తూరు సమీపం లోగల పెద్దవాగు నుంచి ఏ విధమైన అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండగా ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడిన ట్రాక్టర్ యజమాని వల్లెపు దుర్గాప్రసాద్, డ్రైవర్ వల్లెపు జగదీష్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అదేవిధంగా మొద్దులు గూడెం-గుర్రాల చెరువు నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న ఓ ట్రాక్టర్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలో పట్టుబడిన ట్రాక్టర్‌ను ఎలాంటి అనుమతులు లేకపోవడంతో స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. అనుమతులు లేకుండా మట్టి అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ తెలిపారు.



ఘోర రోడ్డు ప్రమాదం

తల్లి, ఇద్దరు బిడ్డలు మృతి

నవతెలంగాణ-దమ్మపేట

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం శనివారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో తల్లి, ఇద్దరు బిడ్డలు మృతి చెందారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం...ఎన్టీఆర్ జిల్లా ఏ కొండూరు మండలం చీమలపాడు గ్రామానికి చెందిన దంపతులు చీపు బాలకృష్ణ, భార్య లక్ష్మి(30), కూతుర్లు శరణ్య(8), శాన్విక(6) బైక్‌పై ఎన్టీఆర్ జిల్లా విసన్నపేట నుంచి అశ్వారావుపేట వైపు కోళ్ల ఫారంలో పనిచేయటానికి వస్తున్నారు. మందలపల్లి సమీపంలో దాబా హోటల్ వద్ద వెనక నుంచి ఒక కారు ఢీ కొట్టిందని, వెనక నుంచి వచ్చిన లారీ తమపై ఎక్కి వెళ్లిందని తెలిపారు. ఈ సంఘటనలో తల్లి, కూతుర్లు అక్కడికక్కడే మృతి చెందారు. చీపు బాలకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. 108 ద్వారా దమ్మపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పాఠశాల వార్షికోత్సవం

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

మండల పరిధిలోని యర్రగుంట గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 60వ వార్షికోత్సవాన్ని హెడ్మాస్టర్ ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో ఎంతో ఘనంగ నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ హాజరయ్యారు. పాఠశాల మొదటి సంవత్సరం 1968-1969 బ్యాచ్ పూర్వవిద్యార్థులు ప్రత్యేకంగా ఆహ్వానించి పాఠశాల విద్యార్థులు సన్మానించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ యర్రగుంట ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న అనేక మంది విద్యార్థులు విదేశాల్లో ఉన్నత పదవుల్లో వున్నారని, అదేవిధంగా అనేకమంది విద్యార్థులు స్వదేశంలో డాక్టర్లు, పోలీస్, టీచర్లు ఇంకా మరెన్నో ఉన్నత పదవుల్లో వున్నారని, ఇదే పాటశాలలో చదువుకొని ఇప్పుడు ఇదే పాఠశాలలో సోషల్ టీచర్‌గా రాము పని చేస్తున్నాడని, మరి కొంత మంది విద్యార్థులు ఇక్కడే చదువుకొని పెద విద్యార్థులు కోసం ఫౌండేషన్ స్థాపించి ఆర్థిక సేవలు అందిస్తున్నారని అన్నారు.

పాఠశాల మాజీ హెడ్మాస్టర్ వెంకటరామయ్యను పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. అనంతరం పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వనమా గాంధీ, భద్రారావు, చైర్మెన్ మోహన్ రావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బూటకపు ఎన్‌కౌంటర్లకు కాంగ్రెస్ బాధ్యత వహించాలి

- ఆజాద్ పిలుపు

నవతెలంగాణ-చర్ల



సరిహద్దు ఛత్తీస్‌గడ్ ఊసూరు బ్లాక్ కర్రీగుట్టలో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్ బూటకపు ఎన్కౌంటర్ అని ఆ ఎన్‌కౌంటర్‌కు కాంగ్రెస్ పార్టీ బాధ్యత వహించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అల్లూరి సీతారామరాజు జిల్లాల మావోయిస్టు పార్టీ కార్యదర్శి ఆజాద్ పిలుపునిచ్చారు. ఆ మేరకు పాత్రికేయులకు లేఖ పంపారు. ఆ లేఖలో ముఖ్యంగా ఏ పార్టీ అధికారంలో ఉన్న రాజ్యం స్వభావం మారదు. ప్రజల కోసం పోరాడుతున్న మావోయిస్టులపై అటు తెలంగాణ, ఇటు ఛత్తీస్‌గడ్- మహారాష్ట్ర పోలీసులు రాజ్యహింసకు తెగబడుతున్నారు. కార్పొరేట్ కంపనీల అడుగులకు మడుగులొత్తేలా వారు పనిచేస్తున్నారు. ఈ హింసలో పార్టీలకు ఎలాంటి భిన్నాభిప్రాయం లేదు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ అన్ని పార్టీలదీ ఒకటే వ్యూహం, ఒకటే దారి. మావోయిస్టు పార్టీని నిర్మూలించే లక్ష్యంతో పనిచేస్తున్నారు. ఎన్నికల్లో ఒకరిపై ఒకరు విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకున్నా పాలించే విధానంలో ఎలాంటి మార్పు లేదు. ఆదివాసీ ప్రాంతాల్లో ఉన్న విలువైన ఖనిజాలు, వనరులను పెద్ద పెద్ద కంపనీలకు, సామ్రాజ్య వాద తొత్తులకు గుండుగుత్తగా తాకట్టు పెట్టే క్రమంలో అక్కడ ఉన్న ఆదివాసీ ఉద్యమాలను రాక్షసంగా అనగదొక్కుతున్నారు. దండకారణ్యం అంతా పోలీసు క్యాంపులతో నింపేస్తున్నారు. ఓ పక్క డ్రోన్లు, హెలీకాప్టర్లతో ఆకాశ మార్గంగుండా దాడులు చేస్తున్నారు. ఇటీవల కాలంలో మహారాష్ట్ర సరిహద్దులో ముగ్గురు కామ్రేడ్స్ పై విష ప్రయోగం చేసి పట్టుకొని అతి కిరాతకంగా హింసించి ఎన్‌కౌంటర్ కథ అల్లారు. ఈ రోజు బీజాపూర్ జిల్లా ఊసూర్ బ్లాక్ పూజారికాంకేర్ తెలంగాణ గ్రేహౌండ్స్, స్పెషల్ పార్టీ, కోబ్రా పోలీసులకి మావోయిస్టులకు మధ్య జరిగిన భయంకర యుద్ధంలో మా కామ్రేడ్స్ ముగ్గురు అమరులయ్యారు. తెలంగాణ ఎస్ జెడ్సీ సభ్యులు కామ్రేడ్ సాగర్‌తో పాటు కామ్రేడ్ మణిరాం (ఏసీఎం) మరో కామ్రేడ్ అమరుల య్యారు. వారికి మావోయిస్టు పార్టీ ఎర్రెర్ర విప్లవ జోహార్లు అర్పిస్తుంది. వారి పోరాట పటిమను కొనియాడుతూ వారికి లాల్ సలాంలు తెలుపుతుంది. వారి ఎన్ కౌంటర్‌కు కారకులైన ములుగు ఎస్పీ, పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చ రిస్తున్నాం. తెలంగాణ రాష్ట్రంలో గత పది సంవత్సరాలుగా పరిపాలించిన కేసీఆర్ మావోయిస్టు ఎజెండానే తన జెండాఅని అధికారం చేపట్టాక మావోయిస్టు నిర్మూలించడానికి ఒక నియంతగా వ్యవహరించాడు. అదే తరహాలో ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ప్రజాస్వామ్యాన్ని, ప్రజల హక్కులను పరిరక్షిస్తానని ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతానని చెప్పి మావోయిస్టు పార్టీపై తన పోలీసు బలగాలతో దాడులు చేపిస్తూ పాలించే వాళ్ళంతా ఒకే గూటి పక్షులని రాజ్యహింసలో ఒకరిని మించిన వారు ఇంకొకరు అన్నట్లు కార్పొరేట్ ఏజెంట్లే నని రుజువు చేసుకున్నడు. ఈ ఎన్కౌంటర్లకు కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డిదే పూర్తి బాధ్యత అవుతుందని హెచ్చరిస్తున్నాం. ఒక ద్రోహి ఇచ్చిన సమాచారంతో మా కామ్రేడ్స్ పై ములుగు జిల్లా ఎస్పీ పథకం రచించి ఈ ఎన్ కౌంటర్‌కు పాల్పడ్డాడు. తప్ప కుండా ఈ ఎన్ కౌటర్‌కు నెత్తుటి బాకీ తీర్చుకుంటామని ప్రకటిస్తున్నాం అని ఆ లేఖలో ఆయన పేర్కొన్నారు.

17న నుండి సంత రద్దు : ఈవో సమ్మయ్య

నవతెలంగాణ -బూర్గంపాడు

బూర్గంపాడు గ్రామపంచాయతీ పరిధిలో ఇప్పటివరకు ఏర్పాటు చేసినటువంటి సంతను ఈనెల 17వ తేదీ నుండి పూర్తిగా రద్దు చేయడమైనదని గ్రామ పంచాయతీ ఈవో కొమరం సమ్మయ్య శనివారం తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలో ప్రభుత్వ స్థలము లేనందున ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు నిర్వహిస్తున్న సొంత ఆర్ఎంపీ రోడ్డుకు ఇరువైపులా ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానిక పోలీసులు నోటీసులు జారీ చేస్తున్నందున సంతను రద్దు చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వానికి సంబంధించి ఖాళీ స్థలం దొరికినప్పుడు తిరిగి సంత నిర్వహిస్తామని, అప్పటి వరకు సంత రద్దు చేయడమైనదని ఆయన పేర్కొన్నారు.

ఓటు హక్కు భారం కాదు బాధ్యత

- ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి నవ్యశ్రీ

నవతెలంగాణ -దుమ్ముగూడెం

ఓటు హక్కు భారం కాదు అని బాధ్యత అని దుమ్ముగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి నవ్యశ్రీ అన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకొని భారత రాజ్యాంగాన్ని గౌరవించాలని అన్నారు. శనివారం దుమ్ముగూడెం ఎంపీడీవో కార్యాలయం ముందు ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారులతో పాటు సెర్ప్ ఆధ్వర్యంలో ఓటు హక్కు అవగాహనపై ప్రత్యేక రంగోలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు హక్కు ప్రాధాన్యత తెలుపుతూ పలు రకాల లోగోలు ముగ్గులుగా వేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం హేమంతిని, సూపర్‌వైజర్లు ధనలక్ష్మి, సహన సుల్తానా పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక ప్రభుత్వానికి బుద్ధి చెబుదాం

- బీసీ సెల్ మండల అధ్యక్షులు బొల్లి శేఖర్

నవతెలంగాణ-దుమ్ముగూడెం

వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో రైతు వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెబుతారని బీఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షులు బొల్లి శేఖర్ విమర్శించారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.... రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరగానే డిసెంబర్ 9న రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్న హామీ అటకెక్కిందని విమర్శించారు. అలాగే రైతులకు పెట్టుబడి సాయంగా కొత్త రుణాలు కావాలంటే,పాత అప్పు చెల్లించాల్సిందేనని బ్యాంకర్లు రైతుల మెడపై కత్తి పెట్టి వేధిస్తూ,వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు రాబోయే లోక్ సభ ఎన్నికల్లో అన్నదాతల ఆగ్రహానికి మూల్యం చెల్లించుకోక తప్పుదన్నారు.

చలివేంద్ర ఏర్పాటుకు

స్వచ్ఛంద సంస్థ ముందుకు రావాలి : మున్సిపల్ కమిషనర్

నవతెలంగాణ-పాల్వంచ

వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పాల్వంచ మున్సిపల్ కమిషనర్ స్వామి పిలుపునిచ్చారు. శనివారం పాల్వంచ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మునిసిపల్ ఆఫీస్, ఫారెస్ట్ ఆఫీస్, బస్సు స్టాండ్ సెంటర్ అంబేద్కర్ సెంటర్ నందు చలివేంద్రాలు ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ రాజేష్ పాల్గొన్నారు.

సరస్వతి శిశుమందిర్‌లో పోషక అవగాహన సదస్సు

నవతెలంగాణ-బూర్గంపాడు

మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో పోషక అవగాహన సదస్సు శనివారం ఏర్పాటు చేశారు. అనంతరం పాఠశాల చిన్నారులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమం అనంతరం కేసుపాక రేవంత్ దంపతులచే అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు వైవి అశోక్ రెడ్డి, భవనం రాఘవ రెడ్డి, పాఠశాల కార్యదర్శి బళ్ళు మోహన్ కష్ణ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

నవతెలంగాణ - అశ్వాపల్లి



మండల కేంద్రంలో ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న కూలీలకు వేసవి దృష్ట్యా ప్రభుత్వం అందించిన ఓఆర్ఎస్ ప్యాకెట్లను అశ్వాపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి రానమల్ల ప్రవీణ్ కుమార్ శనివారం అందజేశారు. ప్రస్తుతం ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కూలీలకు పాలిథిన్ కవర్లతో షెల్టర్‌లు, ఫస్ట్ ఎయిడ్ కిట్, నీటి సౌకర్యం అందుబాటులో ఉంచామని అన్నారు. ఈ కార్యక్రమంలో మేట్‌లు మద్దెల వెంకటేశ్వర్లు, అబ్బాస్, లకమల జ్ఞానానందం, తదితర కూలీలు ఉన్నారు.

కిచనపల్లి ఉపాధ్యాయుడి పదవీవిరమణ

నవతెలంగాణ-అశ్వాపల్లి

మండల పరిధిలోని కిచనపల్లి గ్రామం పాఠశాలలో ఎస్.జీ.టి ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మాచర్ల శశి కుమార్ పదవీ విరమణ కార్యక్రమం శనివారం పలువురు మర్కోడు కాంప్లెక్స్ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సన్మాన కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్, టీపీటీఎఫ్, టీఎస్ టీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఇస్లావత్ హతిరామ్, జోగా రాంబాబు, ఇస్లావత్ నరేష్, అశ్వాపల్లి, మర్కోడు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కె.శాంతారావు, బి.బాబులాల్, టీచర్లు కొమరం రాంబాబు, సమ్మక్క, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు పెద్దమ్మ గుడిలో రుద్రహోమం

నవతెలంగాణ - పాల్వంచ రూరల్

కేపీ జగన్నాథపురం శ్రీ కనకదుర్గ (పెద్దమ్మ తల్లి) దేవస్థానంలో ఆదివారం రుద్ర హోమం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యాలయ కమిటీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. హోమంలో పాల్గొను భక్తులు రూ.1,516లు చెల్లించి, తమ గోత్ర నామములు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. దంపతులు సాంప్రదాయ దుస్తులు ధరించాలన్నారు. ఇతర వివరాలకు సెల్ 9866923261, 6303408458 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఆగివున్న లారీని ఢీ కొట్టిన బైక్

నవతెలంగాణ-సత్తుపల్లి

ఆగి ఉన్న లారీని ఓ బైకిస్ట్ ఢీకొట్టిన ప్రమాదంలో అతని కాలు విరిగిన ఘటన సత్తుపల్లి శివారులోని ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై శనివారం మధ్యాహ్నం జరిగింది. సత్తుపల్లి మండలం పాకలగూడెంకు చెందిన ఎస్కే మైబు సత్తుపల్లిలో పని నిమిత్తం మోటారు సైకిలుపై వస్తుండగా మాధురి ఫంక్షన్ హాల్ వద్ద ఫ్లైఓవర్ పై బ్రేక్ డౌన్ అయి ఆగివున్న లారీని గమనించకుండా వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో మైబు కాలు విరిగింది. క్షతగాత్రుడ్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు.

రిపోర్టర్ కోటేశ్వరావుకు ఎంపీపీ నివాళి

నవతెలంగాణ-ముదిగొండ

ముదిగొండ ఆంధ్రప్రభ రిపోర్టర్ ఉప్పు కోటేశ్వరరావు చిత్రపటానికి శనివారం ఎంపీపీ సామినేని హరిప్రసాద్ పుష్పగుచ్చాలు వేసి నివాళు లర్పించారు. కోటేశ్వరరావు మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షకార్యదర్శి వాచేపల్లి లక్ష్మారెడ్డి, గడ్డం వెంకట్ గౌడ్, నాయకులు పసుపులేటి వెంకట్ పాల్గొన్నారు.

ముగిసిన న్యాయవాద

సహకార సంఘం ఎన్నికల నామినేషన్లు

నవతెలంగాణ-ఖమ్మం లీగల్

ఖమ్మం జిల్లా న్యాయవాదులు సహకార సంఘం ఎన్నికలు నలుగురు డైరెక్టర్స్ పదవులకు ఈ నెల 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు నామినేషన్‌లు స్వీకరించారు. అనుమోలు నర్సింహరావు, భూక్యా రమేష్, పలివల శ్రీ లక్ష్మీ, గోరింట్ల శాంతరావు, చుంచుల మల్లిఖార్జున రావు, దేవకి శ్రీనివాసరావులు నామినేషన్‌లు వేసినారని ఎన్నికల అధికారి రమేష్ శనివారం ప్రకటించారు. ఫైనల్ లిస్ట్ ని 10న ప్రకటిస్తామని, పోలింగ్ 16న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2-30గంటల వరకు జరుగుతుందని కౌంటింగ్ ప్రక్రియ అదే రోజు సాయంత్రం 3 గంటల నుండి ప్రారంభిస్తామని ఎన్నికల అధికారి తెలిపారు.

భక్తులకు పకడ్బందీ ఏర్పాట్లు చెయ్యండి

- కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా

- వాల్‌పోస్టర్ కలెక్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ పాల్వంచ



శ్రీరామనవమి మహాపట్టాభిషేకం మహోత్సవాలు వీక్షణకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కేటాయించిన విధులను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ సమావేశ మందిరంలో శ్రీరామనవమి, మహా పట్టాభిషేక కార్యక్రమాల నిర్వహణపై అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనాల నియమావళి అనుగుణంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, కళ్యాణ వేడుకల నిర్వహించు మండపాన్ని 26 సెక్టార్లుగా విభజించి, ప్రతి సెక్టారులో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేడుకలు వీక్షించేందుకు పర్యవేక్షణకు జిల్లా అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించినట్లు చెప్పారు. భక్తులు ఒక సెక్టార్ నుంచి ఒక సెక్టార్ కు వెళ్లకుండా పటిష్ట బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆమె చెప్పారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రతి సెక్టార్లో కూలర్లు ఏర్పాటు చేయాలని, భక్తుల వసతి (లాడ్జి) లను ఆన్లైన్ బుక్ చేసుకునే సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. ఆన్లైన్ ద్వారా టికెట్లు విక్రయాలు చేపట్టాలని, ఇప్పటి వరకు 1330 టికెట్లు విక్రయించినట్లు చెప్పారు. మహోత్సవ విధులు నిర్వహించే సిబ్బందికి ప్రత్యేకంగా గుర్తింపు కార్డులు జారీ చేయనున్నట్లు చెప్పారు. మహోత్సవాల రోజుల్లో మాంసం, మద్యం విక్రయాలను నిలిపి వేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో 08743-232444 నంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మంచినీటి సరఫరాకు పట్టణంలో 200 మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని చెప్పారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో తాగునీటికి ఎటువంటి ఇబ్బంది ఇబ్బందులు తలెత్తకుండా సరఫరా పర్యవేక్షణకు 30 మంది ఏఈలు, మంచినీటి పరీక్షలు నిర్వహణకు 12 మంది సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. రెస్క్యూ టీములను అందుబాటులో ఉంచుకోవాలని అగ్నిమాపక అధికారులకు సూచించారు. భక్తులు గోదావరిలోకి వెళ్లకుండా పటిష్ట భారికేడింగ్ ఏర్పాటుతో పాటు నాటు పడవలను, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని చెప్పారు. వంతెనపై వాహనాలు ఆగిపోతే తక్షణమే తరలించేందుకు వీలుగా క్రేన్లను సిద్ధంగా ఉంచాలని చెప్పారు. ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో అత్యవసర వైద్య, సేవలు అందించేందుకు 20 బెడ్లను సిద్ధంగా ఉంచాలని చెప్పారు. ఐసీయూ వార్డు ఏర్పాటు చేయాలని చెప్పారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. చిన్నారులు తప్పిపోయిన సందర్భంలో గుర్తించడానికి వీలుగా జేబులో చిరునామాతో పాటు సెల్ ఫోన్ నెంబర్లను పెట్టాలని భక్తులకు సూచించారు. భద్రాచలం విచ్చేసిన ప్రతి భక్తునికి తలంబ్రాలు అందే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన దేవస్థానం అధికారులకు సూచించారు.

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ తలంబ్రాలు గోడ పత్రికను కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా ఆవిష్కరించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్, ఏఎస్పీ పరితోష్ పంకజ్, డీఆర్డీఓ విద్యాచందన, దేవస్థానం ఈవో రమాదేవి, డిఆర్ఓ రవీంద్రనాథ్, ఆర్డిఓలు మధు, దామోదర్ రావు,అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఖమ్మంలో ఘనంగా శ్రీచైతన్య పాఠశాలల వార్షికోత్సవ వేడుకలు





- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

నవతెలంగాణ-ఖమ్మం టౌన్

స్థానిక రుద్రమ్మ కోట రోడ్ నందుగల శ్రీచైతన్య గ్లోబల్ విస్టా పాఠశాలలో 15వ వార్షికోత్సవ వేడుక శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ ఆకెళ్ళ రాఘవేంద్ర హాజరై మాట్లాడూత.. ఇది ఒక సంవత్సరం విలువైన కృషి, అంకితభావానికి పరాకాష్టగా మాత్రమే కాకుండా మన విజయాలను ప్రతిబింబించే వేడుకగా కూడా పనిచేస్తుందనానరు. ఫెమా కన్వీనర్ ముప్వా శ్రీనివాస రావు మాట్లాడుతూ పుస్తకం అనేది వీసా లేకుండా విశ్వదర్శనం చేయిస్తుందన్నారు. శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ.. 2008లో కేవలం 135 మంది విద్యార్థులతో ఒకే ఒక్క క్యాంపస్లో ప్రారంభమైన శ్రీచైతన్య జూనియర్ కళాశాల నేడు పాఠశాల స్థాయిలోకూడా శాఖోపశాఖలుగా విస్తరించిందన్నారు. విద్యార్థుల అవసరలకు అణుగుణంగా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. హైద్రాబాద్ వంటి మహానగరంలో కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా ఖమ్మం విద్యార్థులు జాతీయ స్థాయిపోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. శ్రీచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య మాట్లాడుతూ శ్రీచైతన్య విద్యాసంస్థల్లో విధ్యసించిన ఎందరో విద్యార్థులు నేడు రాష్ట్ర, దేశ, విదేశాలలో వివిధ స్థాయిలలో ఉన్నతంగా స్థిరపడ్డారన్నారు. ఇంతటి విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ఎ.జి.యం. చేతన్ మాధుర్, ప్రిన్సిపాల్స్ టిఎల్ఎన్. శర్మ, రాజ్ కుమార్ జోషి, ఏడుకొండలు, మురళీమోహన్, నీరజ, శ్రీదేవి, రవి కుమార్, వైస్ ప్రిన్సిపాల్స్ రామకృష్ణారెడ్డి, సురేష్, కోఆర్డినేటర్స్, డీన్స్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాలేరుతో 'సీతారామ'ను అనుసంధానించాలి..

- ప్రధాన కాలువలు సత్వరమే పూర్తి చేయాలి..

- తెలంగాణ రైతు సంఘం

జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి:



సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాలువలు వెంటనే పూర్తి చేసి పాలేరు రిజర్వాయర్ కు అనుసంధానం చేయాలని తెలంగాణ రైతు సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. తద్వారా ఖమ్మం జిల్లాలో సాగర్ ఆయకట్టు కు సాగునీరు అందించాలని కోరారు. తెలంగాణ రైతు సంఘం బృందం ఏన్కూరు మండలంలోని సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాలువలను శనివారం పరిశీలించింది. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాకు జీవనాధారమైన సీతారామ ప్రాజెక్ట్ ను సత్వరమే పూర్తి చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పై ఉందని అన్నారు. ప్రాజెక్ట్ ప్రధాన కాలువలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలంలో పాపకొల్లు గుట్టల వరకు తవ్వి అక్కడితో ఆపారన్నారు. ఆ పనులను కొనసాగించి త్వరగా పాలేరు రిజర్వాయర్ కు అనుసంధానం చేసే ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. తిరుమలాయపాలెం మండలంలో కాలువలు పూర్తి చేసి మధ్యలో ప్రధాన కాలువలు గత మూడు సంవత్సరాల నుంచి తవ్వకుండా కాలయాపన చేస్తున్నారని తెలిపారు. తద్వారా జిల్లాలో రైతాంగానికి సాగునీరు అందక తీవ్రంగా నష్టపోతున్నారు అని అన్నారు. మరోవైపు కృష్ణా పరివాహక ప్రాంతంలో సరైన వర్షాలు కురవక నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిండక ఎడమ కాలువ ఆయకట్టు బీడుగా మారిందని తెలిపారు. వేలాది ఎకరాల్లో వేసిన పంటలు ఎండిపోయి తీవ్రంగా రైతులు నష్టపోయారని అన్నారు. అందుకే సత్వరమే సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాలువలు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు . ప్రధాన కాలువలు పూర్తి చేయకుండా పంట కాలువలు కోసం అధికారులు తొందరపాటు చర్యలు సరికాదని అన్నారు. వైరా రిజర్వాయర్ కు అనుసంధానం పేరుతో అవసరం లేని దగ్గర రూ.వందల కోట్ల ఖర్చు తో కాలువలు కోసం అధికారులు ప్రయత్నం చేయడం సరికాదని అన్నారు. సమగ్ర చర్చ, శాస్త్రీయ పరిశీలన, టెక్నికల్ అంశాల ఆధారంగా తక్కువ ఖర్చు, తక్కువ నష్టం తో ఎక్కువ ఆయకట్టు కు సాగునీరు అందించే అవకాశాలు పరిశీలన చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దుగ్గి కృష్ణ, వజ్జా రామారావు, మండల కార్యదర్శి గుండా సత్యనారాయణరెడ్డి, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బానోతు బాలాజీ, దొంతిబోయిన నాగేశ్వరరావు, వెల్పుల రాములు, లకావత్ నాగేశ్వరరావు, బానోత్ రణసింగ్, నామ కృష్ణారావు, గంగవత్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలను విడుదల చేయండి

-ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు

అమర్లపూడి శరత్

నవతెలంగాణ-సత్తుపల్లి

గ్రామ పంచాయతీ కార్మికులకు రావాల్సిన పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు అమర్లపూడి శరత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కాకర్లపల్లి, రుద్రాక్షపల్లి గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్మికులను శనివారం కలిసిన శరత్ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో వేలాది మంది మల్టీపర్పస్ కార్మికులుగా విధులు నిర్వహిస్తూ గ్రామాలకు సేవ చేస్తున్నారన్నారు. గత మూడు నెలలుగా కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదన్నారు. అసలే చాలీచాలని వేతనాలని, అవికూడా సక్రమంగా అందని కారణంగా కార్మికుల కుటుంబాల జీవనం సాగడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. నెలనెలా జీతాలు సక్రమంగా చెల్లించడానికి ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ప్రత్యేక నిధులను బడ్జెట్‌లో కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు బొజ్జ వెంకటేశ్వరరావు, జీపీ కార్మికులు వెంకటేశ్వరరావు, గంగరాజు, రవి, లక్ష్మి పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న డీసీఎం

-వ్యక్తికి గాయాలు

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

ద్విచక్రవాహనాన్ని డీసీఎం వ్యాను ఢీకొని ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని మద్దులపల్లి వద్ద శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... తల్లంపాడు వైపు నుంచి ఓ ద్విచక్రవాహనదారుడు ఖమ్మం వెళ్తుండగా మద్దులపల్లి వద్ద ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాను ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనదారునికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వ్యక్తిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



మెగా ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-వైరాటౌన్

మండల పరిధిలోని పాలడుగు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం పాస్టర్ మోదుగు వినోద్ కుమార్ సహకారంతో గ్రేస్ జనరల్ హాస్పిటల్ తనికెళ్ల వారి ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 300 వందల మందికి వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు అందించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) స్థానిక గ్రామ నాయకులు, విశ్రాంత ఉపాధ్యాయులు వనమా చిన్న సత్యనారాయణ హాజరై మాట్లాడారు. పల్లె ప్రాంతాలలో ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. అనంతరం గ్రేస్ జనరల్ హాస్పిటల్ సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రేస్ జనరల్ హాస్పిటల్ డాక్టర్లు, సిబ్బంది, గ్రామ ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ మాయ మాటలు ప్రజలు నమ్మరు

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వీరమాచినేని వినీల్

నవతెలంగాణ-దుమ్ముగూడెం

గత పదేండ్ల పాలనలో బీఆర్ఎస్ పాలకులు ప్రజలకు, రైతులకు చేసింది శూన్యమని, వారు చేసిన మోసాలు ఒక్కొక్కటిగా బయట పడుతుంటే ప్రస్తుతం తట్టుకోలేక ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వీరమాచినేని వినీల్ విమర్శించారు. శనివారం లక్ష్మీ నగరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫోన్ టాపింగ్, కాలేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ పథకం, ధరణి పథకాలలో అవినీతి ఒక్కొక్కటిగా బయటకు వస్తుంటే తట్టుకోలేక ప్రజల దృష్టి మరల్చడానికి రైతుల కోసం ధర్నాలు అంటూ డ్రామాలు ఆడుతున్నారని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాజీ మండల రైతు బంధు సమితి అధ్యక్షులు బత్తుల శోభన్ బాబు, లక్ష్మీ నగరం ఎంపీటీసీ మద్ది వనజ, జిల్లా సోషల్ మీడియా చైర్మెన్ కనుబుద్ది దేవా, నాయకులు మద్ది రామిరెడ్డి, నాయకులు నటరాజ స్వామి, సీనియర్ నాయకులు అప్పల రెడ్డి, కుషిని రవి, దాసు పల్లి ఉపేంద్ర, శ్రీను నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) నాయకుడు జిల్లెల మృతి

- నివాళులర్పించిన నున్నా

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

మండలంలోని కాచిరాజుగూడెం గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడు జిల్లెల వెంకటనారాయణ (60) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. వెంకటనారాయణ మృతదేహాన్ని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు సందర్శించి వెంకటనారాయణ మృతదేహంపై ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని నున్నా అన్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ(ఎం) ఖమ్మం రూరల్ మండల కార్యదర్శి నంద్ర ప్రసాద్, గ్రామ నాయకులు అద్దంకి తిరుమలయ్య, పొన్నం వెంకటరమణ, ఎస్కే సైదులు, ఏలూరు నాగేశ్వరరావు, పొన్నం మురళి, పొన్నం భాస్కరరావు, షేక్ చాంద్ పాషా, యండ్లపల్లి హరీష్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన 'జేవీఆర్' విద్యార్థులు

నవతెలంగాణ-సత్తుపల్లి

కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ హైదరాబాద్ వారు ప్రతిష్టాత్మకంగా రాష్ట్రస్థాయిలో నిర్వహించిన జిజ్ఞాస స్టూడెంట్ ప్రాజెక్టు పోటీల్లో సత్తుపల్లి ప్రభుత్వ జేవీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభను కనబర్చారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు తెలంగాణ కాలేజియేట్ ఎడ్యుకేషన్ వారు విద్యార్థులకు ప్రతియేటా జిజ్ఞాస (క్యూరియోసిటీ) పోటీలను నిర్వహించుకుంటూ వస్తోంది. ఈ పరీక్షలో భాగంగా రాష్ట్రం మొత్తంలో 16 సబ్జెక్టుల్లో 1033 స్టడీ ప్రాజెక్టులు ఈ పోటీల్లో పాల్గొనగా రాష్ట్రస్థాయిలో 290మంది విద్యార్థులు ఎంపికయ్యారు. అందులో జేవీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్రంలోనే అత్యధికంగా ఏడు సబ్జెక్టులకు సంబంధించి జిజ్ఞాస స్టడీ ప్రాజెక్టులు ఎంపిక కావడం పట్ల జేవీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.విజయకుమార్ హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించారు. జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టు కన్వీనర్ డాక్టర్ బీ. వినోద్‌కుమార్ మాట్లాడుతూ గత యేడాది వృక్షశాస్త్ర విభాగం నుంచి లంకపల్లి నీలాద్రి ఔషధ మొక్కలు, సత్తుపల్లి పట్టణ తాగునీటి భౌతిక, రసాయనిక పరిమితులపై పరిశోధన చేసిన స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టు ఈ రెండు అంశాల్లోనూ రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాయన్నారు. ఆయా విభాగపు అధ్యాపకులు డాక్టర్ శ్రీధర్, జి వీరన్న, కె రవికుమార్, షేక్ పీర్ సాహెబ్, డాక్టర్ జి వీరారెడ్డి విద్యార్థులను అభినందించారు.

నేడు టీజీవోస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

నవతెలంగాణ-ఖమ్మం

తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మంలోని టీజీవో భవనంలో సాయంత్రం 6 గంటలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నట్లు టీజీవోస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు కస్తాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మోదుగు వేలాద్రి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ముస్లిం ఉద్యోగులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏలూరు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఏ.సత్యనారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్ బీ. శ్యామ్, కోశాధికారి ఎం. ఉపేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఏ. జగన్మోహన్‌రావు, జాయింట్ సెక్రెటరీ ఏ. పరమేశ్వర్ రెడ్డి , మహిళా ప్రతినిధి జీ. దీపారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం. రామకృష్ణగౌడ్, కార్య నిర్వాహక సభ్యుడు పి. యాదగిరి గౌడ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టీజీవో జిల్లా అధ్యక్షులు సంఘం వెంకట పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ భానోత్ దస్రు, ట్రెజరర్ కస్తాల వెంకటేశ్వర్లు పాల్గొంటున్నారని తెలిపారు.

10న తీర్థాల ఆలయంలో వేలం పాట

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

మండల పరిధిలోని తీర్థాల సంగమేశ్వర ఆలయంలో 2024 ఏప్రిల్ 10 నుంచి 2025 ఫిబ్రవరి 20వ తేదీ వరకు లడ్డూ ప్రసాదం, పులిహోర, కొబ్బరి చిప్పలు పోగు చేసుకోవడం కోసం ఈనెల 10వ తేదీన ఆలయ ప్రాంగణంలో వేలం పాట నిర్వహించనున్నట్లు ఈఓ శేషయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

మృతుడి కుటుంబానికి చెక్కు అందజేత

నవతెలంగాణ-కామేపల్లి

కామేపల్లి పీఏసీఎస్ పరిధిలోని రైతులతో పాటు వారి కుటుంబాలకు అని విధాలుగా అండగా ఉంటుందన్నారు. సంఘ పరిధిలోని తాళ్లగూడెం గ్రామానికి చెందిన చిప్పల పల్లి ముత్తయ్య అనే రైతు చనిపోగా సొసైటీ ఇన్సూరెన్స్ పథకం కింద మంజూరు అయిన రూ. 50 వేల చెక్కును అతని భార్య సుధకి కామేపల్లి బ్రాంచ్ మేనేజర్ శ్రీవాని శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఈఓ నాగయ్య, సూపర్‌వైజర్ ఫణికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వడదెబ్బకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన

నవతెలంగాణ-కామేపల్లి

మండల కేంద్రంలో వడదెబ్బకు తీసుకోవలసిన జాగ్రత్తలపై కామేపల్లి మండల ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ నెల్లూరు చందన ఆధ్వర్యంలో శనివారం భారీ ర్యాలీ గ్రామ పురవీధుల్లో నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. వడదెబ్బ బారిన ప్రజలు పడకుండా ప్రజలు ముందస్తు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాలలో ప్రతినిత్యం వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉన్నారని, ప్రభుత్వ వైద్యాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్.సుధాకర్, ఎంపీడీవో రవీందర్, ఆర్ఐ సక్రు, ఏవో తార దేవి, వైద్య సిబ్బంది, ప్రభుత్వ మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫైనాన్స్ కంపెనీల ఆగడాలను అరికట్టాలి

- ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షులు షేక్ సుభాహన్

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలో రోజు రోజుకు కొత్త, పాత వాహనాలపై ఫైనాన్స్ చేస్తున్న కంపెనీలా ఆగడాలు మితిమీరిపోతున్నాయని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్టియూ) జిల్లా అధ్యక్షులు షేక్ సుభాహన్ ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో లోకల్ ఆటోలో ప్రయాణం చేయాలంటే కూలి నాలి చేసుకొని సంపాదించుకున్నటువంటి 100, 200 కూడా సరిపోని పరిస్థితిలో ఉన్నటువంటి సాధారణ ప్రజలు ఏదో ఒక చిన్న పాటి మోటార్ సైకిల్ కొనుక్కొని జీవనం కొనసాగించాలని, సెకండ్ హ్యాండ్ వాహనాల షోరూంలను ఆశ్రయిస్తూ ఫైనాన్స్‌లో వాహనం తీసుకొని జీవనం సాగిస్తున్న తరుణంలో ఈఎంఐ (నెలసరి వాయిదా) లు సరిగ్గా కట్టడం లేదని కస్టమర్లపై ఫైనాన్స్ సంస్థలు దురుసుగా ప్రవర్తించడం, అనేక రీతిలో దౌర్జనాలు చేస్తున్నా కూడా నిమ్మకు నీరేత్తన్నట్టు సంబంధింత అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఒక్క ఖమ్మం నగరంలోని పుట్టగొడుగుల్లా ఫైనాన్స్ సంస్థలు ఉన్నాయని తెలిపారు. అనుమతులు లేనటువంటి ఫైనాన్స్ సంస్థలపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వినయ్ పొట్టకూటి కోసం పొట్టను చేత పట్టుకొని బ్రతుకుతెరువు కోసం ఖమ్మం పట్టణానికి వచ్చిన ఒక కార్మికుడిని మోహన్ సాయి ఫైనాన్స్ సంస్థనే హత్య చేసిందని, రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు లొంగకుండా హత్యా నేరం కింద సంబంధిత రికవరీ ఏజెంట్లపై కేసు నమోదు చేయాలని, చనిపోయిన వినయ్ కుటుంబానికి 20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

బాలికలపై లైంగిక దాడులు

- వేర్వేరు చోట్ల రెండు ఘటనలు
- నిందితుల్లో ఒకరికి రిమాండ్



నవతెలంగాణ-తాండూరు రూరల్/ ఆర్మూర్

రెండు వేర్వేరు ప్రాంతాల్లో బాలికలపై లైంగిక దాడుల ఘటనలు వెలుగుజూశాయి. వికారాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో చోటుచేసుకున్న ఈ ఘటనల్లో ఒకరిని రిమాండ్‌కు పంపగా.. మరొకరిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదైంది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

వికారాబాద్ జిల్లా తాండూరు మండలం ఐనెల్లి గ్రామానికి చెందిన బూడిద అంబేష్ ఆటో డ్రైవర్. అదే గ్రామానికి చెందిన ఓ బాలిక(17) పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల కోసం అంబేష్ ఆటోలో వెళ్లింది. ఈ క్రమంలో అతను బాలికతో పరిచయం పెంచుకున్నాడు. అయితే, గురువారం బాలిక, తన స్నేహితురాలితో కలిసి తాండూర్‌లో ఓ పెండ్లికి వెళ్లింది. విషయం తెలుసుకున్న అంబేష్ అక్కడికి వెళ్లాడు. పెండ్లి అయిపోయిన తర్వాత బాలికను ఇంటి దగ్గర వదలిపెడతానని ఆటో ఎక్కించుకుని తాండూర్ నుంచి ఐనెల్లి గ్రామ శివారులోని తన భూమిలోకి తీసుకెళ్లాడు. అక్కడ బాలికను బెదిరించి ఆమెపై లైంగికదాడి చేశాడు. ఆ సమయంలో ఆమెను వదిలేస్తే జరిగిన విషయం ఇంట్లో చెబుతుందని భావించి.. శుక్రవారం ఉదయం 5 గంటల సమయంలో బాలికను ఆటోలో తీసుకెళ్లి తాండూర్ రైల్వే స్టేషన్‌లో వదిలిపెట్టి పారిపోయాడు. అనంతరం బాధితురాలు ఇంటికి వెళ్లి విషయాన్ని అమ్మమ్మకు, అమ్మకు చెప్పింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న నిందితుడు అంబేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తాండూర్ రూరల్ సీఐ అశోక్ తెలిపారు.

యువకునిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై చేపూర్ గ్రామ యువకుడు సంపత్ లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక(15)ను ప్రేమిస్తున్నానని, పెండ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి, ఆమెపై లైంగికదాడి చేశాడు. విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తానని బాలికను భయభ్రాంతులకు గురిచేశాడు. దీంతో బాధితురాలు ఇంట్లో వారికి చెప్పలేదు. అయితే, ఏప్రిల్ 3న బాలిక ఇంటి వద్ద కండ్లు తిరిగి పడిపోయింది. వెంటనే పట్టణంలోని ఓ ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు పరీక్షలు చేసి మూడు నెలల గర్భవతి అని చెప్పారు. దీంతో బాలిక తల్లిదండ్రులు విషయం తెలుసుకుని.. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంపత్‌పై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఏసీబీకి చిక్కిన
మాదాపూర్ ఎస్ఐ రంజిత్, రైటర్ విక్రమ్

నవతెలంగాణ-మియాపూర్



రంగారెడ్డి జిల్లా మాదాపూర్ ఎస్ఐ రంజిత్, రైటర్ విక్రమ్ శనివారం రూ.20వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. ఇందుకు సంబంధించి ఏసీబీ రంగారెడ్డి డీఎస్పీ ఆనంద్‌బాబు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్‌లోని సాయినగర్ కాలనీలో 60 గజాల్లో కృష్ణ అనే వ్యక్తి ఇంటి నిర్మాణం చేస్తున్నాడు. ఆ స్థలం తనదే అని ఒక మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కృష్ణపై కేసు నమోదు చేశారు. అనంతరం ఎస్ఐ, రైటర్ ఇద్దరూ కలిసి కృష్ణను రూ.లక్ష లంచం డిమాండ్ చేశారు. చివరికి రూ.30వేలు ఇవ్వాలని బెదిరించారు. దాంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించారు. శనివారం మాదాపూర్ పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ, రైటర్ ఇద్దరూ కృష్ణ నుంచి రూ.20వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

బాణాసంచా తయారీ కేంద్రంలో పేలుడు

- ముగ్గురికి గాయాలు
- కామినేని ఆస్పత్రికి తరలింపు

నవతెలంగాణ-చిట్యాలటౌన్



బాణాసంచా తయారీ కేంద్రంలో పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణ కేంద్రంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల పట్టణ కేంద్రంలోని సంతోష్ నగర్‌లో గుంటూరుకు చెందిన కోటేశ్వరరావు కొంతకాలంగా గుట్టు చప్పుడు కాకుండా బాణాసంచా తయారు చేస్తున్నాడు. ఇందుకు యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం మునిపంపుల గ్రామానికి చెందిన మేడి యాదయ్య ఇల్లును కిరాయికి తీసుకున్నాడు. కొంతమంది వర్కర్లతో కలిసి పని చేయిస్తున్నాడు. శనివారం ఉదయం బాణాసంచా తయారు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు పేలడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనలో కోటేశ్వరరావుతో పాటు చిట్యాల మండలంలోని వనిపాకల గ్రామానికి చెందిన గుడిసె శాంతి, మేళ్లచెరువు మండలం ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన బానోతు సైదికి గాయాలయ్యాయి. వారిని వెంటనే నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని నల్లగొండ డీఎస్పీ కె.శివరాంరెడ్డి, నార్కట్‌పల్లి సీఐ కె.నాగరాజు, చిట్యాల ఎస్ఐ డి.సైదాబాబు పరిశీలించారు. అనుమతులు లేకుండా బాణాసంచా తయారు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.

మరో నేతన్న ఆత్మహత్య

నవతెలంగాణ - సిరిసిల్ల/ సిరిసిల్ల టౌన్

కార్మిక క్షేత్రం రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉపాధి లేక మరో నేతన్న ఆత్మహత్య చేసుకున్నాడు. కొన్నాళ్లుగా చేసేందుకు పని లేక.. కుటుంబం గడవడం కష్టమవడం.. మరోవైపు అప్పులు తీరే మార్గం లేక ప్రాణం తీసుకున్నాడు. సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన సిరిపురం లక్ష్మీనారాయణ ప్రగతినగర్‌లో లింగయ్య అనే ఆసామి దగ్గర మరమగ్గాల కార్మికునిగా పని చేస్తుండేవాడు. కొద్ది రోజుల నుంచి పని లేకపోవడంతో ఇంటి సమస్యలు పెరిగిపోయాయి. మరోపక్క లక్ష్మీనారాయణ పెద్ద కొడుకు టెక్స్‌టైల్ పార్కులో పనిలేక ఇతర ఉపాధిని వెతుక్కుంటున్నాడు. చిన్న కొడుకు హైదరాబాదులోని ఓ కంపెనీలో పనిచేయగా.. ఇటీవల అతడి ఉద్యోగం కూడా పోయింది. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు ఆ కుటుంబాన్ని చుట్టుముట్టాయి. అటు పనిలేక.. ఇటు అప్పులు రూ.2 లక్షలు తీర్చే మార్గం లేక ఆత్మస్థైర్యం కోల్పోయిన లక్ష్మీనారాయణ శనివారం ఇంట్లో ఉరేసుకున్నాడు. అవే ఆయన ఆత్మహత్యకు దారితీశాయని కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు.

కేటీఆర్ పరామర్శ, ఆర్థిక సాయం

నేతన్న సిరిపురం లక్ష్మీనారాయణ మృతదేహానికి సిరిసిల్ల ఏరియా ఆస్పత్రిలో ఎమ్మెల్యే కేటీఆర్ నివాళులర్పించారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వద్ద లక్ష్మీనారాయణ కుటుంబాన్ని కేటీఆర్ ఓదార్చారు. తక్షణ సాయం కింద పార్టీ తరపున రూ.50వేలు అందించారు. నేతన్న కుటుంబానికి ప్రభుత్వం తరపున రావాల్సిన ఆర్థిక సహాయం కోసం కలెక్టర్ అనురాగ్ జయంతితో కేటీఆర్ మాట్లాడారు. ప్రభుత్వం తరపున రావాల్సిన సహాయాన్ని వెంటనే అందించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. లక్ష్మీనారాయణ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

సీఐటీయూ నాయకుల ఓదార్పు

సిరిపురం లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులను సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య పరామర్శించి ఓదార్చారు. ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నేతన్నలకు ఉపాధి దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట తెలంగాణ పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్, మూశం రమేష్ తదితరులు ఉన్నారు.

నమో అంటే.. నమ్మించి మోసం చేయడమే

- కేసీఆర్..ఎక్కువ చేస్తే చర్లపల్లి జైలుకు పంపిస్తా : తుక్కుగూడ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నమో అంటే నమ్మించి మోసం చేయడమేనని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. శనివారం తుక్కుగూడలోని రాజీవ్‌గాంధీ మైదానంలో జరిగిన జనజాతర బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. తమ పార్టీ జాతీయస్థాయి ఎన్నికల మ్యానిఫెస్టోను తెలంగాణ గడ్డ మీద నుంచి రాహుల్‌గాంధీ ఆవిష్కరించడం గర్వకారణమన్నారు. సోనియాగాంధీ ఇదే గడ్డ మీద నుంచి ఆరు గ్యారెంటీలిచ్చి రాష్ట్రంలో మూడు రంగుల జెండాను రెపరెపలాడించారని గుర్తుచేశారు. ఇప్పుడు జాతికి ఐదు గ్యారెంటీలను రాహుల్‌గాంధీ అంకితం చేశారని కొనియాడారు. జూన్ నాలుగో తేదీన వెలువడే ఫలితాల్లో ఇండియా కూటమి అధికారంలోకి రాబోతున్నదని ఆశాభావం వ్యక్తంచేశారు. జూన్ 9న ఎర్రకోటపై మువ్వన్నెల జెండాను ఎగురవేయబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. ఉత్తర తెలంగాణ నుంచి గోదావరి, దక్షిణ తెలంగాణ నుంచి కృష్ణానది పోటెత్తి సునామీని సృష్టిస్తే ఎలా ఉంటుందో తుక్కుగూడ కాంగ్రెస్ శ్రేణుల సంద్రం అలా ఉందన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు కదం తొక్కితే బీఆర్ఎస్ కనిపించడకుండా పోయిందనీ, బీజేపీని కూడా తుక్కుతుక్కుగా తొక్కడానికి తుక్కుగూడకు వచ్చిన కాంగ్రెస్ శ్రేణులకు ధన్యవాదాలు అని చెప్పారు. కాంగ్రెస్ బలం, పునాది కార్యకర్తలేననీ, వారి కష్టంతోనే తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం వచ్చిందన్నారు. మోడీ గుజరాత్ మోడల్‌పై తెలంగాణ మోడల్ ఆధిపత్యాన్ని చూపించబోతున్నదని నొక్కి చెప్పారు. పదేండ్లుగా ప్రధాన మంత్రిగా ఉన్న మోడీ ఏటా రెండు కోట్ల చొప్పున పది కోట్ల ఉద్యోగాలివ్వలేదని విమర్శించారు. పార్లమెంట్‌లో ఇదే అంశంపై తాను ప్రశ్నిస్తే కేవలం 7 లక్షల ఉద్యోగాలనే మోడీ ప్రభుత్వం ఇచ్చిందని తేలిందన్నారు. 20 కోట్ల ఉద్యోగాలు ఇవ్వనందుకు మోడీకి ఓటేయ్యాలా? రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని మోసం చేసినందుకు మోడీకి ఓటెయ్యాలా? నల్లచట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో పోరాటం చేస్తున్న 750 మంది రైతులను పొట్టనబెట్టుకున్నందుకు ఓటెయ్యాలా? కనీసం బాధిత కుటుంబాలను పరామర్శించనందుకు ఓటెయ్యాలా? 2022 నాటికి ప్రతి పేదవాడికీ ఇండ్లు కట్టిస్తానని మాటతప్పినందుకు ఓటెయ్యాలా? మతం, కులం, ప్రాంతం, భాషల పేరుతో ప్రజలను విభజించినందుకు మోడీకి ఓటెయ్యాలా? ఓట్ల కోసం దేశాన్ని ఉత్తర, దక్షిణ భారత్‌లుగా విభజించి చూపుతున్నందుకు ఓటెయ్యాలా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. అకాల వర్షాలతో హైదరాబాద్ నగరం అతలాకుతలమైతే సికింద్రాబాద్ ఎంపీగా ఉన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కేంద్రం నుంచి ఒక్క పైసానైనా తెచ్చారా? ఏం మొహం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారు? అని నిలదీశారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం రావాల్సిన ఐటీఐఆర్, బయ్యారం ఉక్కు కర్మాగారం, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదాను పదేండ్లలో కాలంలో ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. తెలంగాణలోని కీలకమైన ఏడు మండలాలను అన్యాయంగా ఏపీలో కలిపారన్నారు. తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిన బీజేపీకి బొందపెట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

సూర్యాపేట, కరీంనగర్‌కు పోయి మాజీ సీఎం హోదాలో కేసీఆర్ వెంట్రుక కూడా పీకలేరని మాట్లాడొచ్చా? అని ప్రశ్నించారు. కేసీఆర్ పదేండ్ల కాలంలోనే వందేండ్ల విధ్వంసం సృష్టించారని ఆరోపించారు. అధికారం పోయింది, కాలు విరిగింది, కూతురు జైలుకు పోయింది కాబట్టి బాధలో ఉన్నప్పుడు ఆయనపై విమర్శలు చేయొద్దని ఇంత కాలం సమన్వయం పాటించామని సీఎం అన్నారు. ఏది పడితే అది మాట్లాడితే చూస్తూ ఊరుకోవడానికి, వినడానికి తాను జానారెడ్డిని కాదు.. రేవంత్‌రెడ్డినని చెప్పారు. ఇష్టమొచ్చినట్టు వ్యవహరిస్తే అంగిలాగు ఊడదీసి చర్లపల్లి జైలులో చిప్పకూడు తినిపిస్తానని హెచ్చరించారు. పదేండ్ల కాలంలో పేదలకు డబుల్ బెడ్ ఇండ్లు మీరు ఇవ్వకపోవచ్చుగాని కేసీఆర్ మీ కోసం చర్లపల్లిలో డబుల్ బెడ్ రూమ్ కట్టిస్తానని హామీనిచ్చారు. ఎందుకంటే చర్లపల్లి జైలులో మీరు, మీ బిడ్డ, కొడుకు, అల్లుడు వస్తే ఉండనీకి డబుల్ బెడ్ రూమ్ కావాల్సిందేనన్నారు. ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు కట్టించిన చోట తాము ఓట్లు అడుగుతామనీ, కేసీఆర్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించిన దగ్గర అడుక్కోవాలని సవాల్ విసిరారు. రాష్ట్రంలో నాలుగు లక్షల ఇందిరమ్మ ఇండ్ల పనులను రూ. 22,500 కోట్లతో ప్రారంభించామని తెలిపారు. కడుపుకట్టుకుని రాష్ట్ర ప్రజల కోసం రోజుకు 14 గంటలు పనిచేస్తున్నామనీ, తెలంగాణలో కాంగ్రెస్‌ను కనీసం 14 సీట్లలో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. హెలిక్యాప్టర్‌లో తిరుగుతూ, విదేశీ పర్యటనలు చేస్తూ .గంటకో డ్రెస్ మార్చే మోడీని గెలిపించొద్దనీ, ప్రజల కోసం దేశవ్యాప్తంగా పాదయాత్ర చేస్తున్న రాహుల్‌గాంధీని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మోడీ పరివారంపై రాహుల్‌గాంధీ పరివారం విజయం తథ్యమన్నారు.

ఆర్థిక, విద్యుత్ సంక్షోభాన్ని సృష్టిస్తే.. గాడిలో పెడ్తున్నాం : డిప్యూటీ సీఎం భట్టి

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఆర్థిక, విద్యుత్ సంక్షోభాన్ని సృష్టించి సుడిగుండంలా చేసి పోయిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ రెండు వ్యవస్థలను గాడిలో పెట్టామన్నారు. ఒకటో తేదీనే ఉద్యోగులకు, పెన్షనర్లకు జీతాలిస్తున్నామన్నారు. రాహుల్‌గాంధీ నిరంతరం పర్యవేక్షణ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి దిశానిర్దేశం చేస్తూ ముందుకు నడిపిస్తున్నారని తెలిపారు. నరేగా కింద రూ.400 వేతనం ఇస్తామని ప్రకటించడం సంతోషకరమన్నారు. తెలంగాణ మోడల్‌గా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేంద్రంలో తీసుకురావడానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఈ సభలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వర్‌రావు, పార్లమెంట్ స్థానాల్లో పోటీచేస్తున్న అభ్యర్థులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సభలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే

తుక్కుగూడ సభకు హాజరైన తెల్లం వెంకట్రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ శనివారం నిర్వహించిన బహిరంగసభలో ఒక ప్రత్యేక సన్నివేశం చోటు చేసుకుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఏకైక బీఆర్ఎస్ ఎమ్మెల్యే , భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు ఆ సభలో ప్రత్యక్షమయ్యారు. మొదట్నుంచి ఆయన మంత్రి పొంగులేటి అనుచరుడిగా ముద్రపడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తెల్లం చివరిదాకా బీఆర్ఎస్ ఉంటాడా? గోడ దూకి కాంగ్రెస్‌లోకి చేరతాడా? అనే గుసగుసలు వినిపిస్తూ ఉన్నాయి. ఇవి ఇలా వినిపిస్తున్న తరుణంలోనే ఆయన తుక్కుగూడ సభలో ప్రత్యక్షమవడం గమనార్హం. కాకపోతే ఇప్పటిదాకా తెల్లం పార్టీ మారబోతున్నట్టు ప్రకటించలేదు. కాంగ్రెస్ కండువా కప్పుకోలేదు. ఇదే ఇక్కడ హైలెట్.

ప్రజాస్వామ్య రక్షణకు బీజేపీని ఓడించాలి

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్

- వనపర్తిలో ఎం.రాములు సంస్మరణ సభ



నవతెలంగాణ -వనపర్తి

దేశ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకో వడానికి పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ అన్నారు. సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు ఎం.రాములు సంస్మరణ సభను పార్టీ వనపర్తి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పుట్ట ఆంజనేయులు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బి.వెంకట్ మాట్లాడుతూ.. ఎం.రాములు అనారోగ్యంతో మరణించడం బాధాకరమని అన్నారు. విద్యార్థి, ఉపాధ్యాయ, సైన్స్, ట్రేడ్ యూనియన్ ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. కులం- కులతత్వం, మతం - మతతత్వం, శాస్త్రీయ అవగాహన తదితర అనేక అంశాలపై కార్యకర్తలకు అవగాహన క్లాసులు బోధించా రని తెలిపారు. జిల్లా స్టడీ సర్కిల్లో రెగ్యులర్ విద్యార్థిగా ఉండేవారని, నిత్య అధ్యయనశీలి అని కొనియాడారు. సీపీఐ(ఎం) బలోపేతం, సెక్యులర్ శక్తులను బలోపేతం చేయడం.. రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని కాపాడటమే ఆయనకు నిజమైన నివాళి అన్నారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని విమర్శించే వారిని ఈడి, ఐటీ, సీబీఐ తదితర స్వతంత్ర సంస్థల ద్వారా వేధింపులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ వెంట ఉంటే నీతిపరులు, వెలుపల ఉండి వ్యతిరేకిస్తే అవినీతిపరులని ముద్ర వేసి జైల్లోకి పంపుతున్నారన్నారు. అందులో భాగంగానే ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, కవిత తదితరులను జైల్లో పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల బాండ్ల పేరుతో కార్పొరేట్ సంస్థల నుంచి నిధులు కాజేసి ప్రజల ఓట్లకు గాలాలు వేస్తున్న బీజేపీనే దేశంలో అతిపెద్ద అవినీతి పార్టీ అని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు రాయితీలు, సామాన్యులపై భారాలు మోపుతోందని, హిందూ- ముస్లిం తగాదాలు సృష్టించి ఓట్ల రాజకీయం ఆడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సభలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, ఆర్.రామ్‌రెడ్డి, ఏం.నాగిరెడ్డి, ఎం.కృష్ణయ్య, రఘుపతి రెడ్డి, వీరయ్య లెక్చరర్ ఎస్.నారాయణ, ఏపీ మల్లయ్య సీనియర్ జర్నలిస్టు ఉషన్న, రాజారాం ప్రకాష్, ఎం.రాములు భార్య వెంకటేశ్వరమ్మ, కుమారుడు విక్రమ్, అల్లుడు డాక్టర్ శ్రీనివాసులు, బావమరిది చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పేదల గుడిసెలపై పెద్దల కన్ను

(మొదటిపేజీ తరువాయి)

పైడిపల్లి శివారులో ఎస్సారెస్పీ కాలువ సమీపంలోని ప్రభుత్వ భూమిలో 2022 ఆగస్టులో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో స్టాలిన్‌నగర్ పేరుతో 1650 మంది ఇండ్లు లేని నిరుపేదలు గుడిసెలు వేసుకున్నారు. ఈ క్రమంలో పైడిపల్లి కొత్తపేట గ్రామాల రైతులు కూడా గుడిసెవాసులకు సహకరించారు. కానీ, ఆ భూమిపై కన్నేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు పైడిపల్లి కొత్తపేటలోని కొంతమంది రైతులకు మాయమాటలు చెప్పి కోర్టులో దావా వేయించారు. కోర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ, మున్సిపల్ అధికారులు గుడిసె వాసులకు ఎలాంటి నోటీసులూ అందించకుండా శనివారం తెల్లవారుజామున సుమారు 500 మంది పోలీసువు, 20 జేసీబీలతో వచ్చి పేదల ఇండ్లను కూల్చేశారు.

తమకు సొంత ఇండ్లు లేనందు వల్లే ఇక్కడ గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నామని.. కొంత సమయం ఇస్తే ఖాళీ చేస్తామని గుడిసె వాసులు కాళ్లావేళ్లా పడినా అధికారులు కనికరించలేదు. ఎదురు తిరిగిన వారిని నిర్దాక్షిణ్యంగా పోలీసులు లాక్కెళ్లి వ్యాన్‌లోకి ఎక్కించారు. ఈ సందర్భంగా గుడిసెవాసులు మాట్లాడుతూ.. రెండు సంవత్సరాల కిందట పైడిపల్లి శివారులోని ఎస్సారెస్పీ కాలువ వద్ద తాము గుడిసెలు వేసుకున్నామన్నారు. తమకు సొంత ఇండ్లు లేవని, గిరి గిరి చిట్టీలు తీసుకొని సుమారు రూ.50 వేల ఖర్చుతో గుడిసెలు వేసుకొని ఇక్కడే నివసిస్తున్నామని తెలిపారు. స్టాలిన్‌నగర్ అని పేరు పెట్టుకున్నామని తెలిపారు. పోలీసులు అర్ధరాత్రి రెండు గంటల సమయంలో అకస్మాత్తుగా వచ్చి తమ గుడిసెలను కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు సొంత ఇల్లు లేకనే గుడిసెలు వేసుకుని నివసిస్తున్నామని, ప్రభుత్వానికి చేతనైతే తమకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతవరకు తాము ఇక్కడే ఉంటామని స్పష్టం చేశారు.

గుడిసెల కూల్చివేత దుర్మార్గపు చర్య
సీపీఐ(ఎం) వరంగల్ జిల్లా కార్యదర్శి రంగయ్య



పైడిపల్లి శివారులో వందలాది మంది పేదలు గుడిసెలు వేసుకుని రెండు సంవత్సరాలుగా అక్కడే నివాసం ఉంటున్నారు. గత రాత్రి రెవెన్యూ సిబ్బంది పోలీస్ బలగాలతో వచ్చి నిరంకుశంగా ఆ గుడిసెలను కూల్చి వేయడాన్ని ఖండిస్తున్నాం. ఈ భూమి ఎస్సారెస్పీ కాలువ కోసం సేకరించారు. దానికి సంబంధించి భూ యజమానులకు నష్టపరిహారం కూడా చెల్లించారు. ఈ భూమి ఎవరికీ సంబంధించిన పట్టాభూమి కాదు. పూర్తిగా ప్రభుత్వ భూమి. ఒకపక్క పేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు కల్పిస్తామని ప్రభుత్వాలు చెప్పాయి. కాబట్టి ఆ ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెల స్థలాలకు పట్టాలు ఇచ్చి.. పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని.. పేదలందరికీ న్యాయం చేయాలి.

దొందూ దొందే..

(మొదటిపేజీ తరువాయి)

రైతుబంధు రూ.15వేలకు పెంచడంలాంటి ఏ హామీనీ నెరవేర్చకుండా.. రైతులను మోసం చేస్తున్నది.. లక్షల ఎకరాల్లో పంటలు ఎండి పోతున్నా.. కనీసం పట్టించు కోవడం లేదు.. ఎకరాకు రూ.25వేల పరిహారం అందించాలి" అని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా 'రైతు దీక్షలు' చేపట్టారు.

కాంగ్రెస్ తెచ్చిన కరువుతో పంటలు ఎండి రైతులు నష్టపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్ వద్ద రైతు దీక్షలో ఆయన మాట్లాడారు. మేడిగడ్డ నుంచి రోజు 200క్యూసెక్కుల నీళ్లు వృథాగా పోతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వానికి కాళేశ్వరం జలాలను ఎలా సద్వినియోగం చేయాలో తెలియక, నీటిని వదలక పోవడంతోనే పంటలు ఎండిపోయాయని అన్నారు. కాళేశ్వరంలోని 300 పిల్లర్లలో రెండు పిల్లర్లు ఇసుకలో కుంగితే రిపేరు చేయకుండా రాజకీయాలు చేయడం వల్లే పంటలు ఎండే పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతు బోనస్ ఇవ్వాలని అనుకుంటున్నామని ఎన్నికల కమిషన్‌కు లేఖ రాయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ లాగా అడ్డుకోకుండా తాము కూడా బీఆర్ఎస్ పార్టీ తరపున ఎన్నికల కమిషన్‌కు లేఖ రాస్తామని తెలిపారు. మరోవైపు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ నష్టం చేస్తున్నదన్నారు. రైతు దీక్ష తరహాలోనే త్వరలోనే నేతన్నల దీక్ష చేపడతామని వెల్లడించారు.

తమ కార్యకర్తలపై కేసులు పెడుతూ బెదిరింపులు

సంగారెడ్డిలో రైతు దీక్షలో, అలాగే జహీరాబాద్‌లో జరిగిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడారు. తమ పార్టీని, తమను తిట్టడం తప్పా.. కాంగ్రెస్ వారికి అభివృద్ధి గురించి ఆలోచన లేదని విమర్శించారు. కేంద్రంలోని మోడీ సర్కార్ కూడా రైతులకు రుణమాఫీ, మద్దతు ధర ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్, బీజేపీలు దొందూ దొందే అంటూ విమర్శించారు. తమ కార్యకర్తలపై కేసులు పెడుతూ బెదిరిస్తున్నారని.. ఏ ఒక్కరూ భయపడొద్దని, తమ ప్రాణాలను అడ్డుపెట్టైనా కార్యకర్తలకు అండగా నిలుస్తామని ధైర్యం చెప్పారు. బీఆర్ఎస్ నుంచి రెండుసార్లు ఎంపీగా గెలిచిన బి.బి పాటిల్.. తల్లి పాలు తాగి రొమ్ము గుద్దిన వాడు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలన కంటే కుట్రలు, కుతంత్రాలకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని వాణిజ్యభవన్ సెంటర్ వద్ద జరిగిన రైతుదీక్షలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా అధికార పార్టీ యంత్రాంగం మొత్తం క్రికెట్ మోజులో నిమగ్నమయ్యారని విమర్శించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు మంత్రులు గజ దొంగల్లా దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు.

రైతుల పండించిన వరి ధాన్యానికి మద్దతు ధరతో పాటూ రూ. 500 బోనస్‌ను చెల్లించాలని భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన దీక్ష చేపట్టారు. ఆలేరు తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలియజేశారు. ఏ రైతును కదిలించినా కన్నీరే వస్తోందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మహబూబ్‌నగర్ తెలంగాణ చౌరస్తాలో చేపట్టిన రైతు దీక్షలో అన్నారు.

ఖమ్మం జిల్లా కల్లూరులో మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో రైతు నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. రాష్ట్రం నుంచి పార్లమెంట్‌లో బీజేపీ ఎంపీలు నలుగురు, కాంగ్రెస్ ఎంపీలు ముగ్గురు ఉన్నారని ఏనాడూ తెలంగాణ అభివృద్ధి కోసం మాట్లాడిన దాఖలాలు లేవని విమర్శించారు. జనగామలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బాన్సువాడలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి రైతు దీక్ష చేపట్టారు.

జైలుకు పోత కానీ పార్టీ మారను : ఎర్రబెల్లి

పాలకుర్తి దీక్షలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ మాట్లాడుతూ.. తాను జైలుకు పోత.. కానీ పార్టీ మారే ప్రసక్తే లేదన్నారు. హామీల అమలు అడిగితే కేసులతో భయపెడుతున్నారని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీని టీఆర్ఎస్‌గా మార్చే ఆలోచన చేస్తున్నామని అన్నారు.

అంతా మీవల్లే..

(మొదటిపేజీ తరువాయి)

12శాతానికి పెంచి నేతన్నల నడ్డి విరిచిందన్నారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ కార్మికవర్గంపై చిన్న చూపు చూస్తోందని విమర్శించారు. ఆయా కార్పొరేట్ కంపెనీలకు పెద్దపీట వేస్తూ బహుళజాతి కంపెనీల పనులు వేగంగా జరిగేలా సాయం అందిస్తున్న కేంద్రం.. ఏండ్లుగా చాలీచాలని వేతనాలతో కార్మికులు, నష్టాల్లో నడుస్తున్న వస్త్ర పరిశ్రమను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో గత సర్కారు ఈ ప్రాంత పరిశ్రమకు ఇచ్చిన ఆర్డర్ల బకాయిలు చెల్లించకపోవడం, ఇప్పుడున్న సర్కారు కనీసం దాని గురించి ఆలోచించకపోవడం బాధాకరమని అన్నారు. రాయితీపై యారన్, కరెంటు కూడా ఇవ్వలేదన్నారు. కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో కార్మికుల కోసం నిర్మించిన అపరల్ పార్క్‌లోని షెడ్లల్లో తొండలు గుడ్లు పెడుతున్నాయని ఎద్దేవా చేశారు. మూన్నెళ్లుగా ఉపాధి లేక 30వేల మంది కార్మికులు రోడ్డునపడ్డారని, తినడానికీ తిండి లేక ఆత్మహత్య చేసుకునే దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొద్ది రోజుల కిందట పవర్‌లూమ్ కార్మికుడు శ్రీనివాస్, శనివారం మరో కార్మికుడు సిరిపురం సత్యనారాయణ ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకోవడమే ఇందుకు అద్దం పడుతోందన్నారు. సిరిసిల్ల మళ్లీ ఉరిసిల్లగా మారే ప్రమాదం ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులెవరూ ప్రాణం తీసుకోవద్దని, ధైర్యంగా ఉండాలని అన్నారు. సమస్య పరిష్కారం కోసం పోరాడుదామని, దీన్ని రాజకీయ కోణంలో కాకుండా ప్రజా సమస్యగా చూడాలని ప్రభుత్వానికి సూచించారు. పాలక, ప్రతిపక్షాలు ఒకరిపైనొకరు ఆరోపణలు చేసుకోకుండా ఈ ప్రాంత వస్త్ర పరిశ్రమ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నేతన్నల సమస్యలు పరిష్కరించాలని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్లను కోరినట్టు తెలిపారు. స్పందించిన మంత్రులు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారని చెప్పారు. నేతన్నలకు ఉపాధి కల్పించి, సిరిసిల్ల గుండె చప్పుడును కాపాడాలన్నారు. ఈ నేతన్నల మహాగర్జనలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్, సీఐటీయూ రాష్ట్ర పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్, సీఐటీయూ, ఇతర సంఘాల జిల్లా నాయకులు మూషం రమేష్, పంతం రవి, కోడం రమణ, తాటిపాముల దామోదర్, మంచే శ్రీనివాస్, మండల సత్యం, వెళ్లండి దేవదాస్, సిరిసిల్ల రవీందర్, మోర రాజు, లక్ష్మీనారాయణ, వస్త్ర పరిశ్రమ అనుబంధ రంగాల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



అప్రజాస్వామికం

- గుడిసెవాసులకు పట్టాలిచ్చి ఇండ్ల నిర్మాణానికి రూ.5 లక్షలివ్వాలి
- అక్రమంగా అరెస్టు చేసిన బషీర్‌ను తక్షణమే విడుదల చేయాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వరంగల్ నగరంలో పైడిపల్లి- కొత్తపేట శివారులోని ప్రభుత్వ భూమిలో రెండున్నరేండ్లుగా గుడిసెలు వేసుకుని జీవిస్తున్న 1,200 మంది పేదలపై శుక్రవారం రాత్రంతా పోలీసులు విధ్వంసం సృష్టించారని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ తెలిపింది. స్టాలిన్ నగర్‌గా పేరుపెట్టుకున్న ఆ ప్రాంతం మొత్తాన్ని ధ్వంసం చేశారని విమర్శించింది. పేదలకు ఇండ్ల పట్టాలిస్తామనీ, ఇందిరమ్మ ఇండ్లు కట్టుకోవడానికి రూ.ఐదు లక్షలు సహాయం చేస్తామంటూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేసింది. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న ఆ పేదలకు పట్టాలు ఇవ్వొచ్చునీ, ఇండ్లు కట్టుకోవడానికి సహాయం చేయొచ్చని పేర్కొంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం అందుకు భిన్నంగా, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నదనీ, ఈ ధోరణిని తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పేదలు గుడిసెలు వేసుకున్నందుకు స్థానిక రైతులకు కూడా కొంత సౌలభ్యం ఏర్పడిందని తెలిపారు. పక్కనున్న వ్యవసాయ మార్కెట్‌లో కూడా కొన్ని సౌకర్యాలు ఏర్పడ్డాయని వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో స్థానిక గ్రామీణ ప్రజలు, ఈ గుడిసె వాసులు పరస్పరం సహకరించుకుంటూ సంతోషంగా ఉన్న సమయంలో ఉన్నట్టుండి పోలీసులు విరుచుకుపడ్డారని పేర్కొన్నారు. సీపీఐ(ఎం) నాయకుడు బషీర్‌ను అరెస్టు చేశారని తెలిపారు. ఇతర నాయకుల కోసం ఇప్పుడు వెతుకుతున్నారని వివరించారు. ఇంతకంటే అన్యాయం ఏముంటదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజాస్వామ్యం పునరుద్ధరించబడిందంటూ ప్రకటించారని గుర్తు చేశారు. కానీ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత మహబూబాబాద్‌లో గుడిసెలను కూల్చివేశారని తెలిపారు. ఆ తర్వాత హన్మకొండలో ఒక కేంద్రంలో, జగిత్యాల, కోరుట్లలో గుడిసెలను ధ్వంసం చేశారని విమర్శించారు. జగిత్యాల, కోరుట్లలో గుడిసెలు ధ్వంసం చేసేటప్పుడు 307 సెక్షన్ కింద కూడా కేసులు పెట్టి నాయకులను 33 రోజులు జైలులో పెట్టారని తెలిపారు. తర్వాత బచ్చన్నపేటలో గుడిసెలు ధ్వంసం చేసి, ఇప్పుడు మళ్లీ వరంగల్‌లోని స్టాలిన్‌నగర్‌లో గుడిసెలను ధ్వంసం చేయడం ప్రజాస్వామ్య పునరుద్ధరణ అనిపించుకోదని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ గుడిసె వాసులకు పట్టాలిచ్చి, ఇండ్లు కట్టుకోవడం కోసం ప్రతి కుటుంబానికీ రూ.ఐదు లక్షల సహాయం చేయాలని డిమాండ్ చేశారు. అక్రమంగా అరెస్టు చేసిన బషీర్‌ను తక్షణమే విడుదల చేయాలని కోరారు. గుడిసెవాసులపై కేసులు పెట్టొద్దని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు.

ఎక్కువసేపు కదలకుండా కూర్చుంటున్నారా?

అదేపనిగా ఎక్కువ సేపు కూర్చునే వారిలో మరణ ప్రమాదం ఇతరులతో పోల్చితే 16 శాతం ఎక్కువగా ఉంటుందని పరిశోధనల్లో తేలింది. తైవాన్‌లో ఇటీవల నిర్వహించిన పరిశోధనకు సంబంధించిన వివరాలను నెట్‌వర్క్ ఓపెన్ జర్నల్‌లో ప్రచురించారు. ఎక్కువ సేపు కూర్చునే వారిపై 13 ఏండ్ల పరిశోధన తర్వాత దీన్ని విడుదల చేశారు.

అదేపనిగా గంటలతరబడి కూర్చొని పనిచేసే వారిలో గుండె సంబంధిత వ్యాధుల వచ్చే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. 4,81,688 మంది వ్యక్తులపై జరిపిన అధ్యయనం తర్వాత, ఇతర వ్యక్తులతో పోలిస్తే అలాంటి వారికి హృదయ సంబంధ వ్యాధులతో మరణించే ప్రమాదం 34 శాతం ఎక్కువగా ఉందని తేలింది. ఇతర వ్యాధుల వల్ల మరణించే ప్రమాదం కూడా 16 శాతం ఎక్కువట.

ఎక్కువసేపు కూర్చోవడం వల్ల బ్లడ్ షుగర్, అధిక రక్తపోటు, ఊబకాయం, నడుము చుట్టూ కొవ్వు పేరుకుపోయే ప్రమాదం పెరుగుతుంది. ఇది కొలెస్ట్రాల్ సమస్యలను కలిగిస్తుంది.

మహిళలు మరింత జాగ్రత్త..

రోజంతా కూర్చొని జిమ్‌కి వెళ్లినా ఉపయోగం లేదని పరిశోధకులు చెబుతున్నారు. ఒక నివేదిక ప్రకారం, ఊబకాయం, కొలెస్ట్రాల్, అధిక రక్తపోటు వంటి ప్రమాదకరమైన వ్యాధులు మహిళల్లో వేగంగా వ్యాప్తి చెందుతాయి. ఇలాంటి వారు తమ ఫిట్‌నెస్‌పై శ్రద్ధ వహించి, ఎక్కువసేపు కూర్చోవద్దని సూచిస్తున్నారు. ■

నన్ను నేను ప్రశ్నించుకుంటూ...



ప్రయాణం నేడు చాలా మందికి ఓ ప్రేరణ. భారత వైమానిక దళంలో రెండవ బ్యాచ్‌లో చేరిన 25 మంది మహిళల్లో ఈమె కూడా ఒకరు. అక్కడ ఆరేండ్ల పని తర్వాత ఆమె ఐటీ పరిశ్రమలో చేరారు. ఇప్పుడు డెల్ టెక్నాలజీస్‌లో సీనియర్ నాయకురాలిగా, సామాజిక ప్రయోజనాల కోసం సాంకేతికతపై మక్కువ పెంచుకున్నారు. ఆ రంగంలో అనేక ముఖ్యమైన కార్యక్రమాలు, ప్రాజెక్ట్‌లకు నాయకత్వం వహిస్తున్నారు. వైమానిక దళ అధికారి నుండి టెక్ లీడర్ వరకు ఎదిగిన ఆమె విజయ ప్రస్థానం నేటి మానవిలో...



కర్నాటకలోని బెలగావి (అప్పటి బెల్గాం) పట్టణంలో పెరిగిన తేజ చిన్నతనం నుండి చురుకైన అమ్మాయి. ఆమె తండ్రి డాక్టర్. దాంతో ప్రతి పనికీ ఓ శాస్త్రీయ కారణం ఉందని నమ్ముతాడు. యుక్త వయసులో తేజ అనేక ప్రశ్నలు అడగేది. సమాధానాల కోసం అన్వేషించేది. ఇదే ఆమెను DIY ప్రాజెక్ట్‌లలో నిమగ్నమయ్యేలా చేసింది. నేర్చుకోవడం పట్ల ఉన్న ఆసక్తి జీవితకాల అభిరుచికి పునాది వేసింది. డెల్ టెక్నాలజీస్‌లో ప్రస్తుతం వైస్ ప్రెసిడెంట్ (ఐటీ)గా ఉన్న ఆమెకు ఇందులో 25 ఏండ్లకు పైగా అనుభవం ఉంది. ఆమె మొదటి సారి ప్రేమలో పడింది ఖగోళశాస్త్రంపై అని గుర్తుచేసుకుంది. అయితే అక్కడ పరిస్థితులు ఆమెకు అనుకూలంగా లేవు. '1990ల ప్రారంభంలో మా బెలగావిలో ఖగోళ శాస్త్రాన్ని బోధించే కాలేజీ లేదు. ఆ చదువు కోసం బెంగళూరు కానీ, పూణే కానీ వెళ్ళాలి. నాకు అటు వెళ్ళే అవకాశం లేదు. ఖగోళ శాస్త్రం అంటే రాత్రిపూట ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తుందని ఇంట్లో చదువుకు నో చెప్పేశారు. నా తదుపరి ఆలోచన ఇంజినీరింగ్, రేడియో ఖగోళ శాస్త్రానికి మారడం' ఆమె చెప్పారు.

యూనిఫాంలో కెరీర్

తేజ కర్నాటక్ యూనివర్సిటీలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ కోర్సు మూడో ఏడాది చదువుతుండగా ఆమె జీవితం మలుపు తిరిగింది. భారతీయ వైమానిక దళం మొదటిసారిగా నాన్-మెడికల్ ప్రాంతాల్లోని మహిళల కోసం తలుపులు తెరిచింది. అందులో ఆమె సీనియర్లు ఇద్దరు చేరారు. యూనిఫారంలో ఉన్న స్త్రీలను చూడటం ఆమెకు ఉత్సాహంగా అనిపించింది. వారి ఉద్యోగం కూడా సవాలుగా అనిపించింది. 'నేనూ నా చివరి ఏడాదిలో ఉన్నప్పుడు దరఖాస్తు చేసుకున్నాను. రెండవ బ్యాచ్ మహిళా అధికారులలో చేరడానికి షార్ట్‌లిస్ట్ చేసిన టాప్ 25 మంది మహిళల్లో నేనూ ఉన్నాను. బెంగుళూరులోని జలహళ్లిలోని ఎయిర్‌ఫోర్స్ టెక్నికల్ కాలేజీలో మా ప్రాథమిక శిక్షణ. తర్వాత నాకు మౌంట్ అబూకిలో పోస్టింగ్ ఇచ్చారు' అని ఆమె చెప్పారు.

ఎయిర్ హోస్టెస్‌లా అనేవారు

ఈ యూనిఫాం తేజాకు మంచి గుర్తింపును తెచ్చిపెట్టింది. బెంగళూరులోని బ్రిగేడ్ రోడ్డులో యూనిఫారంలో నడుచుకుంటూ వస్తున్న ఆమె వద్దకు ప్రజలు వచ్చేవారు. భారత వైమానిక దళంలో మహిళా అధికారుల ప్రవేశంపై మీడియా హర్షం వ్యక్తం చేయడాన్ని ఆమె గుర్తు చేసుకున్నారు. 'కొంతమంది మమ్మల్ని ఎయిర్ హోస్టెస్‌లా అని అడిగారు. ఎందుకంటే అప్పట్లో మహిళలు ఈ రంగంలో ఉంటారనే సంగతే తెలీదు' ఆమె నవ్వుతూ చెప్పారు. మౌంట్ అబూ వద్ద అధికారులు, ఎయిర్‌మెన్‌లతో సహా 300 మంది సిబ్బంది ఉన్న ఆ స్టేషన్‌లో ఇద్దరు మహిళల్లో తేజా ఒకరు. మహిళలకు ప్రత్యేక వాష్‌రూమ్ లేదు. పైగా ఇంతకు ముందు మహిళల నుండి సూచనలు తీసుకోని పురుషుల్లో తమ పట్ల నమ్మకాన్ని పెంచుకోవడం వారికి సవాలుగా ఉండేది. తర్వాత కాలంలో ఆమె నాసిక్, బెంగళూరులో కూడా పని చేశారు. ఒక పెద్ద స్టేషన్‌కు సంబంధించిన మొత్తం సిగ్నల్స్ యూనిట్‌ను కమాండ్ చేసే అవకాశాన్ని పొందారు.

మూస పద్ధతులను బద్దలు కొట్టి

ఐటీ బూమ్ భారతదేశాన్ని తాకినప్పుడు పరిస్థితి మారిపోయింది. అప్పటికే పరిశ్రమలో ఉన్న తేజా సోదరుడు దాని వృద్ధి, ప్రయాణాలతో కూడిన ఉత్తేజకరమైన సంఘటనల గురించి ఆమెకు చెప్పాడు. తన ఆరేండ్ల షార్ట్ సర్వీస్ కమీషన్ పూర్తి చేసి, వైమానిక దళాన్ని విడిచిపెట్టి, ఐటీ పరిశ్రమకు తగిన శిక్షణతో టీసీఎస్‌లో డెవలపర్‌గా చేరారు. 'నేను ఈ రంగానికి కొత్త కాబట్టి వేతనం కూడా తక్కువే. ఏడాది తర్వాత నాకు డెన్మార్క్ వెళ్లే అవకాశం వచ్చింది. తిరిగి వచ్చిన తర్వాత టెలికాం డొమైన్‌లోని విప్రో టెక్నాలజీస్‌లో చేరాను' అని ఆమె చెప్పారు. 2005లో ఆమె డెల్ టెక్నాలజీస్‌లో మేనేజర్‌గా చేరారు. అప్పటి నుండి కెరీర్ పరంగా పురోగతి సాధిస్తూనే ఉన్నారు. ప్రస్తుతం కంపెనీలో వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. లింగ మూస పద్ధతులను బద్దలు కొట్టి భారతదేశంలో డెల్ ఐటీలో డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన మొదటి మహిళ తేజా అని చెప్పవచ్చు. డెల్ టెక్నాలజీస్‌లో ఆమె సామాజిక ప్రయోజనాల కోసం ఆమె టెక్ సీఎస్ఆర్‌ని ప్రారంభించి దానికి నాయకత్వం వహిస్తున్నారు.

విజయం అంటే ఏమిటి?

'నేను నేర్చుకున్న విషయం ఇతరులు ఎదగడానికి ఎలా సహాయపడుతుందని నన్ను నేను ప్రశ్నించుకుంటాను. తమ ప్రాధాన్యం, సమయ నిర్వహణపై మహిళల కోసం సెషన్‌లను నిర్వహిస్తాను. విజయం అంటే ఏమిటి? పైకి చేరుకోవడం అని నేను అంటారు. NASSCOMలో నేను హాజరైన సెషన్‌లలో ఒక గ్లోబల్ కంపెనీ సీఎఫ్ఓ విజయం గురించి మాట్లాడుతూ 'ప్రజలు ఏమి కోరుకుంటున్నారో అనవసరం. తోటివారి ఒత్తిడి మీ విజయాన్ని నిర్వచించకూడదు' అన్నారు. ఇది నా మనసును బాగా తాకింది' అంటూ ఆమె తన మాటలు ముగించారు.

- సలీమ

సవాళ్లను పరిష్కరించడంలో

'గత ఎనిమిది నెలలుగా నేను కృత్రిమ మేధ ఆధారితమైన ఏఐ ఆప్స్ విశ్వసనీయత ఇంజనీరింగ్, డిజిటల్ పరివర్తనలో నిమగ్నమై ఉన్నాను. మేము ఈ ఏఐ ఆప్స్ ప్లాట్‌ఫారమ్‌ను మార్చడానికి Gen AIని ప్రభావితం చేయదానికి ప్రయత్నిస్తున్నాం. మరింత సమర్థవంతంగా చేయదానికి చూస్తున్నాం' అని ఆమె వివరించారు. మహిళలు నిచ్చెన ఎక్కేటప్పుడు వారికి రోల్ మోడల్‌లు, మార్గదర్శకులు ముఖ్యమని తేజా అభిప్రాయం. డెల్ టెక్నాలజీస్‌లో గొప్ప ప్రోగ్రామ్‌లను మహిళలు అందిస్తున్నప్పటికీ వారి సవాళ్లను పరిష్కరించడంలో ఆసల్యం జరుగుతుందని అన్నారు. 'ఇంజనీరింగ్‌లో మా క్లాసులో నలుగురు అమ్మాయిలమే ఉండేవాళ్ళం. నేడు ఈ సంఖ్య దాదాపు సమానంగా ఉంది. సమాజం కూడా అభివృద్ధి చెందింది. నా కుటుంబంలో నేను మొదటి మహిళా ఇంజనీర్. ఇప్పుడు చాలా మంది ఉన్నారు. ఇది స్వాగతించ దగిన మార్పు' ఆమె చెప్పింది.



ఇంకేదైనా చేయాలని

మేము సీఎస్ఆర్ కార్యకలాపాలపై దృష్టి కేంద్రీకరించి సాంకేతికతతో ఇంకేదైనా చేయాలని భావించాను. బ్రెయిలీ పాఠ్యపుస్తకాలను రూపొందించడంలో సహాయం చేయడానికి దృష్టి లోపం ఉన్నవారి కోసం పనిచేసే మిత్ర జ్యోతి అనే ఎన్‌జీఓతో కలిశాము. మహమ్మారి సమయంలో వలస కార్మికుల పునరావాసం కోసం బుద్ధ ఫౌండేషన్ మమ్మల్ని సంప్రదించింది. దీని కోసం మేము మొబైల్ ఆధారిత పరిష్కారాన్ని రూపొందించాము. కర్ణాటక ప్రభుత్వ అభ్యర్థన మేరకు పిల్లలు, పౌరుల్లో సైబర్ సెక్యూరిటీ అవగాహన కోసం గేమిఫికేషన్ సొల్యూషన్‌ను కూడా రూపొందించాము. ప్రస్తుతం నేను 300 మంది వాలంటీర్లతో కలిసి పనిచేస్తున్నాను. ఈ ప్రయాణం నన్ను ఎంతో ఉత్తేజపరుస్తోంది.



హుష్..మాయం!

న్యూఢిల్లీ : 11, 12 తరగతులకు సంబంధించిన ఎన్సీఈఆర్టీ పాఠ్యపుస్తకాల నుండి మరికొన్ని ప్రస్తావనలు అదృశ్యమయ్యాయి. అయోధ్యలో బాబ్రీ మసీదు కూల్చివేత, గుజరాత్ హింసలో ముస్లింల ఊచకోత, మణిపూర్ ఘర్షణలు, జమ్మూకాశ్మీర్‌పై భారత్ వైఖరి...వంటి అంశాల ప్రస్తావన ఇకపై మనకు ఈ పుస్తకాలలో కన్పించదు. ఎన్సీఈఆర్టీ చేసిన ఈ మార్పులు ఆన్‌లైన్ పాఠ్యపుస్తకాలలో కన్పించనప్పటికీ పాఠ్య పుస్తకాలను త్వరలోనే సవరిస్తామని అధికారులు తెలిపారు. 'రాజకీయాలలో చోటుచేసుకున్న తాజా మార్పులను దృష్టిలో పెట్టుకొని అయోధ్యకు సంబంధించిన అంశాన్ని కూలంకషంగా సమీక్షించడం జరిగింది. ఎందుకంటే సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తాజాగా కొన్ని మార్పులు చేసింది. వాటికి పెద్ద ఎత్తున మద్దతు లభించింది' అని ఎన్సీఈఆర్టీ వివరణ ఇచ్చింది.

గుజరాత్ అల్లర్ల ఊసే లేదు

11వ తరగతి రాజకీయ శాస్త్ర పాఠ్య పుస్తకంలోని ఐదవ ఛాప్టర్‌లో (ప్రజాస్వామిక రాజకీయాలు-1) ఉన్న గుజరాత్ అల్లర్ల అంశాన్ని తొలగించారు. 86వ పేజీలో ఇలా ఉంది...'ఈ పేజీలో జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు సంబంధించిన ప్రస్తావనను మీరు గమనించారా? ఈ ప్రస్తావనలు మానవ హక్కులపై పెరుగుతున్న అవగాహనను, మానవ గౌరవానికి ఎదువుతున్న ఇబ్బందులను ప్రతిబింబిస్తున్నాయి. వివిధ రంగాలలో మానవ హక్కుల ఉల్లంఘనలకు సంబంధించిన అనేక కేసులు...ఉదాహరణకు గుజరాత్ అల్లర్లనే తీసుకోండి. వీటిని దేశవ్యాప్తంగా ప్రజల దృష్టికి తీసుకుపోవడం జరుగుతోంది' అని ఉంది. దీనిని ఇలా మార్చారు. 'వివిధ రంగాలలో మానవ హక్కుల ఉల్లంఘనలకు సంబంధించిన అనేక కేసులను దేశవ్యాప్తంగా ప్రజల దృష్టికి తీసుకుపోవడం జరుగుతోంది' అని మార్చేశారు. అంటే గుజరాత్ అల్లర్ల ప్రస్తావనను తొలగించారు.

ముస్లింల ఊచకోత ప్రస్తావనే లేదు

11వ తరగతి రాజకీయ శాస్త్రం పాఠ్య పుస్తకంలోని 112వ పేజీలో 'రాజకీయ సిద్ధాంతం' అనే ఛాప్టర్‌లోనూ, 'లౌకికతత్వం' అనే ఎనిమిదో ఛాప్టర్‌లోనూ కొన్ని ప్రస్తావనలను ఎన్సీఈఆర్టీ తొలగించింది. ప్రస్తుతం ఆ ఛాప్టర్‌లో ఇలా ఉంది. '2002లో గుజరాత్‌లోని గోద్రాలో జరిగిన అల్లర్ల తర్వాత అనేకమంది ముస్లింలు సహా వెయ్యి మందికి పైగా ప్రజలను ఊచకోత కోశారు'. ఇకపై దీనిని ఇలా మారుస్తారు. '2002లో గుజరాత్‌లోని గోద్రాలో జరిగిన అల్లర్ల తర్వాత వెయ్యి మందికి పైగా ప్రజలను చంపేశారు' ఇలా మార్చడానికి ఎన్సీఈఆర్టీ ఏమని కారణం చెప్పిందంటే... ఏ అల్లర్లలో అయినా మతాలకు అతీతంగా ప్రజలు ఇబ్బందులు పడతారట. అది కేవలం ఏదో ఒక మతానికే పరిమితం కాదట.

బాబ్రీ కూల్చివేత కూడా...

12వ తరగతి రాజకీయ శాస్త్ర పాఠ్య పుస్తకంలో 'భారత రాజకీయాల్లో తాజా పరిణామాలు' పేరిట ఎనిమిదో ఛాప్టర్ ఉంది. అందులోని 136వ పేజీలో ఇలా ఉంది. 'రాజకీయ సమీకరణకు రామజన్మభూమి ఉద్యమం, అయోధ్యలో బాబ్రీ మసీదు కూల్చివేతల వారసత్వం ఏమిటి?'. సవరించిన పాఠ్యపుస్తకంలో ఈ వాక్యం ఇలా ఉంది. 'రామ జన్మభూమి వారసత్వం ఏమిటి?'.

ఇదే ఛాప్టర్‌లో బాబ్రీ మసీదు కూల్చివేత అంశాన్ని తొలగించారు. 139 పేజీలో ఇలా ఉంది. '1992లో అయోధ్యలోని వివాదాస్పద కట్టడం (బాబ్రీ మసీదు అంటారు) కూల్చివేతలో అనేక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఉదంతం దేశ రాజకీయాలలో అనేక మార్పులు తెచ్చింది. భారతీయ జాతీయతావాదం, లౌకికతత్వ స్వభావంపై విస్తృత చర్చ జరిగింది. బీజేపీ, హిందూత్వ రాజకీయాల ఉద్ధానానికి, ఈ పరిణామాలకు సంబంధం ఉంది'. అయితే దీనిని ఇలా మార్చేశారు. 'అయోధ్యలోని రామజన్మభూమి దేవాలయంపై శతాబ్దాలుగా నెలకొన్న చట్టపరమైన, రాజకీయ వివాదం దేశ రాజకీయాలను ప్రభావితం చేయడం మొదలు పెట్టింది. అది అనేక రాజకీయ మార్పులకు కారణమైంది. రామజన్మభూమి మందిర ఉద్యమం కేంద్ర బిందువుగా మారింది. ప్రజాస్వామ్యం, లౌకికవాదంపై చర్చలు, సంభాషణలు మొదలయ్యాయి. సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు (2019 నవంబర్ 9న) నేపథ్యంలో అయోధ్యలో రామమందిర నిర్మాణానికి ఈ మార్పులు దారితీశాయి' అని మార్చారు.

మాయమైన 'మణిపూర్'

12వ తరగతి పుస్తకంలోని మొదటి ఛాప్టర్‌లో మణిపూర్ ప్రస్తావన ఉంది. అందులో ఏముందంటే...మణిపూర్‌లో ప్రజలు ఎన్నుకున్న శాసనసభను సంప్రదించకుండానే 1949 సెప్టెంబరులో విలీన ఒప్పందంపై సంతకం చేసేలా మహారాజుపై ఒత్తిడి తేవడంలో భారత ప్రభుత్వం విజయం సాధించింది. ఈ చర్య మణిపూర్‌లో ఆగ్రహానికి, తిరుగుబాటుకు కారణమైంది. ఆ పరిణామాలు ఇప్పటికీ కన్పిస్తూనే ఉన్నాయి....సవరించిన పాఠ్యాంశంలో మణిపూర్ ప్రస్తావనను తొలగించారు. దానిలో ఇలా ఉంది. '1949 సెప్టెంబరులో విలీన ఒప్పందంపై సంతకం చేసేలా మహారాజును ఒప్పించడంలో భారత ప్రభుత్వం విజయం సాధించింది'.

భారత్, పాక్ వివాదాన్ని సైతం...

119వ పేజీలోని ఛాప్టర్ 7లో 'ప్రజల ఆకాంక్షలు' పేరిట ఉన్న పాఠ్యాంశం భారత్, పాకిస్తాన్ మధ్య నెలకొన్న సరిహద్దు వివాదాన్ని ప్రస్తావించింది. అందులో ఇలా ఉంది. 'ఈ ప్రాంతం చట్టవిరుద్ధ ఆక్రమణలో ఉన్నదని భారత్ వాదిస్తోంది.

పాకిస్తాన్ ఈ ప్రాంతాన్ని ఆజాద్ పాకిస్తాన్ అని పిలుస్తోంది'. మార్చేసిన పాఠ్యాంశంలో ఏమని ఉందంటే...అయితే అది పాకిస్తాన్ చట్టవిరుద్ధంగా ఆక్రమించిన భారత భూభాగం పాకిస్తాన్ ఆక్రమిత జమ్మూకాశ్మీర్ (పీఓజేకే). జమ్మూకాశ్మీర్‌కు సంబంధించి భారత ప్రభుత్వ తాజా వైఖరికి అనుగుణంగా ఈ మార్పును తీసుకొచ్చామని ఎన్సీఈఆర్టీ తెలిపింది.

వామపక్షాలకు కొత్త భాష్యం

వామపక్షాలకు ఎన్సీఈఆర్టీ కొత్త నిర్వచనం ఇచ్చింది. 12వ తరగతి పాఠ్యపుస్తకంలోని ఛాప్టర్ 3లో ప్రస్తుతం ఏముందంటే 'వామపక్షాలు పేదలు, అట్టడుగు వర్గాలకు అనుకూలంగా వ్యవహరిస్తాయి. ఈ వర్గాల కోసం తీసుకునే ప్రభుత్వ విధానాలను సమర్థిస్తాయి'. దీనిని ఎలా మార్చేసారో చూడండి. 'ఆర్థిక వ్యవస్థపై ప్రభుత్వ నియంత్రణకు మద్దతు ఇచ్చే వారిని గురించి వామపక్షాలు మాట్లాడతాయి. స్వేచ్ఛాయుత పోటీపై ప్రభుత్వ నియంత్రణలను ఇష్టపడతాయి'.

ఇక 'ప్రజాస్వామిక రాజకీయాలు' పేరిట 10వ తరగతి సాంఘిక శాస్త్ర పాఠ్య పుస్తకంలో ప్రస్తుతం ఉన్న తృణమూల్ కాంగ్రెస్, సీపీఐ, ఎన్సీపీ ప్రస్తావనలను 4వ చాప్టర్ నుంచి తొలగించారు. ఆమ్‌ఆద్మీ పార్టీ, నేషనల్ పీపుల్స్ పార్టీలను చేర్చారు. ఈ మార్పులకు ఎన్సీఈఆర్టీ చెప్పిన కారణమేమిటో తెలుసా? సీపీఐ, ఎన్సీపీలు జాతీయ పార్టీలు కావట. అందుకే ఆయా పార్టీల ప్రస్తావనలను తొలగించారట. వాటి స్థానంలో ఆమ్‌ఆద్మీ, నేషనల్ పీపుల్స్ పార్టీలను చేర్చారట. ఈ రెండు పార్టీలనూ 2023లో ఎన్నికల కమిషన్ జాతీయ పార్టీలుగా ప్రకటించిందని ఎన్సీఈఆర్టీ గుర్తు చేసింది.

ఎన్సీఈఆర్టీ 12వ తరగతి రాజకీయ శాస్త్రం పాఠ్య పుస్తకంలోని ఛాప్టర్ 7లో ఓ పేరాను సవరించి, అందులో ఆర్టికల్ 370 రద్దును ప్రస్తావించింది. గతంలో ఏముందంటే...అనేక రాష్ట్రాలకు సమాన అధికారాలు ఉన్నాయి. ఈశాన్య ప్రాంతంలోని జమ్మూకాశ్మీర్ వంటి కొన్ని రాష్ట్రాలకు ప్రత్యేక అధికారాలు ఉన్నాయి...ఈ పేరాను సవరించి ఇలా మార్చారు....అయితే జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేకాధికారాలు కల్పించే ఆర్టికల్ 370ని 2019 ఆగస్టులో రద్దు చేయడం జరిగింది.

ప్రజా సమస్యలపై కొట్లాడేందుకు కమ్యూనిస్టులు అవసరం

(మొదటిపేజీ తరువాయి)

సాయుధ రైతాంగ పోరాట వారసత్వం కలిగి ఉందన్నారు. భూ పోరాటాలతో పాటు తాగు, సాగు నీటి కోసం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అవిశ్రాంత పోరాటాలు నిర్వహించి విజయం సాధించామన్నారు. భువనగిరి పార్లమెంటు సరిహద్దులు ఇతర పార్టీల అభ్యర్థులకు తెలుసా అని ప్రశ్నించారు. ఈ నియోజకవర్గంలో ఏనాడైనా ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పోరాటాలు చేశాయా అని నిలదీశారు. గత యూపీఏ ప్రభుత్వంలో వామపక్షాల బలం ఉన్న కారణంగానే జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని సాధించుకున్నామన్నారు. అటవీ హక్కుల చట్టాన్ని సాధించుకున్నామన్నారు. బీజేపీ అధికారం చేపట్టిన తర్వాత ఈ చట్టాలను తుంగలో తొక్కుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ సరైన పంథాలో పోరాటాలు నిర్వహించడం లేదని విమర్శించారు. లౌకిక విలువలను కాపాడటంలో విఫలమైనదన్నారు.

భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి ఎండి జహంగీర్ మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం తెలంగాణ పట్ల వివక్ష చూపిందన్నారు. ఈ ప్రాంతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీకి ఓటు అడిగే నైతిక హక్కు లేదని విమర్శించారు. అభ్యుదయవాదులకు, అవకాశవాదులకు మధ్య ఈ పోటీ జరుగుతున్నదన్నారు. డబ్బులు వెదజల్లి గెలవాలని చూస్తున్న పార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. కమ్యూనిస్టు పార్టీ చరిత్ర ఏంటో ఈ ప్రాంత ప్రజలందరికీ తెలుసన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులను ఇంకా ఎన్ని సంవత్సరాలు కొనసాగిస్తారని ప్రశ్నించారు. సరైన ప్రణాళిక లేకపోవడం వల్ల అనేక ప్రాజెక్టులు వెనుకబడుతున్నాయన్నారు. తెలంగాణకు ఎయిమ్స్ ఇచ్చినా కనీస వసతులు కల్పించడం లేదని, 44 డిపార్ట్‌మెంట్లు ఉంటే 20 డిపార్ట్‌మెంట్లు మాత్రమే పని చేస్తున్నాయని చెప్పారు. మూసీ ప్రక్షాళనతో పాటు ముందు మూసీని శుద్ధి చేయాలని డిమాండ్ చేశారు. భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధి కమ్యూనిస్టులతోనే సాధ్యమవుతుందన్నారు. ఆ పోరాట వారసత్వం కలిగిన కమ్యూనిస్టు అభ్యర్థిగా తాను ప్రజల ముందుకు వెళుతున్నామని చెప్పారు. ఆదరించి, అభిమానించి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కడిగల్ల భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీరాంనాయక్, జగదీష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యాదయ్య, సామెల్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సీబీఐ విచారణపై కవిత సవాల్

(మొదటిపేజీ తరువాయి)

ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదని వివరించారు. కవితను ప్రశ్నించే అంశంపై విచారణ చేపట్టాలని కోరారు. "మద్యం స్కాం కేసులో కవితను విచారించాల్సి ఉన్నదని, దీనికి అనుమతి కావాలని కోరుతూ శుక్రవారం సీబీఐ కోర్టును ఆశ్రయించింది. అయితే.. దీనిపై మాకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదు, కనీసం ఆ పిటిషన్ కాపీ కూడా మాకు చేరలేదు. అయినప్పటికీ దీనికి కోర్టు అనుమతి ఇచ్చింది. అందుకే.. దానిని మేం సవాల్ చేస్తున్నాం. కవితను సీబీఐ విచారణకు అనుమతి ఇవ్వడంపై స్టేటస్ కో ఇవ్వాలని న్యాయస్థానాన్ని కోరాం" అని కవిత తరఫు న్యాయవాది నితీష్ రాణా స్పష్టం చేశారు. అందుకు రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరి భవేజా నిరాకరించారు. పిటిషన్ పై వాదనలు విన్న తర్వాతే ఏ ఉత్తర్వులైనా ఇస్తామని స్పష్టం చేశారు. అయితే.. ఎటువంటి వాదనలు వినకుండా స్టేటస్ కో ఉత్తర్వులు ఇవ్వడం కుదరదని న్యాయమూర్తి కావేరి భవేజా స్పష్టం చేశారు. కవిత పిటిషన్‌పై కౌంటర్ దాఖలుకు సీబీఐ మూడు రోజులు వరకు సమయం కోరింది. తదుపరి విచారణను ఈనెల 10న చేపట్టనున్నామని, ఏ నిబంధనల ప్రకారం పిటిషన్ దాఖలు చేశారో స్పష్టంగా తెలియజేయాలని సీబీఐకి కోర్టు తెలిపింది. తదుపరి వాదనలు విన్న తర్వాతే, ఏ ఉత్తర్వులు అయినా ఉంటాయని కోర్టు స్పష్టం చేసింది.

పట్టణ ఉపాధి హామీ చట్టం

- ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్లు
- గవర్నర్ వ్యవస్థ రద్దు
- పార్లమెంట్ పరిధిలోకి ఈడీ, సీబీఐ
- సీపీఐ ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల
- మార్పు కోసం ఓటు : డి.రాజా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పట్టణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొస్తామని, రోజుకు రూ.700 కనీస వేతనంతో 200 ఉపాధి హామీ పని దినాలు కల్పిస్తామని సీపీఐ ఎన్నికల మ్యానిఫెస్టో పేర్కొంది. "18వ లోక్‌సభకు జరిగే ఎన్నికలు మన లౌకిక ప్రజాస్వామ్య, గణతంత్రానికి, దాని భవిష్యత్తుకు, మన రాజ్యాంగ ధర్మానికి చాలా కీలకమైనవి" అని పేర్కొంది. శనివారం సీపీఐ కేంద్ర కార్యాలయం (అజయ్ భవన్)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ జాతీయ నాయకులు బీకే కాంగో, సయ్యద్ అజీజ్ పాషా, దినేష్ వర్ష్నేలతో కలిసి సీపీఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా లోక్‌సభ ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల చేశారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను పార్లమెంటు పరిధిలోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఈ మ్యానిఫెస్టో పేర్కొంది. "ఫెడరలిజాన్ని బలోపేతం చేయడానికి గవర్నర్ వ్యవస్థ రద్దు చేయడం కోసం తమ పోరాటాన్ని ఉధృతం చేస్తాం. కేంద్రం జోక్యాన్ని తొలగించడానికి ప్రయత్నిస్తాం" అని పేర్కొంది. "రాష్ట్రాలలో ఎన్నికైన ప్రభుత్వాలకు ప్రధాన విధాన నిర్ణయాలు తీసుకునే అధికారం కల్పిస్తాం" అని తెలిపింది.

మార్పు కోసం ఓటు: డి.రాజా

బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ పాలన దేశంలో పూర్తిగా విపత్తుకు దారితీసిన నేపథ్యంలో పాలన మార్పు కోసం ఓటు వేయాలని డి.రాజా పిలుపునిచ్చారు. "ఈ ఎన్నికలు దేశానికి, దాని భవిష్యత్తుకు చాలా కీలకమైనవి. ప్రధాని నరేంద్ర మోడీ పాలన దేశానికి వినాశకరమైనది" అని అన్నారు. రాజ్యాంగంపై దాడి జరుగుతోందని, ఆర్ఎస్ఎస్ రాజకీయ సైన్యమైన బీజేపీ రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. నరేంద్ర మోడీ పాలనలో దేశ ప్రజల బతుకులు కష్టతరంగా మారాయని అన్నారు. దేశంలోని మొత్తం సంపదను అతి సంపన్నులపై కేంద్రీకరించి, వెనుకబడిన వారిని కడు పేదరికంలో ఉంచుతున్న మోడీ పరిపాలనకు వ్యతిరేకంగా దేశ ప్రజలు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని, లౌకికవాదం, ప్రజాస్వామ్యం, ఫెడరలిజం, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కేందుకు ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ఎత్తుగడలను ఓడించేందుకు ప్రజలంతా కలిసి రావాలని కోరారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రజల సమస్యలను లేవనెత్తేందుకు తమ పార్టీ తనవంతు పాత్ర పోషిస్తుందని అన్నారు.

మ్యానిఫెస్టోలోని ముఖ్యాంశాలు

"పౌరసత్వ సవరణ చట్టం, యూఏపీఏ రద్దు కోసం పోరాటం కొనసాగిస్తాం. ఎన్నికల కమిషనర్ల నియామకం పారదర్శకంగా జరగాలి. సాధారణ జనాభా గణనతోపాటు కుల గణనను డిమాండ్ చేయాలి. పట్టణ ఉపాధి హామీ కోసం ఒత్తిడి పెంచుతాం. సైన్యంలో కాంట్రాక్టీకరణ కోసం ప్రవేశపెట్టిన అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేయాలి. గిగ్-వర్కర్లకు సామాజిక భద్రత.

పార్లమెంట్ పరిధిలో ఈడీ, సీబీఐ పని చేయాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీల 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని తొలగిస్తాం. ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లను తీసుకొస్తాం. పన్నుల విధింపు చర్యలను సవరిస్తాం. సంపదపై పన్నును విధిస్తాం. కార్పొరేట్ పన్ను పెంచుతాం. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో 200 పని దినాలు. కనీస వేతనం రూ.700 ఉండేలా కృషి చేస్తాం. కేంద్ర ప్రభుత్వం పాఠ్యపుస్తకాల్లో చొప్పించిన అన్ని అశాస్త్రీయ భాగాలను తొలగిస్తాం " అని సీపీఐ వాగ్దానం చేసింది.

గంజాయి అక్రమ రవాణపై కఠిన చర్యలు

- నిరంతరం పోలీసు నిఘా
- 1379 కేజీల గంజాయిని దగ్ధం చేసిన ఎస్పీ చందనా దీప్తి



నవతెలంగాణ- నార్కట్‌పల్లి

మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా నిరంతరం నిఘా పెట్టి పనిచేస్తున్నామని ఎస్పీ చందనా దీప్తి అన్నారు. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో 26 కేసుల్లో 1379 కేజీల గంజాయిని సీజ్ చేసి.. కోర్టు ఉత్తర్వుల ప్రకారం దగ్ధం చేసినట్టు తెలిపారు. నార్కట్‌పల్లి మండలం గుమ్మలబావి పోలీస్ ఫైరింగ్ రేంజ్‌లో శనివారం జిల్లా ఎస్పీ, డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వీర్యం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ చందనా దీప్తి మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 26 కేసుల్లో రూ.కోటి 93లక్షల విలువగల 1379 కిలోల గంజాయిని సీజ్ చేసి నిర్వీర్యం చేసినట్టు తెలిపారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. ఎవరైనా గంజాయిని రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాములు నాయక్, ఎస్‌బీ డీఎస్పీ రమేష్, నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ సైదా, సీఐ రాఘవరావు, బీసన్న, సైదులు, నాగరాజు, ఆర్‌ఐలు సురాప్ప నాయుడు, సంతోష్, ఎస్ఐ అంతి రెడ్డి పాల్గొన్నారు.

ఐపీఎల్‌లో నేడు
ముంబయి X ఢిల్లీ
వేదిక : వేదిక :ముంబయి , రా॥ 7.30
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం..





చాంపియన్స్ అనుపమ, తరుణ్

- కజకిస్థాన్ ఇంటర్నేషనల్ చాలెంజ్

అస్తానా (కజకిస్థాన్) : కజకిస్థాన్ ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత వర్థమాన షట్లర్లు సత్తా చాటారు. పురుషుల సింగిల్స్ విభాగంలో తరుణ్ మన్నెపల్లి, మహిళల సింగిల్స్ విభాగంలో అనుపమ ఉపాధ్యాయ విజేతలుగా నిలిచారు. శనివారం జరిగిన ఫైనల్లో మాజీ జూనియర్ వరల్డ్ నం.1 అనుపమ ఉపాధ్యాయ 21-5, 21-16తో ఇషారాణిపై విజయం సాధించింది. ఆల్ ఇండియన్ టైటిల్ పోరులో అనుపమ 41 నిమిషాల్లోనే సహచర షట్లర్‌పై పైచేయి సాధించింది. 19 ఏండ్ల అనుపమ గతంలో ఇండియా ఇంటర్నేషనల్ చాలెంజ్ 2021, తజకిస్థాన్ ఇంటర్నేషనల్ సిరీస్ 2023, పోలిష్ ఓపెన్ 2022 టైటిళ్లను సైతం సొంతం చేసుకుంది. పురుషుల సింగిల్స్ ఫైనల్లో హైదరాబాద్ ఆటగాడు తరుణ్ మన్నెపల్లి వరుస గేముల్లో గెలుపొందాడు. 22 ఏండ్ల తరుణ్ 21-10, 21-19తో ఎనిమిదో సీడ్ మలేషియా షట్లర్ సూంగ్ జూ వెన్‌పై విజయం సాధించాడు. జాతీయ చాంపియన్‌షిప్స్ రన్నరప్ తరుణ్‌కు ఇదే తొలి అంతర్జాతీయ టైటిల్. మిక్స్‌డ్ డబుల్స్‌లో సంజయ్ శ్రీవాత్స ధనరాజ్, మనీశ జోడీ 21-9, 7-21, 2-21తో మూడు గేముల టైటిల్ పోరులో రన్నరప్ టైటిల్‌తో సరిపెట్టుకున్నారు.





విరాట్ 113

- అజేయ సెంచరీతో చెలరేగిన కోహ్లి
- రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ 183/3

నవతెలంగాణ-జైపూర్

విరాట్ కోహ్లి (113 నాటౌట్, 72 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్స్‌లు) అజేయ సెంచరీతో చెలరేగాడు. ఐపీఎల్ కెరీర్‌లో ఎనిమిదో శతకం సాధించిన విరాట్ కోహ్లి..శనివారం జైపూర్‌లోని సవారు మాన్‌సింగ్ స్టేడియంలో రాజస్థాన్ రాయల్స్‌పై అదిరే ఇన్నింగ్స్‌తో కదం తొక్కాడు. డుప్లెసిస్ (44, 33 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) సైతం రాణించటంతో తొలుత బ్యాటింగ్ చేసిన రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ 20 ఓవర్లలో 3 వికెట్లకు 183 పరుగులు చేసింది. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లలో యుజ్వేంద్ర చాహల్ (2/34), బర్గర్ (1/33) రాణించారు.

కోహ్లి శతక నాదం : టాస్ నెగ్గి బౌలింగ్ ఎంచుకున్న రాజస్థాన్ రాయల్స్.. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేసింది!. ఓపెనర్లు ఇద్దరూ ఇన్నింగ్స్ 14వ ఓవర్‌కు నిలబడినా.. బెంగళూర్ స్కోరు 200 దాటలేదు. స్పిన్నర్లు అశ్విన్, చాహల్ సహా పేసర్ బర్గర్ బ్యాటర్లను కట్టడి చేశారు. లైన్ అండ్ లెంగ్త్‌కు కట్టుబడి క్రమశిక్షణ బంతులేసిన రాయల్స్ బౌలర్లు 33 డాట్ బాల్స్ సంధించారు. ఓవరాల్ స్కోరుపై ఇది ప్రభావం చూపించింది. ఆర్సీబీ ఓపెనర్లు కోహ్లి (113 నాటౌట్), డుప్లెసిస్ (44) తొలి వికెట్‌కు 125 పరుగుల భారీ భాగస్వామ్యం అందించారు. ఆరంభంలో డుప్లెసిస్, కోహ్లి ఇద్దరూ దూకుడు చూపించలేకపోయారు. డుప్లెసిస్ రెండు ఫోర్లు, రెండు సిక్సర్లు కొట్టినా సౌకర్యవంతంగా కనిపించలేదు. పవర్‌ప్లేలో 53 పరుగులు చేసిన బెంగళూర్ ఆ తర్వాత మరింత నెమ్మదించింది. నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లతో 39 బంతుల్లోనే అర్థ సెంచరీ సాధించిన కోహ్లి.. సెంచరీ కోసం 28 బంతులే తీసుకున్నాడు. 9 ఫోర్లు, 4 సిక్సర్లతో 67 బంతుల్లో కోహ్లి శతకం సాధించాడు. గ్లెన్ మాక్స్‌వెల్ (1), సౌరవ్ చౌహాన్ (9), కామెరూన్ గ్రీన్ (5 నాటౌట్) నిరాశపరిచారు. బెంగళూర్ ఇన్నింగ్స్‌లో 14 ఫోర్లు, ఏడు సిక్సర్లు నమోదు కాగా.. అందులో కోహ్లి ఒక్కడే 12 ఫోర్లు, 4 సిక్సర్లు కొట్టడం గమనార్హం. సమిష్టిగా రాణించటంలో మరోసారి విఫలమైన బెంగళూర్ బ్యాటర్లు కాస్త తక్కువ స్కోరుకే పరిమితం అయ్యారు!.

సూర్య రాకతో రాత మారేనా?

- తొలి విజయంపై ముంబయి గురి
- ఢిల్లీ క్యాపిటల్స్‌తో నేడు కీలక పోరు

ముంబయి : ఐపీఎల్ 17 సీజన్లో తొలి మూడు మ్యాచుల్లోనూ ఓడిన ముంబయి ఇండియన్స్ క్లిష్ట పరిస్థితులను చవిచూస్తుంది. ఓ వైపు జట్టు వరుసగా పరాజయాలు చవిచూడగా.. మరోవైపు అభిమానులు ఆ జట్టు సారథి హార్దిక్ పాండ్యను దారుణంగా హేళన చేస్తున్నారు. మైదానంలో గెలుపుతో పాటు అభిమానుల మనసులూ సొంతం చేసుకోవటం ముంబయి ఇండియన్స్‌కు ఇప్పుడు అత్యంత అవశ్యం. మిస్టర్ 360 ఆటగాడు సూర్యకుమార్ యాదవ్ గాయం నుంచి కోలుకుని జట్టుతో చేరాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో నేటి మ్యాచ్‌లో సూర్యకుమార్ ఆడనున్నాడు. పొట్టి ఫార్మాట్ సూపర్‌స్టార్ సూర్యకుమార్ రాకతో ముంబయి ఇండియన్స్ రాత మారుతుందనే అంచనాలు భారీగా ఉన్నాయి. ఇక నేటి మ్యాచ్‌కు ముంబయి ఇండియన్స్ యాజమాన్యం పూర్తి టికెట్లను బ్లాక్ చేసింది. స్టేడియంలోకి పేద పిల్లలకు ఉచితంగా ప్రవేశం కల్పించనుంది. సాధారణ అభిమానుల గైర్హాజరీతో హార్దిక్ పాండ్యకు కాస్త ఊరట లభించే అవకాశం లేకపోలేదు!.

అతడే కీలకం : పొట్టి ఫార్మాట్‌లో బలమైన, బలహీన జట్టు అంటూ ఉండదు. ఆ రోజు అదరగొట్టిన జట్టుదే పైచేయి. రికార్డులు, సమీకరణాలు పెద్దగా కలిసి రావు. ముంబయి ఇండియన్స్ మూడు మ్యాచుల్లో ఓడినా.. ఆజట్టును తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. రోహిత్ శర్మ ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, టిమ్ డెవిడ్ సహా జశ్‌ప్రీత్ బుమ్రా మంచి ఫామ్‌లో ఉన్నారు. కెప్టెన్ హార్దిక్ పాండ్యపై మానసికంగా కాస్త ప్రతికూల ప్రభావం పడినట్టు కనిపిస్తోంది. బంతితో, బ్యాట్‌తో పాండ్య సైతం చక్కగానే రాణిస్తున్నాడు. సూర్యకుమార్ రాకతో ముంబయి ఇండియన్స్ బ్యాటింగ్ లైనప్ రూపురేఖలు మారిపోనున్నాయి. మిడిల్ ఆర్డర్‌లో సూర్యకుమార్, తిలక్ వర్మ, టిమ్ డెవిడ్ త్రయం అత్యంత ప్రమాదకరం. చివరి పది ఓవర్లలో ఈ ముగ్గురూ దండయాత్రకు దిగితే ఎంతటి బౌలింగ్ లైనప్ సైతం నిలువరించలేదు. స్వదేశీ ఆటగాళ్ల ప్రదర్శన ముంబయి ఇండియన్స్‌కు ఎక్స్ ఫ్యాక్టర్ కానుంది.

కోలుకుంటారా? : ఢిల్లీ క్యాపిటల్స్ సైతం మూడు మ్యాచుల్లో పరాజయం చవిచూసింది. నాలుగు మ్యాచులు ఆడేసిన క్యాపిటల్స్ విశాఖలో ఓ విజయం రుచి చూసింది. కానీ గత మ్యాచ్‌లో కోల్‌కత నైట్‌రైడర్స్ చేతిలో చావుదెబ్బ తిన్నది. నైట్‌రైడర్స్ ఊచకోతకు గురైన క్యాపిటల్స్ బౌలింగ్ లైనప్ నేటి మ్యాచ్‌లో ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగేది అనుమానమే. నాణ్యమైన బౌలర్లు ఉన్నప్పటికీ ఢిల్లీ పేలవ ప్రదర్శన చేసింది. కెప్టెన్ రిషబ్ పంత్ ఢిల్లీ క్యాపిటల్స్‌కు మరోసారి కీలకం కానున్నాడు. డెవిడ్ వార్నర్, పృథ్వీ షాలకు పంత్ తోడైతే క్యాపిటల్స్‌కు తిరుగుండదు. అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ నిరాశపరుస్తున్నారు. ఇషాంత్ శర్మ లేటు వయసులో హాట్‌గా రాణిస్తున్నాడు.



మళ్లీ పేస్ పిచ్? : ఐపీఎల్ 16లో వాంఖడే స్టేడియంలో భారీ స్కోర్లు నమోదయ్యాయి. కానీ ఈ ఏడాది సొంతగడ్డపై ముంబయి తొలి విజయం కోసం తపిస్తోంది. రాజస్థాన్ రాయల్స్‌తో వాడిన పిచ్‌నే నేటి మ్యాచ్‌కు సిద్ధం చేశారు. గత సీజన్‌కు ఈ పిచ్‌ను వినియోగించలేదు. దీంతో పిచ్‌పై తొలుత పేస్ ఎక్కువగా ఉండనుంది. బ్యాటర్లు పరుగుల కోసం కాస్త ఎక్కువగా శ్రమపడాల్సి ఉంటుంది. టాస్ నెగ్గిన జట్టు బౌలింగ్ ఎంచుకునే అవకాశం కనిపిస్తుంది.

నకుమురపై విదిత్ విక్టరీ

ఫిడే క్యాండిడేట్స్ చెస్ 2024



న్యూఢిల్లీ : ఫిడే క్యాండిడేట్స్ చెస్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ విదిత్ గుజరాతీ సూపర్ విక్టరీ సాధించాడు. హికారు నకుముర (అమెరికా)పై 29 ఎత్తుల్లో రెండో రౌండ్‌లో కీలక విజయం నమోదు చేశాడు. నల్లపావులతో ఆడిన విదిత్ గుజరాతీ ఎత్తులకు పైఎత్తులు వేసి నకుమురను కంగుతినిపించాడు. భారత యువ సంచలనం ఆర్. ప్రజ్ఞానందను సహచర గ్రాండ్‌మాస్టర్ డి గుకేశ్ చేతిలో ఓటమి పాలయ్యాడు. ఆరంభంలోనే దూకుడుగా ఆడి సహచర చైన్నై చిన్నోడికి రెండు పావులు కోల్పోయిన ప్రజ్ఞానంద మళ్లీ కోలుకోలేదు. 33 ఎత్తుల్లో గుకేశ్ విజయం సాధించాడు.

భారత్‌కు భారీ ఓటమి

1-5తో ఆసీస్ చేతిలో చిత్తు



పెర్త్ (ఆస్ట్రేలియా) : 2024 పారిస్ ఒలింపిక్స్ సన్నద్ధతలో భాగంగా ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన హాకీ ఇండియా పేలవ ప్రదర్శన చేసింది. ఆస్ట్రేలియాతో తొలి టెస్టులో భారీ పరాజయం మూటగట్టుకుంది. 1-5తో ఆతిథ్య ఆస్ట్రేలియా చేతిలో ఓటమి పాలైంది. తొలి టెస్టులో ఆస్ట్రేలియాకు గట్టి పోటీ ఇస్తారనుకున్న భారత ఆటగాళ్లు.. దారుణంగా విఫలమయ్యారు. మ్యాచ్ ఆరంభం నుంచీ మ్యాచ్‌ను నియంత్రణలో నిలుపుకున్న కంగారూలు.. ఐదు మ్యాచుల టెస్టు సిరీస్‌లో 1-0తో ముందంజ వేశారు. భారత్ తరఫున ఏకైక గోల్ 47వ నిమిషంలో గుర్జంత్ సింగ్ కొట్టాడు. ఆస్ట్రేలియా ఆటగాళ్లు టామ్ విక్హమ్ (20వ, 38వ నిమిషం), టిమ్ బ్రాండ్ (3వ నిమిషం), జోయెల్ రింటాల (37వ నిమిషం), ఫ్లిన్ (57వ నిమిషం) గోల్స్ నమోదు చేశారు. భారత్, ఆస్ట్రేలియా ఆదివారం రెండో టెస్టులో తలపడనున్నాయి.

నవచిత్రం



నాగరాజు నెక్కంటి, అశ్విని శ్రీ, సతీష్‌కుమార్

మిస్ జానకీ షూటింగ్ షురూ

ఎస్ ఎస్ చాందిని క్రియేషన్స్ బ్యానర్ పై నాగరాజు నెక్కంటి నిర్మాణ సారథ్యంలో బిగ్ బాస్ ఫేమ్ అశ్విని శ్రీ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మిస్ జానకి'. సతీష్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా శనివారం అత్యంత ఘనంగా పూజా కార్యక్రమం నిర్వహించుకుంది. నిర్మాత సి.కళ్యాణ్ క్లాప్ కొట్టి సినిమాను ప్రారంభించారు. నటుడు మహేష్ కుమార్ మాట్లాడుతూ, 'ఈనెల 20 నుంచి ఏకధాటిగా 30 రోజులు రెగ్యులర్ చిత్రీకరణ జరుపుకుంటుంది. ఆ తరువాత మరో షెడ్యూల్‌తో చిత్రీకరణ పూర్తి చేస్తాం. ఇది లేడీ ఓరియెంటెడ్ చిత్రం. ఈ సినిమాతో అశ్విని శ్రీకు మంచి పేరు వస్తుందని ఆశిస్తున్నాం' అని తెలిపారు.

"బిగ్ బాస్' తరువాత చాలా స్టోరీలు విన్నాను. కానీ ఈ స్టోరీ విన్నప్పుడు చాలా బాగుంది. చాలా డిఫరెంట్‌గా ఉందనిపించింది. ఈ సినిమాలోని నా క్యారెక్టర్ 'డీజే టిల్లు' సినిమాలో రాధిక క్యారెక్టర్‌లా అందరికీ గుర్తుండిపోతుంది' అని నాయిక అశ్విని శ్రీ అన్నారు. డైరెక్టర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ,'అవకాశం ఇచ్చిన ప్రొడ్యూసర్ నాగరాజు నెక్కంటికి థ్యాంక్స్. అలాగే కథని నమ్మి నాతో జర్నీ చేస్తున్న నటీనటులకు, టెక్నీషియన్లకు ధన్యవాదాలు. ఈ సినిమా కచ్చితంగా అందరికి నచ్చుతుంది' అని చెప్పారు.

ఆదరణ అద్భుతం



మీనాక్షి గోస్వామి, సూర్య తేజ

సూర్య తేజ హీరోగా పరిచయం అవుతూ నటించిన చిత్రం 'భరతనాట్యం'. 'దొరసాని' ఫేమ్ కెవిఆర్ మహేంద్ర దర్శకత్వం వహించారు. పిఆర్ ఫిలింస్ పతాకంపై పాయల్ సరాఫ్ నిర్మించారు.

మీనాక్షి గోస్వామి కథానాయికగా నటించారు. వేసవి కానుకగా ఈనెల 5న విడుదలైన ఈ చిత్రం అద్భుతమైన రెస్పాన్స్‌తో అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించి సూపర్ హిట్ సాధించి సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ సక్సెస్ మీట్‌ని నిర్వహించింది.

దర్శకుడు కెవిఆర్ మహేంద్ర, 'కొత్త హీరో, హీరోయిన్‌తో కొత్త నిర్మాతలు ఎక్కడా రాజీపడకుండా ఇంత గ్రాండ్‌గా సినిమా తీయడం, థియేటర్స్‌లో విడుదల చేయడం డబుల్ టాస్క్ అన్ని సవాళ్ళని దాటుకొని ఏపీ, తెలంగాణలో 150కి పైగా థియేటర్స్‌లో రిలీజ్ చేయడం పెద్ద సక్సెస్‌గా భావిస్తున్నాం. థియేటర్స్‌లో రెస్పాన్స్ అద్భుతంగా ఉంది. చూసిన ప్రతి ప్రేక్షకుడు ఎంజాయ్ చేస్తున్నాడు. వస్తున్న రెస్పాన్స్ చూసి ఆంధ్రాలో తొమ్మిది థియేటర్స్‌ని పెంచారు. వీకెండ్స్‌తో పాటు ఉగాది హాలీడేస్ కూడా మాకు హెల్ప్ అవుతాయి' అని తెలిపారు. 'చూసిన ప్రేక్షకులంతా సినిమా చాలా బావుందని అభినందించారు. సెకండ్ హాఫ్ చాలా బావుందని, నేను చక్కగా నటించానని, మొదటి సినిమాలా అనిపించలేదని చాలా మంది మెచ్చుకున్నారు. చిన్న సినిమా అనుకున్నాం కానీ చాలా పెద్ద సినిమాలా ఉందని చెబుతుంటే చాలా ఆనందంగా అనిపించింది' అని హీరో సూర్య తేజ ఏలే చెప్పారు.

తప్పుని అస్సలు భరించలేను



కమల్‌హాసన్

కమల్ హాసన్, డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో లైకా ప్రొడక్షన్స్‌తో పాటు రెడ్ జెయింట్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మిస్తోన్న భారీ బడ్జెట్ చిత్రం 'భారతీయుడు 2'. వీరిద్దరి కాంబినేషన్‌లో 1996లో విడుదలై, బాక్సాఫీస్ దగ్గర సరికొత్త రికార్డులను క్రియేట్ చేసిన 'ఇండియన్' చిత్రాన్ని 'భారతీయుడు'గా విడుదల చేసింది. ఆ మూవీకి సీక్వెల్‌గా ఇప్పుడు 'భారతీయుడు 2' రూపొందుతోన్న సంగతి తెలిసిందే . భారతీయుడు సీక్వెల్ అంటే ఎలాంటి అంచనాలుంటాయో వాటిని మించేలా డైరెక్టర్ శంకర్ ఈ చిత్రాన్ని విజువల్ వండర్‌గా ఆవిష్కరిస్తున్నారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాడే స్వాతంత్ర్య సమరయోధుడు సేనాపతిగా కమల్ హాసన్ పవర్‌ఫుల్ పెర్ఫామెన్స్ ఇవ్వటానికి రెడీ అయ్యారు. ఈ సినిమా శరవేగంగా రూపొందుతోంది. తాజాగా ఈ సినిమాను జూన్ నెలలో విడుదల చేస్తామని మేకర్స్ ప్రకటించారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను కూడా మేకర్స్ విడుదల చేశారు. తెల్లటి ధోతి, కుర్తాలో కమల్ హాసన్ అవినీతికి వ్యతిరేకంగా పోరాటం అంటే ఎంత స్వచ్ఛంగా ఉండాలో అంతటి స్వచ్ఛత పోస్టర్‌లో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. జీరో టాలరెన్స్ (తప్పును అస్సలు భరించలేను) అని పోస్టర్‌పై ఉన్న లైన్ చాలా ప్రభావవంతంగా ఉంది. కమల్ హాసన్ టైటిల్ పాత్రలో నటిస్తోన్న ఈ చిత్రంలో సిద్ధార్థ్, కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్ సింగ్, ప్రియా భవానీ శంకర్, ఎస్.జె.సూర్య, బాబీ సింహ తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

ప్రేక్షకులు ఎంపిక చేసిన వారితోనే సినిమా



రామ్‌గోపాల్ వర్మ

ఆర్‌జీవీ డెన్ వేదికగా శనివారం దర్శకుడు రామ్ గోపాల్ వర్మ 'యువర్ ఫిల్మ్' అనే కాన్సెప్ట్‌ని మీడియా ద్వారా వివరించారు. ప్రేక్షకులే సినిమా హిట్, ఫ్లాప్ నిర్ణయిస్తారు కాబట్టి, ఆ ప్రేక్షకులే సినేమాకు సంబంధించిన హీరో, హీరోయిన్, డైరెక్టర్, సినిమాటోగ్రాఫర్ ఇలా అన్ని టెక్నీషియన్స్‌ను ఆర్‌జీవీ వెబ్సైట్ ద్వారా ఓటింగ్ పద్ధతిలో ప్రజలే ఎన్నుకుంటారు.

ప్రజలు నిర్ణయించిన వారితోనే సినిమాని నిర్మిస్తారు. ఆర్‌జీవీ నిర్మాతగా ఆరు నెలలలో తీసి రిలీజ్ చేస్తారు. సినిమా కథనీ ఆర్‌జీవీ వెబ్సైటులో ఒక రెండు లైన్లలో పెట్టి, ఆ కథ లైను నచ్చిన యాక్టర్స్, డైరెక్టర్స్, డిఓపి, మ్యూజిక్ డైరెక్టర్ ఇలా అందరూ కూడా అప్లై చేసుకోవచ్చు. ప్రేక్షకులు ఇంటరెస్ట్ ఉండి అప్లై చేసుకున్న ప్రతి డిపార్ట్మెంట్ వారికి, ఎవరి వర్క్ నచ్చిందో వారిని ఓటింగ్ పద్ధతిలో ఎన్నుకుంటారు. అలా ఎన్నుకున్న వారిని ఆర్‌జీవీ డెన్ టీమ్ షార్ట్ లిస్ట్ చేసి వెబ్సైట్‌లో పెడతారు. ఆ తరవాత పెట్టే టాస్క్‌లని బట్టి వారు ఆడిషన్స్ ఇస్తూ ఉంటారు.

ఆ ఆడిషన్స్‌లో ప్రేక్షకులకు ఎక్కువగా ఎవరు నచ్చితే, అతను హీరోగా సినిమా తీస్తారు. ఇదే తరహాలో హీరోయిన్, డైరెక్టర్స్, డిఓపి ఇలా అందరూ కూడా ప్రేక్షకుల ద్వారా ఎన్నుకోబడతారు. ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజల కోసం ఎన్నుకున్నదే ప్రజాస్వామ్యం అలానే ప్రేక్షకుల చేత, ప్రేక్షకుల కొరకు, ప్రేక్షకుల కోసం చేసే సినిమాలే ఈ యువర్ ఫిల్మ్ ఐడియా. ఈ యువర్ ఫిల్మ్ అనేది భాషతో సంబంధం లేకుండా అన్ని భాషల వారితో నిర్మాణం ఆర్‌జీవీ డెన్ నుండి జరుగుతుంది.



సుమన్ తేజ్, గరీమ చౌహాన్

సరికొత్తగా సీతా కళ్యాణ వైభోగమే

సుమన్ తేజ్, గరీమ చౌహాన్ హీరో, హీరోయిన్లుగా డ్రీమ్ గేట్ ప్రొడక్షన్స్ పతాకంపై సతీష్ పరమవేద దర్శకత్వంలో రాచాల యుగంధర్ నిర్మిస్తున్న చిత్రం 'సీతా కళ్యాణ వైభోగమే'.

భారీ యాక్షన్ ఎపిసోడ్స్‌తో పాటు మంచి ఫ్యామిలీ ఎమోషన్స్‌తో ఈ చిత్రం రాబోతోంది. గోవాలో కొరియోగ్రాఫర్ భాను మాస్టర్ నేతృత్వంలో దాదాపు 250 మంది డ్యాన్సర్లతో ఈ చిత్రంలోని ఒక పాటను ఇటీవల చిత్రీకరించారు.

తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇదొక లవ్ అండ్ యాక్షన్ మూవీ అని ఈ పోస్టర్ చెప్పకనే చెబుతోంది.

'సరికొత్త కథా కథనాలతో ప్రొడ్యూసర్ రాచాల యుగంధర్ ఈ మూవీని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. 100 మంది ఫైటర్లతో చిత్రీకరించిన భారీ యాక్షన్ సన్నివేశాలు ఈ సినిమాకే హైలెట్‌గా నిలవనున్నాయి. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే ఈ మూవీకి సంబంధించిన విడుదల తేదీని ప్రకటించనున్నారు' అని చిత్ర బృందం తెలిపింది. 'గగన్ విహారి' విలన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో నాగినీడు, శివాజీ రాజా, ప్రభావతి, వెంకీ మంకీ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.ఈ సినిమాకు సంగీత దర్శకుడు చరణ్ అర్జున్, కెమెరామెన్ పరుశురామ్, ఎడిటర్ డి. వెంకట ప్రభు, ఫైట్ మాస్టర్ డ్రాగన్ ప్రకాష్, కొరియోగ్రాఫర్లు భాను మాస్టర్, పోలకి విజయ్ పనిచేస్తున్నారు.



ఐశ్వర్య రాజేష్, జీవీ ప్రకాష్ కుమార్

యూనిక్ ఫ్యామిలీ కామెడీ డ్రామా..

జీవీ ప్రకాష్ కుమార్, ఐశ్వర్య రాజేష్ నటించిన ఫ్యామిలీ కామెడీ డ్రామా 'డియర్'. తమిళంలో ఈనెల 11న, తెలుగులో ఈనెల 12న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రానికి ఆనంద్ రవిచంద్రన్ దర్శకత్వం వహించారు. నట్మెగ్ ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై వరుణ్ త్రిపురనేని, అభిషేక్ రామిశెట్టి, జి పృథ్వీరాజ్ నిర్మించారు. నాగ చైతన్య వాయిస్ ఓవర్ అందించిన ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. నూతన వధూవరుల పాత్రల్లో జివి ప్రకాష్ కుమార్ , ఐశ్వర్య రాజేష్ లైఫ్‌లో స్నీక్ పీక్ ఇస్తుంది. భార్యకి ఉన్న గురక అలవాటు కారణంగా రిలేషన్ షిప్ కాంప్లికేటెడ్‌గా మారిన కథాంశం యూనిక్‌గా ఉంది. నాగ చైతన్య వాయిస్ ఓవర్ ప్రధాన ఆకర్షణలలో ఒకటి. జగదీష్ సుందరమూర్తి కెమెరా బ్రిలియంట్‌గా ఉంది. జివి ప్రకాష్ కుమార్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ కామిక్ కోణాన్ని ఎలివేట్ చేసింది. నిర్మాణ విలువలు ఉన్నతంగా ఉన్నాయి.

అన్నపూర్ణ స్టూడియోస్ ఈ చిత్రాన్ని ఆంధ్రా ప్రాంతంలో విడుదల చేయనుండగా, ఏషియన్ సినిమాస్ తెలంగాణ ప్రాంతంలో విడుదల చేయనుంది. కాళి వెంకట్, ఇళవరసు, రోహిణి, తలైవాసల్ విజయ్, గీతా కైలాసం, నందిని కీలక పాత్రలలో నటించారు.

ఆద్యంతం భావోద్వేగ భరితంగా నరుడి బ్రతుకు నటన

ప్రస్తుతం పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ వరుస చిత్రాలతో సందడి చేస్తోంది. కంటెంట్ ఓరియెంటెడ్ సబ్జెక్టులతో పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ వరుస ప్రాజెక్టులను తెరకెక్కిస్తోంది. మంచి చిత్రాలను అందించే క్రమంలో పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ 'నరుడి బ్రతుకు నటన' అనే సినిమాను మన ముందుకు తీసుకొస్తోంది. ఈ మూవీ చిత్రీకరణ అంతా కూడా కేరళలో జరిగింది. ఇక కేరళ ప్రకృతి అందాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.

ఈ సినిమాలో కేరళ అందాలే హైలెట్ కానున్నాయి. శివ కుమార్ రామచంద్రవరపు, నితిన్ ప్రసన్న, శృతి జయన్, ఐశ్వర్యా అనిల్ కుమార్, వైవా రాఘవ వంటి వారు ప్రముఖ పాత్రల్లో నటించిన ఈ మూవీని రిషికేశ్వర్ యోగి తెరకెక్కిస్తున్నారు. నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్, సుకుమార్ బొరెడ్డి, డా.సింధు రెడ్డి సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి వివేక్ కూఛిబొట్ల సహనిర్మాతగా వ్యవహరిస్తున్నారు. విడుదలకు ముందే దాదాపు అరవైకి పైగా అంతర్జాతీయ అవార్డులను గెలుచుకున్న ఈ చిత్రాన్ని పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ ఈనెల 26న ప్రేక్షకుల ముందుకు తీసుకురావటానికి సన్నాహాలు చేస్తున్నారు. 'ఆద్యంతం భావోద్వేగ భరితంగా సాగే ఈ సినిమా కేరళ అందాలకు ప్రతిబింబంగా నిలుస్తుంది. అలాగే ప్రేక్షకుల ప్రశంసలతోపాటు విమర్శకుల అభినందల్ని పొందిన ఈ సినిమా తెలుగు ప్రేక్షకుల్ని సైతం అలరిస్తుందనే నమ్మకంతో ఉన్నారు.



Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886

అమెజాన్ రెయిన్‌ఫారెస్ట్‌ని భూమి యొక్క ఊపిరితిత్తులుగా పిలవడానికి గల కారణం ఏమిటి ?

1. ఏ అంతర్జాతీయ ఒప్పందం గ్లోబల్ వార్మింగ్‌ను పారిశ్రామిక పూర్వ స్థాయి కంటే 2 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా పరిమితం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది?
ఎ) పారిస్ ఒప్పందం బి) క్యోటో ప్రోటోకాల్
సి) మాంట్రియల్ ప్రోటోకాల్ డి) కోపెన్‌హాగన్ ఒప్పందం

2. UN వాతావరణ మార్పుల సమావేశం COP26 ఏ నగరంలో జరిగింది?
ఎ) పారిస్ బి) న్యూయార్క్
సి) గ్లాస్గో డి) బీజింగ్

3. ప్రపంచవ్యాప్తంగా గ్రీన్‌హౌస్ వాయువులను అత్యధికంగా విడుదల చేస్తున్న దేశం ఏది?
ఎ) యునైటెడ్ స్టేట్స్ బి) చైనా
సి) భారతదేశం డి) యూరోపియన్ యూనియన్

4. 'కార్బన్ పాదముద్ర' అనే పదం ఈ కింది వాటిలో వేటిని సూచిస్తుంది ?
ఎ) అడవిలో నిల్వ చేయబడిన కార్బన్ పరిమాణం
బి) మానవ కార్యకలాపాల ద్వారా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా విడుదలయ్యే గ్రీన్‌హౌస్ వాయువుల మొత్తం
సి) మట్టిలో కార్బన్ సీక్వెస్ట్రేషన్ రేటు
డి) సముద్ర పర్యావరణ వ్యవస్థలపై వాతావరణ మార్పు ప్రభావం

5. ప్రపంచవ్యాప్తంగా అటవీ నిర్మూలనకు ప్రధాన కారణం ఏమిటి?
ఎ) పట్టణీకరణ బి) వ్యవసాయం
సి) మైనింగ్ డి) పారిశ్రామికీకరణ

6. 'జీవవైవిధ్య హాట్‌స్పాట్' అనే భావన దేనిని సూచిస్తుంది ?
ఎ) మానవ కార్యకలాపాల వల్ల ముప్పు పొంచి ఉన్న జాతుల వైవిధ్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాలు
బి) జాతుల వైవిధ్యం మరియు సమృద్ధిగా సహజ వనరులు తక్కువగా ఉన్న ప్రాంతాలు
సి) అంతరించిపోతున్న జాతుల పరిరక్షణ కోసం నియమించబడిన రక్షిత ప్రాంతాలు
డి) వాతావరణ మార్పుల కారణంగా తీవ్రమైన వాతావరణ సంఘటనల వల్ల ప్రభావితమైన మండలాలు

7. 'కార్బన్ ప్రైసింగ్' భావన యొక్క ప్రధాన లక్ష్యం ఏమిటి ?
ఎ) కార్బన్ కాలుష్యంపై పన్ను విధించడం ద్వారా కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు వ్యాపారాలను ప్రోత్సహించటం
బి) ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడానికి శిలాజ ఇంధన పరిశ్రమలకు సబ్సిడీ ఇవ్వండి
సి) కార్బన్-ఇంటెన్సివ్ ఉత్పత్తుల వినియోగాన్ని పెంచండి
డి) పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులలో పెట్టుబడిని తగ్గించండి

8. సముద్రాలలో ప్లాస్టిక్ కాలుష్యం వల్ల ఈ కింది వాటిలో ఏ సముద్ర జంతు జాతులకు ముప్పు ఎక్కువగా ఉంది ?
ఎ) డాల్ఫిన్లు బి) సముద్ర తాబేళ్లు
సి) షార్క్స్ డి) జెల్లీ ఫిష్

9. 'వృత్తాకార ఆర్థిక వ్యవస్థ' అనే భావన యొక్క లక్ష్యం ఏమిటి ?
ఎ) వ్యర్థాలను తగ్గించడం మరియు వనరుల పునర్వినియోగం మరియు రీసైక్లింగ్‌ను ప్రోత్సహించడం
బి) పర్యావరణ ప్రభావాలతో సంబంధం లేకుండా పారిశ్రామిక ఉత్పత్తిని పెంచండి
సి) ఆర్థిక వృద్ధికి సహజ వనరులను ఉపయోగించుకోండి
డి) వ్యవసాయ విస్తరణ కోసం అటవీ నిర్మూలనను వేగవంతం చేయండి



10. పగడపు దిబ్బ బ్లీచింగ్‌కు ప్రధాన కారణం ఏమిటి?
ఎ) ఓవర్ ఫిషింగ్ బి) చమురు కాలుష్యం
సి) సముద్ర ఆమ్లీకరణ డి) గ్లోబల్ వార్మింగ్

11. ఇటీవల 2060 నాటికి కార్బన్ న్యూట్రాలిటీని సాధించే ప్రణాళికలను ఏ దేశం ప్రకటించింది?
ఎ) యునైటెడ్ స్టేట్స్ బి) రష్యా
సి) బ్రెజిల్ డి) చైనా

12. ఇంటర్‌గవర్నమెంటల్ ప్యానెల్ ఆన్ క్లైమేట్ చేంజ్ (IPCC) ఏటా వేటిని అంచనా వేస్తుంది ?
ఎ) అంతర్జాతీయ వాణిజ్య విధానాలు
బి) ప్రపంచ జీవవైవిధ్య పోకడలు
సి) వాతావరణ శాస్త్రం మరియు వాతావరణ మార్పు ప్రభావాలు
డి) సముద్ర కాలుష్య స్థాయిలు

13. ఈ కింది వాటిలో ఏ పునరుత్పాదక ఇంధన వనరులు ప్రపంచవ్యాప్తంగా అత్యధిక వృద్ధి రేటును కలిగి ఉన్నాయి?
ఎ) సౌరశక్తి బి) పవన శక్తి
సి) జలవిద్యుత్ శక్తి డి) భూఉష్ణ శక్తి

14. ఈ క్రింది కార్యక్రమాలలో ఏది యునైటెడ్ స్టేట్స్‌లో క్షీణించిన పర్యావరణ వ్యవస్థలను పునరుద్ధరించడం మరియు హరిత ఉద్యోగాలను సృష్టించడం లక్ష్యంగా పనిచేస్తుంది ?
ఎ) గ్రీన్ న్యూ డీల్ బి) పారిస్ ఒప్పందం
సి) క్యోటో ప్రోటోకాల్ డి) క్లీన్ పవర్ ప్లాన్

15. మాంట్రియల్ ప్రోటోకాల్‌కు చేసిన 'గాలీ సవరణ' ద్వారా ఈ కింది వాటిలో వేటిని దశలవారీగా తొలగించాలని లక్ష్యంగా పెట్టుకుంది ?
ఎ) ఓజోన్ క్షీణతకు కారణమైన గ్రీన్‌హౌస్ వాయువులు
బి) పారిశ్రామిక ప్రక్రియల నుండి కార్బన్ ఉద్గారాలు
సి) సముద్రాలలో ప్లాస్టిక్ కాలుష్యం
డి) ఉష్ణమండల ప్రాంతాల్లో అటవీ నిర్మూలన

16. ఈ కింది వాటిలో ఏ పర్యావరణ సంస్థ ఇటీవల 'స్టేట్ ఆఫ్ ది వరల్డ్స్ ఫారెస్ట్' నివేదికను విడుదల చేసింది?
ఎ) గ్రీన్‌పీస్
బి) వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ (WWF)
సి) ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం (UNEP)
డి) ప్రపంచ వనరుల సంస్థ (WRI)



డాక్టర్ కె. శశిధర్
పర్యావరణ నిపుణులు
94919 91918

17. 'పర్యావరణ పాదముద్ర' అనే పదం ఈ కింది వాటిలో దేనిని సూచిస్తుంది ?
ఎ) రక్షిత సహజ ఆవాసాల మొత్తం ప్రాంతం
బి) పర్యావరణ వ్యవస్థలపై మానవ కార్యకలాపాల ప్రభావం
సి) జీవవైవిధ్య హాట్‌స్పాట్‌ల పంపిణీ
డి) మంచినీటి వనరుల లభ్యత

18. 'వాతావరణ స్థితిస్థాపకత' అనే పదం ఈ కింది వాటిలో వేటిని సూచిస్తుంది ?
ఎ) మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పర్యావరణ వ్యవస్థల సామర్థ్యం
బి) కార్బన్-ఇంటెన్సివ్ పరిశ్రమల ప్రోత్సాహం
సి) పర్యావరణ ప్రభావంతో నిమిత్తం లేకుండా పట్టణ ప్రాంతాల విస్తరణ
డి) తీవ్రమైన వాతావరణ సంఘటనలను తట్టుకోగల వ్యక్తుల సామర్థ్యం

19. 2050 నాటికి నికర-సున్నా ఉద్గారాలను సాధించడానికి కట్టుబడి ఉన్న ఏ దేశం ఇటీవల వాతావరణ అత్యవసర పరిస్థితిని ప్రకటించింది?
ఎ) యునైటెడ్ స్టేట్స్ బి) యునైటెడ్ కింగ్‌డమ్
సి) చైనా డి) ఆస్ట్రేలియా

20. UN బయోడైవర్సిటీ సమ్మిట్ COP15 పర్యావరణ వ్యవస్థలలో ఏ కీలక భాగం క్షీణించడంపై దృష్టి పెట్టింది?
ఎ) నేల సంతానోత్పత్తి బి) పరాగ సంపర్క జనాభా
సి) సముద్ర జీవవైవిధ్యం డి) మొక్కల జాతులు

21. 'ఆంత్రోపోసీన్' అనేది ప్రతిపాదిత భౌగోళిక యుగం, ఈ కింది వాటిలో దేని ఆధారంగా వర్గీకరించబడింది ?
ఎ) పెరిగిన అగ్నిపర్వత కార్యకలాపాలు
బి) భూమి యొక్క పర్యావరణ వ్యవస్థలపై మానవ ప్రభావం యొక్క ఆధిపత్యం
సి) గ్లోబల్ కూలింగ్ ట్రెండ్స్
డి) సహజ ఆవాసాల విస్తరణ

22. నిరంతర సేంద్రీయ కాలుష్య కారకాల (POPలు) ఉత్పత్తి మరియు వినియోగాన్ని దశలవారీగా నిలిపివేయాలని ఏ పర్యావరణ ఒప్పందం లక్ష్యంగా పెట్టుకుంది?
ఎ) క్యోటో ప్రోటోకాల్ బి) మాంట్రియల్ ప్రోటోకాల్
సి) బాసెల్ కన్వెన్షన్ డి) స్టాక్‌హోమ్ కన్వెన్షన్

23. ఇటీవల జరిగిన COP26 ఏ కారణాల వల్ల విమర్శల్ని ఎదుర్కొంది ?
ఎ) ప్రధాన ఆర్థిక వ్యవస్థల నుండి భాగస్వామ్యం లేకపోవడం
బి) ప్రతిష్టాత్మక ఉద్గారాల తగ్గింపు లక్ష్యాలను సెట్ చేయడంలో వైఫల్యం
సి) అభివృద్ధి చెందుతున్న దేశాలలో వాతావరణ అనుకూలతకు సరిపోని నిధులు
డి) పైవన్నీ

24. 'ఆర్కిటిక్ యాంప్లిఫికేషన్' అంటే ఏమిటి ?
ఎ) ఆర్కిటిక్ ప్రాంతంలో హిమానీనదాలు వేగంగా కరగడం
బి) భూమ్మీద మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే ఆర్కిటిక్ ప్రాంతం ఎక్కువగా వేడెక్కడం
సి) ఆర్కిటిక్ వాతావరణ నమూనాల కారణంగా ప్రపంచ ఉష్ణోగ్రతలలో తగ్గుదల
డి) వాతావరణ మార్పుల కారణంగా ఆర్కిటిక్ సముద్రపు మంచు విస్తరణ

25. గ్లోబల్ బయోడైవర్సిటీ ట్రెండ్‌లను హైలైట్ చేస్తూ 'లివింగ్ ప్లానెట్ రిపోర్ట్'ను ఇటీవల ఏ అంతర్జాతీయ సంస్థ విడుదల చేసింది?
ఎ) ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం (UNEP)
బి) వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ (WWF)
సి) ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (IUCN)
డి) గ్రీన్‌పీస్

26. 'రీవైల్డింగ్' భావన యొక్క ప్రధాన లక్ష్యం ఏమిటి ?
ఎ) పట్టణ ప్రాంతాలను సహజ ఆవాసాలుగా విస్తరించడం
బి) క్షీణించిన పర్యావరణ వ్యవస్థలను పునరుద్ధరించడం మరియు స్థానిక జాతులను తిరిగి ప్రవేశపెట్టడం
సి) వ్యవసాయ అవసరాల కోసం అడవులను నరికివేయడం
డి) రక్షిత ప్రాంతాలలో పారిశ్రామిక అభివృద్ధిని ప్రోత్సహించడం

27. 'యునైటెడ్ నేషన్స్ డికేడ్ ఆన్ ఎకోసిస్టమ్ రీస్టోరేషన్' యొక్క లక్ష్యం ఏమిటి ?
ఎ) అటవీ నిర్మూలనను ప్రోత్సహించండి
బి) పర్యావరణ క్షీణతను వేగవంతం చేయండి
సి) క్షీణించిన పర్యావరణ వ్యవస్థలను పునరుద్ధరించడానికి చర్యను సమీకరించండి
డి) పర్యావరణ ప్రభావంతో నిమిత్తం లేకుండా పట్టణ ప్రాంతాలను విస్తరించండి

28. పర్యావరణ శరణార్థుల గురించి ఈ క్రింది ప్రకటనలలో ఏది సరైనది?
ఎ) వాతావరణ శరణార్థులకు అంతర్జాతీయ చట్టం కింద రక్షణ ఉంటుంది
బి) వాతావరణ శరణార్థులు స్వచ్ఛందంగా వలసపోతారు
సి) వాతావరణ మార్పు ప్రజల స్థానభ్రంశానికి దోహదం చేయదు
డి) వాతావరణ శరణార్థులు తరచుగా మానవతా సహాయాన్ని పొందడంలో సవాళ్లను ఎదుర్కొంటారు

29. 'అమెజాన్ రెయిన్‌ఫారెస్ట్'ని భూమి యొక్క ఊపిరితిత్తులుగా పిలవడానికి ప్రధాన కారణం ఏమిటి ?
ఎ) ఇది కిరణజన్య సంయోగక్రియ ద్వారా గణనీయమైన మొత్తంలో ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేస్తుంది
బి) ఇది ప్రపంచంలోనే అతిపెద్ద కలప ఉత్పత్తిదారు
సి) ఇది ఏదైనా పర్యావరణ వ్యవస్థలో అత్యధిక జాతుల వైవిధ్యాన్ని కలిగి ఉంది
డి) ఇది ప్రపంచ ఉష్ణోగ్రతలను నియంత్రించడానికి బాధ్యత వహిస్తుంది

30. 'రేస్ టు జీరో' ప్రచారం ఈ కింది వాటిలో దేనికి సంబంధించింది ?
ఎ) సముద్రాలలో ప్లాస్టిక్ కాలుష్యాన్ని నిర్మూలించడం
బి) 2050 నాటికి నికర-సున్నా ఉద్గారాలను సాధించడం
సి) అంతరించిపోతున్న జాతులను రక్షించడం
డి) సుస్థిర వ్యవసాయాన్ని ప్రోత్సహించడం

సమాధానాలు

1. ఎ	2. సి	3. బి	4. బి	5. బి
6. ఎ	7. ఎ	8. బి	9. ఎ	10. డి
11. డి	12. సి	13. ఎ	14. ఎ	15. ఎ
16. సి	17. బి	18. ఎ	19. బి	20. బి
21. బి	22. డి	23. డి	24. బి	25. బి
26. బి	27. సి	28. డి	29. ఎ	30. బి

విద్యార్థుల ఒత్తిడిని తగ్గించే ఓపెన్ బుక్ ఎగ్జామ్స్



పాకాల శంకర్ గౌడ్
9848377734

సహజంగా పరీక్షలు సమీపిస్తుంటే విద్యార్థుల్లో భయం, ఆందోళన మొదలవుతాయి. ఏడాదిగా చదివిందంతా గుర్తుపెట్టుకుని పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఒక్కోసారి మొదటి వాక్యం గుర్తుకు రాకపోయినా సమాధానం సరిగా రాయలేరు. రాత్రనక, పగలనక కష్టపడి చదువుకొని పరీక్షహాల్లోకి వెళ్లగానే పరీక్షాపత్రం చూస్తూ ఆత్రుతతో టెన్షన్ పడుతూ విద్యార్థులు పరీక్షలు రాస్తూ ఉంటారు. రాబోయే రోజుల్లో విద్యార్థుల్లో టెన్షన్ తగ్గించి, కంఠస్థం (బట్టీ పద్ధతి) చేసే విధానానికి స్వస్తి పలికి, పరీక్షలకు పుస్తకాలను తీసుకుని వెళ్లి, చూసి రాసే అవకాశమిస్తే ఎలా ఉంటుందోనని సీబీఎస్సీ ఆలోచిస్తోంది. ఈ ఆలోచనే ఓపెన్ బుక్ ఎగ్జామ్ చర్చను తెరపైకి తీసుకువచ్చింది.

ఓపెన్ బుక్ ఎగ్జామినేషన్: పుస్తకాలు చూస్తూ పరీక్షలను రాసే పద్ధతిని ఓపెన్ బుక్ ఎగ్జామ్స్ అంటారు. ఈ పరీక్ష విధానంలో సమాధానం రాసేటప్పుడు విద్యార్థులు వారి పుస్తకాలు, స్టడీనోట్స్, గైడ్లు ఉపయోగించుకోవడానికి అనుమతి ఇస్తారు.ఓపెన్ బుక్ ఎగ్జామ్‌లో విద్యార్థులు ఆమోదింపబడిన స్టడీ మెటీరియల్ మాత్రమే అనుమతిస్తే దాన్ని పరిమితి చేయబడిన ఓపెన్ బుక్ అసెస్మెంట్ అని, ఏదైనా సంబంధిత స్టడీ మెటీరియల్ ఉపయోగిస్తే అది ఉచిత టైప్ ఓపెన్ బుక్ అసెస్మెంట్ అని అంటారు.ఓపెన్ బుక్ పరీక్షలు ప్రస్తుత పరీక్షలతో పోల్చుకుంటే కఠినంగా ఉంటాయి. ప్రస్తుత పరీక్షా విధానంలో విద్యార్థుల జ్ఞానాన్ని వారి బట్టీ పట్టే సామర్థ్యాన్ని మనం పరీక్షిస్తున్నాం. ఓపెన్ బుక్ పరీక్షల్లో ప్రశ్నలు సాంప్రదాయ పద్ధతిలో వలె నేరుగా ఉండవు పరోక్షంగా విద్యార్థుల అవగాహనా సామర్థ్యాన్ని పరీక్షించేవిగా ఉంటాయి. విశ్లేషణ స్థాయినీ అంచనా వేసేలా ఉంటాయి. మూల్యాంకన ప్రక్రియను మార్చడానికి, సమస్యలను సంశ్లేషణ చేయడానికి, విశ్లేషించడానికి విద్యార్థులను సమర్థవంతంగా తయారు చేయడానికి సమస్య పరిష్కార నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి విమర్శనాత్మక ఆలోచనలు ప్రోత్సహించడానికి విద్యార్థుల్లో అవగాహనా సామర్థ్యాన్ని పెంచడానికి ఓపెన్ బుక్ ఎగ్జామ్ ఉపయోగపడుతుంది.ఈ విధానం సృజనాత్మకతతో కూడి, పుస్తకాలతో విస్తారమైన పరిచయం లేకుండా విద్యార్థులు సమాధానాలు రాయలేరు. ఓపెన్‌బుక్ పరీక్షలో వచ్చే ప్రశ్నలు విస్తృత పరిధిని కలిగి ఉంటాయి. పుస్తకం ఆమూలాగ్రం చదివి పరీక్ష రాసేలా ఉండదు. ఆ సబ్జెక్టుకి సంబంధించి అనేక పుస్తకాలతో సంబంధం ఉండేలా విస్తృతస్థాయి ప్రశ్నలు ఈ పరీక్షల్లో అడుగుతారు.

బుక్ రీడింగ్, ఇంటర్నల్ డిబేట్‌లకు బాగా అలవాటు పడి ఉంటే ఈ ఓపెన్ బుక్ ఎగ్జామ్ విద్యార్థులకు సులభమవుతుంది. క్షేత్రస్థాయి పరిస్థితులను గమనిస్తే టీచర్లు పాఠాలు బోధించే విధానం గతంతో పోల్చుకుంటే చాలా మారిపోయింది. నూతన భావనలకు అవగాహన కల్పించే బదులుగా ఈ ప్రశ్నకు ఇలా జవాబు రాస్తే ఇన్ని మార్కులు వస్తాయి అనే విధంగా విద్యార్థులకు పాఠ్యాంశ బోధన జరుగుతుంది.ఇలా చేయడం వల్ల విద్యార్థులకు నూతన భావనలపై లోతైన అవగహన లేకుండా పోతుంది. విశ్లేషించి జవాబు రాసే ఆలోచన విద్యార్థుల్లో లోపిస్తుంది.ఓపెన్ బుక్ పరీక్షల్లో ప్రశ్నలు విద్యార్థులను ఆలోచింపజేసేలా ఇండైరెక్ట్‌గా ఉంటాయి. జవాబులు రాసేముందు ప్రశ్నలను అర్థం చేసుకుని భావనలపై అవగాహన లేకుంటే సమాధానాలు రాయలేరు. వారు తెచ్చుకున్న పుస్తకాల్లో స్టడీ మెటీరియల్‌లో ఈ ప్రశ్నకు సమాధానం ఎక్కడ ఉందో తెలుసుకుని దానికి సంబంధించిన సమాచారాన్ని వినియోగించుకొని ప్రశ్నలకు జవాబు రాయాల్సి ఉంటుంది.


ఓపెన్ బుక్ ఎగ్జామినేషన్స్ ఎందుకు?: నూతన జాతీయ విద్యా విధానం-2020కి అనుగుణంగా మూల్యాంకన పద్ధతిని మార్చడం, ప్రత్యామ్నాయ మూల్యాంకన పద్ధతిని అన్వేషించడం, విద్యార్థుల ప్రయోజనం కోసం వివిధ రకాల పరీక్షలను అమలు చేయాలని సిఫారసు చేసింది. సీబీఎస్సీ సాధారణ పరీక్షలకు ప్రత్యామ్నాయంగా ఓపెన్ బుక్ ఎగ్జామ్‌ని అన్వేషిస్తుంది. సీబీఎస్సీ గతేడాది విడుదల చేసిన నేషనల్ కరికులం ఫ్రైమ్ వర్క్ ఆధారంగా ఈ రకమైన ప్రతిపాదనను రూపొందించింది. పాఠశాల విద్య కోసం జాతీయ పాఠ్యప్రణాళిక ఫ్రేమ్ వర్క్ ప్రస్తుత మూల్యాంకన ప్రక్రియను సంస్కరించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. పరీక్షల సంస్కరణలలో భాగంగా ఓపెన్ బుక్ ఎగ్జామినేషన్ విధానాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేసి ఫలితాలను సమీక్షించనుంది సీబీఎస్సీ.

దేశంలో ఓపెన్ బుక్ పరీక్ష విధానం: 2014లో సీబీఎస్సీ ఓపెన్ టెక్స్ట్ బేస్డ్ అసెస్మెంట్ (ఓటీబీఏ)ని ప్రవేశపెట్టింది. దీనిద్వారా 9, 11 తరగతులలో ఓపెన్ బుక్ పరీక్షలు నిర్వహించారు. బట్టీ పట్టే విధానాన్ని తగ్గించి సమాచార ప్రాసెసింగ్ నైపుణ్యాలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకొని అమలు చేసారు. కాని విద్యార్థుల్లో క్రిటికల్ థింకింగ్ స్కిల్స్ పెంచడంలో విఫలమయ్యామనే భావనతో 2017-18 విద్యాసంవత్సరంలో దీన్ని నిలిపివేశారు.2019లో ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కాలేజీలలో ఓపెన్ బుక్ ఎగ్జామ్‌ను అడ్వయిజర్ బోర్డ్ సిఫారసు చేసిన తర్వాత అనుమతించింది. 2020-21 కరోనా సమయంలో ఢిల్లీ యూనివర్సిటీ, జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీ, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, అలీఘర్ ముస్లిం యూనివర్సిటీ, ఐఐటి ఢిల్లీ, ఐఐటి ఇండోర్, ఐఐటి బాంబే, కేంద్రీయ విద్యాలయాలు విద్యార్థులను మూల్యాంకనం చేయడానికి ఓపెన్ బుక్ టెస్టులను నిర్వహించాయి. తెలంగాణ రాష్ట్రంలో ఓపెన్ బుక్ ఎగ్జామినేషన్ ప్రయోగం 2021-22లో తెలంగాణ సాంకేతిక విద్యాశాఖ పాలిటెక్నిక్ పరీక్షలకు ఈ విధానం అమలు చేసి సత్ఫలితాలను పొందింది. అప్లైడ్ ఇంజనీరింగ్ మ్యాథమెటిక్స్‌లో పాస్ పర్సంటేజ్ 24 శాతం పెరిగింది.కేరళ రాష్ట్రంలో ఉన్నత విద్యా సంస్థల్లో అంతర్గత మూల్యాంకనం కోసం ఈ ఓపెన్ బుక్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

ప్రయోజనాలు: ఓపెన్ బుక్ ఎగ్జామినేషన్ విద్యార్థులకు ముఖ్యమైన భావనలు, హై ఆర్డర్ స్కిల్స్, సెల్ఫ్ అసెస్మెంట్‌పై దృష్టి పెట్టడంలో సహాయపడుతుంది. క్లిష్టమైన సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహించడానికి ఉపయోగపడుతుంది. బోర్డ్ ఎగ్జామ్ ఆధారంగా నడిచే కోచింగ్ పరిశ్రమ విస్తరణను నిరోధిస్తుంది. వనరుల నిర్వహణ నైపుణ్యాలను ప్రోత్సహిస్తుంది. విద్యార్థుల్లో పరీక్షకు సంబంధించిన ఒత్తిడిని తగ్గిస్తుందని ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ భువనేశ్వర్‌కు చెందిన వైద్య విద్యార్థులతో జరిపిన అధ్యయనంలో తేలింది. విద్యార్థుల ఆత్మహత్యలను తగ్గించడానికి ఇది దోహదపడుతుంది. పరీక్షలు స్వేచ్ఛగా ఎలాంటి ఒత్తిడి లేకుండా రాస్తారు.

సీబీఎస్సీ పైలెట్ ప్రాజెక్టు: నేషనల్ కరికులం ఫ్రేమ్ వర్క్ ప్రకారం సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్సీ) 9 నుండి 12వ తరగతి విద్యార్థులకు ఓపెన్ బుక్ ఎగ్జామినేషన్ విధానాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని పరీక్షించనుంది. ఈ పైలట్ ప్రాజెక్టులో 9, 10వ తరగతి లకు ఇంగ్లీష్, గణితం, సైన్స్, 11 తరగతిలకు ఇంగ్లీష్, గణితం, జీవశాస్త్రం కోసం ఓపెన్ బుక్ పరీక్షలు ఉంటాయి.జూన్ నాటికి సీబీఎస్సీ పైలట్ ప్రాజెక్టు రూపకల్పన, అభివృద్ధి ఖరారు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది ఢిల్లీ విశ్వవిద్యాలయం నుండి సహాయ సహకారాలు తీసుకోవాలని నిర్ణయించింది.నవంబర్, డిసెంబర్ లో ఎంపిక చేసిన బడుల్లో ఈ పైలట్ ప్రాజెక్టు ద్వారా ఓపెన్ బుక్ ఎగ్జామ్ నిర్వహించనుంది సీబీఎస్సీ.వచ్చే ఫలితాలను విశ్లేషించి ఈ పరీక్షా విధాన అమలుపై నిర్ణయం తీసుకోనుంది.

ఓపెన్ బుక్ ఎగ్జామినేషన్ అంటే కాపీ కొట్టే విధానం కాదని విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలి. పాఠ్యాంశాలలోని భావనలను అవగాహన చేసుకొని లోతైన అధ్యయనం చేస్తేనే ఈ పరీక్షా విధానంలో విద్యార్థులు సరైన జవాబులు రాయగలరు.రాబోయే తరాల భవిష్య త్తును దృష్టిలో పెట్టుకొని, ప్రపంచ స్థాయిలో మన విద్యార్థులు పోటీపడేలా సీబీఎస్సీ పైలట్ ప్రాజెక్ట్ ఫలితాల ఆధారంగా మరింత అధ్యయనం చేసి ఓపెన్ బుక్ ఎగ్జామినేషన్‌పై నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఫిన్లాండ్, సింగపూర్, ఇంగ్లాండ్, అమెరికా, జర్మనీ, ఆస్ట్రేలియా లాంటి అభివృద్ధి చెందిన దేశాల్లో వివిధ పరీక్షల్లో ఈ ఓపెన్ బుక్ ఎగ్జామ్ అమలు చేసి సత్ఫలితాలు పొందుతున్నాయి.



ఓపెన్ బుక్ ఎగ్జామినేషన్ అంటే కాపీ కొట్టే విధానం కాదని విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలి. పాఠ్యాంశాలలోని భావనలను అవగాహన చేసుకొని లోతైన అధ్యయనం చేస్తేనే ఈ పరీక్షా విధానంలో విద్యార్థులు సరైన జవాబులు రాయగలరు.రాబోయే తరాల భవిష్య త్తును దృష్టిలో పెట్టుకొని, ప్రపంచ స్థాయిలో మన విద్యార్థులు పోటీపడేలా సీబీఎస్సీ పైలట్ ప్రాజెక్ట్ ఫలితాల ఆధారంగా మరింత అధ్య యనం చేసి ఓపెన్ బుక్ ఎగ్జామినేషన్‌పై నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఫిన్లాండ్, సింగపూర్, ఇంగ్లాండ్, అమెరికా, జర్మనీ, ఆస్ట్రేలియా లాంటి అభివృద్ధి చెందిన దేశాల్లో వివిధ పరీక్షల్లో ఈ ఓపెన్ బుక్ ఎగ్జామ్ అమలు చేసి సత్ఫలితాలు పొందుతున్నాయి.

'ఆరోగ్య భారత్' అందని ద్రాక్షేనా?

ముఖ్యంగా మనదేశంలో వైద్య రంగం దాదాపు ప్రయివేటీకరణ, కార్పోరేట్ వ్యక్తుల సంస్థల్లో ఉన్నదనేది వాస్తవం. అధిక ఫీజులు, స్కానింగ్, మందులు ఖర్చులు ఎక్కువగా ఉండటంతో పేద మధ్య తరగతి ప్రజలకు పూర్తిగా వైద్యం ఎండమావి వలే ఉన్నది. ముఖ్యంగా మహిళలు పిల్లలు రక్తహీనత, న్యూమోనియా, ఇతర అనారోగ్యాలతో బాధపడుతున్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే కూడా ఈ విషయాలను ధ్రువపరుస్తుంది. ప్రజలకు ఆరోగ్యం అందించే బాధ్యత ప్రభుత్వానిదే అయినా, మనదేశంలో మాత్రం ఇదో ఓట్లు దండుకునే కార్యక్రమంగా ఉచిత, సంక్షేమ పథకాలు అమల్లో భాగంగా చూడటం బాధాకరం.





ఐ.ప్రసాదరావు
6305682733

1948 ఏప్రిల్ 7న " ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ)" ఏర్పడిన రోజునే 1949 నుంచి ప్రపంచ ఆరోగ్య దినోత్సవంగా జరుపుతున్నారు. ప్రపంచ జనాభా అంతా ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో, అనేక వ్యాధులు నిర్మూలనకు కృషి చేయడం దీని ముఖ్య ఉద్దేశం. ఇటీవల కాలంలో మనందరం చూసిన 'కరోనా' విస్ఫోటనం మన ఆరోగ్య వ్యవస్థ ఎలా ఎంతగా దిగజారిందో బట్టబయలు చేసింది. అప్పటినుంచే ప్రపంచ దేశాలు, ప్రజలు ఆరోగ్య సంరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవడంలో నిమగ్నమయ్యాయి. అయితే ఇటీవల వెల్లడించిన 2024 గ్లోబల్ హెల్త్ ఇండెక్స్ సూచికలో సింగపూర్ మొదటి స్థానంలో నిలిచింది. ఆఖరి స్థానంలో ఆఫ్రికా దేశమైన లెసోతో ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం ప్రతీ వెయ్యి మంది జనాభాకు ఒక వైద్యుడు ఉండాలి. మనదేశంలో ప్రతీ 10,189 మందికి ఒక ప్రభుత్వ వైద్యుడు ఉన్నాడు. అందుబాటులో ఉన్న వైద్య నివేదికల ప్రకారం..మనదేశంలో 10 లక్షల మంది వైద్యులు రిజిస్టర్ కాబడి ఉన్నారు. వీరిలో 58 శాతం పట్టణ/నగర ప్రాంతాలలో సేవలందిస్తుండగా, కేవలం 18.8 శాతం వైద్యులు మాత్రమే గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తున్నారు. ప్రపంచంలో స్పెయిన్, ఇటలీ, ఐస్‌లాండ్, జపాన్, స్విట్జర్లాండ్, స్వీడన్, ఆస్ట్రేలియా వంటి దేశాలు ఆరోగ్య రంగంలో ముందంజలో ఉంటూ, ఆదేశ ప్రజలకు సురక్షిత ఆరోగ్యం అందిస్తున్నాయి. ఇక మన పొరుగు దేశమైన 'భూటాన్' తీవ్రంగా వైద్యుల కొరతతో సతమతమవుతోంది. ఈ దేశంలో ప్రతీ ఐదు వేల మందికి ఒక వైద్యుడు ఉండటం ఆందోళన కలిగించే అంశం. జపాన్ ప్రజలు మంచి ఆరోగ్యంతో ఫిట్‌గా ఉన్నట్లు తెలుస్తోంది.

ఇక మన భారతదేశంలో అందరికీ ఆరోగ్యం అందని ద్రాక్షవలే ఉన్నది. 142 కోట్ల మందికి అవసరమైన డాక్టర్లు, నర్సులు, ఇతర ఆరోగ్య సిబ్బంది, ఆసుపత్రులు అందుబాటులో లేవు. దీనికి ప్రధాన కారణం మనదేశ స్థూల జాతీయోత్పత్తిలో కేవలం ఒక శాతం నిధులు మాత్రమే నేటికీ కేటాయించడం జరుగుతోంది. ఇంత తక్కువ నిధులతో అందరికీ ఆరోగ్యం ఎలా అందిస్తారో... పాలకులకే తెలియాలి. ఈ ఏడాది " మై హెల్త్ - మై రైట్" అనే థీమ్ తో జరుపుకుంటున్న ఈ ఆరోగ్య దినోత్సవం మనదేశంలో అందరికీ ఈ సౌకర్యం లభిస్తుందా? అనేది బిలియన్ డాలర్ల ప్రశ్న..!? కేరళ, ఢిల్లీ వంటి రాష్ట్రాల్లో వైద్య రంగానికి బడ్జెట్లో నిధులు ఎక్కువగా కేటాయించి ఖర్చు చేస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ, ప్రజల అందరికీ అందుబాటులో ఉంచుతున్నారు. ఇక ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల కూడా కొంత మేరకు ఆరోగ్య సేవలందించటం చూస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం "ఆయుష్మాన్ భవ" వంటి కార్యక్రమాలు చేపడుతున్నా, ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా నేటికీ మనదేశంలో నాణ్యమైన వైద్యం అందరికీ అందుబాటులో లేదు. దీనికి ప్రధాన కారణం పేదరికం, నిరుద్యోగంతో పాటు ప్రభుత్వ విధానాలు. ముఖ్యంగా మనదేశంలో వైద్య రంగం దాదాపు ప్రయివేటీకరణ, కార్పొరేట్ వ్యక్తుల సంస్థల్లో ఉన్నదనేది వాస్తవం. అధిక ఫీజులు, స్కానింగ్, మందులు ఖర్చులు ఎక్కువగా ఉండటంతో పేద మధ్య తరగతి ప్రజలకు పూర్తిగా వైద్యం ఎండమావి వలే ఉన్నది. ముఖ్యంగా మహిళలు పిల్లలు రక్తహీనత, న్యూమోనియా, ఇతర అనారోగ్యాలతో బాధపడుతున్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే కూడా ఈ విషయాలను ధ్రువపరుస్తుంది. ప్రజలకు ఆరోగ్యం అందించే బాధ్యత ప్రభుత్వానిదే అయినా, మనదేశంలో మాత్రం ఇదో ఓట్లు దండుకునే కార్యక్రమంగా ఉచిత, సంక్షేమ పథకాలు అమల్లో భాగంగా చూడటం బాధాకరం.

ఇక మనదేశంలో వైద్య విద్య నేటికీ ఖరీదైన చదువుగానే పరిగణించబడుతోంది. ధనికులకు మాత్రమే లభ్యమవుతుంది. దీనికి ప్రధాన కారణం వైద్య కళాశాలలు ఎక్కువగా ప్రయివేటు రంగంలో నెలకొల్పారు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలకు వైద్య విద్య లభించుటలేదు. ప్రభుత్వ వైద్య కాలేజీల్లో తగినంత బోధనా సిబ్బంది, మౌలిక సదుపాయాలు లేకపోవడంతో నాణ్యత గల విద్య అందిపుచ్చుకుని లేకపోవడం జరుగుతుంది. అందుచేతనే అమెరికా, రష్యా, చైనా, ఉక్రెయిన్, ఆస్ట్రేలియా వంటి విదేశాలకు విద్యార్థులు వలసపోతున్నారు.అక్కడే చదువుకుని, అక్కడే స్థిరపడుతున్నారు. అక్కడ ఉన్న రాజకీయ, సామాజిక, ఆర్థిక, ప్రభుత్వాల విధానాలు వారిని ఆకర్షించుట చేత అక్కడే వైద్యులుగా స్థిరపడుతున్నారు. ఇక మన భారతదేశంలో అనేక వివక్షతలు వెంటాడుతూనే ఉండుట, రాజకీయ విధానాలు, సౌకర్యాల లేమి వల్ల వైద్యులు, ఇతర సిబ్బంది ఇక్కడ పనిచేయుటకు సుముఖత చూపడం లేదు.

2047 నాటికి వికసిత భారత్ అనే లక్ష్యం చేరుకోవాలంటే ముందు అందరికీ ఆరోగ్య భద్రత కల్పించాలి. వైద్య రంగానికి ఇక నుంచైనా బడ్జెట్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఎక్కువగా కేటాయించి ఖర్చు చేయాలి. లైబ్రరీలు, లాబొరేటరీస్, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలి. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి. రిసెర్చ్ అండ్ డెవలప్మెంట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి. అందరూ ఆరోగ్యంగా ఉంటేనే ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతమవుతుందని గ్రహించాలి. మగవారితో సమానంగా మహిళలు కూడా అన్ని రంగాల్లో సమభాగం కల్పించాలి. వివక్షతలు లేకుండా చూడాలి. ఇప్పటికే మనదేశంలో ఊబకాయం, డయాబెటిస్, థైరాయిడ్, మానసిక అనారోగ్యం, వివిధ శారీరక అనారోగ్యాలతో బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కల్తీలతో ఆహారం కలుషితమవుతుంది. వాయు కాలుష్యము, పెస్టిసైడ్స్ వలన కాలుష్యం మానవుని అనారోగ్యాలకు కారణమవుతున్నాయి. జంక్ ఫుడ్స్, ఫ్రైడ్ ఐటమ్స్ తినుట వలన కూడా యవ్వనంలోనే అనేక అనారోగ్యాలకు గురవుతున్నారు. తస్మాత్ జాగ్రత్త. గుండె, ఊపిరి తిత్తులు, మూత్రపిండాల సంబంధించిన వ్యాధులు ప్రబలి తున్నాయి. శారీరక శ్రమ లేకపోవడం వలన కూడా అనారో గ్యాలతో బాధపడుతున్నారు. కనీసం ప్రతీ రోజూ ఒక గంట వ్యాయామం చేయాలి. యోగా, ధ్యానం చేయడం జరగాలి. పరిశు భ్రత పాటించాలి. పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపట్టాలి. అందరికీ ప్రభుత్వం మంచినీరు సరఫరా చేయాలి. ప్రజలు కూడా ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలి. పౌష్టికాహారం తీసుకోవాలి. పరిశుభ్రత పాటించాలి. "ఆరోగ్యమే మహాభాగ్యము" అనే భావన అందరిలో కల్పించడమే ఈ దినోత్సవ పరమార్థం.

(నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం)